# కరోనా

## కత్తి అంచుపై....



Coro'noir' Stories



*Don't walk infront of me... I may not follow*
*Don't walk behind me.... I may not lead*
*Walk beside me... on this razor's edge*
*....as a fellow sufferer*




డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. LANKA SIVA RAMA PRASAD**

# కరోనా

## కత్తి అంచుపై....







**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

**Dr. Lanka Siva Rama Prasad**

# కరోనా కత్తి అంచుపై...

## (Coro'noir' Stories)

✧✧✧——————————✧✧✧

by

**Dr. Lanka Siva Rama Prasad**

June 2021

Copyright @ 2021

**Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**

Price : ₹ **300 $ 5**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

# ప్రస్తావన

జనవరి 2020లో కరోనా ఇండియా నేలపై అడుగుపెట్టింది. ఆ తరువాత అది సృష్టించిన అల్లకల్లోలం మరింత తీవ్రమై జనవరి 2021 నాటికి తగ్గినట్లే తగ్గి ఫిబ్రవరి మధ్యలో మరల ఊపందుకున్నది. ఈ రెండో అల ధాటికి వ్యాధిగ్రస్తులైన వారి సంఖ్య పదిహేను కోట్లను దాటగా మరణాల సంఖ్య ముప్పై రెండు లక్షలను దాటింది మే 2021 నాటికి. ఇండియాలో కోవిడ్ పాజిటివ్ కేసులు రెండు కోట్లకు పైగా; మృతులు రెండులక్షల ముప్పై వేలు.

నాయిర్ (Noir) కథలలో హీరోలుండరు. ఎక్కడ నుంచో ఎవరో వచ్చి కరోనాలా విలయాన్ని, విధ్వంసాన్ని సృష్టిస్తారు. కన్నీళ్లు, రక్తం పారుతుంటే ఆశ వాటిలో సమాధి అవుతూ ఉంటుంది. స్వప్నాలు శకలాలుగా విరిగి పడుతుంటాయి. ప్రేమ నశించి కాముకత్వం ప్రబలమవుతుంది. గుడ్లగూబల అరుపులు, నక్కల ఊళలు, చితిమంటల చిటపటల మధ్య నిశాసంచారుల అలజడి నిర్విఘ్నంగా సాగుతుంటుంది. అనాధ శవాలు గుడ్లప్పగించి పలకరిస్తుంటాయి. బాధాకథల పాదాలపై రక్తపు చారికలు కదలాడుతుండగా, వీధులన్నీ స్మశానం వేపు దారి తీస్తుంటాయి. ముగింపు అసంపూర్తిగా, నిరాశగా ముగిసి నిజం సమాధిలో కప్పబడగా పాత్రలు గమ్యం కానరాని ధూళితెరలలో అదృశ్యమవుతాయి.

కరోనా మూడవ అల ఆగష్టు–సెప్టెంబరులో రావచ్చు. వాక్సినేషన్ తాయెత్తు కోసం యావత్తు నేషన్ త్వరపడుతున్నది. ఈలోగా మరణాలు మిగిల్చిన దుఃఖపు మందుల్ని పనిచేసినా పని చేయకపోయినా మింగాల్సిందే! ప్రతి ఒక్కరూ అందరిలోనూ కరోనాను చూస్తూ ఫ్రెగొలి సిండ్రోమ్ స్థితికి చేరుకుంటున్నారు. ఇప్పుడు ఏకసూత్ర భ్రాంతి కరోనా. ఇక్కడ ముఖాలకు విలువ లేదు. మాస్కుల వెనక ఆశ, పిపియి కిట్లలో స్వేచ్ఛ ఉక్కబోతకు గురై ఉడికిపోతున్నాయి. ఇప్పుడు నడక కత్తి అంచుపైనే!

**ఉత్తిష్ఠ జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత!**

**క్షురస్య ధారా నిశిత దురత్యయా దుర్గంపథస్తత్ కవయో వదంతి!!**

మానవత్వం రక్తసిక్త శకలాలుగా తెగి పడిపోతూ, ప్రపంచం స్వయం ప్రకటిత ద్వీపాలుగా విడిపోతున్నది. ఇంకెన్నాళ్లు పడుతుందో యథాస్థితికి రావడానికి తెలీని దుర్భర పరిస్థితి.

**"యస్మిన్ విజ్ఞతే సర్వం ఏవమ్ విజ్ఞాతం భవతి"**

జనవరి 2013లో తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా Noir - Black genre లో విడుదలైన కథల పుస్తకం "కత్తి అంచుపై". దానిలోని కొన్ని ముంబాయి నిశీధి కథలకు మంచి ప్రాచుర్యం లభించింది.

ఈ కథలు కరోనా నేపథ్యంలో వ్రాయబడినాయి.

"కత్తి అంచుపై" కథల్ని విశేషంగా ఆదరించిన సాహితీ మిత్రులకు కానుకగా ఈ పుస్తకాన్ని సృజనలోకం వినమ్రతతో సమర్పిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయ సూచిక

1. భస్మ సింహాసనం ........ 7
2. శవం నోట్లో నాణెం ........ 14
3. ఆఖరి క్షణాలు – ఆగని కన్నీళ్లు! ........ 19
4. అసంకల్పిత హంతక బ్రహ్మచారులు ........ 26
5. స్మెల్ డేటింగ్ ........ 31
6. బలిపశువు లేదా స్కేప్‌గోట్ ........ 38
7. పికప్ ఆర్టిస్ట్ అనబడు ప్రేమగురువు ........ 44
8. నైన్త్ వేవ్ – తొమ్మిదవ అల ........ 52
9. లాజరస్, లేచిరా! ........ 61
10. దేవాలయాలూ – సొలొమాన్ ప్రభువులూ... ........ 68
11. ఈ పని ముందే చెయ్యాల్సింది! ........ 73
12. హాం ఫట్ కాయినూ! హ్రీం బిట్ కాయినూ! ........ 79
13. అనియంత్రిత భావ ముట్టడి అను ఓ.సి.డి. ........ 88
14. వాళ్లను ఉరిదీయండి... నెమ్మదిగా... ........ 95
15. శత్రువుతో సంసారం అను నీలి త్రికోణం ........ 101
16. చిన్న తప్పు – పెద్ద ముప్పు ........ 110
17. యముని మహిషపు గంటల చప్పుడు ........ 118
18. అగ్ని ప్రవేశంలో అయిదో సూత్రం ........ 125
19. జంతు క్షేత్రం ........ 132
20. ఎండాకాలపు గడ్డి – శీతాకాలపు పురుగు ........ 138

# 1. భస్మ సింహాసనం

**ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము**
**నిప్పులలోన కరిగిపోయె**
**ఇచ్చోటనే భూములేలు రాజన్యుని**
**అధికారముద్రికలంతరించె...**

"ఎవరైనా కొంటారా ఈమెను?" అన్నాడు అతడు.

"ఎవరన్నా కొంటే బాగుండును. ప్రస్తుత యజమాని ఆమెను సరిగా చూసుకోవడంలేదు" అన్నది ఆరోగ్యమ్మ.

"తానూ నాకు నచ్చలేదు. కోట్లకు కోట్లు ఖర్చుపెడుతున్నా డబ్బంతా మురుగు కాల్వలో చెత్తలా కొట్టుకుపోతున్నది. కావాలంటే తన కూతురు మనశ్శాంతిని కూడా తీసుకుపొమ్మను. ఇక ఆమెదారి ఆమెది. నా దారి నాది. చరిత్ర రాసిన శిలాక్షరాలు ఇవి. లే నిలబడు! కొనేవాళ్లకు కనబడేలా" అన్నాడు భూపతి.

"నువ్వు నిలబడమాకమ్మా" వారించింది నేలతల్లి. "వాడికి నీ విలువ తెలవడం లేదు".

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. అయినా తమాయించుకుని లేచి నిలబడింది.

"ఎవరయ్యా వేలం పాట నిర్వహించేది?" అన్నాడు ఓ కుబేరుడు పొడుచుకొచ్చిన తన పొట్టను వజ్రాల ఉంగరాల చేతుల్తో సవరించుకుంటూ.

దేశంలో ధర్మాన్ని నాలుగు పాదాలమీద, కుదరకపోతే కుంటికాలి మీదయినా నిలబెట్టే మఠానికి చెందిన కౌశిక పీఠాధిపతి ముందుకు వచ్చాడు

దండక మండలాల్ని తడుముతూ. శిష్యగణం జింక చర్మాన్ని బహు భక్తిశ్రద్ధలతో పరచగా, అతడు గట్టుమీద మొదటి మెట్టుపై కూర్చున్నాడు. మంత్రాలు చదివి, వరాలు, శాపాలు పెట్టే గొంతు కాబోలు దర్పంగా, కంచులా మోగింది– "నేను, నేను మహా గురువును"–

"మహాగురువు. గురువులకే గురువు రాజర్షి, అఖండ" అన్నారు శిష్యకోటి కోటి గొంతుల్తో... చుట్టూ ఉన్న భక్తులు దండాలు పెట్టారు.

"ఎవరు కొంటారీమెను! త్వరగా చెప్పండి! అక్కడ మహా హారతి సమయం దగ్గర పడుతోంది" వేగిరపడుతున్నాడు అసహనంగా నక్షత్రకుడనే ప్రధాన శిష్యుడు.

ఆమె స్థాణువులా నిలబడి ఉంది. ఎంతో ప్రయత్నం మీద ఆమె అలా ఉండగలుగుతున్నదని ఆమె పాదాలు నేలను నొక్కుతున్న తీరును చూస్తే అర్థమవుతుంది.

"రెండు శాతం" అన్నాడు రిలయెన్స్ విశ్వాసమూర్తి – "భూపతి ఆమెకి పెట్టేదానికన్నా వెయ్యికి ఏడెక్కువ! ఒకటిన్నర బంగారు నాణేలు నా పాట!" అన్నాడు 5జి గొంతుతో...

చుట్టుపక్కల వాళ్లు నవ్వారు, సందేహిస్తూనే...

"మర్యాద, గౌరవం ముఖ్యం" అరిచాడు భూపతి. "ఇది ప్రజారాజ్యం. ఈమె గౌరవాన్ని మీరూ నేనూ కాపాడాలి... పన్నులేస్తే మీరొప్పుకోరు. అందుకే ఈ వేలం పాట. అదే ఆమెకు గౌరవమూ, నాకు ఆదాయమూ..."

వందిమాగధులు అతడి మాటలకు చప్పట్లు కొట్టారు. పక్కనే బళ్లమీద కూరగాయలు, పళ్లూ అమ్ముకునేవాళ్లు చిరువ్యాపారస్తులు చిరచిరలాడారు. "ఇదేం కాలమయ్యా! ఓ పెద్దమనిషీ! ఆమె విలువ నీకు తెలవడం లేదిప్పుడు!" అన్నది ఒకప్పుడు పూలమ్మి ఇప్పుడు కట్టెనమ్ముకుంటున్న అనసూయమ్మ.

"పాట పెంచండి! నా పాట ఒకటి ముప్పాతిక బంగారు నాణెం" అన్నాడు సిన్మా నటుడు. బిట్‌కాయిన్ల బిజినెస్‌లో కాస్త బాగానే సంపాదించాడీ మధ్య.

"రెండు బంగారు నాణేలు" అరిచాడు ఓ వజ్రాల వ్యాపారి. అతగాడు రాళ్లను వజ్రాలుగా అమ్మగలిగే తెలివితేటల్తో బ్యాంకుల్ని ముంచి పైకి వచ్చినవాడు.

"మూడు ట్రిలియన్లు" అన్నాడు నారాయణరావు "ఆరోగ్యమే మహాభాగ్యం. అందుకే నా షేర్లన్నిటినీ అమ్మి అయినాసరే ఆమెను కొంటాను".

"మూడు బంగారు నాణేలు ఒకటోసారి... మూడు బంగారు నాణేలు రెండోసారి..." నక్షత్రకుడు కేకపెడుతూ ఓ క్షణం ఆగాడు. భూపతి మనసులో మాటబయటకు దొర్లుకురాగా...

"నేను ఆమెకోసం అయిదు బంగారు నాణేల విలువైన ప్లాను సిద్ధం చేసాను, మీరు మూడు... మూడు... అంటే నా మూడు చెడ్తుంది. ఆక్షన్ రద్దు చేయిస్తా!" అన్నాడు భూపతి వగరుస్తూ.

"నాలుగు బంగారు నాణేలు" అన్నాడు రతన్‌భాయి. "దేశమంటే మట్టికాదోయ్... మనుషులోయ్...' అందుకని నేను ఈమెను కొని దేశ ప్రతిష్ఠ నిలబెడ్తాను".

"అయిదు బంగారు నాణేలకు పైసా తక్కువైనా ఒప్పుకోను. ఒకపక్క డ్రాగను దేశం, మరోపక్క గరుడపక్షి, సింహం, ఇంకో పక్కన ఎలుగుబంటి; ఇటుపక్కలో బల్లెంలా దాయాదుల గొడవలున్నా ఎలాగోలా నెట్టుకువస్తున్నా... ఎవరైనా సరే అయిదు స్వర్ణ నాణేలిస్తే వారికీ సహనశీలి దొరుకుతుంది. భలేమంచి చౌకబేరం మంచి తరుణం మించిపోతున్నది" అన్నాడా భర్త భూపతి.

"అయిదు బంగారు నాణేలు ఎవరిస్తారు?" అన్నాడు నక్షత్రక శిష్యుడు.

"నేను ఇటువంటి వేలంపాటలకు వ్యతిరేకం" అన్నాడు పప్పూ అనే పిలగాడు... బంగారమ్మ అనే వాళ్లమ్మ "అంతేగా, అంతేగా!" అన్నది.

"నేను కొంటాను అయిదు బంగారు నాణేలకు" అన్నాడెవరో... అందరూ అటు తిరిగారు. భుజం మీద నాగలి, మట్టి చెమట తడిసిన దుస్తులు, బురదకాళ్లు, పల్లెటూరి రైతు. అప్పుడే వచ్చినట్లున్నాడు... అందరినీ కలయజూస్తున్నాడు.

మౌనం రాజ్యమేలింది కొన్ని క్షణాలపాటు.

"నీవు... నువ్వు కొంటావా?" అన్నట్లు అందరూ చూసారతడివేపు అనుమానాస్పదంగా.

"అవును" అన్నాడతడు దృఢంగా. "అయిదు బంగారు నాణేలు..."

"మాటలు కాదు పైసలు చూపించు. ఏది నీ ఆధార్ కార్డు? పాన్ కార్డున్నదా? వోటర్ ఐడెంటిటీ ఏది? బ్యాంక్ ఎకౌంట్ ఉన్నదా?" అడిగాడు నక్షత్రకుడు సీరియస్‌గా.

రైతు వెంటనే తన సెల్‌ఫోను చూపించాడు. "పేటియం చేయమంటారా... గూగుల్ పేనా!" అన్నాడు.

భూపతి, పీఠాధిపతి కళ్లు కలిసాయి. శానిటైజేషన్ చేసుకుని, ధర్మదేవత నడుస్తూండగా ధన దేవత నాలుగు చేతులా కమీషన్లు తీసుకుంటుంటే, న్యాయదేవత కళ్లకు, నోటికి మాస్కు కట్టుకున్నది.

మరల చప్పట్లు బాజాలు మోగాయి. దీపాలు వెలిగించి హారతులిచ్చారు. ఆకాశం నుండి పూలవర్షం కురిసింది ముందు లైన్లో నిలబడి "గో కరోనా, గో కరోనా!" అని గోసపెడ్తున్న భక్తులు, శిష్యుల మీద!

జనాలందరూ ఆ ట్రాన్సాక్షన్ చూసాక ఎవరి ఆస్తుల్ని వాళ్లమ్ముకుందామని అవుటర్ రింగురోడ్ల వేపు పరిగెత్తాలనుకున్నారు; అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకుని, చెవులు కొరుక్కున్నారు.

"భూపతీ!" అన్నదామె "నీ నిర్ణయం, వ్యాపారం అయిపోయింది. ఇది హాస్యం కాదు కదా! ఇది ముగింపేనా?"

"ముగింపు కాక మరేమిటి! నీ అదృష్టం బాగుండి రైతు చేతిలో పడ్డావు. అదే వ్యాపారస్తుల చేతిలో పడి ఉంటే ఆ కథే వేరుగా ఉండేది. నీ అంగీకారంతోనే కదా ఈ వేలం జరిగింది. అయినా అంతా ముగిసాక ఈ పిచ్చి ప్రశ్నలేమిటి?" అన్నాడు భూపతి బ్యాంకు బాలన్స్ చూసుకుంటూ...

రైతు అన్నాడు నింపాదిగా– "నన్నిక్కడకు రానీకుండా ఏవేవో అడ్డంకులు, బారికేడ్లు పెట్టారెవరో! అమ్మా! ఆరోగ్యమాతా! నీకూ, నీ కుమార్తెకు ఏ ఆపదా రానివ్వను. నన్ను నమ్ము! నీ వంగీకరిస్తేనే నిన్ను నేను ఆకుపచ్చని పొలాల్లోకి వనదేవతలా తీసుకువెళ్తాను" అన్నాడు.

ఆమె తలపైకెత్తి అక్కడ ఉన్న ప్రజల్ని చూసింది. అందరికీ ఆవు ముఖాలున్నా అక్కడక్కడ పులిచారలు కనిపిస్తూనే ఉన్నాయి. తన కుమార్తె చెయ్యి పట్టుకుని రైతు వెనక నడుస్తూ ఆమె ఒక్కక్షణం ఆగి వెనక్కి తిరిగి తన అనామిక వేలికున్న 'రక్షణ' అనే ఉంగరాన్ని అక్కడున్న బూడిదపైకి విసిరికొట్టి జనంలో అదృశ్యమయ్యింది. ఉంగరం తాకిడికి పైకి లేచిన బూడిద, వేగంగా వీచిన గాలితో కలిసి భూపతి, పీఠాధిపతి, శిష్యులు, వ్యాపారస్తులు, జనుల కళ్లల్లో ముక్కుల్లో దూరింది.

అందరూ దగ్గడం మొదలెట్టారు. ముక్కులు తుడుచుకొంటున్నారు. ఏదో విషపుగాలి సోకినట్లు వళ్లంతా వెచ్చబడింది. జ్వరం, ఒళ్లునెప్పులు, సలపరం...

**ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూసల సౌరు**
**గంగలో కలిసిపోయె**
**ఇచ్చోటనే ఎట్టి పేరెన్నికన్గన్న**
**చిత్రలేఖకుని కుంచెయు నశించె...**

ఇక్కడ, ఈ నేలమీద అదృష్ట దురదృష్టాలు కావడి కుండల్లా, గోడగడియారంలో లోలకంలా అటు యిటూ ఊగుతుంటాయి. 'రాజే కింకరుడు, కింకరుడే రాజు' కావచ్చును ఈ మండే కాష్ఠాల దగ్గర.

గంగానది ఇంకా శుభ్రపడలేదు. విషపుగాలి దెబ్బకు లాక్‌డవున్లూ, ఐసోలేషన్ భయాలకు జనాలు సగం సగం చచ్చారు. వాతావరణంలో ఆక్సిజన్ లెవల్సు తగ్గిపోయాయి కాని మూర్ఖత్వ సాంద్రతలో ఏ తేడా రాలేదు. అంటరానితనం, దారిద్ర్యం, పరువు హత్యలు, వర్ణ ధర్మ పాలనలో పెద్ద మార్పు లేదు. నల్లబజారులో ఆక్సిజన్; రెమ్‌డెసివరు, ఆస్పత్రి మంచాలు అమ్ముకుంటున్నారు.

బుడిపెల వైరసు ప్రపంచాన్ని చుట్టుముట్టింది. ఆరోగ్యమాత రైతును అనుసరిస్తూ పల్లెలకు వెళ్లాక, పట్టణాలనిండా రోదన ధ్వనులే! వైద్యశాలలు చేతులెత్తేసాయి.

మణికర్ణిక, ఆది మణికర్ణిక (హరిశ్చంద్ర) ఘాట్‌ల వద్ద రోజుకు వందకు పైగా శవదహనాలు జరిగేవి. ఈ విష వైరస్ దెబ్బకు అవి మరింత పెరిగాయి. కాశీలోనే కాదు దేశంలో ఎక్కడ చూసినా అదే పరిస్థితి.

లాక్‌డౌన్ వల్ల వలస కూలీలు స్వస్థలాలకు వెళ్లిపోయారు దారిలో నానా అగచాట్లు పడుతూ. వైరస్ జ్వరంతో ఇంట్లో మూలుగుతూ పడి ఉన్నాడు రైతు.

ఏ మందూ పనిచేయని మహమ్మారి ఇది. వైరసు ధాటికి ఆరోగ్యమాత కుమార్తె మనశ్శాంతి కన్నుమూసింది. ఆమె పార్థివదేహాన్ని తీసుకుని హాస్పిటల్ నుంచి సరాసరి మణికర్ణికా ఘాట్ వద్దకు వచ్చింది ఆరోగ్యమ్మ దీనాతి దీనంగా విలపిస్తూ...

తెల్లటి గుడ్డలో చుట్టబడి ఉంది ఆ బాలిక మనశ్శాంతి. ఇప్పుడామెను దహనం చెయ్యాలా, ఖననం చెయ్యాలా? కాటికాపరికి చెల్లించేందుకు ఆమె వద్ద పైసా లేదు. ఏం చెయ్యాలి? నాతోపాటు గంగలో కలిపేయనా ఎవరూ చూడకుండా మనశ్శాంతిని! ఆ తల్లి దుఃఖానికి అంతేలేదు. ఎదురుగా చితులపై దహనమవుతున్న శవాలు. బూడిద కుప్పలు.

**ఇది పిశాచులతో నిటాలేక్షణుండు**
**గజ్జె కదలించి యాడు రంగస్థలంబు;**
**ఇది మరణ దూత తీక్షణమౌ దృష్టులరయ**
**నవని బాలించు భస్మసింహాసనంబు;**

ఆ దృశ్యాల్ని చూస్తుంటే ఆమె మనసు కకావికలమైంది. ఆస్పత్రిలో తన కుమార్తె ఆఖరి చూపులూ దక్కలేదు. ఐసొలేషన్‌లో ఐసిసియూలో వెంటిలేటర్ మీద ఉంచారామెను. అట్నుంచీ అటే ఊపిరికై ఆక్రోశిస్తూ ఆ చిన్నారి ఊపిరి గాల్లో కలిసిపోయింది.

మనశ్శాంతి పోయాక అప్పటివరకూ ఉన్న భయమూ పోయింది. ఏదో నిర్లిప్తత. అంతా అయిపోయాక చేసేదేమున్నది. అంతేనా? ఎవరూ సాయం చేయరా! కనీసం ఈ ఆఖరి ప్రయాణమన్నా సజావుగా సాగేనా...!

ఆమె కళ్లనించి ధారాపాతంగా కన్నీరు. నిస్త్రాణగా ఉన్న ఆమె కళ్లు తిరిగినట్లై కూలబడింది. కన్నుమూసిన లోహితాస్యుడిని మహా స్మశానానికి తీసుకువచ్చిన చంద్రమతిలా ఆమె; ఎదురుగా అంతా చేసి ఏమీ చేయలేని స్థితిలో భూపతి, పీఠాధిపతులు, వ్యాపారస్తులు... గడ్డం పెరిగిన హరిశ్చంద్రుళ్లలా

ఉన్నారు. తెల్లటి గుడ్డ చుట్టిఉన్న కుమార్తె దేహాన్ని పట్టుకుని ఆమె ఒక్కొక్క అడుగూ వేస్తూ గంగా జలాల్లోకి నడుస్తున్నది....

ఆరోగ్యమూ, మనశ్శాంతి పోయాక మిగిలేదేముంది. అందరిలోనూ ఏదో దిగులు. “ఈ పీడకల త్వరగా ముగిసి, ఈ విషజ్వరం తొందరగా తగ్గితే ఆ మహాదేవుడిని బతిమాలి మేమంతా నిన్నూ, నీ కుమార్తెనూ బతికించుకుంటాం! మా తప్పుల్ని సరిదిద్దుకుంటాం! మమ్మల్ని మన్నించు తల్లీ” అని వేడుకుంటున్నారు.

విశ్వేశ్వరుడు, అన్నపూర్ణ, గంగమ్మ నడయాడిన దేశంలో స్వార్ధబుద్ధితో రాళ్లుగా మారిన మనుషులు... మేయర్లు, భూపతులు! మరి, ఎన్నాళ్లీ చలనంబులేని శయనంబు?

**ఏ తల్లులల్లాడిరో! కన్నీటంబడి క్రాగిపోయినది**
**నిక్కంబిందు పాషాణముల్!...**

★★★★★

**(జాషువా కవీంద్రునికి కృతజ్ఞతలతో...)**

# 2. శవం నోట్లో నాణెం

కరోనా హాస్పిటల్ గందరగోళంగా ఉన్నది. బయట రోగుల సంబంధీకులు మాట్లాడుకుంటున్నారు భయపడుతూ సామాజిక దూరం పాటిస్తూ...

"అందరికీ ఇమ్యూనిటి రక్షణ కలిగేంత వరకూ ఏ ఒక్కరూ సురక్షితంగా లేనట్లే" అన్నది సుప్రియ. ఆమె వైరాలజిస్టు. ఆమె మామగారికి వైరస్ సోకింది.

"వాక్సీనులు వచ్చాయి అని ఊపిరి పీల్చుకునే లోపునే వేరియెంట్స్ వచ్చాయి. వీటికి వాక్సినులు పనిచెయ్యవేమో అన్న పుకారువార్త తీవ్రంగా జనాలను కంగారు పెడ్తోంది" అన్నది స్మితా పటేల్ సాలోచనగా. ఆమె భర్త ఐసోలేషన్ వార్డులో ఉన్నాడు.

వేరియెంట్స్ సాధారణమే కాని వాటిలో సౌతాఫ్రికా B.1.351, బ్రిటన్ (యూ.కె.) B.1.1.7, బ్రెజిల్ ప్రయాణీకుల ద్వారా జపాన్‌లో వ్యాపిస్తున్న P.1 చాలా వేగంగా, ప్రమాదకరంగా వ్యాపిస్తున్నాయి" అన్నాడు ప్రణీత్. ఇతడు జర్నలిస్టు.

"ఇండియాలో రెండోవేవ్ చాలా భయానకరంగా విస్తరిస్తున్నది. B.1617 - L452R, B.1617 - E484q వేరియెంట్ల తీవ్రతకు హాస్పిటల్స్‌లో బెడ్లు చాలడం లేదు. ఆక్సిజన్ సరఫరా అస్తవ్యస్తమయ్యింది. వాక్సీన్‌ల కొరత ఏర్పడింది. రెమిడెసివర్ లాంటి మందులు బ్లాక్‌మార్కెట్‌లోకి వెళ్లిపోయాయి" అన్నాడు డాక్టర్ నిరంజనం. ఆయన ప్రకృతి వైద్యుడు.

"దీన్ని జయించలేం, దానంతటకది చల్లారాల్సిందే! అది సరే, మరి నన్ను అన్నీ మూసుకుని ఇంట్లో ఉండమంటావా! నావల్ల కాదు" అన్నాడు క్రిస్టఫర్ "ఇప్పటికే బతకడం మీద ఇష్టంపోయి చావుమీద ప్రేమ పుడుతున్నది".

"న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలోలా రాకపోకలు బంద్‌చేసి ఉంటే ఇండియా సేఫ్‌గా ఉండేది కదా! ఇప్పుడు చూడు ప్రతినగరమూ ఓ మహాస్మశానమైంది" అన్నాడు ప్రీతమ్. అతడి స్నేహితుడు వెంటిలేటర్‌పై ఉన్నాడు.

“కోవిడ్ వైరస్ మొదలైన చైనాలో చనిపోయింది అయిదువేల లోపు. 144 కోట్ల జనాభాలో 4636 మందే కోవిడ్-19తో చచ్చిపోయారంటే చిదంబర రహస్యం అర్థం కావడంలేదా? 135 కోట్ల జనాభా ఉన్న ఇండియాలో దాదాపు రెండున్నర లక్షలమంది, 33 కోట్ల జనాభా ఉన్న అమెరికాలో దాదాపు ఆరు లక్షలమంది చనిపోయారు అంటే దేవరహస్యం ఏమిటో?” అన్నాడు థామస్. ఇతడు డాటా ఎనలిస్టు రిపోర్టర్.

“అవును. హాన్ తెగకు ఈ వైరస్‌ను ఎదుర్కొనే శక్తి ఉందేమో! లేదా వుహాన్ ల్యాబ్‌లో తమకు సోకకుండా శత్రువులకు తాకే దివ్యవైరసాస్త్ర ప్రయోగం జరిగిందంటావా?” అడిగింది భారతమ్మ దిగులుపడుతూ. ఆమెకు షుగర్, బిపి ఎక్కువయ్యాయి. చెకప్‌కని వచ్చింది.

“చైనా ‘ఒన్ బెల్ట్ ఒన్ రోడ్’ కామన్ డెస్టినీలకు అడ్డుతగిలిన వాళ్లకు బుద్ధిచెప్పడమే టీకా తాత్పర్యమా? మన చెయ్యికి రక్తపుతడి అంటకుంటా ఎదుటివాళ్ల ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసే సమ్మోహనాస్త్ర ప్రయోగమేనా కోవిడ్-19 వైరస్” ప్రశ్నించాడు బ్రియాన్. వాక్సీన్ రెండవ డోస్ కోసం వచ్చాడతడు.

“ఇండో-చైనా సరిహద్దులో గాల్వన్‌లోయ గాయపడింది. పాంగాన్ సరస్సు ఎర్రబడింది ఇరుదేశాల సైనికుల రక్తంతో. దెబ్బతిన్న డ్రాగన్ ఇప్పుడు వికటాట్టహాసం చేస్తున్నది. ఈ ప్రపంచమంతా ఒకటే కుటుంబం. అందరిదీ ఒకే ఉమ్మడి లక్ష్యమన్న సమాజం కావాలి. ‘కమ్యూనిటీ ఆఫ్ కామన్ డెస్టినీ’ ప్రపంచం గుర్తించాలి. ప్రపంచంలో అతిపెద్ద దేశం చైనా! ఒక నిర్దిష్టమైన క్రమపద్ధతి ఉన్న చైనా, అస్తవ్యస్త స్థితిలో ఉండే పాశ్చత్య పోకడలను సహించరాదు అనేది చైనా కమ్యూనిస్ట్ పార్టీ విధానం. దానిని ఆచరణలోనికి తీసుకురావడం చైనా ప్రభుత్వ బాధ్యత. అంతేకాని చైనా నీచమైన పనులు చేయదు” అన్నాడు యాంగ్ పియాంగ్. అతడు చైనాబౌల్ హోటల్ మేనేజర్.

“అవును, ఒక్క వైరస్ మిస్సైల్‌తో యువాన్ ఖర్చు లేకుండా హాంకాంగ్ అల్లర్లనూ, ఇండియా ఆత్మనిబ్బరాన్ని, అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల అహంకార గర్వాల్ని ప్రపంచ ప్రజల మనోస్థైర్యాల్ని దెబ్బతీసింది చైనా! అన్ని దేశాలూ లాక్‌డవునూ, ఐసొలేషన్లలోకి పోగా తాను మాత్రం ఇంటి తలుపులు బార్లా తెరిచి

'మీకు మా సాయం కావాలా' అని అడుగుతున్నది అమాయక ముఖంతో" అన్నాడు నరేంద్ర ఆగ్రహంగా.

"ఇంకా చైనానెవరు నమ్ముతారిప్పుడు? చైనా వస్తువులంటేనే నాణ్యత తక్కువని అనుకునేవారు. ఇతరులను దెబ్బతీయాలని గొయ్యి తవ్వితే ఆ గోతిలో తానే పడ్డట్లు అయ్యిందా చైనా పరిస్థితి" అన్నాడు రాబర్ట్ తన కల్లంత దూరంలో ఉన్న యాంగ్ పియాంగ్ వేపు అదోరకంగా చూస్తూ.

"చైనా సంగతి అట్లా వుంచు. ఇండియాలో కుంభమేళాలూ, ఎలక్షన్లూ, ఇతర మతోత్సవాలూ జన సందోహాల భక్తిప్రపత్తుల మధ్య దిగ్విజయంగా సాగుతున్నాయి కదా! భక్తి ముందు భయం ఓడిపోయిందా?" ప్రశ్నించింది మార్గరెట్. ఈమె లెక్చరర్, కవయిత్రి.

"స్మశానాల ముందు శవాలు వెయిటింగ్ లిస్టులో ఉన్నాయి. ఎంత కలపా చాలడం లేదు. శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపే అవకాశం లేదు. 'ఆ నలుగురూ దొరికితే చాలు' అన్నట్లున్నది పరిస్థితి" వాపోయాడు దీనదయాళ్. ఆయన కుటుంబంలో నలుగురికి కరోనా సోకింది.

"మంచాలు లేక, ఆక్సిజన్ అందక, మందులు దొరకక, వైద్యసిబ్బందికి విశ్రాంతి లేక, పరిపాలకులకు ఏం చెయ్యాలో తోచక అయోమయస్థితిలో 'న కర్మా' ఇనాక్షన్ స్థితిలోకి వెళ్లిపోయింది వ్యవస్థ.

ఇండియాలో రోజుకు రెండు వేల మరణాలన్న వార్త చావు భయం, బతుకు రోదనలను మరణమృదంగ ధ్వని తరంగాలుగా విస్తరింపచేస్తున్నది. జనాలు భయభయంగా నిద్రపోతూ పీడకలలు కంటున్నారు.

స్వర్గానికి తీసుకెళ్లే నిచ్చెన ఖాళీగా పడిఉన్నది ప్రయాణీకులు లేక. నరకానికి వెళ్లే దారులన్నీ క్రిక్కిరిసి ఉన్నాయి. దారిలో నార్డిక్ దేశాల 'గజొల్' నది, మధ్యధరా సముద్రపు 'హుబుర్' నది, జపాన్ 'సంజు' నది, హిందూదేశపు వైతరణి నది, గ్రీకుల ఎఖెరాన్ బాధల నది; కొసిటస్ – ఏడ్పుల నది, ఫ్లెగెథాన్–జ్వాలానది, లెథె–మరపు నది; స్టిక్స్–వణుకు పుట్టించే నది దగ్గర ఆత్మలు క్రిక్కిరిసి ఉన్నాయి.

నదిని దాటించే పడవలు దూరంగా కనబడుతున్నవి. తీరం వేపు మినుకు మినుకుమంటున్న దీపం వెలుగులో పడవ నడిపేవాడు. పెరిగిన గడ్డం, చిందరవందర జుట్టు, భయంకర రూపంతో ఉన్నాడతడు యమభటుల నాయకుడిలా. అతడి కళ్లు ఎర్రగా మండుతున్న కొలుముల్లా ప్రజ్వలిస్తున్నాయి. జిడ్డుకారుతున్న గోచిగుడ్డ అతడి వంటిని కప్పుతున్నది. చేతిలో పొడుగాటి కర్రతో పడవను నడుపుతూ మసక చీకటి తెరలను చీల్చుకుంటూ వస్తున్నాడు చరాన్ లేదా కారాన్ అనబడే మృతాత్మల పడవ సరంగు.

దూరంగా ఇంకొన్ని మృత్యు నావలు. చిక్కటి బురదనీళ్లు ప్రవహిస్తున్న నదుల అలల్ని కోసుకుంటూ వస్తున్నాయి. అడుగో ఐరిస్–మనన్‌మాన్ మాక్‌లిర్; ఫిలిప్పీన్స్–మనుంగుల్ జార్; లాపిటల్–ఫ్లెగ్యాస్, మధ్యధరా సముద్రపు ఊర్ధ్వనాబి వాళ్లవాళ్ల నదుల రేవుల వద్దకు పడవలు తీసుకు వస్తున్నారు... గబ్బిలాల రెక్కల చప్పుడు, గుడ్లగూబల అరుపులు... నక్కల ఊళలు... పాముల బుసబుసలు... భయంకరంగా వినవస్తుంటే ఆత్మలు వణికిపోతున్నాయి.

“పున్నామ నరకం దాటించే పుత్రుడున్నాడా నీకు?” వైతరణి నది దగ్గర వినిపిస్తున్నది క్షణక్షణానికీ ఓ భీకర స్వరం. “లేకుంటే ఈ నదిలో దూకు... మరుజన్మలో పరిహారం చేసుకుని మళ్లీరా”. కొన్ని హిందూ ఆత్మలు నదిలో దూసుకు పోతున్నాయి... కొన్ని నదిమీద తేలుతున్నాయి. కొన్ని అయోమయంగా అటూ యిటూ తిరుగుతున్నాయి.

“మీ దగ్గర నావికుడికి చెల్లించాల్సిన పైకం ఉందా?” కొండలదిరి, గుండెలు వణికేలా భయంకరంగా వినవచ్చింది సైకొపాంప్ – మృతుల మార్గదర్శకుడి గొంతు. “వరుసలో నిలబడండి. అక్కడ ఆస్పత్రులల్లోనూ తొందరే, చావడానికీ తొందరే, స్మశానాల దగ్గరా తొందరే... ఇక్కడ పడవెక్కడానికీ తొందరే!... ఏదీ పైకం– ఒబొల్ లేదా ఎక్సొన్యుమియా లేదా వయాటికమ్ లేదా దనాకె లేదా మొహరు! ఏదో ఒకటి చెల్లించాల్సిందే! చెప్పలేదా మీవాళ్లకు! చచ్చినాక నోట్లో కాని, కనురెప్పలపై కాని నాణేలుంచాలని? నాలమ్, పైకం లేకుండా స్టిక్స్ నది ఎట్లా దాటుతారు?” అరుస్తున్నాడతడు.

నోట్లో నాలుక, నాణెం లేనివాళ్లు దొంగచాటుగా నది దాటాలని నీటిలో కాలు పెట్టబోగానే స్టిక్స్ నది భుగభుగమని మండే బుడగల్తో కాల్చిపడేసింది. ఆ

ఆకుపచ్చని నీళ్లు, దుర్వాసన ముందు భూలోకంలో కాలుష్యం బారిన పడిన నదులు, మురికి కాలువలు ఏమాత్రం పోటీకి రావనిపించి ఆత్మలు జంకాయి.

“భూలోకంలో తెలివితేటలిక్కడ పనికిరావు. పోయి మీ లోకానికిపోయి కళ్లు తెరిచి నోట్లో నాణెం పెట్టించుకుని మళ్లీరా, పో!” అరిచాడు కారాన్. చూస్తున్న ఆత్మలకు కారాన్ ముఖం బుడిపెలున్న కరోనా వైరస్‌లా కానవచ్చింది.

ఐసిసియూలో మానిటర్‌లు రంగు రంగుల సిగ్నల్స్‌తో వెలుగుతున్నాయి. రకరకాల అలారంలు మోగుతున్నాయి. కరోనా తమకు రాకుండా డాక్టర్లు, నర్సులు – పర్సనల్ ప్రొటెక్టివ్ గేర్ – ఆత్మరక్షణా దుస్తులలో గ్రహాంతరవాసుల్లా బిక్కుబిక్కుమంటూ అటూ ఇటూ తిరుగుతున్నారు ఎప్పుడు డ్యూటీ అయిపోతుందా, ఎప్పుడు ఇంటికి పోదామా ఈ ఉక్కపోత దుస్తుల్ని విడిచేసి అనుకుంటూ; ఎవరి ప్రాణం వాళ్లకు తీపికదా!

నర్స్ అరిచింది– “డాక్టర్! ఇందాక డెత్ డిక్లరేషన్ చేసిన పేషంట్ కదుల్తున్నాడు. ప్లీజ్ కమ్ ఫాస్ట్! ఎడ్రినాలిన్, స్టిరాయిడ్లిచ్చాను. ట్యూబ్ రెడీ!”.

‘డాక్టర్ టీం’ ఇంకో కేసు దగ్గర కుస్తీపడుతూ ఇటు చూసారు. డాక్టర్ పరిగెత్తుకు వచ్చి “సిస్టర్, ఎండోట్రఖియల్ ట్యూబ్!” అన్నాడు. “నాకు ట్యూబ్ వద్దు డాక్టర్! నోట్లో నాణెం పెట్టండి!” అని చెప్పబోయాడు అతడు… డాక్టరు, నర్సులు వాళ్లకలవాటైన పనుల్లో వాళ్లున్నారు. పేషంట్ ఆక్సిజన్ లెవెల్స్ మళ్లీ పడిపోయాయి. గుండె కాసేపు కొట్టుకుని మరల ఆగిపోయింది.

అక్కడ కారాన్ మళ్లీ అరిచాడు– “నోట్లో ట్యూబుతో కాదయ్యా నాణెం పెట్టుకుని రా! పో!”….

★★★★★

# 3. ఆఖరి క్షణాలు - ఆగని కన్నీళ్లు!

**"సర్ ఝుకా దేతేహై సబ్ హుకహే ఖుదా కె సామ్‌నే**
**షాహ్ తక్ మజబూర్ హోతేహే కజాకె సామ్‌నే"**

ఆ క్షణం వచ్చినప్పుడు తలవంచక తప్పదు. అది ఖుదా నిర్ణయం. వెళ్లక తప్పదు. వందేళ్లు బతుకుతామనుకుంటాం. రేపటి కబురు తెలవదు.

కారుమబ్బులా కమ్ముకు వచ్చింది ఈ కరోనా! వెంటిలేటర్లలోకి పోయిన ఊపిరి, మానిటర్లలో కలిసిన కనుల కాంతులు, సెలైన్, మందుల్లో వణుకుతున్న జీవద్రవాలు, ఆఖరి క్షణాల్లో 'అల్లా'ను తలుచుకునే అవకాశమే లేదు. దగ్గరవాళ్ల స్పర్శానుభూతి వెచ్చదనం ఐసిసియూ చల్లదనంలో చల్లారిపోయింది.

ఊరు కాని ఊరులో సంప్రదాయాలు పాటించడం ఈ మహమ్మారి కాలంలో సాధ్యమేనా? జిన్ను భూతాలతో కూడిన చెడుగాలులు చెత్త కాల్చినపుడు వచ్చే పొగలా చుట్టుముట్టుతున్నపుడు ఊపిరి ఆడేదెక్కడ!

"మరణాలు అధికంగా ఉన్నపుడు అంత్యక్రియలు చేసేదెలా?" సలీమ్ భాయ్, ఇమామ్ సాబ్ మాట్లాడుకుంటున్నారు; శవాల సంచుల్లో వచ్చిన దేహాలను అలాగే పూడ్చేయడం సరైన పద్ధతేనా! ఆఖరి చూపు, అనునయపు వీడ్కోలు లేని అంతిమయాత్ర ఇలా జరగడం దైవనిర్ణయమా!

కరోనా గాలి సోకినాక ఎంతో కలివిడిగా ఉండే ప్రేమ సమాజంలో కల్లోలస్థితి నెలకొన్నది. ఆ విషపు గాడ్పుకు సలీం తండ్రి రహీమ్‌భాయ్ గజగజా వణికిపోయాడు. ఈ వయసులో ఆయనకు పెద్ద కష్టం వచ్చింది. గవర్నమెంట్ దవాఖానాలో రాపిడ్ ఏంటిజన్ టెస్ట్ చేసారు. నెగిటివ్ వచ్చింది. పారసిటమాల్ టాబ్లెట్ వేసాక వళ్లు కాస్త చల్లబడినట్లనిపించింది.

సలీం కుటుంబం గుంటూరు నుంచి వరంగల్ వచ్చి పదేళ్లయ్యింది. ఆటో నడుపుతూ వచ్చే ఆదాయంతో కాస్త నిలదొక్కుకుని చిన్న యిల్లు కట్టుకున్నారు. అయిదేళ్ల క్రితం అమ్మ అమీనాబీ క్యాన్సర్‌తో కన్నుమూసింది. అప్పట్నుంచీ నాయన కుంగిపోయినాడు. కరోనా వచ్చాక ఏడాదిగా ఆదాయం తగ్గింది. భార్య, ఇద్దరు పిల్లల్ని, నాయనను పోషించడం కరువు కాలంలో ఎంత కష్టమో అర్థమయ్యింది సలీమ్‌కు. అర్ధరాత్రి నాయన గదిలో పలవరిస్తున్నట్లనిపించి సలీమ్, జులేఖాలు గాభరాగా లేచారు. వెళ్లి చూసేసరికి నాయన కుడివేపు పడుకుని సూరా–యాసిన్, సూరా–అర్‌రద్‌లు చదువుకుంటున్నాడు... నాలుగు రోజులు జ్వరానికే మనిషి గొంతు పీలపోయింది. మైక్ సాయం లేకుండా ఆయతులు గంభీరంగా, రాగయుక్తంగా, స్పష్టంగా చదివేవాడు... అయ్యో... ఇప్పుడిలా! భార్యాభర్తల కళ్లలో నీళ్లు తిరిగాయి. అలికిడి విని రహీమ్ ఎంతో కష్టంమీద వాళ్లవేపు తిరిగాడు. ఆయాసం ఎక్కువవుతున్నట్లున్నది... "బేటా పానీలావో..." అన్నాడు. జులేఖా నీళ్లు తేవడానికి వెళ్లింది. హాల్‌లో పిల్లలు గాఢనిద్రలో ఉన్నారు.

"దవాఖానాకు వెళ్దాం నాయనా!" అన్నాడు సలీమ్ కళ్లనీళ్ల పర్యంతమై. నాయన పక్కనే కూర్చుని అతడి తలను తన ఒళ్లో పెట్టుకున్నాడు, ఊపిరి భారంగా పీలుస్తున్నాడు నాయన... ముహ్తదర్‌లా... మృతువు నడక...

జులేఖా మంచినీళ్లు తెచ్చింది. సలీమ్ తాగించబోతే గొంతు మింగబడడం లేదు. ఏదో అడ్డం వచ్చినట్లు నాయన అవస్థ పడుతున్నాడు. సలీమ్‌కు అర్థమయ్యింది...

"అష్‌షదు అల్లా ఇలహా ఇల్లల్లహు
వహదుహు లా షరిక లహు
వ అష్‌షదు అన్న ముహమ్మద్ నబ్దుహు
వ రసూలల్లా..." పఠించాడు గద్గదకంఠంతో

"అల్లాహొ అక్బర్..." గొంతు కలిపింది జులేఖా.

తెల్లవారేసరికి రహీమ్‌భాయ్‌కు ఎగశ్వాస ఎక్కువైంది. కాళ్లు బలహీనమై కదలలేదు. తల్కిన్ చదువుతూనే ఉన్నారు. బాబాజాన్ పెదాలు అస్పష్టంగా కదిలాయి. పిల్లలు హడావుడిగా లేచి తాత దగ్గరకు వచ్చారు. అతడి చూపులు సలీమ్, జులేఖా, మనవడు, మనవరాలిని స్పృశించి ఖిబ్లా వేపు చూస్తూ నిశ్చలమైనాయి.

అంతా నిశ్శబ్దం....

దుఃఖిస్తూనే సలీమ్ నాయన కళ్లను నెమ్మదిగా మూసినాడు. పైన తెల్లని వస్త్రాన్ని కప్పినాడు.

“మౌత్‌సె కోయీా న ఘబరాయె అగర్ యహ్ సమఝె
కె యహ్ దునియా కె బఖేడోం సె ఛుడా దేతీహై!”

✣ ✣ ✣ ✣ ✣

కరోనా వలన నాయన చనిపోయాడని అనుకుంటున్నారందరూ. గుంటూరు బంధుమిత్రులకు ఫోన్ చేసాడు. ప్రతి ఇంట్లోనూ ఎవరో ఒకరు జ్వరంతో బాధపడ్తున్నారనేది అర్థమయ్యింది. చుట్టుపక్కల మిత్రులు కూడా వచ్చి దూరంగా నిలబడి చూసి వెంటనే వెళ్లిపోతున్నారు. మాస్కులుండడంతో ఎవరి ముఖంలో భావాలూ కనబడడం లేదు.

మసీదు నుంచి ఇమామ్, ఇంకో నలుగురు వాలంటీర్లు వచ్చారు. ఇంట్లో పిల్లలు బిక్కుబిక్కుమని తిరుగుతున్నారు.

ఘుసల్ – వేడినీటి స్నానం చేయించారు పార్థివ దేహానికి. మూడుసార్లు అత్తరు జల్లారు. మూడు తెల్లటి వస్త్రాలను లిఫాఫా, ఖామిస్, ఇజార్‌లుగా కప్పినారు. కఫిన్ సిద్ధమయ్యింది. పార్థివ శరీరం– మయ్యిత్ ఇప్పుడు దఫన్–ఆఖరి ప్రయాణానికి రెడీగా ఉన్నది. ఆఖరి చూపులయిపోయాయి. సలీమ్ భావోద్వేగానికి గురైనాడు.

ఈ మహమ్మారి ఓదార్పు మాటలను మింగివేసింది. బంధుమిత్రుల ఆలింగనాలను, కరచాలన స్పర్శను దూరం చేసింది. ప్రాణభయం మాస్కుల వెనక దోబూచులాడుతున్నది.

జనాజా ప్రార్థనలు చదివినారు.

బిస్మిల్లా హిర్రహీమ నిర్రహీమ్... అత్యంత దయాశీలి కరుణామయుడైన ‘అల్లా’ను స్మరిస్తూ...

.... లా ఇలాహ ఇల్లల్లాహు మహమ్మద్ రసూలల్లా...

..............................................

సమాధి గోతిలో ఉంచిన రహీమ్‌భాయ్ శరీరంపై మూడు పిడికిళ్ల మట్టి జల్లినారు.

“మిన్హా ఖలఖ్ నకుమ్–
వా ఫి హా న్యుదుకుమ్–
వా మిన్హా నుఖ్రిజుకుమ్ తరతన్ ఉఖ్రా”–

“ఈ మట్టి నుంచి నిన్ను తయారు చేసాము
ఈ మట్టిలోకే నిన్ను తీసుకు వెళ్తాము
ఈ మట్టి నుంచే నిన్ను మరల తీసుకువస్తాము.”

వచ్చినవాళ్లు సలీమ్ భయ్యాకు తజియత్ చెప్పి ఓదార్చినారు. అందరూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. జీవితంలో ఒక సహజ భాగం మరణం.

హో ఉమ్రె ఖిజర్ భీ తొ కహెంగె బ–వక్తె మర్గ్
హమ్ క్యా రహె యహాఁ అభీ ఆయె అభీ చలే!

✤ ✤ ✤ ✤ ✤

నాయనకు మంచిగనే జరిగింది. మరి తమ పరిస్థితేంటి? నెలరోజులైంది నాయన చనిపోయి. ఇంట్లో భరించలేని నిశ్శబ్దం... ఒళ్లునొప్పులు, జ్వరంగా అనిపించగా దవాఖానకు వెళితే జులేఖాకు కోవిడ్ పాజిటివ్ అని రిపోర్టు వచ్చింది. “ఆయాసమొస్తే హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేయండి. అప్పటి వరకు ఇంటిలోనే ఐసొలేషన్‌లో ఉండవచ్చు” అన్నాడు డాక్టరు మందులిస్తూ...

పిల్లలకు తనకు నెగెటివ్. జులేఖా అప్పటికే షుగర్‌కు, బి.పికి మందులు వాడుతున్నది. వాటికి తోడు కరోనాకు రోజూ దోసెడు మందులు. జ్వరం వచ్చీ పోతున్నది ఆమెకు. ఎవరినీ తన దగ్గరకు రానియ్యడం లేదు. వస్తే వాళ్లకు అంటుకుంటుందేమోనని భయపడ్తున్నది. నాయన గదివేపు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నది. ఇమామ్ సాబ్ దగ్గరికెళ్తే తాయెత్తు ఇచ్చాడు. ఆమె చేతికి తాయెత్తు కట్టి వంటపనిలో నిమగ్నమైనాడు. పిల్లలు ఇల్లూడ్చి, బట్టలు సర్దుతున్నారు.

“అమ్మీని జాగ్రత్తగా చూసుకోండి! నేను సరుకులు తెస్తాను” అని సలీమ్ ఆటోలో బజారుకెళ్లాడు. ఇంటికి వచ్చేసరికి జులేఖా ఆయాసపడ్తున్నది. కోవిడ్

పాజిటివ్ అని తెలిసాక ఎవరూ సాయం వచ్చే పరిస్థితి లేదు. పిల్లల్ని ఇమామ్ సాబ్ దగ్గరుంచి జులేఖాను ఆటోలో తీసుకుని గవర్నమెంట్ దవాఖానాకు తీసుకువెళ్లాడు సలీమ్. దారంతా పరాకుగా మాట్లాడుతున్నదామె.

ఎమర్జన్సీ గది నుంచి కరోనావార్డుకు, వార్డు నుంచి ఐసిసియూకు షిఫ్ట్ చేసారు. “షుగర్ లెవెల్స్ పెరిగాయి, సిటిస్కాన్ రిపోర్టులో న్యుమోనియా ఉందని తేలింది. అంతా ఆమె తట్టుకునే శక్తిమీద ఆధారపడి ఉంటుంది. మంచి జరుగుతుందని ఆశిద్దాం!” అన్నాడు పెద్ద డాక్టరు.

తెల్లవారుజామున ఒంటిగంటకు ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయని వెంటిలేటర్ మీద పెట్టారట. పిల్లల్ని సముదాయించి, ఇంత తినబెట్టి వాళ్లను మసీదులో ఉంచి హాస్పిటల్‌కు వచ్చేసరికి ఇదీ విషయం.

వారం రోజులుగా వెంటిలేటర్ మీదే ఉంది జులేఖా! ఈలోగా ఎప్పుడు ఏ దుర్వార్త వినవలసి వస్తుందోనని గజగజ వణికిపోయాడు సలీమ్. గుంటూరులో జులేఖా అమ్మా, నాన్నల పరిస్థితీ బాగోలేదు. ఆమె అన్నదమ్ములు కాని, తన వేపు వాళ్లూ ఎవరూ రాలేదు. రాత్రంతా హాస్పిటల్ దగ్గర జాగారం పిల్లలతో. పెద్దవాడు అన్వర్‌కు పదేళ్లు. ఆరేళ్ల ముంతాజ్‌ను ఓదార్చి ధైర్యం చెబుతున్నాడు. అలిసిపోయారేమో ఆటోలోనే నిద్రపోతున్నారు పిల్లలు.

తెల్లవారుజామున పిల్లల్ని ఇంటికి తీసికెళ్లి ఇంత అన్నం, కూరా వండి పదిగంటలకల్లా హాస్పిటల్‌కు వచ్చాడు సలీమ్.

డాక్టరు గారు రమ్మంటున్నారని ఫోన్ వచ్చింది. అపాయం శంకిస్తూనే ఐసిసియూ దగ్గరకు వెళ్లాడు సలీమ్. డ్యూటీ డాక్టరు వచ్చి అన్నాడు– “సలీం మీరేనా! జులేఖా పరిస్థితి బాలేదు. ఇప్పటికే రెండుసార్లు హార్ట్ ఎటాక్ వచ్చి బి.పి. పడిపోయింది. మరల తేరుకుంది షాక్ ఇచ్చినాక... కాని ఇంప్రూవ్‌మెంట్ లేదు. ఈ గంట గడిస్తే ఎక్కువ!” అని చెప్పి లోపలకు వెళ్లిపోయాడు. ఐసిసియూ అద్దాలలోంచి కనిపిస్తున్నది జులేఖా బెడ్ దగ్గర డాక్టర్లు, నర్సులు పి.పి.యీ. కిట్లలో హడావుడిగా తిరుగుతున్నారు.

ఓ అర్ధగంట తరువాత నర్స్ వచ్చింది... “ఓ గంటలో వస్తే అన్ని ఫార్మాలిటీలు పూర్తిచేసి బాడీ అప్పగిస్తాం” అన్నదామె. “ఈ ఫారమ్ మీద సంతకం పెట్టండి”.

బయటకు వచ్చి ఆటోలో కూర్చోగానే దుఃఖం పొర్లుకు వచ్చింది సలీమ్‌కు. ఇదే ఆటోలో తానూ, జులేఖా పిల్లల్ని తీసుకుని పార్కులకు, సినిమాలకు వెళ్లేవాళ్లు. హాయిగా నవ్వుతూ వెళ్లి ఉర్సులో పాల్గొనేవాళ్లు. ఇప్పుడు ఇదే ఆటోలో... ఆమెను...

తెల్లటి గుడ్డలో ఓ పాకేజీలా కట్టేసి ఉన్న ఆమె నిర్జీవ దేహాన్ని స్ట్రెచర్ మీద తీసుకువచ్చి ఆటోలో పడుకోబెట్టారు. దానిపై ఉన్న టాగ్ మీద "జులేఖా – వైఫ్ ఆఫ్ సలీమ్" అని అడ్రస్ వ్రాసి వుంది. "చెక్ చేసుకోండి ఇప్పుడే!" అన్నారు వాళ్లు... అప్పజెప్పినట్లు పుస్తకం మీద సంతకం తీసుకుని వెళ్లిపోయారు.

"ఇంటికి వెళ్లాలా, సరాసరి కబరస్తాన్‌కు వెళ్లాలా? పిల్లలకేం సమాధానం చెప్పాలి?" సలీం ఒక నిర్ణయానికి వచ్చాడు...తన సుకుమార హస్తాలతో ఎన్నో సేవలు చేసింది తనకు. ఆమెకు ఈమాత్రం సేవ చేయలేడా తాను. ఎవరేమన్నా అనుకోనీ!... ఇంటికి తీసుకువచ్చి ఆమె దేహాన్ని హాల్లో పడుకోబెట్టాడు. ఇరుగు పొరుగు వాళ్లెవరూ సాయానికి రాలేదు. ఇమామ్ సాబ్ నూటరెండు డిగ్రీల జ్వరంతో వణుకుతున్నాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు కదల్లేని పరిస్థితిలో తానే సాయం చేయలేనందుకు.

ముంతాజ్, అన్వర్‌లకు ఏం చెయ్యాలో చెప్పాడు. పిల్లలు అర్థం చేసుకున్నారు. ముంతాజ్ తల్లి శరీరాన్ని వేడినీటితో కడిగింది. అత్తరు చల్లి తల్లి దేహాన్ని తెల్లని బట్టలతో కప్పినాడు అన్వర్. సలీం కఫన్ సిద్ధం చేసాడు. ముగ్గురూ కలిసి ఆమెను ఆటోలో ఉంచారు. తమకు సాయంచేసేది ఆ దేవదేవుడొక్కడే. జనాజా ప్రార్థనలు చేసారు.

...బిస్మిల్లా హిర్రహీమ్ నిర్రహీమ్...

...లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలల్లా...

ఆటో కదిలింది కబరస్తాన్ వేపు. అక్కడా నిర్మానుష్యంగా ఉంది. పిల్లల్ని ఆటోలో ఉంచి ఆమె దేహాన్ని మోసుకుని వచ్చి రహీమ్‌భాయి సమాధి పక్కనే గొయ్యి తవ్వాడు. ఆఖరిసారి జులేఖా ముఖాన్ని చూసాడు. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్నదామె. ఆమె శరీరాన్ని నెమ్మదిగా గోతిలోకి దించాడు. మూడు పిడికిళ్ల మట్టి చల్లాడు.

'మిన్హా ఖలఖ్ న కుమ్
వా ఫిహా న్యుదుకుమ్
వా మిన్హా నుఖ్రి జుకుమ్ తరతన్ ఉఖ్రా"

గోతిని పూడ్చి పిల్లల్ని తీసుకుని ఇంటికి రాగానే దుఃఖం పొర్లుకువచ్చింది. పిల్లల్ని కావలించుకుని భోరుమన్నాడు.

"బతుకుతాను ఈ పిల్లలకోసం... అల్లా దయకోసం... చావంటే భయపడను. ఈ కరోనా కాదు జిన్ను పిశాచాలు యావన్మందీ దండెత్తి వచ్చినా చలించను..." అనుకున్నాడు సలీమ్.

తండ్రిని చూసిన పిల్లలలో కూడా ధైర్యం వచ్చింది. నాయన ఉండగా మనకు భయం లేదు అనుకున్నారు వాళ్లు.

"మనం భయపడవద్దు. మనకి ఇల్లు ఉంది. అండగా 'అల్లా' ఉన్నాడు. పక్షులు హాయిగా బతకడంలేదా సరైన ఇల్లు లేకున్నా! మనం బయటకు వెళ్లినప్పుడు ఈ ఇల్లు ఇక్కడే ఉంది. మనం ఇంట్లో ఉన్నప్పుడూ ఈ ఇల్లు ఇక్కడే ఉంది. బయటకు వెళ్తున్నదీ మనమే, లోపలికి వస్తున్నదీ మనమే! మనమిక భయపడం. తాత, అమ్మ మనలోనే ఉన్నారు. మనల్ని కాపాడే ఆ మహాశక్తిమంతుడు, కరుణామయుడు మనతోనే ఉన్నాడు" అన్నాడు సలీం. "మనం వెళ్లి ఇమామ్‌సాబ్‌కు సాయం చేద్దాం... ధైర్యం చెబుదాం..."

"లా ఇలాహ ఇల్లల్లా ముహమ్మద్ రసూలల్లా"

వాళ్లకిప్పుడు కరోనా భయంలేదు. మృత్యువును దగ్గరగా చూసినాక దుఃఖం నశిస్తుంది.

న తొ కుఛ్‌తొ ఖుదా థా, కుఛ్ న హోతా తో ఖుదా థా!
దుబొయా ముఝ్‌కొ హొని నె, న హోతా మెయిన్ తొ క్యా హొతా!!

★★★★★

**(ఇది నేను విన్న కథ, నా మాటల్లో చెప్పాను. నాకు తెలిసిన గజల్స్‌ను మననం చేసుకుంటూ).**

# 4. అసంకల్పిత హంతక బ్రహ్మచారులు

"వంద కోతుల్తో సమానం ఒక్కో బ్రహ్మచారి" అన్నాడు దుర్గారావు.

"ఏమిటి సంగతి ఇవ్వాళ పెళ్లికాని ప్రసాదుల మీద ఫోకస్ పెట్టావా" అడిగింది హిమజ మాస్కు సర్దుకుంటూ.

"యూమీన్ ఇన్‌సెల్స్? యస్... ఇన్‌వలంటరీ సెలిబేట్స్ - పార్టనర్ దొరకనివాళ్లు కదూ" అన్నాడు రాబర్ట్ కాఫీ తెస్తూ.

"భాబాస - భార్యా బాధితుల సంఘం, భర్త బాధితుల సంఘంలా ఇది సహచరులు దొరకని యువకుల గ్రూపు అన్నమాట. వీళ్లకు స్త్రీలంటే ద్వేషం. గమ్మత్తేమిటంటే... 'అలన' అనే కెనడా యూనివర్సిటీ స్టూడెంట్ తన బాధల్ని ఆన్‌లైన్‌లో చెప్పుకోడానికని 'అలన ఇన్‌వాలంటరీ సెలిబసి ప్రాజెక్ట్' అనే వెబ్‌సైట్ ఓపెన్ చేసింది. INVCEL గా తనేవాత దానిని INCEL గా మార్చి 2000 సంవత్సరంలో వేరేవాళ్లకు ఇచ్చి తాను తప్పుకుంది. ఇప్పుడు దానిలో లక్షలకొద్దీ మెంబర్లున్నారు. అదిప్పుడు హేట్‌గ్రూప్‌లకు నిలయంగా మారింది" అన్నాడు జెర్రీలూయిస్.

అరిజోనా, మెరికోపా కౌంటీ - గ్లెన్‌డేల్ పట్టణం డౌన్‌టౌన్ వెస్ట్‌గేట్ సిటీసెంటర్ దగ్గరున్న రెస్టారెంట్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు నలుగురు మిత్రులు. ఈలోగా కరొలిన్, సమంతలు వచ్చి జాయినయ్యారు. వెస్ట్‌గేట్ సిటిసెంటర్ చాలా పెద్ద మిక్స్‌డ్ యూజ్ డెవలప్‌మెంట్ కమ్యూనిటి సెంటర్. రెండు వందల ఇరవై మూడు ఎకరాలలో ఎనభై లక్షల చదరపు అడుగుల నిర్మాణం (ఫ్లోర్ ఏరియా) చెయ్యాలనేది ప్లాన్. ప్రతి ఏడాది రెండు కోట్లమంది విజిటర్స్ వస్తారక్కడకు. ఫుట్‌బాల్ గేమ్స్ తరచుగా జరుగుతాయక్కడి స్టేడియంలో.

"వాట్ హాట్‌టాపిక్ టుడే రాబర్ట్!" అడిగింది సమంత హాయిగా నవ్వుతూ.

"ఇన్‌సెల్ గురించి తెలుసుగా నీకు, జెర్రీ ఇప్పుడే 'అలన' గురించి చెబుతున్నాడు".

"క్వయిట్ ఇంటరెస్టింగ్! కాని వాళ్లు టెర్రరిస్టు గ్రూపుల్లా బిహేవ్ చేస్తున్నారు కదా! మేల్ డామినెన్స్, ఆడవాళ్ల మీద కోపం, ద్వేషం!" అన్నది కరొలిన్.

"అవును. నా ఫ్రెండొకడు లవ్-షై డాట్‌కామ్‌లో మెంబరు. అతడి ప్రవర్తన గమ్మత్తుగా ఉండేది. ఎవరైనా చక్కని అమ్మాయి కనిపిస్తే తలవంచుకునేవాడు కాని పిడికిళ్లు బిగించడం, పళ్లు పటపటలాడించడం లాంటివి చేసేవాడు. తరువాత తెలిసింది వాడు 4 ఛాన్, రెడ్డిట్‌లో ట్రొలింగ్, 'షిట్‌పోస్టింగ్' చేసేవాడని" అన్నాడు జెర్రీలూయిస్.

హిమజకు భయమేసింది. దుర్గారావు చేతిని గట్టిగా పట్టుకున్నది.

"భయంలేదు హిమజా! మేమున్నాం కదా! మాకు ఎక్సెల్ వచ్చు, ఇన్‌సెల్ రాదులే" అన్నాడు రాబర్ట్ నవ్వుతూ.

"ఇన్‌సెల్ కమ్యూనిటి పోస్టుల నిండా మహిళలపై బూతులు, నిందలు, సెక్స్ వర్కర్లపై ఆగ్రహాలు, ఒంటరితనం, దిగులు, ఆత్మహత్యల గురించి చర్చలు! ఈ తీవ్ర భావాలు ఎటు దారితీస్తాయో!" అన్నది సమంత.

"మాట్రిక్స్ సినిమాలోలా – బ్లూపిల్ మింగి మాయాలోకంలో ఉంటావా లేక రెడ్‌పిల్ మింగి వాస్తవంలో బతికి చస్తావా? నిర్ణయం నీదే! ఇప్పుడు ఈ మానోస్ఫియర్ – మగ ప్రపంచంలోకి 'బ్లాక్‌పిల్' వచ్చింది. వైట్ డామినేషన్ వరల్డ్‌లో బ్లాక్ పార్టనర్‌ను కోరుకుంటే అది హైపొగమి ప్రతిలోమ భాగస్వామ్యం. తనకంటే అధికుడిని కోరుకుంటే అది అనులోమ వ్యవహారం. అందం, ఆకర్షణ లేకపోవడ మంటే 'బ్లాక్‌పిల్' తీసుకుని బతకడం అన్నమాట. ఈ ప్రపంచం తమకు బ్లాక్‌పిల్స్ ఇచ్చి తగిన పార్టనర్ దొరక్కుండా చేసింది కనుక దాని మీద పగ తీర్చుకోవాలన్న ధోరణి 'ఇన్‌సెల్స్' వ్యాఖ్యలలో కనిపిస్తుంది" అన్నాడు దుర్గారావు.

"ఇప్పుడేమో ఈ కరొనా గొడవ. 'స్టే ఎట్ హెూమ్' ఆర్డర్ ఎక్స్‌పైర్ అయ్యింది కాబట్టి బయటకు రాగలిగాం. ఇంట్లో ఉండీ ఉండి పిచ్చబోర్ కొట్టింది" అన్నది హిమజ.

"ఇట్లా పిచ్చబోర్ కొట్టే కొందరు ఇన్‌సెల్స్ డెత్‌కల్ట్‌గా మృత్యుదూతలుగా మారుతున్నారు" అన్నది సమంత.

"వాళ్లు ఫెమినిజంకు వ్యతిరేకం హిమజా! పారెటొ సూత్రం ప్రకారం ఎనభైశాతం యువతులు ఇరవైశాతం మగవాళ్లకు పడిపోతారు. మిగతా ఎనభై శాతం యువకులు ఫ్రస్ట్రేషన్‌లో చచ్చిపోతున్నారు పార్టనర్ దొరకక. ఎర్రగోలీ-రెడ్‌పిల్ ఉన్న మగాళ్లు ఇరవై శాతం మందికి అంతులేని అవకాశాలు. నల్లగోలీ-బ్లాక్‌పిల్ మింగిన మిగతా ఎనభైమందికి ఆడవాసన తగలక ఇన్‌సెల్‌లై పిచ్చెక్కి ఆత్మహత్యలకు దిగుతున్నారు లేదా మూకుమ్మడి హత్యలకు ప్లాన్ చేస్తున్నారు ఆడవాళ్లపై ద్వేషంతో" అన్నాడు రాబర్ట్.

"అందంగా, ఆకర్షణీయంగా ఉండే ఆడవాళ్లకు పొగరెక్కువ. వాళ్లు క్రూరులు. చపలమనస్కులు. 'నీకంటే డబ్బూ, అందం ఉన్న ఆల్ఫామేల్ దొరికితే నిన్ను కాలితో తన్ని వాడితో వెళ్లిపోతారు అనేది' ఇన్‌సెల్ సభ్యుల అభిప్రాయం" అన్నాడు జెర్రీలూయిస్.

"ఆడవాళ్లను ఫెమాయిడ్స్, రోస్టీస్, స్టాసీస్, బెక్కీస్ అని వల్గర్‌గా పిలుస్తారు. ఛాడ్ అంటే శృంగారవీరుడు. నార్మీ అంటే మామూలు మగాడు. లుక్స్‌మాక్సింగ్ అంటే మంచిగా ట్రిమ్‌గా తయారవడం – ముఖాన ముడతలొస్తే 'ఫేస్ లిఫ్టింగ్' వగైరా ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకోవడం. కర్రీసెల్స్, రైస్‌సెల్స్, ఎథ్నిసెల్స్, ఫేక్‌సెల్స్ ఇవన్నీ సబ్ గ్రూపుల పేర్లు" వివరించాడు దుర్గారావు.

సమంత అన్నది- "మహిళా ఇన్‌సెల్స్ కూడా ఉన్నాయి హిమజా. ఫెమ్‌సెల్స్. ఇరవై రెండు వేల మెంబర్లున్నారు వీటిలో. సరైన మగాడు దొరకనివాళు కొందరైతే, ఒక్క మగాడి వాసనా తెలియనివాళ్లు మరికొందరు".

"ఇదేమన్నా మెంటల్ డిజార్డరా?" అడిగింది కరొలిన్.

"అవునట. డిప్రెషన్, ఆటిజమ్, బాడి డిస్‌మార్ఫియాలలో ఇన్‌సెల్స్ ఎక్కువట. వీళ్లలో ఆత్మహత్యల శాతం ఎక్కువ" అన్నాడు జెర్రీలూయిస్.

"2009లో 'జార్జి సొడిని' అనేవాడు పెన్సిల్వేనియా హెల్త్‌క్లబ్బులో కాల్పులు జరిపితే ముగ్గురు మహిళలు చనిపోయారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. సెక్సువల్ ఫ్రస్టేషన్ ఉన్న ఇన్‌సెల్స్ కొందరికి ఇతడు ఆరాధ్యుడట.

2014లో శాంతాబార్బరా, ఐలావిస్టా – కాలిఫోర్నియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ‘ఎలియాట్ రోడ్జర్’ ఆరుగురిని చంపి, పధ్నాలుగు మందిని గాయపరచి ఆత్మహత్య చేసుకున్నాడు. వాడు ఇన్‌సెల్స్ కోసం 137 పేజీల మ్యానిఫెస్టో వ్రాసాడు. అతడ్ని E.R. అని పిలుస్తారు.

ఒరెగాన్‌లో క్రిస్‌హార్పర్, ఆల్బెర్టాలో షెల్డాన్ బెనెట్లీ, న్యూమెక్సికోలో విలియం అట్చిసన్, ఫ్లోరిడాలో నికొలస్ క్రుజ్ – వీళ్లందరూ మాస్ మర్డరర్లు. హంతక అసంకల్పిత బ్రహ్మచారులు” అన్నాడు రాబర్ట్ వికిపీడియా చూస్తూ.

“టొరంటోలో ఏప్రిల్ 23, 2018 నాడు వాన్ వేగంగా నడిపి పదిమంది మృతికి, పదహారు మందిని గాయాలకు గురిచేసిన అలెక్ మినాసియాన్ ఓ మిసొగైనిస్ట్. మహిళా ద్వేషి. ఫ్లోరిడా, డల్లాస్, లాస్‌వెగాస్, జర్మనీలలో హత్యాకాండలు ఇన్‌సెల్ సభ్యులు చేసినవే! 2020 ఫిబ్రవరి 24న పదిహేడేళ్ల యువకుడు స్పాలో పనిచేస్తున్న యువతిని దారుణంగా పొడిచి చంపాడు’’ అంటూనే జెర్రీలూయిస్ కిటికీ అద్దంలోంచి రెస్టారెంట్ వేపు వస్తున్న వ్యక్తిని చూసాడు.

రెస్టారెంట్ బిజీగా ఉంది. అన్ని టేబుల్సు దాదాపు ఫుల్‌గా ఉన్నాయి. మెయిన్ డోర్‌కు పక్కన ఉన్న టేబుల్స్ దగ్గర చాలామంది యువతులు కూర్చుని సందడిగా మాట్లాడుకుంటున్నారు. కరోనా కట్టడి తరువాత కలుసుకోవడం కాబట్టి అంతా కోలాహలంగా ఉంది. దుర్గారావు, హిమజ, రాబర్ట్, జెర్రీ, సమంత, కరొలిన్‌లు ఓ మూల ఉన్న టేబుల్ దగ్గర ఉన్నారు. బారిస్టాలు చాలా బిజీగా ఉన్నారు. కస్టమర్లకు సర్వ్ చేస్తూ.

“రాబర్ట్! కరొలిన్! నేనిందాక చెప్పానే! నాకొక ఫ్రెండ్ ఉండేవాడని, అర్మండ్ జూనియర్! అతడే అనుకుంటా... రెస్టారెంట్‌లోకి వస్తున్నాడు’’ అన్నాడు జెర్రీలూయిస్.

అర్మండ్ జూనియర్ నెమ్మదిగా లోనికి వచ్చి రెస్టారెంట్‌లో ఉన్నవాళ్లవేపు చూసాడు. తన చేతిలోని బ్యాగ్ టేబుల్ మీద ఉంచి జిప్ ఓపెన్‌చేసి ముఖానికున్న మాస్కు తీసేసాడు. కాఫీ, బిస్కట్లు సర్వ్ చేస్తున్న బారిస్టాల వేపు, ఆనందంగా మాట్లాడుకుంటున్న యువతుల వేపు అదోరకంగా చూసాడు. బ్యాగ్‌లోంచి వీడియో కెమెరా తీసి రికార్డింగ్ మోడ్‌లో పెట్టి, సెల్‌ఫోన్‌లో రెస్టారెంట్‌ను వీడియో తీసాడు.

బారిస్టా గరల్‌కు కాఫీ ఆర్డర్ చేసి తాను తీసిన వీడియోలను 'యూట్యూబ్'లో అప్‌లోడ్ చేసాడు 'రెట్రిబ్యూషన్-ప్రతీకారం' శీర్షికతో.

ఆర్డర్ చేసిన కాఫీ తీసుకువచ్చిన బారిస్టా గరల్ చిరునవ్వు నవ్వి చక్కని సువాసనతో పొగలు కక్కుతున్న కాఫీకప్పు అక్కడ పెట్టి కౌంటర్ వేపు వెళ్తున్నది వయ్యారంగా... చటుక్కున పైకి లేచాడు అర్మండ్ జూనియర్... భీకరంగా అరిచాడు... "కరోనా లాక్‌డౌన్ అయిపోయిందా? అందరూ ఇక్కడ చేరారు! నేను పంపిస్తా మిమ్మల్ని ఐసొలేషన్‌లోకి..." అతడి చేతిలోని ఆటోమాటిక్ గన్ నిప్పులు కక్కింది. గుండ్రంగా తిరుగుతూ అతడు ఒక లక్ష్యం లేకుండా కాలుస్తుంటే బారిస్టా గరల్ నేలకూలింది. పక్కనే ఉన్న టేబుల్ దగ్గర ఉన్న ముగ్గురు యువతులు రక్తపు మడుగులో పడిపోయారు. కొందరు టేబుళ్ల చాటున దాక్కుంటున్నారు. క్షణాల్లో అంతా అల్లకల్లోలం.

"ఇన్‌సెల్ తిరుగుబాటు వర్ధిల్లాలి! సెయింట్ ఎలియాట్ జిందాబాద్! అంటూ భయంకరంగా అరుస్తూ అతడు కాల్పులు జరుపుతూనే ఉన్నాడు. కొన్ని గుళ్లు తమవేపు దూసుకువస్తాయని పసిగట్టిన లూయిస్ మిత్రులను "డౌన్... డౌన్..." అంటూ నేలమీద పడుకొమ్మని సంజ్ఞచేసి టేబుల్‌ను అడ్డం పెట్టాడు.

"లాంగ్‌లివ్ ఇన్‌సెల్ రెబెలియన్... ఈ.ఆర్. జిందాబాద్" అని అరుస్తూ ఆ హంతకుడు పెప్పర్‌స్ప్రే జల్లుతూ వచ్చిన దారినే పారిపోయాడు.

వంద కోతులొచ్చి ధ్వంసం చేసిన పూల తోటలా రెస్టారెంటు గాయపడిన వాళ్ల ఆక్రందనలతో... చనిపోయిన వాళ్ల రక్తపు మడుగులతో... విరిగిపడిన కుర్చీలు, ఫర్నీచర్‌తో భీకరంగా కానవచ్చింది.

★★★★★

# 5. స్మెల్ డేటింగ్

–"ఉపరిచర వసువు, అప్సరస మత్స్యకన్య అద్రికల సంతానం మత్స్యగంధి. ఆమెను యమునానది ఒడ్డున నివసించే దశరాజు దత్తత తీసుకుని పెంచాడు సత్యవతి అనే పేరుతో. పెంపుడు తండ్రి లానే ఆమె చేపలు పట్టడం, పడవ నడపడంలో నేర్పు సంపాదించింది. ఒకరోజు పరాశరుడనే మహర్షి ఆమెతో శృంగారం నెరిపి తన మహిమతో ఆమె చేపలకంపును పోగొట్టి గంధవతిగా, యోజనగంధిగా సువాసనలు వెదజల్లేట్లు చేసాడు. వారి ప్రేమకు చిహ్నంగా పుట్టినవాడు వ్యాసుడు. ఆ తరువాత శంతనుడనే రాజు సత్యవతి రూపలావణ్యాలకు, సువాసనకు పడిపోయి వివాహం చేసుకోవాలనుకున్నపుడు, అతడి కుమారుడు గంగాపుత్రుడైన దేవవ్రతుడు రాజ్యం సత్యవతీపుత్రులకే చెందేందుకు తాను వివాహం చేసుకోను, రాజ్యమక్కర్లేదని భీష్మ ప్రతిజ్ఞ చేసి భీష్ముడిగా పిలవబడతాడు. సత్యవతీ–శంతనులకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు సంతానం. చిత్రాంగదుడు గంధర్వుల చేతిలో మరణిస్తాడు. విచిత్రవీర్యుడికి కాశీరాజు కుమార్తెలు అంబిక, అంబాలికలతో వివాహం చేస్తాడు భీష్ముడు. సంతానం కలగకుండానే విచిత్రవీర్యుడు చనిపోగా, సత్యవతి తన ప్రథమ సంతానమైన వ్యాసుడిని నియోగపద్ధతిలో తన కోడళ్లైన అంబిక, అంబాలికలతో కలిసి సంతానాన్ని కనమని ప్రార్థిస్తుంది. అంబికకు ధృతరాష్ట్రుడు, అంబాలికకు పాండురాజు, వాళ్ల దాసికి విదురుడు పుడతారు. ధృతరాష్ట్రుడి సంతానం కౌరవులు, పాండురాజు సంతానం పాండవులు. వీరి కథే మహాభారతం" –టి.వి.లో ప్రవచనాలు వినవస్తున్నాయి.

"శరీరపు వాసనకు ఎనలేని ప్రాముఖ్యత ఉందన్నమాట మనకు తెలుసు. చాలామంది చెమట గొర్రెమూత్రపు కంపు కొడుతుంది. అందుకే పడుకునే ముందు స్నానంచేస్తే అన్నిరకాల సుఖనిద్ర పడుతుందని పెద్దలంటారు" అన్నది పుష్పవల్లి.

“ఈ కరోనా వల్ల మాస్కు పెట్టుకోవాల్సి వచ్చింది. అప్పుడు తెలిసింది మన నోరు ఎంత కంపుకొడుతుందో” అన్నాడు సుబ్రహ్మణ్యం. ఆయన తెలుగు పండితుడు. శాఖాధిపతి.

“మన అనకు! నీ సంగతి నీకర్థమయ్యింది కదా! మరి నేనెలా భరిస్తున్నా ననుకున్నావు నిన్నిన్నాళ్లూ! సిగరెట్లు మానవు. చెబితే వినవు” అన్నది నెమ్మదిగా పుష్పవల్లి. అదే కాలేజిలో సైన్స్ లెక్చరర్ ఆమె.

సుబ్రహ్మణ్యానికి దుఃఖమూ, కోపమూ పొడుచుకువచ్చాయి. “నేను రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకుంటాను. నోట్లో ఫ్రెష్‌మింట్ వేసుకుంటాను. లవంగాలు నములుతాను. నీవే అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నావు” అన్నాడు.

“ఒక్కోసారి తొందరలో మరచిపోతావు. అయినా నీమీద నాకు ప్రేమేలే!” అన్నది పుష్పవల్లి అతడిని అనునయిస్తూ.

అప్పుడప్పుడు ఇలాంటి గొడవలు వాళ్లకు మామూలే! కాసేపు గొడవపడి మరలా సర్దుకుపోతారు.

“ఏమోనోయ్! ఈ కరోనా దెబ్బకు ముందుగా వాసన పోతుందట. మనం ఇది రుచిగా ఉంది, అది రుచిలేదు అనేదంతా ఆఘ్రాణించే శక్తివల్లనేనట. కాబట్టి ఓ రకంగా రుచి, వాసనలు కవలపిల్లలేమో!” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“ఫెరొమొన్ అనే రసాయన పదార్థాలు జీవుల శరీరాల నుండి వెలువడ్తాయి. ఆహారము, నిద్ర, మైథునాలలో వీటి పాత్ర చాలా ఎక్కువట” అన్నదామె.

“కాకతీయుల ఓరుగల్లు విద్యానాథుడు – ‘భృంగానవాప్తి ప్రతిపన్నఖేదా కృత్వావనే గంధపలీ తపోలమ్’ అని వ్రాస్తే పింగళి సూరన ‘అంబుజగంధి నాసిక నిజాన్వయ శత్రువు చంపక ప్రసూనంబు గరంబు గెల్చుట మనంబున బెట్టి’ అని అనువదించాడు.

ముక్కుతిమ్మన తెలుసు కదా నీకు. ఆయన వ్రాసాడనే ప్రసిద్ధికెక్కిన పద్యం ఇది–

**“నానా సూన వితాన వాసనల నానందించు సారంగమే**
**లా నన్నొల్ల దటంచు గంధఫలి బల్కాకన్ దపంబంది యో**
**షా నాసాకృతి దాల్చి సర్వసుమన స్సౌరభ్య సంవాసియై**
**పూనెం బ్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబు లిర్వంకన్”**

“ఓ పుష్పవల్లీ! నీ ముక్కు కూడా సంపెంగ మొగ్గ. నీ చూపులు తుమ్మెదలు” అన్నాడు సుబ్రహ్మణ్యం పద్యపరవశం కలిసిన ప్రేమతో...

“అవునా తుమ్మెదగారూ! రండి సూపు చల్లారిపోతోంది. హాయిగా సేవించినాక ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకులు పలుకుదురుగానిలే” అన్నదామె హాయిగా నవ్వుతూ.

ఈ దంపతుల ఏకైక పుత్రరత్నం శ్రీనివాస్. యూనివర్సిటీ ఆఫ్ నెబ్రస్కాలో సైకాలజీ రిసెర్చ్ స్కాలర్. అతడి స్నేహితులు సుశాంతి, జాకబ్, మార్తా, స్పెన్సర్. వీళ్లు హ్యూమన్ బాడీసెంట్స్ – మానవ శరీర వాసనల మీద రిసెర్చి చేస్తున్నారు.

సెల్‌ఫోన్ రింగయ్యింది. స్కైపులో శ్రీనివాస్ కనిపించాడు. “అమ్మా! నాన్నా! ఇవ్వాళ నా పేపరు ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రింటయ్యిందమ్మా!” అన్నాడు ఆనందంగా జర్నల్‌ను చూపుతూ.

“కంగ్రాట్యులేషన్స్‌చిన్నా! వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యూ” అన్నారు వాళ్లిద్దరూ పుత్రోత్సాహంతో.

“మేం అతిస్వేదం, నోటి దుర్వాసన, పాదాల చెమట, తల, చంకలు లాంటి రోమాలెక్కువ ఉండే ప్రాంతాల నుంచి వచ్చే వాసనకు సెక్చువల్ ఓరియంటేషన్‌కు ఏమన్నా సంబంధం ఉన్నదా అని రిసెర్చ్ చేస్తున్నాం. ఈ వాసనలకు, ఫెరొమోన్‌లనే రసాయనాలకు, ఇమ్యూన్ సిస్టమ్‌లోని మేజర్ హిస్టో కంపాటిబిలిటీ కాంప్లెక్స్ ఉన్న సంబంధాలను అధ్యయనం చేస్తున్నాం” అన్నాడు శ్రీనివాస్.

“వావ్, క్వయిట్ ఇంటరెస్టింగ్” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“ముక్కు అంటే నోస్ – మనం ‘నాసా’ అంటాము. ముక్కు మధ్యగోడలో ఉండే వొమెరొనాసల్ ఆర్గాన్ ఆఫ్ జాకబ్‌సన్ మేజర్ హిస్టోకంపాటిబిలిటి కాంప్లెక్స్‌తో

సమన్వయంగా పనిచేస్తూ కొత్తకొత్త వ్యాధుల్ని రానీకుండా, ఇన్‌బ్రీడింగ్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది.

ABCC-11 అనే జన్యువు చంకల నుంచి వచ్చే వాసనను, చెవిలో గుబులు (వాక్స్)ను నిర్ణయిస్తుంది. అందుకే కొందరి చెమట గొర్రెకంపు, చేపలకంపు ఇలా రకరకాలుగా ఉంటుంది” అన్నాడు శ్రీనివాస్.

“మత్స్యగంధి రహస్యమన్నమాట” అన్నది పుష్పవల్లి సాలోచనగా.

“అంతే కాదు నాన్నా! ‘నీ దగ్గర ముసలి వాసన’ వస్తుందంటాము కదా! శృంగార సుగంధాలు, వృద్ధుల వాసన, మృత్యు పరిమళాలు, ఇవన్నీ ఫెరొమోన్‌ల ప్రభావమే.

ఫ్లావిన్-కంటెయినింగ్ మోనో ఆక్సిజనేజ్-3 ఎంజైమ్ లోపంతో మూత్రం, చెమట, ఊపిరిలో ట్రైమిథైల్ ఎమిన్ ఉండడం వలన చేపకంపు వస్తుంది. ఇదే మత్స్యగంధికున్న జన్యులోపం. అట్లాగే బాహుమూలాల్లో, రోమాలెక్కువ ఉన్నచోట ఎక్కువ చెమట పట్టినప్పుడు బాక్టీరియా పెరిగి మేక ఉచ్చకంపు కొడుతుంది” అన్నాడు శ్రీనివాస్.

“ఇందాక మీ అమ్మా నేను ముక్కుతిమ్మన పద్యం చదివాములే. ముక్కుకూ సెక్సుకూ సంబంధాలు కనిబెడ్తున్నారంటే కొక్కోకంలా ముక్కోకశాస్త్రం వచ్చేస్తుందన్నమాట” అన్నాడు సుబ్రహ్మణ్యం చిద్విలాసంగా నవ్వుతూ.

“ముక్కును బట్టే ముఖం ఉంటుందటగా! ఆర్టిస్టులు ముందు ముక్కు గీసి తరువాత ముఖం గీస్తారట నిజమేనా! వెనకటి రోజుల్లో గద్దముక్కు (ఎక్విలిన్), గ్రీకుముక్కు, ఆఫ్రికన్ ముక్కు, దేగముక్కు, చొట్టముక్కు, సంపెంగ ముక్కు అని ఆరు రకాల ముక్కుల్ని వర్ణించాడు ఎడెన్ వార్‌విక్” అన్నాడు శ్రీనివాస్.

“ముక్కు చూడు ముక్కందం చూడు, ముక్కుకున్న ముక్కెరచూడు” అన్నట్లు మనదేశంలో స్త్రీలు ముక్కుపుడకలు, ముత్యాల రింగులు ముక్కుకు అలంకరించుకునేవాళ్లు.

**అసౌ నాసా వంశస్తు హీన గిరివంశ ధ్వజ పటి**
**త్వదీయోనేదీయః ఫలతు ఫలమస్మాక ముచితమ్-**

శిల్పీకరించిన వేణువులా ఉన్న జగన్మాత ఎడమ నాసికకు ఉన్న ముత్యాల కాంతులు మాకు సకల సంపదల నిచ్చునుగాక అని జగద్గురువు శంకరాచార్యులు 'సౌందర్యలహరి'లో ప్రార్థించినాడు కదా!" అన్నది తన్మయంగా పుష్పవల్లి.

"అవునమ్మా!" అన్నాడు శ్రీనివాస్. "ఇప్పుడు అమెరికాలో ఈ ఫెరొమోన్‌ల వాణిజ్య వినియోగ అవకాశాలపై చర్చలు బాగా జరుగుతున్నాయి. ఆడ, మగ వాళ్లలో వేర్వేరు వయస్సులలో ఫెరొమోన్‌లో వచ్చే మార్పులేమిటి? ఎటువంటి సహచరులతో యువతీయువకులు ఆనందంగా ఉంటారు అన్న వాటిపై ప్రయోగాలు జరిగాయి. డేటింగ్ సెంటర్లు వెలిసాయి.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఆర్ స్మెల్' బదులు 'లవ్ ఎట్ ఫస్ట్ స్మెల్' ఈనాటి స్టైల్. ఇదుగో 'స్మెల్ డేటింగ్' పద్ధతి.

ముందు 'స్మెల్ డేటింగ్'లో రిజిస్టర్ చేయించుకుంటే వాళ్లొక టి-షర్ట్ పంపిస్తారు. దానిని మూడురోజులు తొడుక్కోవాలి. ఎటువంటి 'డిఒడరెంట్' వాడకూడదు.

మూడురోజుల తరువాత దానిని స్మెల్ డేటింగ్ వాళ్ల స్వెట్ షాపుకు పంపాలి. ఆ టీషర్టును వాళ్లు ముక్కలుగా చేసి క్లయింట్స్‌కు పంపుతారు. వాసన నచ్చిన క్లయింటు ఎర్ర హార్ట్ సింబల్ పెట్టి 'డేటింగ్'కు రడీ అని మెసేజ్ పంపుతుంది. యువతులైనా అదే పద్ధతి. ఆ తరువాత మాటామంతీ, సూటబిలిటీ, కంపాటబిలిటి, ఎలిజిబిలిటి సరిగా సరిపోతే సహజీవనం లేకుంటే ఒన్‌నైట్ స్టాండ్" వివరించాడు శ్రీనివాస్.

"నీవు కూడా జాయినయ్యావా 'స్మెల్ డేటింగ్'లో నాయనా?" అని పుష్పవల్లి గాభరా పడింది.

"అమ్మా అర్జెంట్ కాల్! మళ్లా మాట్లాడుతాను" అన్నాడు శ్రీనివాస్. స్కైప్ ఆఫ్ అయ్యింది. సుబ్రహ్మణ్యం-పుష్పవల్లి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. "అమ్మబాబోయ్" అనుకున్నారు ఆందోళనగా. ఇది సరికొత్త ట్రెండ్!

వాతావరణం తేలికపరుద్దామని సుబ్రహ్మణ్యం అన్నాడు- "డియర్ నీకు నత్కీరుడి కథ తెలుసా?"

"ఏమిటి చెప్పండి!" అన్నది పుష్పవల్లి.

"పాండ్య దేశంలో హరద్విజుడు అనే పూజారి శివాలయంలో అర్చకుడిగా ఉండేవాడు. రెండేళ్లపాటు కరువు తాండవించేసరికి మనిషిని మనిషి తినేంత దుస్థితిలో గుడిని, ఊరిని విడిచి వెళ్లిపోదామని పూజారి గుడితలుపులు మూస్తుంటే శివుడు ప్రత్యక్షమై 'నేను నీకు ఒక పద్యం చెబుతాను. పాండ్యరాజుకు వినిపిస్తే ఆయన ధనమిస్తాడు'.

రాజధానికి వెళ్లి పూజారి– 'సింధుర రాజ గమనాధమ్మిల్ల బంధంబు సహజ గంధంబు' –అని రాజసభలో పద్యం చదువుతుంటే ఆస్థానకవి నత్కీరుడు ఆక్షేపిస్తాడు– 'ఆడపిల్ల జడకు సహజగంధమేమిటయ్యా! నీవు నీ కవిత్వమూ! చాల్లే ఆపు!' అన్నాడు. పూజారి కన్నీళ్లపర్యంతమై శివుడిని తలుచుకున్నాడు. శివుడు ప్రత్యక్షమై నత్కీరుడిని కుష్ఠువ్యాధితో బాధపడమని శపించి, అర్చకుడిని ఆదుకున్నాడు. ఆ నత్కీరుడు శివుని ప్రార్థించి శ్రీకాళహస్తిని సందర్శించి, కొలనులో స్నానం చేసి రోగవిముక్తి పొందినాడు. ఇది ధూర్జటి వ్రాసిన శ్రీకాళహస్తి మహాత్మ్యము లోనిది" చెప్పాడు భక్త్యావేశాలతో సుబ్రహ్మణ్యం.

వింటున్నదే కాని పుష్పవల్లి ఆలోచనలు ఎటో ఉన్నాయి. కరోనా వల్ల చాలామందికి ముందుగా వాసన నశిస్తున్నది. అంటే పాజిటివ్ వచ్చినవాళ్ల మేజర్ హిస్టోకంపాటబిలిటి కాంప్లెక్స్‌కు – హ్యూమన్ ల్యూకొసైటిక్ ఏంటిజన్‌కు – కరోనా వైరస్‌కూ ఏమన్నా సంబంధమున్నదా? ఏ ఎంజైము లోపమున్నవాళ్లలో ఈ కరోనా వృద్ధి చెందుతుంది? ఇవి తరువాత ఆలోచిద్దాం. "ఏమండీ! శ్రీనివాస్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నాము కదా! ఆ ఫోటోలు అప్‌లోడ్ చేద్దాం రండి" అన్నది సుబ్రహ్మణ్యంతో.

ఇద్దరూ కలిసి తమకు నచ్చిన అమెరికా సంబంధాల వివరాలను అమ్మాయిల ఫోటోలతో శ్రీనివాస్‌కు అప్‌లోడ్ చేసారు. "మంచి సాంప్రదాయం కలవాళ్లు, మనవాళ్లు; జాతకాలు, గోత్రాలు కలిసాయి. వీటిలో నీకెవరు ఇష్టమో చెబితే వాళ్లూ అమెరికాలోనే ఉన్నారు గనుక పెళ్లిచూపుల కార్యక్రమం పెట్టుకోవచ్చు" అని మెసేజ్ చేసారు.

స్కైప్ ఆన్ అయ్యింది. స్క్రీన్‌మీద శ్రీనివాస్ నవ్వుతూ... "అమ్మా, నాన్నా మీరు సంబంధాలు వెదకక్కరలేదు. స్మైల్‌డేటింగ్‌లో మాకిద్దరికీ పరిచయం

అయ్యింది. మా మేజర్ హిస్టోకంపాటిబిలిటి కాంప్లెక్స్, హ్యూమన్ ల్యూకొసైటిక్ ఏంటిజన్‌లు మ్యాచ్ అయ్యాయి. మా ఇద్దరి వాసనలు మాకు పూర్వజన్మ వాసనల్లా ఆనందాన్నిచ్చాయి. ఇదుగో మీ కాబోయే కోడలు... నటాషా ఫ్రాగ్రన్స్" అన్నాడు

తెరపై 'నటాషా ఫ్రాగ్రన్స్' ప్రత్యక్షమయ్యింది, మాస్కు తీసి చిరునవ్వుల వెన్నెలను, పారిజాత పరిమళాలను వెదజల్లుతూ

"హాయ్ గైస్! నైస్ టు సీ యూ" అన్నదామె.

"బై మమ్మీ, బై డాడీ! సీయూ ఎగైన్" వాళ్లు చేతులూపుతూండగానే స్కైప్ ఆఫయ్యింది.

"మనవాడిలో ఆమెకేం ఫ్రాగ్రన్స్ నచ్చిందో" అన్నది పుష్పవల్లి.

సుబ్రహ్మణ్యం అలా చూస్తూనే ఉండిపోయాడు... ఎక్కడో పాట వినిపిస్తున్నది... 'నీ చెమటనీరే మంచిగంధం...'

★★★★★

# 6. బలిపశువు లేదా స్కేప్‌గోట్

శ్రేష్ఠుడైన మహాపూజారి 'ఆరన్' బలికి తెచ్చిన ఒక మేకపిల్లపై తన చేతులుంచి ఇజ్రాయెల్ ప్రజల దోషాలను, అకృత్యాలను, పాపాలను దాని తలపైకి మార్చి దుర్గమమైన కొండప్రాంతపు ఎడారిలో వదిలేసాడు. ప్రజల దోషాలను తన నెత్తిమీద మోస్తూ అది అజాజెల్ ఎడారిలోకి తరలిపోయింది.

రెండవ మేకపిల్లను శాస్త్రోక్తంగా బలిపీఠంపై నరికి దైవార్పణ గావించి శాంతినొందినారు.

బలి చేయబడకుండా తప్పించుకున్న మేకపిల్లను ఎస్కేప్ గోట్ అని పిలిచేవారు. అది కాలక్రమేణా 'స్కేప్ గోట్'గా మారింది.

ఆడమేక మెడలో తమ పాపాలను కూర్చి వెండి పూసలహారంలో వేసి 'ఎలిని' చౌడునేలల్లోకి మేకను తరిమివేసేవారు సిరియాలో.

ప్రాచీన గ్రీకులు బానిసనో, నేరస్తుడినో, పేదవాడినో ఎన్నికచేసి ఏడాది పాటు సుష్ఠుగా మేపి ఓ శుభదినం నాడు వాడిని పట్టణం చుట్టూ తరుముతూ రాళ్లతో కొట్టి నగర బహిష్కారం చేసి ప్లేగు లాంటి మహమ్మారులు రాకుండా జాగ్రత్త పడేవారుట!

సంతానం లేని హరిశ్చంద్రుడికి వరుణదేవుడి కరుణ వలన రోహితాస్యుడనే కుమారుడు జన్మించాడు. ఒప్పందం ప్రకారం రోహితుడిని వరుణుడికి అప్పగించాల్సి ఉంది. కాని హరిశ్చంద్రుడు వాయిదాలు వేస్తూపోయాడు. దానితో హరిశ్చంద్రుడికి 'జలోదరమనే' వ్యాధితో పొట్టలో నీరు చేరింది. రోహితుడిని వరుణదేవుడి కప్పగిస్తేనే శాప విముక్తి జరిగి వ్యాధి తగ్గుతుంది. రోహితుడికీ సంగతి తెలిసి అడవిలోకి పారిపోగా, అక్కడ అజీగర్తుడనే పేద బ్రాహ్మణుడు కనిపించాడు. అతడికి వంద గోవుల్నిచ్చి అతడి కుమారుడు శునశ్శేపుడిని కొనుక్కుని నగరానికి తీసుకొచ్చి

తనకు మారుగా వరుణుడికి బలి ఇమ్మని తండ్రికి అప్పగించాడు. బలిపీఠం మీద తలవంచి శునశ్శేపుడు విశ్వామిత్రుడు నేర్పిన వేదమంత్రాలతో ఇంద్ర, వరుణులను ప్రార్థించగా వారు అతడికి చిరాయువునిచ్చి విడుదల చేసారు. ఆనక విశ్వామిత్రుడు శునశ్శేపుడిని దత్తత చేసుకున్నాడు.

"డబ్బున్నవాళ్లు పేదవాళ్లని ఎలా బలిపశువులుగా చేస్తారో ఈ కథల్లో తెలుసుకోవచ్చు" అన్నాడు ఉత్తేజ్.

"మహమ్మారి దేశాన్ని చుట్టుముట్టినప్పుడల్లా ఎవరో ఒకరు బలిపశువు కాకతప్పదు" అన్నది సమత.

దూరంగా గొర్రెలు మేకలు గుంపులు గుంపులుగా మాస్కులూ గట్రా సగం సగం తొడుక్కుని కుంభమేళాలు, ఎలక్షన్ ఊరేగింపులతో బిజీబిజీగా ఉన్నాయి. న్యాయపీఠాలకు కోపం వచ్చి ఎలక్షన్ కమీషనర్ల మీద కస్సుమన్నాయి. అవకాశం కోసం ఎదురుచూస్తున్న సామ్యవాద, స్వామివాద, వివాద, విదేశీ పత్రికలు ప్రస్తుత ప్రభువుపై విరుచుకుపడ్డాయి.

"మొన్ననే మా అన్నయ్యకు జ్వరం వచ్చింది. అతడికి షుగర్, బిపి ఉన్నాయి. డాక్టర్ ఆన్‌లైన్‌లో మందులు రాసిచ్చాడు. వాడినా తగ్గలేదు. డాక్టర్ సజెస్ట్ చేసినట్లు RTPCR కోసం వచ్చాం. అడుగో లైన్‌లో నిలబడి ఉన్నాడు ఇందాకట్నుంచీ" అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రాజశేఖర్.

"మా వదినకు RTPCR నెగటివ్ వచ్చింది. కాని రాత్రికి రాత్రి ఆయాసమెక్కువై ఆక్సిజన్ లెవల్స్ తగ్గాయి. దగ్గుతుంటే భయమేసి హాస్పిటల్‌కు తీసుకువచ్చాం. హెచ్.ఆర్. సి.టి.స్కాన్ చేస్తున్నారు ఇప్పుడు" అన్నది వకుళ.

"తప్పుకొండి సార్ జరా! మాఆవిడకు దమ్మెక్కువైంది" అంటూ ఆటోలోంచి దించి ఆమెను ట్రాలీపై పడుకోబెట్టారు కష్టం మీద. వాళ్లు తమతోపాటు తెచ్చిన ఆక్సిజన్ సిలిండర్‌ను తోసుకుంటూ, ఆమె ముక్కులోకి ఆక్సిజన్ పైపును సర్దుతూ వార్డుబాయితోపాటు ఎమర్జన్సీ వార్డు వేపు దాదాపు పరిగెడ్తున్నట్లు వెళ్తున్నారు.

వాళ్లలా చూస్తుండగానే ఎమర్జెన్సీ వార్డు బయట బోర్డు పెట్టారు– "బెడ్స్ ఖాళీలేవు. దయచేసి వేరే హాస్పిటల్‌కు వెళ్లగలరు".

అప్పుడే అంబులెన్సు వచ్చి ఆగింది. లోపలవాళ్లు మొత్తుకుంటూ ఏడుస్తున్నారు– "అయ్యో! ఇప్పటివరకు గాలి పీలుస్తూనే ఉన్నాడే! ఏమయ్యా బాబూ కాస్త చూడు త్వరగా! పి.పి.ఇ. కిట్‌లో ఉన్న డ్యూటీ డాక్టరు పరిగెత్తుకు వచ్చాడు... అంబులెన్స్‌లోకి ఎక్కి రోగి కళ్లలోకి టార్చిలైటు వేసాడు... కనుపాపలు వెడల్పుగా, నిశ్చలంగా ఉన్నాయి. గుండె కొట్టుకోవడం లేదు. ఒళ్లు శీతలంగా ఉంది! మానిటర్‌లో లైఫ్‌లైన్ సన్నని సరళరేఖలా ఉంది! "సారీ అమ్మా!" అన్నాడు.

"ఏదైనా చెయ్యండి డాక్టర్" అని మొత్తుకుంది అతడి భార్య.

"బ్రాట్ డెడ్" అన్నాడతడు నర్సుతో!

ఇ.సి.జి. తీసారు ఫైనల్ ప్రూఫ్ కోసం...

"ప్చ్!" అని పెదవి విరిచాడు. "మీ ఇష్టం" తీసుకువెళ్లిపోవచ్చు. "మానవతా దృష్టితో ఈ ఇ.సి.జికి, పరీక్షకు ఛార్జి వేయడంలేదు" అని వెళ్లిపోయాడు.

అంబులెన్స్ డ్రైవరన్నాడు– "మీకు డెత్ సర్టిఫికెట్ అవసరముంటే గాంధీ హాస్పిటల్‌కు తీసుకువెళ్తాను. ఇక్కడ క్యాజువాలిటీలో అడుగుపెట్టాలన్నా ముందు ఇరవై వేలు డిపాజిట్ కట్టాలి. తరువాత సర్టిఫికెట్ ఇస్తారు". పేషంట్ ఎడ్మిట్ అయితే అతడికి కమిషన్ వచ్చేది. టైమ్ వేస్ట్ ఇవ్వాళ. తొందరపడి పేషెంట్ ముందే చచ్చిపోయాడు. ఇవ్వాళ అంతా లాసే!

ఆమె ఏడుస్తూనే ఉన్నది. ఆమె తండ్రి కాబోలు అన్నాడు– "ఇప్పటికే వరంగల్‌లో నాలుగు లక్షలు ఖర్చుపెట్టాం! గాంధీ దవాఖానకు పద! అతడి పేరుమీద ఇన్సూరెన్స్, బ్యాంకు ఖాతాలున్నాయి. సర్టిఫికెట్ అవసరం" అన్నాడాయన ఏడుస్తూనే.

అంబులెన్స్ గాంధీ హాస్పిటల్ వేపు వెళ్లింది. ఆమె రోదనలు మిన్నంటు తుండగా.

గాంధీ హాస్పిటల్‌లో 'బ్రాట్ డెడ్' అని రిజిస్టరయ్యాక అంబులెన్స్ డ్రైవర్ అడిగాడు– "వరంగల్‌కు వెళదామా!"

వరంగల్‌కు మూడు గంటల ప్రయాణం. వెళ్లేప్పటికి చీకటి పడుతుంది. అపార్ట్‌మెంట్ వాళ్లు శవాన్ని లోనికి రానివ్వరు. చీకటి పడ్డాక దహనం చేయడానికి వీలు కుదుర్తుందా? ఫోన్ చేసాడు చనిపోయిన వ్యక్తి అన్నదమ్ములకు. ఎరేంజ్‌మెంట్లు

చేస్తాం సరాసరి స్మశానానికి తీసుకురమ్మన్నారు వాళ్లు. పదేళ్లలోపు ఇద్దరు పిల్లలకు కడచూపు చూసే అవకాశం లేదు. నాన్న ఏడంటే ఏమని సమాధానం చెప్పాలి పిల్లలకు?

సాయంకాలం ఆరుగంటల కల్లా వరంగల్‌కు చేరుకుంది అంబులెన్స్.

"డెడ్‌బాడీ తెచ్చాను కారులో, తెలిసినవాళ్లు కాబట్టి. లేకుంటే గాంధీ హాస్పిటల్‌లో దించేసి వెళ్లిపోయేవాడిని" అన్నాడు అంబులెన్స్ డ్రైవర్. "ఇరవై వేలు పే చెయ్యండి… మాయదారి రోగం నాకంటుకుంటుందేమో!"

మహాప్రస్థానం దగ్గర ఇంకా రెండు శవాలు క్యూలో ఉన్నాయి. వాళ్ల వాళ్ల బంధుమిత్రులు బిక్కుబిక్కుమంటూ దుఃఖిస్తున్నారు దూర దూరంగా నిలబడి.

మధ్యాహ్నం వరకు సూర్యనారాయణగా పిలువబడిన అతడు సాయంకాలం చీకటి పడేప్పటికి శవమై రాత్రి పదిగంటలకు పంచభూతాల్లో కలిసిపోయాడు. ఆరోజు ఆఖరి శవదహనం తరువాత స్మశానమూ నిట్టూర్చింది.

దుఃఖాన్ని దిగమింగుకోవడం చాతకావడం లేదామెకు. తల్లిదండ్రుల కోసం ఎదురుచూసి చూసి నిద్రలోకి జారుకున్న పిల్లల్ని చూసి గుండె పగిలిందామెకు. రేపు వీళ్లకు ఏం సమాధానం చెప్పాలి?

అన్ని నగరాల్లోనూ ఇదే పరిస్థితి.

కరోనా టెస్ట్‌ల వద్ద క్యూ…

వాక్సినేషన్ సెంటర్‌ల వద్ద క్యూ…

ఆక్సిజన్ సిలిండర్ల కోసం క్యూ…

హాస్పిటల్‌లో బెడ్లకోసం క్యూ…

రెమ్‌డెసివర్‌ల కోసం క్యూ…

స్మశానాల వద్ద క్యూ…

మొన్నమొన్నటి వరకూ మాస్కులు పెట్టుకోమంటే వినలేదు. సామాజిక దూరం పాటించండి, ఐసొలేషన్‌లో ఉండండి, లాక్‌డౌన్ నియమాలను అతిక్రమించకండి అంటే వినలేదు. అందరూ హరిశ్చంద్రులే వాయిదాలు వేయడంలో.

రెండో వేవ్ తీవ్రం కాగానే తీవ్ర విమర్శలు. ఎదుటివాడిని తిట్టడంలో ఉన్న హాయి ఇంక దేనిలోనూ ఉండదేమో! 'ఇక్కడే లాక్‌డౌన్‌లో వుండండి, వలస వచ్చిన వాళ్లు పోవద్దు' అంటే చస్తే మావూళ్లో చస్తామంటూ పోలోమని వెళ్లిన వాళ్లు ముచ్చటగా మూడు నెలలు కాకముందే మూటాముల్లె సర్దుకుని మళ్లా వచ్చారు. ఇప్పుడు మళ్లీ బయల్దేరారు మళ్లీ లాక్‌డవున్ పెడతారేమోనని భయంతో.

రైల్వేస్టేషన్ల వద్ద క్యూ...

బస్టాండ్‌లలో క్యూ...

కాలిబాటల మీద క్యూ...

"గమ్మత్తేమిటంటే ఈ మహమ్మారి డబ్బున్నవాళ్లనే దెబ్బతీస్తున్నట్లున్నది" అన్నాడు ప్రభాకరం. ఇతడు సూర్యనారాయణ మిత్రుడు. వీళ్లు సూర్యనారాయణ భార్యను పరామర్శించి వెళ్తూ మాట్లాడుకుంటున్నారు.

"రెండో వేవ్ వచ్చేసరికి అందరికీ ప్రాణభయం పట్టుకున్నది. డబ్బున్న వాళ్లు హాస్పిటల్ బెడ్స్‌ను, ఆక్సిజన్‌ను, రెమ్‌డెసివర్ మందుల్ని, చివరకు స్మశానాలను బుక్ చేసుకుంటున్నారనిపిస్తున్నది. భయంతో అవసరం లేని వాటిని కొని స్టాక్ పెట్టుకుంటే అత్యవసర వస్తువులకు కొరత ఏర్పడదా? దందాలు జీవన విధానమైన దేశంలో బ్లాక్‌మార్కెట్, నల్లడబ్బుదే కదా రాజ్యం!" అడిగింది ప్రమీల. "అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలి. రెమ్‌డిసివర్ ఆరు వయల్సు అరవై వేలకు కొని సూర్యనారాయణకిప్పించినా ఫలితం దక్కలేదు".

"ఈ దేశం విచిత్రమైనది. వీళ్లకు కుంభమేళాలు కావాలి, ఎలక్షన్లు కావాలి, విద్య వైద్యం ఉచితంగా అందాలి, పన్నులు కట్టవద్దు. కులాలు మతాలు పోవద్దు. పని చేయమని అనవద్దు. ఎవరన్నా అంటే వాడిమీద విరుచుకుపడతారు" అన్నాడు భీమారావు. మళ్లీ RTPCR టెస్ట్ చేయించుకోవాలేమో మనం".

"నూట నలభై కోట్ల జనాభా ఉన్న దేశంలో అందరికీ టెస్ట్‌లు చెయ్యాలంటే సాధ్యమేనా! నలతగా ఉన్న ప్రతిసారీ RTPCR లు చెయ్యడం ప్రాక్టికల్‌గా వీలవుతుందా? అందరికీ వాక్సీన్ తయారు చెయ్యడానికి రెండు డోసులు ఇవ్వడానికి

ఎంతకాలం పడుతుంది? అసలు వాక్సీనులు పనిచేస్తాయని గ్యారంటీ ఉన్నదా? ఇలా లాక్‌డౌన్‌లు పెట్టుకుంటూ పోతే ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు గాడిన పడుతుంది? ఇప్పటికే నానా కష్టాలు పడుతున్న దిగువ మధ్యతరగతి, రెక్కాడితే కాని డొక్కాడని పేదల పరిస్థితి ఏమిటి?" తన ఆక్రోశం వెలిబుచ్చాడు దామోదర్.

శ్రేష్ఠుడైన మహాపూజారి 'ఆరన్' రెండు మేకపిల్లలను ఎన్నిక చేసాడు. దేశంలోని ధనవంతుల్ని, నమ్మకస్తుల్ని కాపాడాలంటే బలిపశువులు కావాలి. చిరువ్యాపారులు, చేతి వృత్తుల మచ్చలున్న మేకపిల్లను ఆర్థిక బలిపీఠంపై బలి ఇచ్చారు. వలస కార్మికులు, రైతుల చారలున్న మేకపిల్ల మెడలో తాము చేసిన తప్పుల, పాపాల వెండి గొలుసును, వేపాకులు బంతిపూల దండను వేసి అంతూపొంతూ తెలియని అజాజెల్ ఆర్థిక ఎడారిలోకి తరిమారు.

ఆ స్కేప్‌గోట్ అలా వెళ్తుండగానే దేశంలో మూడో వేవ్ మొదలయ్యింది... స్మశానంలో చీకటిలా భయం తరుముకు రాసాగింది... ఆ పేద మేక అలా పరిగెడ్తూనే ఉన్నది... ప్రజల, పాలకుల పాపాల్ని,తప్పుల్ని తలపై మోసుకుని, మెడలో వేసుకుని....

★★★★★

# 7. పికప్ ఆర్టిస్ట్ అనబడు ప్రేమగురువు

“ఒన్ ఆన్ ఒన్ కోచింగ్ కావాలా! గ్యారంటీ సక్సెస్! ఫెయిలయితే డబ్బు వాపస్! రండి మా గూటికి! ‘పీకాక్ పికప్ లెయర్‌కు స్వాగతం!’ అన్నాడు కృష్ణమోహన్ తన ప్రారంభోపన్యాసంలో...

“ఇది ఆన్‌లైన్ కోచింగ్ క్లాస్, అంతా వర్చువల్. ఈ కరోనా లాక్‌డౌన్ సమయంలో గదికే పరిమితమై సెల్‌ఫోన్లకే అంకితమైన యువతా, మేలుకో! మీ కలల్ని రసరమ్యభరితంగా చేసి, వాటిని సాకారంగా చేసే సదవకాశం మీ ముందున్నది” అన్నది లావణ్య హొయలలు కురిపిస్తూ...

“ఇది ‘స్పీడ్ సెడక్షన్’ కోర్సు. సమ్మోహనాస్త్ర ప్రయోగ ఉపసంహార విద్య. న్యూరో లింగ్విస్టిక్ ప్రొగ్రామింగ్ (NLP) టెక్నిక్‌లున్నాయి దీంట్లో. మేం పికప్ లైన్స్ నేర్పుతాం. మీ మాటలకు ఎంత కఠిన హృదయమైనా వెన్నలా కరిగి పోవాల్సిందే. ఎంతకాలం ప్రేమరహిత ఎడారుల్లో గడుపుతారు మీరు? వెన్నెల కురిసే శృంగార వనాల్లోకి దారి చూపిస్తాం! మీకిదే మా ఆహ్వానం” అన్నాడు మోహన్.

యూట్యూబు వీడియో చూస్తున్నారు మిత్ర చతుష్టయం- లక్ష్మణ్, సుగ్రీవరావు, విభీషణకుమార్, ఆంజనేయశర్మ. వీళ్లకు అమ్మాయిలతో మాట్లాడడమంటే భయం. ఇరవై ఏళ్లు దాటాయి కాని ఇంకా గర్ల్‌ఫ్రెండ్స్ లేరు. మిడిల్‌క్లాస్ కుటుంబాలు, తల్లిదండ్రులు స్ట్రిక్ట్‌గా పెంచేసరికి ఏ పని చెయ్యాలన్నా వణుకు వీళ్లకు. కరోనా వచ్చిన దగ్గర్నుంచి కాలేజీలు లేవు. అంతా ఆన్‌లైన్ వ్యవహారమే. దొంగచాటుగా పోర్న్ సినిమా చూసి ఉక్కిరిబిక్కిరైపోతూ నిద్రపట్టని రాత్రుళ్లు, నలిగిన దిళ్లు, అప్పుడప్పుడు స్వయం తృప్తులూ. బయటకు చెప్పుకోలేని పరిస్థితి. తప్పు చేసే ధైర్యం లేదు. పైగా దైవభక్తి కూడానూ.

మత్తుగొలిపే కళ్లతో చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడుతున్నది లావణ్య- "ఈ ఆన్‌లైన్ కోర్సు మీకోసమే ప్రత్యేకించబడింది. చాలా చౌక... వెరీ చీప్...

'హౌటూ పికప్ గరల్స్ - అమ్మాయిల్ని పడేయడం ఎలా' ఈ కోర్సు ఫీజు... కేవలం వెయ్యి రూపాయలు.

'హౌటు గెట్ ద వుమన్ యూ డిజైర్ ఇన్‌టు బెడ్ - నీకు నచ్చిన అమ్మాయిని మంచం మీదకు తెచ్చుకోవడం ఎలా' - దీని ఫీజు అయిదు వేల రూపాయలు మాత్రమే.

'పికప్ లైన్స్, టెక్నిక్‌లు ప్రాక్టికల్‌గా నేర్పిస్తాం. వాటి ఖర్చు ఎక్స్‌ట్రా! మీ ఫీజు పేటియమ్, గూగుల్ పేలో పేచేసి పేరు, ఫోన్ నెంబరు, ఆధార్‌కార్డు లేదా పాస్‌పోర్టు కాపీ ఆన్‌లైన్‌లో పంపిస్తే మీకు యూనిక్ పాస్‌వర్డ్ అందుతుంది. ఇవి మా ఆన్‌లైన్ నంబర్లు. మాది రిజిష్టర్డ్ సంస్థ. మా ఆఫీస్- ఆనంద నిలయం, ప్రేమనగర్, జూబిలీహిల్స్ రోడ్ నెంబర్-136, ఏక్సిస్‌బ్యాంక్ దగ్గర. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మా ఆఫీసుకు రావచ్చు. ముందుగా ఎపాయింట్‌మెంట్ తీసుకొండి.

తొలిచూపులోనే ప్రేమ పుడ్తుందంటే నమ్మరా! మా ఆఫీసుకు రండి, ప్రేమలో పడకపోతే అప్పుడు విమర్శించండి!" అంటూ ఫేడాఫ్ అయిపోయింది అందాలభామ లావణ్య.

కృష్ణమోహన్ స్క్రీన్‌పై కనిపించాడు- "ఇది వేడిరక్తం ఉప్పొంగే యువకులకే కాదు, ప్రేమతరంగాలు పొంగిపొరలే యువతులకు కూడా! మిత్రులారా గుర్తుంచుకోండి 'పారెటొ' రూల్ ప్రకారం వందలో ఎనభైమంది యువకులు ఇరవైమంది అమ్మాయిల కోసం, ఎనభైమంది అమ్మాయిలు ఇరవైమంది సిక్స్‌ప్యాక్ అబ్బాయిల కోసం లైన్లు వేస్తుంటే మిగతావాళ్లకు మిగిలిందేమిటి ఫ్రస్ట్రేషనే కదా! ఆల్ఫామేల్ కోసమే అంతా ఎగబడితే బీటామేల్స్‌కు నిరాశ పుట్టదా! ఇన్‌సెల్స్‌గా మారి హింసకు పాల్పడరా వాళ్లు. ఆడపిల్లలను ద్వేషిస్తూ అరాచకానికి తెగబడ్తున్నారు కాదా ఈ బీటా మేల్స్, ఇన్‌సెల్స్! ఈ విషయాలన్నిటి గురించి మీకు అవగాహన కల్పిస్తాం. ఎడారిలా మారిన మీ జీవితపు నడకలకు ఒయాసిస్సులున్న దారి చూపిస్తాం" అన్నాడతడు తన వాక్చాతుర్యంతో కట్టిపడేస్తూ...

మిత్రులు నలుగురూ కూడబలుక్కుని అమ్మానాన్నలను బతిమలాడుకుని తలా అయిదువేలు సంపాదించి అప్పాయింట్‌మెంట్ తీసుకుని ఆనందనిలయానికి వెళ్లారు. అదిరిపోయేట్లు ఉంది ఆఫీసు. కోవిడ్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు వాళ్లు. మాస్కులు, శానిటైజేషన్, సామాజిక దూరం... ప్లాస్టిక్ తెరల మధ్యనున్న కౌంటర్‌లోంచి గ్లవుస్ తొడుక్కున్న చేతికి అయిదువేలిచ్చి రిజిస్ట్రేషన్ అయ్యేప్పటికి ఉదయం పదకొండు అయ్యింది. ఐడెంటిటీకార్డు తీసుకుని లోపలకు అడుగుపెట్టారు. మాంచి పోష్‌గా ఉన్న ఏ.సి. వెయిటింగ్ హాల్. అక్కడ నుంచి లోపలి మినీ ఆడిటోరియంలోకి అడుగుపెట్టారు. తెల్లగా వెండితెరలా మెరుస్తున్న స్క్రీన్, పోడియం, మైక్ అన్నీ ఉన్నాయి. లోపల ఇరవైమంది యువతీయువకులు ఇరవై అయిదేళ్ల వయసులో వున్నవాళ్లే అందరూ. కాస్త దూరదూరంగా కూర్చున్నారు. అందరి ముఖాలపై మాస్కులున్నాయి. మిత్రులు నలుగురూ కూర్చుంటుండగా పోడియం కుడివేపు నుంచి మోహన్ ఎడమవేపు నుంచి లావణ్య వచ్చి అందరికి విష్ చేసారు.

“మన్మథుడు’లో నాగార్జునలా ఉన్నాడురా కృష్ణమోహన్” అన్నాడు సుగ్రీవరావు నెమ్మదిగా.

“లావణ్య మాత్రం తక్కువా! ‘సరైనోడు’లో రకుల్‌ప్రీత్‌సింగ్‌లా లేదూ!” అన్నాడు లక్ష్మణ్ ఆమెవేపు కన్నార్పకుండా చూస్తూ.

“ష్” అన్నారెవరో... హాల్లో గుసగుసలు తగ్గి నిశ్శబ్దం ఆవరించింది.

మోహన్ మైక్ ముందుకు వచ్చాడు– “మేము ఈ ట్రెయినింగ్ సెంటర్ పెట్టడానికి వెనుక ఉన్న ఉద్దేశం మేం పడిన కష్టాలు, డిప్రెషన్, ఆత్మన్యూనత! అందం, చదువూ వుండి కూడా నేను ఎందుకు ఫాలోవర్‌గా బీటా మేల్‌గా ఎంత నరకయాతన అనుభవించానో మీకు చెబుతాను”.

లావణ్య అందుకుంది– “మా కథ చెబుతూనే మీకు ఈ ఆల్ఫా, బీటా, ఒమేగాల గురించి, ప్రేమ, కామం, కోరికల గురించి వివరిస్తాము. యువతీ యువకులకు నిజమైన ప్రేమ, చిరకాలపు సాహచర్యంలోని రహస్యాల గురించి ఎడ్యుకేట్ చేయడం మా ఉద్దేశం. స్క్రీన్‌పై వచ్చే ఇమేజ్‌లను మేము వ్యాఖ్యానిస్తాము. మీకేమైనా సందేహాలుంటే అడగవచ్చు. సెషన్ ఓ గంటసేపు ఉంటుంది. అర్ధగంట

ప్రశ్నలు–జవాబులు–పరిచయ కార్యక్రమాలు. వారానికి ఒకరోజు రెండుగంటల సెషన్... మూడు నెలల కోర్సు".

తెరపై గ్రూకోమార్క్స్ ఇమేజ్ ప్రత్యక్షమయ్యింది. అతడంటున్నాడు– "నేను ఒకమ్మాయిని రెండేళ్లపాటు ఫాలో అయ్యాను. మా ఇద్దరి అభిరుచులూ, ఇష్టాయిష్టాలూ అన్నీ ఒకేరకం. నాకూ, ఆమెకూ అందమైన ఆడపిల్లలంటే ఇష్టం".

హాల్లో అందరూ కిసుక్కున నవ్వారు. వాతావరణం తేలికపడింది. తెరపై సిల్వర్ బాక్ గొరిల్లా ప్రత్యక్షమయ్యింది ఛాతీ బాదుకుంటూ భయంకరంగా అరుస్తూ... అందరూ ఉలిక్కిపడ్డారు దాని అరుపులకు. దాని నోటిలో దంతాలు వాడిగా శూలపు మొనల్లా ఉన్నాయి.

"అదిగో అది ఆల్ఫామేల్ గొరిల్లా! దానిని అనుసరిస్తూ ఉన్న మిగతా గొరిల్లాలు బీటామేల్స్–ఫాలోవర్స్–అనుచరులన్న మాట. ఒక ఆల్ఫామేల్–ఆల్ఫా ఫిమేల్ జంటకడితే ఆల్ఫాపెయిర్ అంటాము" అన్నాడు మోహన్.

బీటా జంతువులు అనుచరులు కావచ్చు లేదా సెకండ్ ఇన్ కమాండ్ కావచ్చు. పూర్వకాలం జానపద చిత్రాల్లో హీరోకు తోడుగా వచ్చే హాస్యపాత్రలా 'బీటా'లు వ్యవహరిస్తాయి. ఇవి ఒక్కోసారి 'స్పేర్ డాడీ'లుగా తమ పాత్ర పోషిస్తాయి" వివరించింది లావణ్య.

"గామా' మేల్ కాని ఫీమేల్ కాని – సాహసం ఎక్కువ, నా దారి నాది. నాదారి రహదారి టైపు. స్వేచ్ఛాజీవి.

'ఒమేగా'కు ఆత్మవిశ్వాసం, తెలివితేటలెక్కువ. ఒంటరి తోడేలు, లక్ష్యసాధన, అనేక విషయాలపై అభిరుచి ప్రత్యేకతలు.

'డెల్టా' – దెబ్బలు తినీ తిని వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకున్నా, ఏకాకి బతుకు. ప్రాక్టికాలిటీ, వృశ్చికంలా తనకు తాను అపాయం కలిగించుకోవడం 'డెల్టా' లక్షణాలు.

'సిగ్మా' ఉద్వేగం, నాటకీయత, ఆకర్షణ, ప్రతిదానికి ఓ లెక్క ఉండేట్లు చూసుకోవడం వీళ్ల స్వభావం. కాస్త జిత్తులమారి.

ఇవన్నీ పెకింగ్ ఆర్డర్‌ను నిర్ణయించడంలో తోడ్పడ్తాయి" అన్నది లావణ్య.

తెరపై కోడిపుంజు, పెట్టలు ప్రత్యక్షమయ్యాయి. ఒక కోడిపెట్ట ముక్కుతో పొడుస్తూ మిగతా పెట్టలను తరిమేసి మహారాణి స్టైల్లో కుక్కుటరాజు పంచన చేరింది.

"ఇదే పెకింగ్ ఆర్డరంటే! మేటింగ్ హక్కుకోసం పోరాటం" అన్నాడు మోహన్. "ఒక్కోసారి ఆల్ఫామేల్స్ బలాత్కారం (రేపు) చేస్తాయి కూడా".

తెరపై రామాయణంలోని ఘట్టమొకటి ప్రత్యక్షమయ్యింది. మహాపార్శ్వుడనే రాక్షసవీరుడు రావణుడికి సలహా చెబుతున్నాడు–

**"బలాత్ కుక్కుట వృత్తేన ప్రవర్తస్వ మహాబల!**
**అక్రమ్యాక్రమ్య సీతాం వైతాం భుంక్ష్వ చ రమస్వచ!"**

"మహాబలుడా! నీకు ఎదురొచ్చేదెవరు? కోడిపుంజులా ప్రవర్తించు. బలాత్కారంగా సీతను ఆక్రమించి అనుభవించు!"

రావణుడు నవ్వాడు– "ఆపని చేస్తే నా తల నూరు వక్కలవుతుందని బ్రహ్మ శపించాడు, అంతకుముందు నేను పుంజికస్థల అనే అప్సరసను బలాత్కారం చేసినపుడు. కాబట్టి ఇంకేదైనా ఉపాయం చెప్పు".

"రావణుడు గొప్ప ఆల్ఫామేల్, పేరుపొందిన రేపిస్టు. ఇతనిలాంటివాడే కీచకుడు. హిందువుల ఇంద్రుడు, గ్రీకుల జ్యూస్ వీళ్లు పికప్ ఆర్టిస్టులు. మారువేషాల్లో వచ్చి శృంగారాలు వెలగబెట్టే కాంతిస్వరూపులు" అని వ్యాఖ్యానించాడు మోహన్.

ఆనాటి సెషన్ ముగిసింది. ఒకరినొకరు పరిచయం చేసుకున్నాక అందరూ తమలా అవకాశం దొరక్క బాధపడుతున్న బీటాగ్రూపని తెలిసాక కాస్త ధైర్యం వచ్చింది మిత్రబృందానికి.

ఆనందనిలయంలో రోజుకు ఆరు సెషన్లు. ఇప్పటికే వెయ్యిమంది రిజిస్ట్రేషను చేయించుకున్నారట. కరోనా రెండోవేవ్ వచ్చేసరికి– "ఆనందనిలయానికి రానక్కర్లేదు. ఆన్‌లైన్ వీడియో, పవర్‌పాయింట్ పంపుతాం. శ్రద్ధగా ఫాలోకండి" అని మెసేజ్ వచ్చింది.

రెండోవారం– "మైయర్–బ్రిగ్స్ పర్సనాలిటీ టైపు ఇండికేటర్ ప్రొఫార్మా వచ్చింది. మీదే వ్యక్తిత్వమో మీరే నిర్ణయించి మాకు పంపండి. మీకు సరైన జోడీని నిర్ణయిద్దాం" అంటున్నది లావణ్య. "మన సంస్థలో ఇప్పటికే వేలాదిగా సభ్యులు

చేరుతున్నారు. కరోనా నిబంధనలు సడలించాక మనమందరం ఒక రిసార్టులో కలుసుకుని మన భావాలను పంచుకుందాం! ఈలోగా ఈ ప్రొఫార్మా నింపి పంపండి!”

మోహన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యాడు. “వెల్‌కమ్ ఫ్రెండ్స్! మీకు వచ్చేనెల కొన్ని ‘పికప్ లైన్స్’ పంపుతాం! అవి పాజిటివ్ లైన్స్–పొజ్జర్స్ (Pozzers), నెగటివ్ లైన్స్– నెగ్గర్స్. కాని, ఈ మూడు వారాలూ మీ చుట్టుపక్కల ఉన్నవాళ్ల వ్యక్తిత్వాల్ని విశ్లేషించండి. ఈ హోంవర్క్ చేసాక వచ్చేనెల ఇదే రోజున కలుసుకుందాం! మీ రిపోర్టులు, ఫారమ్‌లు ఆనందనిలయమ్@జిమెయిల్.కామ్‌కు పంపాలి. మీకోసం వేచి చూస్తుంటాం. ఎక్కువమందిని విశ్లేషించిన మొదటి ముగ్గురికి ఐఫోన్‌లు బహుమతిగా ఇవ్వబడతాయి. కోర్సు పూర్తయినాక జరిగే కాన్వొకేషన్‌లో... విష్‌యూ గుడ్‌లక్!” అని నవ్వుతూ నిష్క్రమించాడతడు.

మిత్రబృందంలో హుషారు పుట్టుకువచ్చింది. తమ ఎపార్ట్‌మెంట్స్‌లో దాదాపు వందమందికి పైగా ఉన్నారు. మిత్ర చతుష్టయం ప్రొఫార్మాలు జిరాక్స్ చేయించి కాలనీలో తెలిసిన వాళ్ల దగ్గరకు వెళ్లి వాళ్లు బహిర్ముఖులా/అంతర్ముఖులా; వాస్తవదృష్టి/ఊహాలోకంలో నివసించే వారా; నిర్ణయాలు ఆలోచనతో చేస్తారా/ ఉద్వేగాలకు ముడిపెడతారా; జీవితాన్ని ఒక ప్రణాళికలో నడుపుతారా/ఎలావస్తే అలా స్వీకరిస్తారా... ఇలా వాళ్లు వినయంగా, ప్రేమగా అడగడం మొదలెట్టేసరికి కాలనీలో చాలామంది స్నేహితులయ్యారు. ఇదివరకు వీళ్లని పట్టించుకోని ఆడపిల్లలు పలకరించడం మొదలెట్టారు.

రెండవ నెల ఆన్‌లైన్ మీటింగ్‌లో– “పిక్‌అప్ లైన్స్– పాజిటివ్–పొజ్జర్స్ (Pozzers), నెగిటివ్–నెగ్గర్స్ (Neggers) ఇరవై–ఇరవై మొత్తం నలభై డైలాగులు వచ్చాయి. వాటిని తమకు నచ్చిన వాళ్లపై ప్రయోగించి, నిజాయితీగా రిజల్టు వ్రాసి సబ్మిట్ చేయాలి. ఈనెల హోంవర్క్ ఇది. బెస్ట్ రిజల్టు సాధించిన ముగ్గురికి కాన్వొకేషన్ వేదిక మీద లాప్‌టాపులు ఇవ్వబడతాయి” ఎనౌన్స్ చేసింది లావణ్య.

ప్రాక్టికల్స్ మొదలెట్టారు మిత్రులు.

లక్ష్మణ్ వెళ్లి ఊర్మిళతో అన్నాడు– “నీవెంత అందంగా ఉన్నావంటే నేను పికప్‌లైన్ మరచిపోయాను”

ఊర్మిళ ఉరిమింది– “నాకు నిద్రవస్తున్నది, వెళ్లి పధ్నాలుగు ఏళ్లకు వచ్చి కనబడు” లక్ష్మణ్ ఖంగుతిన్నాడు.

అక్కడ ఆంజనేయశర్మ ఆలోచనా సముద్రం దాటి మెలకువలోకి వచ్చేసరికి ఓ లంకిణి కనిపించింది. బొద్దుగా ఎర్రగా నడిచొచ్చే పర్ఫ్యూమ్ బాటిల్లా ఉంటుంది.

“ఎవరీ దేవకన్య? ఆకాశం నుంచి దిగివచ్చిందా?” అన్నాడు ఆశ్చర్య పోతున్నట్లు నటిస్తూ...

“ఆకాశం నుంచి కరోనా వచ్చింది. పెట్టుకోరా మాస్కు...” అని ఈసడించుకుని వెళ్లిపోయింది లంకిణికన్య.

“కన్యారాశి అనుకున్నా కాని వృశ్చికరాశిలా కుట్టింది బాబోయ్” అనుకున్నాడు ఆంజనేయశర్మ.

సుగ్రీవుడికి స్టార్ బాగోక తార తగిలింది– “పగటిపూట నక్షత్రం నేలకు దిగివచ్చిందే!” అన్నాడు. “నేను చుక్కను కాదురా తోకచుక్కను” అని తోకతొక్కిన తాచులా బుసకొట్టింది.

విభీషణుడికి ‘సరమ’ తగిలింది. “గులాబీల ఎరుపు, మేఘాల్లో మెరుపు ఎవరో తెలుసా!” అన్నాడు.

“గురివింద గింజనడుగు గుట్టు చెబుతుంది” అని విసవిసా వెళ్లిపోయిందామె.

మన పికప్లైన్లు పనిచేయడం లేదు! జాతిరత్నాల్లోలా మన లైన్లు మనమే రాసుకోవాలనుకున్నారు వాళ్లు. కొత్త లైన్లు వ్రాసుకుని పక్క కాలనీలో ట్రై చెయ్యబోతే అక్కడివాళ్లు దేహశుద్ధి చేయబోయారు. వాళ్లలో ఒకడొచ్చి వీళ్లవేపు అనుమానంగా చూస్తూ అడిగాడు– “ఏమిటి... మీది ఆనందనిలయం ఆన్లైన్ కోచింగా!” అని.

“అవును బ్రో!” అన్నారు నలుగురు మిత్రులు. “మేం కూడా! మనం మనం ఒక్కటే!” అనుకుని చేతులు కలుపుకున్నారు. కరోనా తగ్గినాక కాన్వొకేషన్లో మజా చెయ్యాలని తీర్మానించుకున్నారు.

మూడు నెలలు కోర్సు అయినట్లు మెసెజ్ వచ్చింది అందరికీ. ఆన్లైన్లో లావణ్య, మోహన్లు కనిపించారు. “మిత్రులారా! మీకిచ్చిన హోంవర్క్ దిగ్విజయంగా

పూర్తి చేసారని మీరు పంపిన మెయిల్స్ వల్ల తెలుస్తున్నది. వాటినన్నిటినీ మా కమిటీ విశ్లేషించి విజేతలను ఎన్నిక చేస్తున్నాం. కాన్వొకేషన్ అటెండ్ కాదలుచుకున్నవాళ్లు రెండు వేల రూపాయలు పేటియమ్ చేయగలరు. త్వరలో కాన్వొకేషన్ డేట్ ఎనౌన్స్ చేస్తాం! విష్‌యు గుడ్‌లక్!" అని నవ్వుతూ అదృశ్యమయ్యారు వాళ్లు.

మిత్రబృందానికేదో అనుమానం వచ్చి, మొన్న మిత్రులైన బ్రదర్స్‌తో కలిసి ఆనందనిలయానికి వెళ్లారు. ఆనందనిలయంలో వేరే సంస్థ పేరు ఉంది. వాచ్‌మాన్ నడిగారు. మోహన్-లావణ్య ఒక్కనెలకే దానిని రెంట్‌కు తీసుకున్నారట. ఖాళీచేసి రెండు నెలలయ్యింది. ఇప్పుడు వేరే సంస్థవాళ్లు తీసుకున్నారు - అని చావుకబురు చల్లగా చెప్పాడు.

మొత్తం పదివేలమంది దగ్గర అయిదు కోట్లు వసూలు చేసిన మోహన్, లావణ్యలు మాల్దీవులలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సముద్రమట్టానికి అయిదడుగుల ఎత్తున ఉన్న 1192 మాలాద్వీపాల పగడాలదండ మాల్దీవులు... అటువంటి ధివెహి రాజ్యంలో కొబ్బరిచెట్ల నీడలో హాయిగా సేదదీరుతూ కూర్చుని ఉన్నారు మోహన్, లావణ్యలు కాని విష్వక్సేన్-విద్యుల్లతలు. ఇద్దరు ఆల్ఫా వ్యక్తులు కలిస్తే 'బీటా' జనాల్ని ఎంత తేలికగా బుట్టలో వేయవచ్చో వాళ్ల తెలివితేటలు, చాకచక్యాన్ని చూస్తే అర్థమవుతుంది.

విష్వక్సేన్ అన్నాడు- "ఇంకో సంవత్సరానికి ఈ ఎపిసోడ్ అందరూ మరచిపోతారు. కరోనా కష్టాల్ని మరచిపోయినట్లు గానే. ఈసారి టీనేజ్ గ్రూపుపై వల విసరాలి.

"తథాస్తు!" అన్నదామె స్విమ్మింగ్‌పూల్ లోంచి మెరుపు తీగెలా అతడి వడిలోకి చేరుతూ. దూరంగా బీటామేల్స్, బీటా ఫిమేల్స్ కొట్టుకులాడుతూనే ఉన్నారు ఫ్రస్ట్రేషన్‌లో.

★★★★★

# 8. నైన్త్ వేవ్ - తొమ్మిదవ అల

తుఫాను వచ్చినపుడు వరుసగా వచ్చి విరుచుకుపడే అలలలో ప్రతి తొమ్మిదో అల చాలా బలంగా ఉంటుంది. దానిని తప్పించుకుని బయటపడినవాడే తీరం చేరతాడు.

అయితే మూడో అల గురించి జాగ్రత్తపడు. ఇది నెమ్మదిగా వచ్చినట్లే వచ్చి నిన్ను సుడిగుండంలోకి లాక్కుపోతుంది. మొదటి అల నీ కాళ్లకింద ఇసుకను లాగేస్తుంది. రెండవ అల నిన్ను నేలపై పడగొడ్తుంది. మూడవ అల నిన్ను సుడిగుండం వేపు నెడ్తుంది. నాలుగు, అయిదు, ఆరు అలలు వచ్చినప్పుడు నీవు నిలబడి తీరం వేపు వెళ్లడానికి ప్రయత్నిస్తావు. ఏడవ అల నిన్ను వెళ్లనివ్వదు. ఎనిమిదవ అల ప్రశాంతంగా వచ్చి వెళ్లిపోతుంది. తొమ్మిదవ అల నిన్ను అటోయిటో విసిరికొడ్తుంది. ఎక్కడో సైరన్ పాట లీలగా వినబడ్తుంది రాళ్లపైన. హంసగీతం అర్థమయ్యేసరికి శరీరంతో అవసరం ఉండదు.

## మొదటి అల

“ఈ రిపోర్టు చూడండి డాక్టర్ సాబ్” అన్నాడు రవీందర్‌రావు. “ఈమధ్య మా ఆవిడ ఒంట్లో నలతగా ఉంది. టెస్టులు చేయించాను మా అల్లుడికి తెలిసిన ల్యాబ్‌లో”

“ఆవిడను తీసుకువచ్చారా? షుగర్ 325 పైగా ఉంది” అన్నాడు డాక్టర్ విక్రమ్.

“ఈ అల్లోపతి మందులు ఒకసారి మొదలుపెడితే ఆపకూడదంట కదా సర్, ఆయుర్వేదం మందులు వాడుతున్నాం. అయినా మీ సలహా తీసుకుందామని వచ్చాను” అన్నాడు ఆయన. డాక్టర్ విక్రమ్‌కు మంచి స్నేహితుడతడు.

"రేపు తీసుకురండి. పరీక్షలు చేసినాక మనం ఆలోచిద్దాం" అన్నాడు డాక్టర్ విక్రమ్. ప్రగతి హాస్పిటల్ ప్రారంభించినప్పుడు తొలి పరిచయం రవీందర్‌రావుతో. డాక్టర్ విక్రమ్ జనరల్ సర్జన్. అతడి భార్య డాక్టర్ సీత గైనకాలజిస్టు.

వారం రోజుల తరువాత వచ్చాడు రవీందర్ తన భార్య కృష్ణవేణమ్మతో. డాక్టర్ బి.పి. చూసాడు. 170/120 ఉంది. షుగర్ లెవెల్స్ మూడువందల యాభై దాటినాయి. ఆమె నాలుక పొడిపొడిగా ఉంది.

"ఇన్సులిన్ ఇస్తే మంచిది. బి.పి. కూడా తగ్గాలి. హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యండి" అన్నాడు డాక్టర్ విక్రమ్.

"అలాగే సర్... నా బ్లడ్‌ప్రెషర్ చెక్ చేయండి" అన్నాడు రవీందర్‌రావు.

180/110 బి.పి; షుగర్-256

"మీరేం మందులు వాడుతున్నారు?" అడిగాడు డాక్టర్.

"ప్రకృతివైద్యం, యోగా, డైట్ కంట్రోల్ చేస్తున్నాను. రోజూ నార్మల్‌గానే ఉంటుంది బి.పి., షుగర్. ఇవ్వాళే ఎక్కువయినట్లుంది. ఆ... నిన్న మామిడిపండ్లు తిన్నాము. బహుశా దానివల్ల కావచ్చు" అన్నాడు. ఆయన థాంక్స్ చెప్పి వెళ్లిపోతూ.

## రెండవ అల

మూడురోజుల తరువాత కృష్ణవేణమ్మకు పక్షవాతం వచ్చిందని న్యూరో హాస్పిటల్‌లో జాయిన్ చేసారు కూతురూ, అల్లుడూ! బి.పి; షుగర్ ఎక్కువై ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. సిటిస్కాన్ బ్రెయిన్‌లో హెమరేజ్, లంగ్స్‌లో న్యుమోనియా.

"వెంటిలేటర్ మీద పెట్టారు సర్! ఎన్నాళ్లు పడుతుంది నార్మల్ అవడానికి" అన్నాడు రవీందర్‌రావు. "మేమిద్దరమే ఇంటిలో! ఒక అమ్మాయి అల్లుడు నిజామాబాద్‌లో ఉన్నారు. ఇంకో అమ్మాయి, అల్లుడికి మాకు మధ్య సరిగా మాటలు లేవు. మీకు ఫోన్ చేసాను మీరు టూర్‌కు వెళ్లారని స్టాఫ్ చెప్పారు."

పదిరోజులు నానా అవస్థలు పడి ఆమె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఆరు లక్షల రూపాయల అప్పు మిగిలింది.

"అందుకే నేను హాస్పిటల్స్ అంటే ఇష్టపడను" అన్నాడు రవీందర్‌రావు. "ఇంటి దగ్గర ప్రశాంతంగా చచ్చిపోయేది. చచ్చిపోయే దానిమీద ట్రఖియాస్టమీలు, పనిచేయని మందులు ఇచ్చి చివరకు చేతులెత్తేసారు. కనీసం నన్ను లోపలికి రానివ్వలేదు. చివరి చూపూ సరిగా దక్కలేదు" అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఆయనతోపాటు పెద్దకూతురు స్వాతి, అల్లుడు రామారావు ఉన్నారు. చిన్నకుమార్తె సంధ్య, అల్లుడు సోమేశ్వరరావు అలా కనబడి వెళ్లిపోయారట. ఏదో షాపుపెట్టి వ్యాపారం చేస్తానంటే రవీందర్‌రావు డబ్బివ్వలేదని కోపం.

డాక్టర్ విక్రమ్ రవీందర్‌రావును పరీక్ష చేసాడు. "ఇ.సి.జి.లో తేడా ఉంది. బ్లడ్‌ప్రెషర్ ఎక్కువగా ఉంది. హెచ్.బి. ఒన్ ఎసి నార్మల్‌గా లేదు. షుగర్ కంట్రోలు కావడం లేదు. కార్డియాలజిస్టు సలహా తీసుకోండి. ట్రెడ్‌మిల్, ఎఖో పరీక్షలు చెయ్యాల్సి రావచ్చు" అని మందులు రాసిచ్చాడు.

## మూడవ అల

రెండు నెలలయ్యింది. స్వాతి ఫోన్ చేసింది డాక్టర్ విక్రమ్‌కు.

"డాక్టర్! నాన్నకు ఛాతీలో నెప్పిగా ఉంది. కార్డియాలజిస్ట్ హార్ట్‌ఎటాక్ అంటున్నారు"

డాక్టర్ విక్రమ్ కార్డియాలజిస్ట్ సురేష్‌తో మాట్లాడినాడు.

"మూడు రోజుల్నుంచి ఛెస్ట్ పెయిన్ ఉందట. తనకు తెలిసిన పెయిన్‌కిల్లర్స్ వాడుతున్నాడు. ఇ.సి.జి.లో ఏంటీరియర్ మయొకార్డియల్ ఇన్ ఫార్కషన్ ఫీచర్సున్నాయి. ఎఖొ చేసాను. ఎజెక్షన్ ఫ్రాక్షన్ నలభైశాతం ఉంది. ఎడ్మిట్ కమ్మంటే మందులు వ్రాయమని రిక్వెస్ట్ చేస్తున్నాడు. మందులు వ్రాసిచ్చాను కాని అతడికి ఏంజియోగ్రాం చెయ్యాలి" అన్నాడు డాక్టర్ సురేష్.

"రెండు నెలల క్రితం అతడి భార్య చనిపోయింది. ఆరు లక్షల అప్పయ్యిందని దిగులు. తాను హాస్పిటల్‌లో చేరితే డబ్బులెక్కడనుంచి తేవాలో అన్న భయం కాబోలు" అన్నాడు డాక్టర్ విక్రమ్ థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేస్తూ.

"చూడమ్మా స్వాతీ! నాన్నకు ఏంజియోగ్రాం చెయ్యాలి. దాంట్లో బైపాస్ చెయ్యాలా, స్టెంట్ వెయ్యాలా అనేది తెలుస్తుంది".

"నిమ్స్‌కు వెళతాం డాక్టర్‌గారూ" అన్నది స్వాతి.

రవీందర్‌రావుకు రెండు స్టెంట్‌లు వేసారని తెలిసింది ఇరవై రోజుల తరువాత. స్వాతి వాళ్ల ఇంట్లోనే ఉన్నాడట రవీందర్‌రావు.

## నాలుగవ అల

స్వాతి-రామారావులకు ఇద్దరు పిల్లలు. డాక్టర్ విక్రమ్ దవాఖానాలోనే నార్మల్ డెలివరీలయినాయి. అందుకే వాళ్లకు ఆ హాస్పిటల్ మీద అంత నమ్మకం. ఇప్పుడు సంధ్యకు ఎనిమిదో నెల. డాక్టర్ సీత దగ్గరే నెలనెలా పరీక్ష చేయించు కుంటున్నారు ఆరోనెల నుంచీ.

డాక్టర్ సీత స్కాన్ పరీక్ష చేసి అన్నది- "శిశువు బొడ్డుదగ్గర పేగులు కనిపిస్తున్నాయి. ఎక్స్ ఓంఫాలస్ ఏమో!"

వేరేచోట కూడా అదే రిపోర్టు వచ్చింది. ఏమీ చేయలేని పరిస్థితి. ఎనిమిదోనెల ఇరవైరోజులు దాటగానే లేబర్‌పెయిన్స్‌తో వచ్చింది అర్ధరాత్రి సంధ్య. ప్రిమెచ్యూర్ డెలివరీ. బొడ్డు దగ్గర పొర పగిలి పేగులు బయటకు వచ్చాయి. డాక్టర్ విక్రమ్ సర్జరీ చేసి పేగుల్ని లోనికినెట్టి రంధ్రం మూసాడు. మూడురోజులు బదికి ఆ పిల్లవాడు చనిపోయాడు న్యుమోనియాతో.

ఆ వంకతో అల్లుడు సోమేశ్వరరావు నానాయాగీ చేసి వెళ్లాడు. తొలి కాన్పు కదా ఖర్చులూ అయ్యాయి. అంతా వృధా ప్రయాస.

## అయిదవ అల

సంధ్యకు రెండవ కాన్పులో ఆడపిల్ల పుట్టింది. మూడవ కాన్పులో మగపిల్లవాడు. రెండూ నార్మల్ డెలివరీలే ప్రగతి హాస్పిటల్‌లో! డబ్బులు కాస్త సర్దుబాటు చేసాక అల్లుడితో గొడవలు సద్దుమణిగాయట. కాని ఆశకు అంతుండదు కదా! ప్రతి ఏడాది ఏదో అవసరం వస్తూనే ఉంటుంది. ఇద్దరు అల్లుళ్లకు ఇళ్లు కట్టుకోడానికి డబ్బు ఇచ్చాడు ఊళ్లో ఉన్న పొలాలనమ్మేసి. తాను మాత్రం తనకు రెండెకరాల పొలం మిగుల్చుకుని, రెండుగదుల ఇల్లు కట్టుకుని దానిలోనే

ఉంటున్నాడు ఒంటరిగా. కూతుళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు వాళ్లకు అవసరం వచ్చినప్పుడు రవీందర్‌రావు దగ్గరకు వచ్చిపోతుంటారు.

"అప్పుడప్పుడూ ఛాతీనెప్పి వస్తున్నది డాక్టరుగారూ!" అన్నాడు రవీందర్‌రావు. "మందులు క్రమం తప్పకుండా వాడుతున్నా ఇప్పుడు".

"స్టెంట్స్ వేసి పదిహేడేళ్లయింది కదా!" అన్నాడు డాక్టర్ విక్రమ్. "కార్డియాలజిస్టుకు చూపించండి. ఓసారి అన్ని పరీక్షలు చేస్తే తెలుస్తుంది సమస్య ఏమిటో!"

మరల నిమ్స్‌కు వెళ్లారు. ఒక స్టెంట్ బ్లాక్ అయ్యింది, మిగతా రక్తనాళాలలో తేడా ఉంది, బైపాస్ చేయించుకొమ్మని సలహా ఇచ్చారు అక్కడ.

రవీందర్‌రావుకు ఆపరేషన్ ఇష్టంలేదు. బతికినన్నాళ్లు బతుకుతాను. ముందు సంధ్య కూతురు దీప్తికి పెళ్లి చెయ్యాలి. ఆ తరువాత తనకేమైనా ఫరవాలేదు అనుకున్నాడు. చూస్తుండగానే రెండేళ్లు గడచిపోయాయి. దీప్తికి మంచి సంబంధం వచ్చింది. కాబోయే అల్లుడు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్స్‌పెక్టర్.

## ఆరవ అల

"భార్యపోతే తట్టుకున్నాను. ఇరవై ఏళ్లుగా ఒంటరితనాన్ని భరిస్తున్నాను. పిల్లల కోరికలు కాదనకుండా తీరుస్తున్నాను. నా మనవరాలి పెళ్లి ఉన్నంతలో ఘనంగా జరిపిస్తాను" అన్నాడు రవీందర్‌రావు.

దీప్తి వివాహం ఘనంగా జరిగింది. డాక్టర్ విక్రమ్, డాక్టర్ సీతలు వధూవరులను ఆశీర్వదించారు. "మా పిల్లలందరూ మీ దవాఖానాలోనే పుట్టారు. మీ ఆశీస్సులే మాకు వరాలు" అన్నారు కుటుంబసభ్యులు.

దీప్తి వివాహం అయిన సంవత్సరానికి రవీందర్‌రావుకు మరల తీవ్రంగా ఛాతినెప్పి వచ్చింది. నిమ్స్‌కి తీసుకువెళ్లారు. ఐసిసియూలో పదిరోజులుంచాక బైపాస్ ఆపరేషన్ చేసారు. డిశ్చార్జి చేసినాక వచ్చి స్వాతివాళ్ల ఇంట్లో ఒకనెల, సంధ్యవాళ్ల ఇంట్లో ఒకనెల ఉంటున్నాడు.

ఎప్పుడు నెప్పులు తగ్గుతాయా, ఎప్పుడు తన ఇంటికి వెళ్లాలా అనేదే ఆలోచన.

ఆర్నెల్లు గడిచాయి.

# ఏడవ అల

జనవరి 30, 2020 నాడు కేరళలో మొదటి కరోనా కేసు రిపోర్టు చేయబడింది. వూహాన్ నుంచి కేరళకు తిరిగి వచ్చిన ముగ్గురు మెడికల్ స్టూడెంట్లతో తొలివేవ్ ప్రారంభమయ్యింది. కేరళలో మార్చి 23న, ఇండియాలో మార్చి ఇరవై అయిదున లాక్‌డౌన్ ప్రకటించారు. జనవరి 30, 2021 నాటికి ప్రపంచంలో కోవిడ్-19 వ్యాధిగ్రస్తుల సంఖ్య పదికోట్లను దాటింది. మరణాలు ఇరవై రెండు లక్షలు. ఇండియాలో వ్యాధిగ్రస్తుల సంఖ్య కోటిని దాటింది. లక్షా యాభైవేల మంది చనిపోయారు.

"కుటుంబాలు ఎవరికివారే యమునా తీరే" అయిపోయాయి. రవీందర్‌రావు తన పాత ఇంటికి వెళ్లిపోయి ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. ఆ ఇల్లూ, రెండెకరాల పొలం అమ్మేసి మా వద్ద ఉండవచ్చుకదా అని పిల్లల పోరు. "తను కట్టించి ఇచ్చిన ఇళ్లిప్పుడు వాళ్లవి. అయినా అక్కడ తాను బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అంతమందిలోనూ ఒంటరిగా ఉండటం కన్నా ఒంటరితనంలో ఒంటరిగా బతకడం మేలు. ఘర్షణలుండవు" అనుకున్నాడు రవీందర్‌రావు.

రామారావుకు కరోనా పాజిటివ్ వచ్చింది. ఐసొలేషన్‌లో ఉంటున్నాడు. ఉద్యోగాలలో పైరాబడి తగ్గింది. జీతంతో గడవడం కష్టంగా మారింది. పిల్లల కాలేజీలకు సెలవులు.

దీప్తికి ఆరోనెల. కరోనా కారణంగా సీమంతం లాంటివి ఘనంగా చెయ్యలేకపోయినందుకు రవీందర్‌రావు బాధపడ్డాడు.

కరోనా సోకి దీప్తి వాళ్ల మామగారు చనిపోయారు. కర్మకాండలవీ అయ్యాక సంధ్యను తీసుకువచ్చి పరీక్ష చేయించింది డాక్టర్ సీతతో.

"దీప్తి వాళ్ల ఆయన హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు కనుక అక్కడే రెగ్యులర్ ఛెకప్‌లు. కాని మీ దగ్గరే డెలివరీ అవ్వాలనుకుంటున్నది మేడమ్" అన్నది సంధ్య.

"ఓవర్ వెయిట్ ఉంది. బి.పి. ఎక్కువగా ఉంది! అక్కడ జాగ్రత్తగా ఛెకప్‌లు చేయించుకోమ"ని సలహా ఇచ్చింది డాక్టర్ సీత. "ఇక్కడకన్నా అక్కడే ఫెసిలిటీలు ఎక్కువమ్మా!" అంటూ.

# ఎనిమిదవ అల

కరోనా రెండవ వేవ్ ఫిబ్రవరి మూడవ వారంలో మొదలయ్యింది. ఇండియా ఎండల వేడికి కరోనా ఖతమవుతుందనుకున్నవాళ్లకు ఆశాభంగ మయ్యింది. క్లస్టర్స్‌గా కరోనా కొన్నికొన్ని పట్టణాలలో మరణమృదంగాన్ని మోగిస్తున్నది.

ఫోన్ అదేపనిగా మోగుతుంటే డాక్టర్ సీత మాట్లాడింది– "నేను సంధ్యను డాక్టర్. దీప్తికి కరోనా పాజిటివ్ వచ్చింది" అన్నదామె "నాకు భయంగా ఉంది" అంది ఏడుస్తూ...

"దీప్తి ఎక్కడుందమ్మా?" అడిగింది డాక్టర్ సీత.

"హైదరాబాద్, అంబర్‌పేట, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో. రెండుమూడు రోజుల నుంచీ జ్వరం వస్తుంటే వాళ్ల రెగ్యులర్ డాక్టర్ వద్ద చూపించారుట. RTPCR చేయిస్తే పాజిటివ్ వచ్చింది. అమ్మాయి ఓవర్ వెయిట్, బి.పి. ఎక్కువగా ఉంది. కోవిడ్–19 పాజిటివ్ వెంటనే పెద్ద హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేయమన్నారు డాక్టరు" అన్నది సంధ్య.

మరునాడు ఫోన్ వచ్చింది– "దీప్తికి జ్వరం తగ్గింది కాని ఆయాసం ఎక్కువైంది. మీ దగ్గరకు తీసుకువద్దామంటే మూడు, నాలుగు గంటల ప్రయాణం. తట్టుకుంటుందో లేదోనని పక్కనున్న కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్చాము. ఐసొలేషన్ వార్డులో ఉంచి ఆక్సిజన్ ఇస్తున్నారు" అన్నది సంధ్య.

రెండురోజుల తరువాత మరల ఫోన్ చేసింది సంధ్య– "ఉమ్మినీరు తగ్గిందని సిజెరియన్ సెక్షన్ చేసారు. ఆడపిల్ల. తల్లీ, బిడ్డా ప్రస్తుతానికి బాగానే ఉన్నారు. పసిపాపను నియొనెటల్ వార్డులో అబ్జర్వేషన్‌లో ఉంచారు".

మరల అయిదు రోజుల తరువాత ఫోన్ చేసింది సంధ్య. "దీప్తిని డిశ్చార్జి చేసారు. ఇంటికి తీసుకువచ్చాము మేడమ్" అందామె. కాని ఇవ్వాళ జ్వరం వచ్చింది మరల...

# తొమ్మిదవ అల

డాక్టర్ విక్రమ్ ఓ.పి. రూపంలోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు రవీందర్‌రావు –"దీప్తికి ఆయాసమెక్కువైందని మరల హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసారట డాక్టర్. నాకు చాలా గాభరాగా ఉంది". కన్నీళ్లు బొటబొటా కారుతున్నాయి అతడి కళ్లవెంబడి. సంధ్య అక్కడే ఉంది. దీప్తికి అహర్నిశలూ సేవచేస్తూ...

"నేను కనుక్కుంటాను. మీరు ధైర్యంగా ఉండండి రవీందర్‌రావు గారూ!" అన్నాడు డాక్టర్ విక్రమ్. హాస్పిటల్ నెంబర్ తీసుకుని డ్యూటీ డాక్టర్‌కు ఫోన్‌చేసాడు.

"కండీషన్ ప్రికారియస్‌గా ఉంది సర్. సిటిస్కాన్ చేసాము. న్యుమోనియా ఎక్కువగా ఉంది. వెంటిలేటర్ మీద పెట్టాల్సి రావచ్చు. ఆమెను ఐసిసియులోకి షిఫ్ట్ చేస్తున్నారనుకుంటా! ఎక్స్‌క్యూజ్‌మి" అని ఫోన్ పెట్టేసాడతడు.

గంటలోపే ఫోన్ వచ్చింది. రవీందర్‌రావు వలవలా ఏడుస్తున్నాడు. "అంతా అయిపోయింది సార్. దారిలో ఆయాసమెక్కువైతే సంధ్య కూతురికి తన నోటితో కూడా గాలి ఊదిందట. వెంటిలేటర్ కెక్కించిన కొద్దిసేపటికే హార్ట్ ఆగిపోయింది. ఆఖరి ప్రయత్నాలు చేస్తున్నాం అన్నారట డాక్టర్లు" అతడి దుఃఖానికి అంతులేదు. రవీందర్‌రావుకు తోడుగా వచ్చిన అతడి మనవడు ఆటో తీసుకువచ్చి వాళ్లింటికి తీసుకువెళ్లాడు.

దీప్తికి అదేరోజు సాయంత్రం అంత్యక్రియలయ్యాయి. కనీసం ఆమెను ఆఖరిసారిగా చూడడానికి కూడా వెళ్లలేని పరిస్థితి. దీప్తి ఒక కలలా అదృశ్యమయ్యింది.

వారం రోజుల తర్వాత డాక్టర్ విక్రమ్‌కు ఫోన్ చేసింది సంధ్య– "దీప్తికి పుట్టిన పసిపాప జ్వరం ఫిట్స్‌తో చనిపోయింది నియోనేటల్ వార్డులో. డాక్టర్! నేను దీప్తికి నా నోటితో గాలి ఊదాను కదా! నాకు పాజిటివ్ వస్తుందేమోనని భయంగా ఉంది. పాజిటివ్ వస్తే నేనూ చనిపోతానా? మీ హాస్పిటల్‌లో అయితే మాకీ దురదృష్టం వచ్చేది కాదేమో! నాకు భయంగా ఉంది డాక్టర్..." అంటూ ఏడుస్తూనే ఉన్నదామె.

రెండు రోజుల తరువాత రవీందర్‌రావు వచ్చాడు. ఇవ్వాళ సంధ్య ఇక్కడకు వస్తుంది హైదరాబాద్ నుంచి. మీకు చెప్పలేదు కాని ఆమెకు, సోమేశ్వరరావుకు

మధ్య చాలా గొడవలున్నాయి. అతడు వ్యసనపరుడు డాక్టర్. ఇంకో ఫ్యామిలీ మెయింటెయిన్ చేస్తున్నాడని అనుమానం” అన్నాడు ఎంతో మధనపడుతూ. “కొన్నిరోజులు మీ హాస్పిటల్‌లో రూం తీసుకుని ఉంటుంది. మీకు తెలుసు కదా ఆమె కరోనా పాజిటివ్! నా దగ్గర ఉండమంటే ఈ వయసులో మీకు కరోనా పాజిటివ్ వస్తే ప్రమాదం కాదా? పైగా మీకు బైపాస్ అయ్యిందని అంటున్నది. ఏం చెయ్యమంటారు నన్ను డాక్టర్!”

కలివిడిగా కలిసి ఉండే కుటుంబాలు గుట్టకొకరు, పుట్టకొకరుగా చెదిరి పోయారు. ఎవరికివాళ్ళు ఐసొలేషన్‌లో బతకాల్సిన పరిస్థితి. ప్రపంచమంతా ఇప్పుడు ఏ దేశానికి ఆ దేశంగా, ద్వీపాలుగా విడిపోయింది.

ఇప్పుడు సంధ్య తన హాస్పిటల్‌లో ఉంటే మిగతా డెలివరి పేషంట్లు భయపడతారు. స్టాఫ్ పారిపోతారు. డాక్టర్ విక్రమ్‌కు భయమేసింది. “నేను సర్దిచెపుతాను రవీందర్‌రావు గారూ! సంధ్యను మీ ఇంట్లోనే ఉండమంటాను. కరోనా వచ్చేదయితే ఈపాటికే మీకు వచ్చేది. అయినా వాక్సీన్‌లు రెండు డోసులూ పడ్డాయిగా. భయం అక్కర్లేదు” అన్నాడు.

ఏదో ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తున్నట్లున్న రవీందర్‌రావు వేపు చూసాడు డాక్టర్ విక్రమ్. దూరంగా ఏవో మృదంగ ధ్వనులు... ఒకరకమైన గంటల సవ్వడి... సైరన్ సాంగ్-హంసగీతం-తొమ్మిదవ అల...

★★★★★

# 9. లాజరస్, లేచిరా!

“అతడు నీటిని ద్రాక్షాసవముగా మార్చినాడు. మృత్యుముఖాన ఉన్న రాజప్రతినిధి కుమారుడి విషజ్వరమును తగ్గించినాడు. పక్షవాతపు రోగిని నడిపించినాడు. అయిదువేలమంది ప్రజలకు అయిదు రొట్టెలు, రెండు చేపలను ఇబ్బడి ముబ్బడి గావించి విందు చేసినాడు. నీటిపైన నడచినాడు. పుట్టుగుడ్డికి చూపునిచ్చినాడు. చనిపోయిన లాజరస్‌ను నాలుగు రోజుల తరువాత బ్రతికించినాడు.

మానవుల పాపాలను తన రక్తంతో కడిగి, శిలువపై మరణించి, సమాధి నుంచి మూడవ దినమున పునరుజ్జీవితుడైనాడు జీసస్. అతడు మృతులలో నుంచి లేచెను. దేవుని వాక్కు అతడు. దేవుని మాటకు దేహరూపమతడు. ఆదాములో అందరూ మృతినొందెదరు. క్రీస్తులో అందరూ జీవమును పొందెదరు. ఎవరి సమయము వచ్చినపుడు వారు; అతడు తొలిపంట; అతడూ, అతడి విశ్వాసులూ! ఆమెన్! తన ప్రసంగాన్ని ముగించాడు పాస్టర్ పాల్. ఆరోజు శనివారం. కరోనా తీవ్రంగా ఉండడం వలన హాజరైన విశ్వాసుల సంఖ్య తక్కువగా ఉన్నది.

“పాస్టర్ అంటే గొర్రెల కాపరి. విశ్వాసులకు మార్గదర్శనం చేస్తాడు’’ అన్నాడు శామ్యూల్ మాస్కు ముక్కుమీదకు లాక్కుంటూ

“పాల్ సార్‌కు చెప్పాలి. మన కూటమిలో చాలామంది విషజ్వరంతో బాధపడుతున్నారు కదా! వారి స్వస్థతకై ప్రత్యేక ప్రార్థనలు చేద్దాం” అన్నాడు జోసెఫ్. కాలనీలో చాలామందికి కరోనా పాజిటివ్ వచ్చింది. గత ఆర్నెల్లలో వీధికొక్కరు, ఇద్దరు చనిపోయేసరికి అందరిలోనూ భయాందోళనలు పెరిగిపోయాయి.

“మూడు నెలలు కాలేదు తాతయ్య జరిగిపోయి. ఇప్పుడు మా నాయనకు అంతులేని జ్వరం” అన్నది రూత్, శామ్యూల్ సోదరి.

"నిన్నటి నుంచి మా అత్తమ్మ ఒక్కటే ఒళ్లునొప్పులు, కీళ్లనెప్పులు, జ్వరం అంటోంది. డాక్టర్ దగ్గరకు వెళ్తే కరోనాటెస్ట్ చేయించుకు రమ్మన్నాడు" అన్నది రాఛెల్. ఈమె జోసెఫ్ భార్య.

"కరోనా కిట్లు లేవంట గవర్నమెంట్ దవాఖానాలో. రేపు వచ్చి కనుక్కొమ్మన్నారు" అన్నాడు శామ్యూల్.

"నాథానియెల్ కుమార్తె పెళ్లికి వస్తున్నావా! పన్నెండు గంటలకు చర్చిలో" అన్నది రాఛెల్.

"నాయనకు, జ్వరం తగ్గితే వస్తాను. మా అమ్మ కూడా పడతాలేస్తా ఉన్నది. వాళ్లకింత అన్నం కూడ వండిపెట్టాలి" అన్నది రూత్.

పాస్టర్ పాల్, అతడి అసిస్టెంట్ పీటర్ ఆధ్వర్యంలో నాథానియెల్-ఎస్తెర్‌ల కుమార్తె రోజీకి ప్రకాష్-రెబెకాల కుమారుడు జాకబ్‌కు వివాహం జరుగుతున్నది. కరోనా కాలం కదా అని కొద్దిమందినే పిలిచారు. క్యాటరింగ్ మయూరి హోటల్‌కు ఇచ్చారు యాభైమందికని. సంఘ సభ్యులందరూ వచ్చేసరికి సంఖ్య నూటయాభై దాటింది. రెండు కుటుంబాలు పేద కుటుంబాలే! ఎలా వీళ్లకి విందు ఇవ్వాలి? వాళ్లు పాస్టర్ పాల్‌తో ఆలోచిస్తుండగానే ఫోన్ మోగింది. పాల్ స్నేహితుడైన రెవరెండ్ ప్రేమ్‌కుమార్ గారు మెదక్ చర్చి నుంచి వచ్చారు కాజీపేటకు. తానెక్కడ ఉన్నదీ చెప్పాడు పాల్. పావుగంటలో వాళ్లూ వచ్చారు. వీళ్లందరికి ఎలా విందు ఇవ్వాలి? విషయం గ్రహించిన రెవరెండ్ గారు పాల్‌కు ధైర్యం చెప్పి వధూవరులను ఆశీర్వదించాడు.

ఆశ్చర్యం! పెళ్లి వేడుకలు ముగిసి భోజనాల సమయమయ్యేసరికి కూల్‌డ్రింక్స్, రకరకాల వంటలతో విందు బ్రహ్మాండంగా జరిగింది. రెవరెండ్ ప్రేమకుమార్ చెప్పారు పాల్‌తో. మీరు క్యాటరింగ్‌కు ఆర్డరిచ్చిన మయూరి హొటల్ యజమాని తన శిష్యుడేనని- "అంతా ప్రభువు చలువ. నీటిని వైన్‌గా మార్చినవాడే మనకూ సాయంచేసాడు".

రెవరెండ్ డాక్టర్ ప్రేమకుమార్ మెడిసిన్‌లో యం.డి. చేసినాడు. తండ్రి కోరిక ప్రకారం ప్రీస్ట్‌గా శిక్షణ పొంది అటు వైద్యం, ఇటు సువార్త ప్రచారం చేస్తూ ప్రభుసేవకుడిగా ధన్యతనొందినాడు. రెవరెండ్ వచ్చారని తెలియగానే లోకల్

కార్పొరేటర్ తన కుమారుడికి జ్వరం తీవ్రంగా ఉన్నదని ఆశీస్సులివ్వమని వేడుకున్నాడు. బాలుడిని పరీక్షించి అతడు తీసుకుంటున్న మందులు సరిపోతాయని ధైర్యం చెప్పి పవిత్రజలాన్ని, నూనెను ఇచ్చి పంపించాడు.

అలాగే వివిధ రుగ్మతలతో ఉన్నవారిని పరీక్షించి మందులు, శాక్రమెంట్ చేయబడిన శిలువ హారాలను, పవిత్ర జలాన్ని, ఆశీర్వదింపబడిన కొవ్వొత్తులను, హోలీకార్డ్సును ఇచ్చినాడు. ఈ వార్త తెలిసి స్త్రీలు పురుషులు వచ్చి దేవుని సన్నిధిలో హొసన్నాలు పలుకుతూ "రక్షకుడా! మమ్మల్ని కాపాడు" అని జీసస్‌ను వేడుకున్నారు.

"పతనం చెందిన దేవదూతలు, దారితప్పిన మనుషుల చెడుపనుల వల్ల కాలుష్యం పెరిగింది. ఆత్మను సైతానుకు అమ్మి, మోసెస్ దశాజ్ఞలను ధిక్కరించి, కరుణామయుడు నిర్మించిన బాటలో పోకుండా మనిషి నరకలోకపు దారిలో తచ్చాడుతున్నాడు. మనిషి శిథిలమైన గుడిగా మారుతున్నాడు. దీనిని పడగొట్టి మూడురోజుల్లో పునర్నిర్మించిన రక్షకుడి ఆశీస్సులు, జీవజలం మనకు రక్షణనిస్తాయి" అని సువార్తను తెలిపాడు రెవరెండ్ ప్రేమకుమార్.

పవిత్ర కలశం-ఛాలిస్‌లో నీటినిపోసి త్రిమూర్తుల ఆశీస్సులకై ప్రార్థనచేసి, పవిత్ర జలాన్ని భక్తులకు ఇచ్చినారు.

"తెలిసో తెలియకో అందరం తప్పులు చేస్తాం. వాటిని భగవంతుని ముందు అంగీకరించాలి. పశ్చాత్తాపపడాలి. మనకు మంచి చూపున్నా నిజాన్ని సరిగా చూడలేము. ఒక్కోసారి మన ఇంటినిమనమే గుర్తుపట్టలేము" రెవరెండ్ మాట్లాడుతుండగానే ఇద్దరు స్త్రీలు లోనికి పెద్దగా శోకిస్తూ పరిగెత్తుకు వచ్చారు. వాళ్లు వడివడిగా వచ్చి పూజాపీఠం ముందు మొక్కి ఏడుస్తున్నారు. పాస్టర్ పాల్ వాళ్లను ఓదార్చి శాంతవచనాలు చెప్పినాడు.

"ఆచార్యా! ఈమె కరుణ, ఆమె కుమార్తె మెర్సీ. కరుణ కొడుకు ఎలెజార్‌కు విషజ్వరం సోకింది. హాస్పిటల్‌లో ఉన్నాడు. పరిస్థితి సీరియస్‌గా ఉంది" అన్నాడు పాస్టర్ పాల్.

"అయ్యా తమరు నాలుగు రోజులు ముందువస్తే నా సోదరుడు బతికేవాడు. అతడిని వెంటిలేటర్‌పై పెట్టారు" అని వెక్కివెక్కి ఏడ్వసాగింది మెర్సీ.

"మా జీవనాధారం అతడు. నా భర్తపోయి ఏడు నెలలయ్యింది ఈ కరోనాతోనే! ఇప్పుడు నా కొడుకు చావుబతుకుల మధ్య ఉన్నాడు" దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

రెవరెండ్ ప్రేమకుమార్ వాళ్లవేపు చూసాడు దయాపూరితమైన కన్నులతో. అతడి కళ్లవెంబడి నీళ్లు ధారాపాతంగా కారాయి.

"ప్రభువు మనలను పరీక్షస్తున్నాడు. అమ్మా, ఏ హాస్పిటల్‌లో ఉన్నాడు మీ అబ్బాయి" అడిగాడు రెవరెండ్.

"గాంధి హాస్పిటల్, మెడికల్ వార్డు రెండో యూనిట్... ఐసిసియూలో" అన్నది మెర్సీ. వృత్తిరీత్యా ఆమె నర్సు. అదే హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్‌లో సిస్టర్.

"డాక్టర్ ఇజ్రాయెల్ సార్ – ఇన్‌ఛార్జి" అన్నది మెర్సీ.

రెవరెండ్ ప్రేమకుమార్ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడినాడు. "అమ్మా నేనూ వస్తాను హాస్పిటల్‌కు మీతో. పాస్టర్ పాల్ మీరూ రండి" అన్నాడతడు.

"మనలనందరినీ కాపాడేది ఆ తండ్రి మాత్రమే! ఆ ప్రకాశవంతమైన దివ్యకాంతి మన చీకట్లను పారదోలుతుంది. పుట్టుగుడ్డికి చూపునిస్తుంది. ఆమెన్" అన్నాడు ప్రేమకుమార్.

"ఆమెన్" అన్నారందరూ.

"గాంధీ ఆస్పత్రిలో రెవరెండ్ ప్రేమకుమార్, పాస్టర్ పాల్‌లను తన రూంలో సాదరంగా కూర్చోబెట్టినాడు అసిస్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ ఇజ్రాయెల్. ఈరోజు డ్యూటీ అతడిదే!.

"నేను ఎలెజార్‌ను చూడవచ్చునా" అడిగాడు డాక్టర్ ప్రేమకుమార్.

"తప్పకుండా! మీరు ఈ పిపిఇ కిట్ వేసుకోండి!"

ఐసిసియూలోకి అడుగుబెడుతుండగానే డాక్టర్ ఇజ్రాయెల్ ఫోన్ మోగింది. "సూపరింటెండెంట్‌గారు అర్జెంటుగా రమ్మంటున్నారు. ఎవరో విఐపి వచ్చారట. నేను ఇప్పుడే వస్తాను. డాక్టర్ సూర్యా, సిస్టర్ నళినీ – డాక్టర్ ప్రేమకుమార్ సర్‌కు

‘ఎలిజార్’ పేషంట్‌ను చూపించండి” అని డాక్టర్ ఇజ్రాయెల్ వెళ్లిపోయాడు. డాక్టర్ ప్రేమకుమార్‌కు రెండేళ్ల జూనియర్ డాక్టర్ ఇజ్రాయెల్.

ఐసిసియూ గది నిండా పేషంట్లు. మానిటర్ల అలారంలు నిముష నిముషానికీ మోగుతున్నాయి ఎక్కడో ఒకచోట. అక్కడకు నర్సులు, పిజి డాక్టర్లు పరిగెడ్తున్నారు. ఇంజక్షన్లిస్తున్నారు. వెంటిలేటర్ ఎడ్జస్ట్ చేస్తున్నారు.

రెవరెండ్ ప్రేమకుమార్, పాస్టర్ పాల్‌లను ఎలెజార్ బెడ్ వద్దకు తీసుకువెళ్లాడు డాక్టర్ సూర్య.

“మీ గురించి సార్ చెప్పారు” అన్నాడతడు – “ఎలిజార్ పేషంట్‌ను వెంటిలేటర్ మీద పెట్టి నాలుగు రోజులయ్యింది. ఆక్సిజన్ శాచురేషన్ ఇవ్వాళ పొద్దుటినుంచీ అప్పుడప్పుడూ బాగా పడిపోతున్నది” అన్నాడు డాక్టర్ సూర్య.

డాక్టర్ ప్రేమకుమార్ కళ్లు ఎలెజార్‌ను నిశితంగా పరీక్షించాయి. ఎలెజార్ వెంటిలేటర్ మీద కూడా ఊపిరి పీల్చుకోడానికి ఇబ్బంది పడుతున్నాడు. అలారం గట్టిగా మోగింది. ఎలిజార్ కాళ్లూ చేతులూ కొట్టుకుంటున్నాడు. డాక్టర్ ప్రేమకుమార్ ఎలిజార్ చేతిని పట్టుకుని “ఎలెజార్ ఎలెజార్” అని పిలిచాడు.

ఎలెజార్ కళ్లు తెరిచాడు. కనుగుడ్లు అటు ఇటూ తిరుగుతున్నాయి. నుదుటి నిండా చెమటలు.

“డాక్టర్ సూర్యా! ఎండ్రొటఖియల్ ట్యూబ్ బ్లాక్ అయినట్లుంది. కొత్త ట్యూబ్ రెడిగా ఉందా?”

“రెడీ సర్!” అన్నది సిస్టర్ నళిని.

“డాక్టర్ సూర్యా! నేను ఇంటెన్సివిస్ట్‌గా పనిచేసాను. మీకు హెల్ప్ చేయవచ్చా. మీ అనుమతితో ట్యూబ్ తీస్తాను” అని ఎండ్రొటఖియల్ ట్యూబ్ బల్బ్ డిఫ్లేట్ చేసి ట్యూబును ఎలెజార్ గొంతులోంచి బయటకులాగాడు. ఎలెజార్ గట్టిగా దగ్గి ఊపిరి మామూలుగా తీసుకోవడం మొదలెట్టాడు. ఆక్సిజన్ శాచురేషన్ 96కు వచ్చింది. పల్స్ నార్మలయ్యింది. బి.పి. మామూలు స్థాయిలో ఉంది.

ఎండోట్రఖియల్ ట్యూబుకు గట్టిపడిన కఫం ప్లగ్‌లా అతుక్కుని ఉంది.

డాక్టర్ సూర్య అన్నాడు– “నేను ఫస్టియర్ పి.జి.ని. ఇది నాకు తొలిపాఠం”.

డాక్టర్ ఇజ్రాయెల్ ఫోన్ చేసాడు. మీటింగ్ ఇప్పుడే అయ్యేట్టులేదని. తాను రాలేనందుకు క్షమించమని డాక్టర్ ప్రేమకుమార్‌ను కోరినాడు.

ఓ అర్ధగంటసేపు అక్కడే ఉండి ఎలెజార్ స్థిమిత పడినాక పాస్టర్ పాల్‌తో కలిసి రెవరెండ్ ప్రేమకుమార్ అక్కడ ఉన్న డాక్టర్ సూర్య, సిస్టర్ నళినిలకు థాంక్స్ చెప్పి కిందకు వచ్చారు.

వరండాలో మెట్ల దగ్గర దిగాలుగా ఉన్న కరుణ, మెర్సీ కనిపించారు. “ఎలెజార్ బాగానే ఉన్నాడమ్మా! వెంటిలేటర్ అవసరం లేదిప్పుడు” అన్నాడు రెవరెండ్ ప్రేమకుమార్.

“ప్రభువు మిమ్మల్ని కాపాడుతాడు” ఆశీర్వదించాడు పాస్టర్ పాల్.

“నమ్మినవారిని ప్రభువు కాపాడతాడు. అతడే జీవమూ, పునరుత్థానమూ” అన్నాడతడు.

రెవరెండ్ డాక్టర్ ప్రేమకుమార్ బృందం వెళ్ళిపోయింది పాస్టర్ పాల్ వద్ద వీడ్కోలు తీసుకుని.

సిస్టర్ మెర్సీ అక్కడ ఇన్‌ఛార్జి పర్మిషన్ తీసుకుని తన సోదరుడు ఎలెజార్‌ను చూడడానికి ఐసిసియూలోకి వెళ్లింది. సిస్టర్ నళిని వచ్చింది ఆమెను చూడగానే.

“ఇందాక గొప్ప అద్భుతం జరిగింది. రెవరెండ్ డాక్టర్ ప్రేమకుమార్ వచ్చి ఎలెజార్‌ను ముట్టుకుని తానే స్వయంగా ఎండొట్రఖియల్ ట్యూబ్ తీసివేసారు. ట్యూబ్‌కు అతుక్కుని ఉంది ఇంత ప్లగ్. ఏమాత్రం ఆలస్యమయినా ఎలెజార్ మనకు దక్కేవాడు కాదు” అన్నది సిస్టర్ నళిని.

మెర్సీ గొంతు విని ఎలెజార్ కళ్లు తెరచి చూసాడు.

“అక్కా! అప్పటిదాకా నాకు ఒకటే పీడకలలు. ఏదో సమాధిలో నన్ను నాలుగురోజులు పూడ్చిపెట్టినట్లు. నాకూపిరాడక తన్నుకులాడుతున్నట్లు... ఇంతలో ఎవరో నా గొంతులోంచి గొట్టాన్ని లాగేసారు. నాకు రిలీఫ్ అనిపించింది. నా

చేతిలో ఇదుగో శిలువపై క్రీస్తు ఉన్న గొలుసు... ఎవరో పిలుస్తున్నారు ఎలెజార్, ఎలెజార్! అని... లాజరస్, లేచిరా! అని రక్షకుడు పిలిచినట్లు".

మెర్సీ కళ్లనిండా నీళ్లు నిండాయి. విశ్వాసులను రక్షించడానికి కరుణామయుడు వస్తాడు అనేక రూపాలలో...

"ఎలెజార్! నీకిక భయంలేదు. కరోనా విషకౌగిలి నుంచి నీవు బయటపడ్డావు" అన్నది మెర్సీ సజల నయనాలతో...

మృతులలోంచి లాజరస్ లేచి వచ్చిన తరువాత కరుణామయుడిని శిలువ వేసారు అతడు దైవకుమారుడు కాదని ఋజువు చేసేందుకు.

పదిరోజుల తరువాత పాస్టర్ పాల్‌కు వార్త వచ్చింది. రెవరెండ్ ప్రేమకుమార్‌కు కోవిడ్ పాజిటివ్ వచ్చిందని, మూడు రోజులు కోమాలో ఉండి ఇప్పుడు పూర్తి స్వస్థతతో ఉన్నారని.

పాస్టర్ పాల్ కృతజ్ఞతా దృక్కులతో శిలువ వేయబడిన క్రీస్తు ముందు మోకరిల్లినాడు... ప్రభువు దయ ఈ ప్రపంచమంతా ప్రసరించి లోకమును స్వస్థపరుచును గాక, ఆమెన్!....

★★★★★

# 10. దేవాలయాలూ -
# సొలొమాన్ ప్రభువులూ...

“డేవిడ్ చేతులు రక్తసిక్తమైనాయి కనుక జెరూసలెంలో దేవాలయ నిర్మాణానికి ‘యెహొవా’ అనుమతి ఇవ్వలేదు. డేవిడ్-బాతొషెబాలకు కుమారుడవైన ఓ సొలొమాన్, నీవు ఓ అద్భుత దేవాలయాన్ని నిర్మించు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ లోహపు పనిముట్లను వాడరాదు” అన్నారు పూజారులు.

‘సోలో’గానే వెళ్లే సొలొమాన్ ప్రభువు సందిగ్ధంలో పడినాడు. మహా గండశిలలను, తాళప్రమాణ దేవదారు, నల్ల చేవమానులను లోహపు పనిముట్లు లేకుండా దేవాలయ నిర్మాణానికి వీలుగా చేయడం సాధ్యమయ్యేపనేనా?

సొలొమాన్ ప్రభువు మహాజ్ఞాని, న్యాయమూర్తి, చక్కని పరిపాలనా దక్షత కలవాడు. నలభై ఎనిమిది ప్రవక్తలలో ఒకడు. పక్షుల భాష తెలిసినవాడు. ఏడు వందల మంది భార్యలు, మూడు వందలమంది ఉంపుడుగత్తెలున్న విలాస పురుషుడు. తన వద్ద ఉన్న సొలొమాన్ ముద్రిక వేపు సాలోచనగా చూసాడు. దానిపై స్టార్ ఆఫ్ డేవిడ్ ముద్రించబడి ఉంది. ఆ ఉంగరం ఎటువంటి భూత పిశాచాలనైనా లొంగదీసుకోగలదు. సొలొమాన్ ప్రభువు తన ఆంతరంగికులను సంప్రదించాడు. రబ్బీలన్నారు- “ప్రభూ! అస్మోడియస్ ‘జిన్ను’ పిశాచాలకు రాజు, ఆగ్రహరూపుడు. కామపిశాచి. అతడి దగ్గర ‘షమీర’ అనే నక్సియన్ శిలాక్రిమి ఉన్నది. ఆకుపచ్చని రాయిలో ఉండే ‘షమీర’ ఏ రాయినైనా ముక్కలు చేయగలదు. కరిగించగలదు. హిందూదేశంలో, కానాన్ రాజ్యంలో, అనేక దేవాలయ నిర్మాణాలకు ‘షమీర’ వాడతారు.

ఈ ‘షమీర’ తోనే ప్రధాన పూజారి వాడే బ్రెస్ట్ ప్లేట్-వక్ష స్త్రాణముపై పన్నెండు రత్నాలను అమర్చినాడు మోసెస్!” అన్నారు పూజారులు.

"యెహోయిదా కుమారుడవైన బెనయ్యా! నీవు మహావీరుడివి! నా మిత్రుడివి. నీకు స్టార్ ఆఫ్ డేవిడ్ ముద్రించబడిన నా ఉంగరాన్ని, యెహోవా పవిత్ర నామమున్న కంఠహారాన్ని, శక్తివంతమైన కాలి కడియాల్ని ఇస్తున్నాను. ఆ అశ్మదేవుడిని బంధించి తీసుకునిరా!" ఆజ్ఞాపించాడు సొలొమాన్.

బెనయ్య వెళ్లి అస్మోడియస్‌కు బాగా తాగించి సంకెళ్లు వేసి, రాతిపెట్టెలో సొలొమాన్ ముందుకు తీసుకువచ్చాడు. పిశాచాలరాజు మనుజ చక్రవర్తి వేపు చూసి నవ్వాడు. "నాలుగు క్యూబిట్ల ఎత్తులేవు, నీకు ప్రపంచాన్ని ఆక్రమించాలన్న కోరికెందుకు సొలొమాన్ ప్రభూ!" అన్నాడు హేళనగా.

సొలొమాన్ బదులిచ్చాడు– "నీ పిశాచబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. నిన్నిక్కడకు రప్పించింది యెహోవా దేవాలయ నిర్మాణానికి పనికివచ్చే 'షమీర' కోసం".

అస్మోడియస్ అన్నాడు– "షమీర' ఇప్పుడు సముద్రపు రాజు అధీనంలో, హుపో పక్షి రక్షణలో ఉంది".

పక్షుల భాష తెలిసిన సొలొమాన్ 'పర్వత వడ్రంగి పిట్ట– హుపో' గూడును ముట్టడించగా తన పిల్లల్ని కాపాడుకోడానికి 'షమీర'ను రాజుకిచ్చింది ఆ పక్షి. ఆ 'షమీర' రాళ్లను తొలవగలదు కనుక దానిని శిలాక్రిమి అన్నారు.

దేవాలయ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. తన ఉంగరం– రింగ్ ఆఫ్ సొలొమాన్– శక్తితో జీన్నులను అదుపులోకి తీసుకునోవాలయపు పనులన్నీ చేయించాడు సోలొమాన్. అస్మోడియస్‌ను తన భవనంలోనే రాతిపెట్టెలో బంధించి ఉంచినాడు. ఒకరోజున సొలొమాన్ అడిగాడు పిశాచాల రాజును– "మాకంటే ఏరకంగా గొప్పవాళ్లయ్యారు నీవూ, నీ జిన్నులూ!"

అస్మోడియస్ అన్నాడు– "నీకే గనుక ధైర్యముంటే నా సంకెళ్లు విప్పదీసి, నీ ఉంగరాన్ని ఇవ్వు ఓ అయిదు నిముషాలపాటు. మా శక్తి సామర్థ్యాలు నీకర్థమవుతాయి".

ద్రాక్షాసవపు మత్తులో ఉన్న సొలొమాన్ ఏమీ ఆలోచించకుండా అస్మోడియస్‌ను విడుదలచేసి ఉంగరాన్నిచ్చాడు. అస్మోడియస్ ఆ ఉంగరాన్ని మింగి

ఇంతింతై భూమ్యాకాశాలను అందుకునేంత పెరిగి గట్టిగా గాలి పీల్చి వదిలేసరికి సొలొమాన్ ఎగిరి నాలుగు వందల లీగుల దూరం కొట్టుకుపోయి ఎడారిలో పడ్డాడు. అస్మోడియస్ వెంటనే సొలొమాన్ రూపంలోకి మారి అతడి రాజ్యసంపదలను అనుభవిస్తూ, దేశాన్ని పిశాచాల పాలుచేసి లోకకంటకుడిగా మారాడు.

అక్కడ ఎడారిలో సొలొమాన్ నానా కష్టాలు పడుతూ, ఏ పట్టణంలోనూ ఎవరూ తనను గుర్తుపట్టకపోవడంతో ఉన్మత్తుడిగా మారి బిచ్చమెత్తుకుని కాలం గడుపుతూ కొన్నేళ్లకు తన రాజభవనం చేరుకుని దొంగచాటుగా తన పడకగదిలోకి ప్రవేశించాడు. బాగా తాగి మత్తుగా నిద్రపోతున్న అస్మోడియస్ మంచం పక్కన తన సొలొమాన్ ముద్రిక కనిపించింది. ఆ ఉంగరాన్ని వేలికి తొడుక్కోగానే సొలొమాన్‌కు యధారూపం, శక్తులు వచ్చాయి. మహోగ్రంగా గర్జిస్తున్న సొలొమాన్‌ను చూడగానే అస్మోడియస్ నఖశిఖ పర్యంతం వణికిపోయాడు. పిశాచాలరాజును శిలామందసంలో బంధించి, సీలువేసి సముద్రంలో పడవేయించాడు సొలొమాన్.

సొలొమాన్‌కు వృద్ధాప్యం వచ్చేసరికి అతడి విదేశీ భార్యల పెత్తనం ఎక్కువయ్యింది. వాళ్లు తమతమ దేశాల దేవుళ్లకు గుడులు, గోపురాలు కట్టించేట్లు సొలొమాన్‌ను ఒత్తిడి చేసారు. సిడొనియన్ల అస్తార్తె, అమ్మోనైట్ల మిల్కోం అనబడే మొలొక్‌ల దేవాలయాలు వెలిసాయి. యెహోవా దృష్టిలో సొలొమాన్ భ్రష్టుడైనాడు.

అమ్మోనైట్ల దేవుడు మొలాక్, అస్సిరియన్–బాబిలోనియన్ల బాల్–మాలిక్ –సూర్యదేవుని రూపం. అతడికి ఆగ్రహం వస్తే ప్లేగులాంటి మహమ్మారిలను పంపుతాడు. వృషభశిరస్సుతో ఇత్తడి సింహాసనంపై కూర్చుని బలుల్ని కోరతాడు. అతడి చాచిన చేతులకింద అగ్నిహోత్రాలు మండుతుంటాయి. చిన్నపిల్లల్ని ఆ చేతుల మీదుగా దాటించి రక్షణ కోరతారు మూర్ఖ భక్తులు. జెరుసెలెం దగ్గరున్న గెహన్నాలోయలో చిన్నపిల్లల్ని మంటల్లో బలిచేస్తారని పుకార్లుండేవి. కన్నీళ్లలోయకు ప్రభువైన మొలొక్ విగ్రహం తల్లిదండ్రుల కన్నీళ్లు, పిల్లల రక్తంతో తడిచి భయంకరంగా ఉంటుందని భావించేవారు.

జిన్ను పిశాచాలు పనిచేస్తూనే ఉన్నాయి నిరంతరాయంగా! విముక్తి ఎప్పుడో కానరావడం లేదు వాటికి. సొలొమాన్ ప్రభువు తన సింహాసనంపై కూర్చుని రాజదండంపై తల ఆనించి నిద్రపోతున్నాడు. రాజును నిద్రలేపే ధైర్యం ఎవరికుంది?

"అతడికి మరణాన్ని ప్రసాదించాము కాని జిన్ను భూతాలతడు బ్రతికే ఉన్నాడని భ్రమలో ఉన్నాయి. నెమ్మదిగా చెదలు సులేమాన్ రాజదండాన్ని తినివేయగా అది విరిగి ముక్కలై సులేమాన్ నేలపై పడినాక భూతలకర్థమయ్యింది తాము ఓ సంవత్సరం వృధాశ్రమ చేసామని".

– ఖురాన్–సూరా 34, ఆయతులు–14

ఎటువంటి శక్తులున్నవారైనా ఆయుర్దాయం తీరినాక మట్టిలో కలిసిపోక తప్పదు, వాళ్ల వాళ్ల రాజదండాలతో పాటుగా.

జాన్‌మిల్టన్ తన పారడైజ్ లాస్ట్‌లో పతనం చెందిన దేవదూతల గురించి వ్రాస్తున్నాడు–

మొలొక్, రక్తసిక్త దేహుడై
మానవ బలుల్ని, తల్లిదండ్రుల కన్నీళ్లను ఆస్వాదిస్తుంటే
మరణ మృదంగాలు, తప్పెట్ల చప్పుళ్లమధ్య
మాడిపోతున్న శిశువుల రోదనలు మాసిపోతాయి

అటువంటిమొలొక్‌కు గుడి కట్టించిన సొలొమాన్ దేవుడి దృష్టిలో పతనమైనాడు.

కాలం మారింది. దేవాలయాలతో పాటు విద్యాలయాలు, వైద్యాలయాలు, కాలేజీలు, యూనివర్సిటీలు వచ్చి కొత్తకొత్త దేవుళ్లను ప్రతిష్ఠించినట్లు కొత్తకొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. 542 మెడికల్ కాలేజీలు, 64 పి.జి. ఇన్స్టిట్యూట్‌లు, 172 బయొ మెడికల్ ఇంజనీరింగ్ కాలేజీలు, 875 యూనివర్సిటీలు, పన్నెండు లక్షలమంది అల్లోపతి డాక్టర్లు, ఎనిమిది లక్షలమంది ఆయుష్ డాక్టర్లు, అరవై ఎనిమిది రకాల స్పెషలిస్టులు అందరూ ఉన్నారుట... వెంటిలేటర్లు తయారు చేయలేరు, ఆక్సిజన్ ఉత్పత్తి చేయలేరు....

అన్నీ కార్పొరేట్ మొలొక్ దేవాలయాలే! ఐసిసియూ మంటల్లో కొందరు, కరోనా చేతుల్లో కొందరు, ఆక్సిజన్ చాలక ఎందరో గెహెన్నా నల్లబజారు లోయలోకి తరలిపోతున్నారు. సొలొమాన్ ప్రభువులు అధికార భూతం అస్మొడియస్‌తో పంతానికిపోయి ప్రజారక్షణ ఉంగరాన్ని పిశాచాల రాజుకిస్తే అతడు ప్రభువును

ఎలక్షన్ల ఎడారిలోకి విసిరేసాడు. కుంభమేళాల్లో తిరిగి తిరిగి, అతడు ఎర్రకోటలో అడుగుపెట్టాక అస్మోడియస్ భూతం ఆకాశంలోకి పారిపోతుందా? కరోనా జిన్ను వైరస పిశాచాలు ప్రజల్ని చుట్టుముడుతుంటే సొలొమాన్ ప్రభువులు రాజదండాలపై తలవాల్చి నిద్రపోతున్నారా? రాజదండాన్ని అవినీతి చెదలు తినివేస్తే ఆనక సంగతేమిటి?

సొలొమాన్ రాజనీతి, ఆర్థిక సరళి, ఆత్మ నిర్భరత్వం, మన్‌కీ బాత్, విమర్శక రాణుల ఒత్తిడికి లోనేవుతున్నదా? యెహోవా దేవాలయం ఎదుటనే కార్పొరేట్ మొలొక్ గుడి కడితే మొలొక్ చాచిన చేతుల క్రింద ప్రజ్వరిల్లే మంటలలో అమాయకులు కాలిపోవాల్సిందేనా?

ప్రభుత్వరంగ తల్లి, ప్రైవేటురంగ తల్లి కొట్లాడుకుంటున్నారు ఆ ఆర్థిక పుత్రుడు తన కొడుకంటే తన కొడుకని. సొలొమాన్ ప్రభువు శిశువును నరికి చెరో సగమిమ్మనగానే ప్రైవేటురంగ తల్లి విదేశాలకు తరలిపోయింది. ప్రభుత్వరంగ తల్లి ఆ బిడ్డని ఆమెకు ఇచ్చేయి కాని చంపవద్దని వేడుకున్నది...

ప్రస్తుత ప్రభువు సొలొమాన్‌కు అర్థమవుతుందా ఇది?...

★★★★★

# 11. ఈ పని ముందే చెయ్యాల్సింది!

"ఒక్కోసారి నీవు పావురానివి, ఒక్కోసారి విగ్రహానివన్న నిజాన్ని నీవు ఒప్పుకోవాలి!" – క్లాడె ఛాబ్రాల్.

విగ్రహాల్ని చూసినప్పుడల్లా దేవేందర్‌కు ఈ మాట గుర్తుకు వస్తుంది. అతడికి తెలుసు ప్రతి గండశిలలోనూ అంతర్లీనమై ఒక విగ్రహం ఉంటుందని, దానిని దర్శించిన శిల్పి తన సుత్తి, ఉలితో విగ్రహాన్నో, శిల్పాన్నో సృష్టిస్తాడని. మిన్నెసొటా కాలేజి ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్‌లో మాస్టర్స్ చేస్తున్నాడు. ఏనిమేషన్ స్కల్ప్చర్ అతడి స్పెషాలిటి. దేవేందర్, మంజుల ప్రేమలోపడి పెళ్లి చేసుకున్నారు. కులాంతర వివాహం. మంజుల అదే కాలేజీలో ఫిల్మ్ మేకింగ్‌లో మాస్టర్స్ చేస్తున్నది. ఇద్దరూ క్యాంపస్‌లో ఉంటున్నారు. ఆరోజున వాళ్లు మిన్నియాపొలిస్–చికాగొ ఎవెన్యూలో 'కప్ ఫుడ్స్' గ్రాసరీ స్టోర్స్‌లో షాపింగ్ చేస్తున్నారు.

బయట ఏదో గొడవ. బిల్లు పేచేసి షాపింగ్‌బ్యాగ్ తీసుకుని వస్తుంటే స్టోర్ ఎంప్లాయి అంటున్నాడు.

"అతడు ఇరవై డాలర్ల దొంగనోటిచ్చాడు సిగరెట్లు కొనుక్కొని. అదేమంటే నేను ఇచ్చింది మంచినోటే అని దబాయిస్తున్నాడు. తాగి ఉన్నాడు".

"కాల్ పోలీస్" అన్నాడు సహోద్యోగి.

దేవేందర్ సెల్‌ఫోన్ ఆన్ చేసాడు. మే 25, 2020 సోమవారం సమయం 8.08 P.M. పోలీస్‌కార్ వచ్చింది. ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు దిగారు. కప్ ఫుడ్స్ దగ్గర్నుంచి దొంగనోటిచ్చాడని ఆరోపణ చేయబడిన వాడి కారు దగ్గరకు వెళ్లి ఒక పోలీస్ ఆఫీసర్ ఫ్లాష్‌లైట్‌తో అద్దాన్ని ఠకీఠకీమని కొట్టాడు.

"నీ చేతులు చూపించు" అన్నాడు గట్టిగా. కారులో ఉన్న వ్యక్తి నెమ్మదిగాడోర్ తెచిచాడు.

"నీ చేతులు చూపించు" అన్నాడు మరల పోలీస్ ఆఫీసర్ రివాల్వర్ గురిపెడుతూ.

అతడు ఖాళీ చేతులు చూపించాక ఆఫీసర్ తన తుపాకిని హోల్‌స్టర్‌లో ఉంచి అతడిని కారు బయటకు లాగి చేతులకు హ్యాండ్‌కఫ్స్ వేసాడు.

"ఇంకేమన్నా ప్లానుందా?" అన్నాడు ఆఫీసర్.

"నో... నథింగ్!" అన్నాడతడు.

"వీడేదో తేడాగా ప్రవర్తిస్తున్నాడు" అన్నాడు రెండో పోలీస్‌ఆఫీసర్. "ఏమిటా నురగ నోటిదగ్గర?"

"కొంచెం 'హూపింగ్' చేసా! డ్రగ్స్" అన్నాడతడు భయభయంగా. "ఇప్పుడు ఓ.కె!"

"నిన్ను అరెస్టు చేస్తున్నాం. పద!" అని అతడిని పోలీస్ కారువేపు తీసుకెళ్లారు రోడ్ క్రాస్ చేస్తూ.కారు దగ్గర నేలపై పడిపోయాడతడు. లేపి కారు కానించి నిలబెట్టారు పోలీస్ ఆఫీసర్లు.

"నేను కోవిడ్-19 నుంచి రికవరవుతున్నాను... నాకు క్యాస్ట్రోఫొబియా ఉంది. నేను మీ కారులో కూర్చోలేను చచ్చేభయం!" అన్నాడతడు.

"ఎక్కు కారులోకి!" అన్నారు వాళ్లు.

"కావాలంటే నేలమీద పడుకుంటా! కారులోకి ఎక్కను" అన్నాడతడు వగరుస్తూ. "నాకు ఊపిరాడదు"

ఇంతలో ఇంకో పోలీస్ ఆఫీసర్ కారులో వచ్చి నేరస్తుడి కారు దగ్గర కాపలాగా నిలబడ్డాడు.

మూడో పోలీస్ కారులో మరో ఇద్దరు ఆఫీసర్లు వచ్చారు. "ఐ కాంట్ ఫకింగ్ బ్రీత్" అన్నాడతడు రెండుసార్లు.

"కారెక్కు" అన్నారు వచ్చిన ఆఫీసర్లు.

బలవంతాన పోలీస్ కార్ బ్యాక్‌సీట్లోకి ఎక్కించారు. అతడు వాళ్లతో కలబడుతూ కార్లోంచి బయట పేవ్‌మెంట్ మీద పడ్డాడు బొక్కాబోర్లా. ఒక ఆఫీసర్ అతడి మెడమీద మోకాలుతో నొక్కిపెట్టాడు.

"ఊపిరాడట్లేదు... ఐ కాంట్ బ్రీత్! ప్లీజ్, మామ్మా!" అంటూనే ఉన్నాడతడు.

"పక్కనే ఎవరో అంటున్నారు... "అతడికి గాలి ఆడనివ్వండి! లొంగిపోయాడు గదా!"

"ఇతడి నోటివెంట రక్తం వస్తున్నది. అంబులెన్స్‌కు ఫోన్ చెయ్యండి!" అన్నాడింకో పోలీస్ ఆఫీసర్.

"నేను చచ్చిపోతున్నా!" అంటున్నాడతడు.

"ఏం కావాలి నీకు" అన్నాడో ఆఫీసర్.

"ఊపిరాడడం లేదు... నీ మోకాలు తీసేయి, ఊపిరాడడం లేదు..." అన్నాడతడు దీనంగా.

ఎవరో అరిచారు– "కార్లోకి పో, మాన్!"

"నా వల్ల కాదు" అన్నాడతడు. పోలీసాఫీసర్ మోకాలింకా అతడి మెడపైనే ఉన్నది.

"అమ్మా, మామ్మా!" అరిచాడతడు. "నా పొట్ట నెప్పెడుతున్నది... మెడ నెప్పెడ్తున్నది... ఒళ్లంతా బాధగా ఉంది. నన్ను చంపవద్దు...!" వేడుకుంటున్నాడతడు.

ఎవరో అంటున్నారు అతడి ముక్కు నుంచి రక్తం వస్తున్నదని. దేవేందర్, మంజుల కాస్త దూరం నుంచి గమనిస్తూనే ఉన్నారు. వీడియో తీస్తున్నది మంజుల సెల్‌ఫోన్‌లో.

"అతడేమీ స్ట్రగుల్ చేయడం లేదుకదా! వదిలెయ్యండి" అన్నారెవరో.

"బాగానే ఉన్నాడుగా మాట్లాడుతూ!" అన్నాడో ఆఫీసర్.

"లేదు, లేదు... తీసుకువెళ్లి కారులో పడుకోబెట్టండి!"

"డ్రగ్ తీసుకుంటే ఇదే గతి!" అన్నాడో ఆఫీసర్.

"అతడు కదలడం లేదు" అరిచారెవరో... ఆఫీసర్లు ముందుకు కదిలి జనాల్ని చెదరగొట్టారు. ఒక ఆఫీసర్ అతడి పల్స్ చూసాడు.

అంబులెన్స్ వచ్చింది. టెక్నిషియన్ వచ్చి పల్స్ చూసాడు. ఆఫీసర్ మోకాలింకా అతడిమెడపైన నొక్కుతూనే ఉన్నది.

ఏడు నిముషాల నలభై ఆరు సెకండ్లు.

అతడిని స్ట్రెచర్ మీద అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అంబులెన్స్ హెన్నెపిన్ కౌంటీ మెడికల్ సెంటర్ వేపు వెళ్ళిపోయింది.

మంజుల గుండె దడదడలాడింది.

"ఇంత దారుణమా!" అన్నదామె గుసగుసగా దేవేందర్‌తో. ఇద్దరూ తమ కారులో క్యాంపస్‌కు వెళ్ళిపోయారు.

9.25 P.M.కు జార్జి ఫ్లాయిడ్ అనే వ్యక్తి మరణించాడని టి.వి.లో వార్త వచ్చింది.

మే 26వ తేదీన వందలాది మంది ప్రదర్శకులు 'జస్టిస్ ఫర్ జార్జి' 'ఐ కాంట్ బ్రీత్, బ్లాక్ లైవ్స్ మాటర్' అని వ్రాసి ఉన్న ప్లేకార్డులతో ఫ్లాయిడ్ చనిపోయిన చోట గుమిగూడారు.

కొద్ది రోజుల్లోనే అమెరికా అట్టుడికిపోయింది. అల్లర్లు చెలరేగాయి. అరవై దేశాలలో 'బ్లాక్‌లైవ్స్ మాటర్'ను సమర్ధిస్తూ ప్రదర్శనలు జరిగాయి. జూన్ 7న ఇంగ్లండ్‌లోని బ్రిస్టల్‌లో పదిహేడవ శతాబ్దపు బానిస వ్యాపారి ఎడ్వర్డ్ కొల్‌స్టన్ విగ్రహం వేపు ప్రదర్శకులు కదిలారు. 125 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠింపబడిన కంచువిగ్రహం అది. కవరు కప్పి ఉన్న విగ్రహంపై వాళ్లు కోడిగుడ్లు విసిరారు. తరువాత కవర్ తొలగించి విగ్రహానికి తాళ్లు కట్టి లాగి నేలమీద పడేసారు. వీధుల్లో లాక్కుంటూ తీసుకువెళ్లి బ్రిస్టల్ హార్బర్‌లో నీళ్లలో పడవేసారు. వాళ్ల నినాదాలలో, ప్లేకార్డులలో 'బ్లాక్‌లైవ్స్ మాటర్' 'సైలెన్స్ ఈజ్ వయొలెన్స్' అన్న వాక్యాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

దేవేందర్ అన్నాడు– "బానిసల వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదించా డతడు. ఆఫ్రికా మూలాలున్నవాళ్లు బానిసల వ్యాపారుల విగ్రహాలను చూస్తే మండిపడతారు. ఎన్నాళ్లుగానో ఉగ్గపెట్టుకున్న కోపం ఇలా బయట పడుతున్నది".

మంజుల అన్నది– "మనదేశంలో కులాలు మాసిపోయాయా? మనిద్దరం ఇక్కడ హాయిగా ఉన్నా మన పెద్దవాళ్లు పరువు నష్టమని పడి ఏడవడంలేదా?"

"అక్కడ కులాల గొడవ. ఇక్కడ వర్ణాల గొడవ. ఇంకోచోట మతాల గొడవ. మొత్తానికి గొడవలు తప్పవేమో!"

"ఇప్పుడు విగ్రహాలు, గుడులు, గోపురాలు కూల్చివేతలు మొదలయ్యాయి. అన్ని దేశాలల్లోనూ జనాలకు ఆవేశం వచ్చినపుడు విగ్రహాలపై కోపం చూపించే ఆనవాయితీ ఉన్నట్లున్నది".

"రష్యాలో 1917లో జార్ చక్రవర్తి మూడవ అలెగ్జాండర్ విగ్రహాన్ని కూల్చారు కమ్యూనిష్టులు. 1956లో హంగరీ-బుడాపెస్ట్‌లో స్టాలిన్ విగ్రహాన్ని నేలకూల్చారు అక్కడి ప్రజలు. 2014లో ఉక్రెయిన్‌లో లెనిన్ విగ్రహాన్ని పడగొట్టారు"

"ఇరాక్‌లో మ్యూజియంలోని విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఆఫ్ఘనిస్తాన్-బామియాన్‌లో బుద్ధుడి విగ్రహాన్ని కూల్చివేసారు కదా!"

"మన రాష్ట్ర విభజనలో ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలకు ముప్పు రాలేదా! దేశంలో అక్కడక్కడా కొందరు ఆవేశపరులు జాతీయ నాయకుల విగ్రహాలపై తమ కోపాన్ని చూపిస్తుంటారు. కొద్దిరోజులు అల్లర్లు జరుగుతాయి. అమాయకులు నష్టపోతుంటారు".

"మనం ఎలాగోలా ఇక్కడే ఉందాం, మంజులా! మన వాళ్లకింకా పరువు ప్రతిష్ఠలపై మమకారం పోలేదు కదా! మొన్న మా నాన్నను దారికాచి కొట్టారట ఎవరో!" అన్నాడు దేవేందర్.

"అవును దేవేందర్! వీళ్లు బతకరు, ఇంకొకరిని బతకనివ్వరు. ఈ భూకంపాలు, అడవులు తగలబడడాలు, సునామీలు, వైరస్ జ్వరాలు మనిషికేదో సందేశాన్ని పంపిస్తున్నాయనిపిస్తున్నది. మనమే అర్థం చేసుకోవడం లేదా దానిని?"

ఫ్లాయిడ్ చనిపోయిన రోజు వీడియోని మరల చూస్తుంటే వాళ్లకు కన్నీళ్లాగలేదు. ఆ తరువాత జరిగిన 'బ్లాక్ లైవ్స్ మాటర్' ఉద్యమం, విగ్రహాల ధ్వంసం, అల్లర్లు, ఇవన్నీ వాళ్ల మనసులను కలచివేసాయి. అలా మాట్లాడుకుంటూ నిద్రలోకి జారుకున్నారు వాళ్లు.

దేవేందర్‌కు మగతగా నిద్రపట్టింది. కలలో... తాను, మంజుల ఇండియాకు వెళ్లారు. అక్కడ ఊళ్లోకి వెళ్లగానే పెద్ద గొడవయ్యింది. మంజులను లాక్కెళ్లి వాళ్లింట్లోపెట్టి గదికి తాళం వేయబోతే ఆమె తప్పించుకుని తన దగ్గరకు వచ్చింది. ఇద్దరూ పారిపోతుంటే వాళ్లు కత్తులు, కర్రలతో వెంటబడ్డారు...

కొడుతున్నారు... తమవాళ్లు ఎదురుతిరిగారు. పెద్ద గొడవ. మంజుల గుడి మెట్లదగ్గర కూలబడిపోయింది. మంజుల వాళ్ల నాన్న తనను కిందపడవేసి మెడమీద మోకాలుతో నొక్కుతున్నాడు.

'ఐ కాంట్ బ్రీత్' అని వగరుస్తున్నాడు. తను. మంజుల వెనకనుంచి వచ్చి వాళ్ల నాన్నను తోసింది. దేవేందర్ లేచాడు. ఇద్దరూ పరిగెడ్తూనే ఉన్నారు. వాళ్లకంటే ముందుగా ఇంకెవరో 'ఐ కాంట్ బ్రీత్' అంటూ వేగంగా పరిగెత్తుతున్నారు. వాళ్ల దగ్గరికి వెళ్లి చూస్తే వాళ్లంతా ఒకప్పుడు ఊళ్లలో, చౌరస్తాలలో ప్రతిష్ఠించబడిన జాతీయ నాయకుల విగ్రహాలు. ఈ మనుషుల మధ్య మేముండలేం.... 'వుయ్ కాంట్ బ్రీత్' అంటూ పరిగెడ్తున్నాయా విగ్రహాలు.

వాళ్లకంటే ముందు వరుసలో... దేవుళ్లు, దేవతలు. వాళ్లు గుళ్లూ గోపురాలను విడిచి వెళ్లిపోతున్నారు. ఈ కులాల, మతాల, వర్గాల, వర్ణాల వైరాన్నిక చూడలేము. ఈ ఉన్మాదుల మధ్య మేముండలేం... 'వుయ్ కాంట్ బ్రీత్' అంటూ వాళ్లు అదృశ్యమైపోయారు. దేవేందర్‌కు దేవాలయాలలో, చౌరస్తాలలో గద్దెలన్నీ ఖాళీగా, బోసిగా కానవచ్చాయి.

"వాళ్లు ఈ పని ముందే చెయ్యాల్సింది. నౌ ఐ కాంట్ బ్రీత్" అంటూ దేవేందర్ కలవరిస్తుంటే మంజుల ఉలిక్కిపడి లేచింది. ఆమె తట్టిలేపేంత వరకూ అతడు, కలవరిస్తూనే ఉన్నాడు... "నాకు ఊపిరాడడం లేదు... నాకు ఊపిరాడడంలేదు...".

★★★★★

# 12. హాం ఫట్ కాయినూ! హ్రీం బిట్ కాయినూ!

"నాన్నా! నాన్నా! మనీ అంటే ఏమిటి" అని అడిగింది 'సిరి' తన తండ్రి సాగర కృష్ణమూర్తిని.

"మనీ అంటే డబ్బు అమ్మా! 'ధనం' మనిషిని నడిపించే ఇంధనం" అన్నాడతడు తనకు తెలిసిన ఒక కథను గుర్తుకు తెచ్చుకుంటూ. "మనకున్నది కుచేలరావు మామయ్యకు లేనిది అదే!"

"మనీ అనేది ఓ రకం కవిత్వం" అన్నాడు వాలెస్ స్టీవెన్స్. తన సన్నబడిన వాలెట్‌ను తడుముకుంటూ. "మనీ ఒక అత్యంత శక్తివంతమైన ఆయుధం. మనీ ఒక కుషన్. స్వేచ్ఛ, కొనుగోలు శక్తి, హింసకు, దొంగతనాలకు, హత్యలకు, యుద్ధాలకు కారణం. మనీ ఒక రక్షణా వ్యవస్థ. ఒక భద్రతా భావం. వీటన్నిటినీ మించి 'మనీ' ఒక వ్యసనం".

"అవన్నీ సరేగాని 'మనీ' అంటే ఏమిటి నాన్నా?" అని మరల అడిగింది 'సిరి' ముద్దుముద్దుగా.

"మనీ అంటే కాలం. మనీ అంటే విలువ. మనీ అంటే 'మనిషి' మొదటి రెండక్షరాలు. మనీ అంటే మనిషి ఆనందపు నైరూప్య చిత్రం. మనీ అంటే దైవరూపం. మనీ అంటే మనం గెలవలేని శత్రువు. మనీ అంటే దేవుడి ఆశీర్వాదం. మనీ అంటే మన ఉద్వేగాలను ఉత్తేజపరచే పరశువేది. మనీ మన పరువు ప్రతిష్ఠలను ప్రతిబింబించే అద్దం" అన్నాడు సాగర కృష్ణమూర్తి. సిరి కాసేపు మాట్లాడలేదు.

సాగర కృష్ణమూర్తి ఓ క్షణం ఆలోచించాడు– "అమ్మా నీవే 'మనీ'. నీవే దేవతవు. నీవే నా సిరిసంపదవు".

'సిరి' ముఖం విప్పారింది. నీలి సముద్రపు తరంగాలపై వెండిలా మెరుస్తున్న నురగల మధ్య ముత్యపు చిప్ప నుంచి వెలువడిన వీనస్–ఎఫ్రొదితి దేవతలా, పాలసముద్ర మథన సమయాన ఆవిర్భవించిన లక్ష్మీదేవిలా ముత్యాలు చిరునవ్వులు చిందిస్తూ తానే పులికడిగిన ముత్యంలా ప్రకాశించింది. మనీ అంటే వెన్నెల కన్న చల్లనైనది. ఆగ్రహం వస్తే శతకోటి సూర్యప్రభానల దీప్తులను, ఉష్ణాన్ని మించగలిగినది.

దూరంగా కొండపైన గుడిగంటలు మ్రోగాయి. మనీ–ధన దేవత గుడి ముందర భక్తులు బారులు తీరి ఉన్నారు. రోమ్ నగరంలోని ఏడుకొండల్లో ఒక కొండ పేరు కాపిటిలియమ్. గుడిలో దేవత పేరు 'జునొ మొనెటా'. మొనెటా అంటే నాణెం, మనీ అని అర్థం. జునొ అంటే ఎవరితోనూ సరిపోల్చలేనిది; జునో దేవత యవ్వనానికి, జ్ఞానానికి, ప్రేమ, పెళ్ళిళ్లకు అధిదేవత.

"హిందూ దేశంలో ధనధాన్య సంపదలకు అధిదేవత పెన్నిధి కుమార్తె లక్ష్మీదేవి. అష్టలక్ష్ములు ఈమె ప్రతిరూపాలు (ఆది, ధన, ధాన్య, గజ, సంతాన, ధైర్య, జయ, విద్యా లక్ష్ములు). ఆ సంపదలకు సంరక్షకుడు కుబేరుడు. కుబేరుడు నరవాహనుడు. అతడిదే లంకారాజ్యం. కుబేరుడు లంకను తన సవతి సోదరుడైన రావణుడికి ఓడిపోయి సమర్పించుకున్నాడు. కుబేరుడికి ప్రస్తుతం అనేక రూపాలు. ఒకప్పుడు గవ్వలు, ధాన్యపు గింజలు (గ్రెయిన్, షెకిల్), ఎముకలు, టాలీస్టిక్స్, కంచు లోహపు బిళ్లలు, రాగి దిమ్మలు, పళ్లేలు, నాణేలు, కాగితాలు, నోట్లు, డిజిటల్ మనీ ఇత్యాదివి ఉండేవి.

కుబేరుడి ఒక చేతిలో పెద్ద దుడ్డుకర్ర, రెండోచేతిలో రూపాయలు, దీనారాలు, క్రొయిసిడ్లు, బెజాంట్లు, ఆరియన్లు, సిగ్లాలు, కర్షపణాలు, పణాలు, బంగారు, వెండి, ఎలక్ట్రమ్ నాణేలున్న చేతిసంచి పట్టుకుని మనిషి మీద ఊరేగుతుంటాడు పెద్ద బానపొట్టతో. అతడికి తోడు 'ముంగిస' నిధులకు కాపలా ఉండే పాముల్ని ఎదుర్కోవడానికి" అన్నాడు ధనంజయరావు తనకున్న ఆర్థికజ్ఞానాన్ని కుచేలుడికి చెబుతూ.

"అయితే ఇప్పుడు కుబేరుడు బిట్‌కాయిన్లు కూడా మోస్తున్నాడంటావా?" అడిగాడు కుచేలుడు కించిత్ సందేహంతో...

"మంచిప్రశ్న! ఇప్పుడు ప్రపంచంలో కొత్త జలక్– ఈ క్రిప్టో కరెన్సీ! అంతా డిజిటల్ వ్యవహారం. నీకు తెలుసా అయిదు ఏప్రిల్ 2021 నాటికి ఈ క్రిప్టోకరెన్సీ విలువ రెండు ట్రిలియన్ డాలర్లు. బిట్‌కాయిన్, ఎథిరియమ్, రిపుల్, లైట్ కాయిన్ – ఇలాంటివి ఎలక్ట్రానిక్ మనీ రూపాలు" వివరించాడు ధనంజయుడు.

"నా మిత్రుడు సాగర కృష్ణమూర్తి పెద్ద బ్యాంకర్. ఆయన భార్య ఇందిర. వాళ్లింటికి వెళ్లి నా గోడు, దరిద్రం గురించి చెప్పుకుంటాను. ఏమన్నా లోనిస్తే పిల్లల పెళ్లి చేస్తాను" అనుకున్నాడు కుచేలుడు. పైకి అన్నాడు– "వీటిని నమ్మవచ్చా?".

వీళ్ల మాటలను వింటున్న సహోద్యోగి ఆశాలత అన్నది– "అన్నా! నీవు భయపడాల్సిందేమీ లేదు. నీకు తెలుసా ఇప్పుడు ఒక్క బిట్‌కాయిను విలువ నలభై లక్షల రూపాయలు. పెద్దపెద్ద నటులు, ఇండస్ట్రియలిస్టులు దీంట్లో పెట్టుబడి పెట్టి మిలియనీర్లయ్యారు".

కుచేలుడికి, వాళ్ల బ్యాంకులో పనిచేసే చిరుద్యోగులకు ఆశ పుట్టింది. బ్యాంకు లొసుగులు తెలుసు కనుక 'కీడెంచి మేలెంచాలని' ఓ కిట్టీపార్టీలో 'ఆశాలత'తో ఇంటర్వ్యూ చేసారు– "మన బ్యాంకుల్లోనే మోసాలు జరుగుతున్నాయి కదా! ఎలక్ట్రానిక్ మనీతో సమస్యలు రావా?" అని నిలదీసింది రూత్.

"ఈ నెల మీటింగ్‌కు వచ్చేప్పుడు అందరూ ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయండి! సందేహాలుంటే చర్చిద్దాం" అనుకున్నారు సభ్యులందరూ. మొత్తం ముప్పైమంది. ప్రతినెలా అయిదువేల చిట్టీ కట్టుకుని అవసరాల నిమిత్తం వాడుకుంటారు. ఎక్కువమంది శ్రీలక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నవాళ్లే.

"లక్ష్మిదేవి వాహనం గుడ్లగూబ. అందుకే ఆమెను 'ఉలూకవాహిని' అంటారు. గ్రీకు ప్రజలకు గుడ్లగూబ అదృష్టానికి, జ్ఞానానికి గుర్తు. మంచిచెడుల తారతమ్యం తెలిసిన పక్షి. జ్యూస్ దేవాధిదేవుడి శిరస్సులోంచి పుట్టిన కుమార్తె ఎథెనా. ఎథెనా జ్ఞానానికి, యుద్ధానికి అధిదేవత" అన్నాడు ధనంజయరావు.

"ఈ బిట్‌కాయిన్స్ కొనడం ఎలా?" అడిగాడు కుచేలుడు.

కృష్ణమూర్తి, ఇందిరలు అతడి పిల్లల పెళ్లికోసమని ప్రాధేయపడితే అయిదు లక్షలు అప్పిచ్చారు. తాత్కాలిక ధైర్యం అతగాడిది.

ఆశాలత అన్నది– “2008లో సతోషి నకమోటో మొదలుపెట్టాడు ఈ బిట్‌కాయిన్ వ్యవహారం. 2011లో 22 రూపాయలున్నది 2021 ఫిబ్రవరికల్లా ముప్పై లక్షలు, ఏప్రిల్ చివరకు నలభై లక్షలయ్యింది. మనందరం కలిసి రెండు, మూడు బిట్‌కాయిన్లు కొంటే ఏడాదికల్లా ఒక్కో కాయిన్ విలువ అరవై లక్షలవుతుంది. ఆలోచించండి!”

అందరూ ఆలోచనలో పడ్డారు. ముప్పై మంది సభ్యులు తలకో నాలుగు లక్షలు పెట్టుబడి పెడితే కోటి ఇరవై లక్షలు. మూడు బిట్‌కాయిన్లు వస్తాయి. ఏడాది చివరకల్లా అరవై లక్షలు లాభం. అంటే ఒక్కొక్కరికి రెండు లక్షలు. అందరి కళ్లలో బిట్‌కాయిన్లు బంగారు నాణేల్లా తిరగడం మొదలెట్టాయి.

అయిదుగురు కలిసి కమిటీ ఏర్పడ్డారు. వాళ్లకు ఆశాలత, ఆమె భర్త మురుగన్ సలహాదారులు. ఏది చేసినా ముప్పైమంది సభ్యులు, కమిటి మెంబర్లు ఉండాల్సిందే. అలా నిర్ణయాలు చేసుకుని సభ్యుల్లో ఇద్దరు కంప్యూటర్ స్పెషలిస్టులను ట్రాన్సాక్షన్లను చేయడానికి నామినేట్ చేసారు. కమిటీ మెంబర్ల పేరుతో జాయింట్ ఎకౌంట్ ఓపెన్ చేసి మెంబర్లలోని లాయర్ల సలహాలతో అందరూ నోటరీ చేసిన పత్రాలలో సంతకాలు చేసారు లాభనష్టాలు సమానంగా భరించాలని. ఒకరినొకరు నిందించుకోకూడదని ప్రమాణాలు చేసుకున్నారు. సంవత్సరం మధ్యలో వెళ్లిపోతే పదిశాతం పెనాల్టీ.

వారానికోసారి అందరూ సమావేశమై ఎంత కొనాలి, ఎంత అమ్మాలి నిర్ణయం చేసుకోవాలి అనుకుని ఓ కంప్యూటర్‌ను దానికోసం ప్రత్యేకించారు. పాస్‌వర్డ్‌ను అందరికీ ఇచ్చారు. సభ్యులు బిట్‌కాయిన్ పాస్‌వర్డ్‌ను డైరీలలో, సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో దాచుకున్నారు. మొదటివారం ఒక కాయిన్ కొన్నారు నలభై లక్షలు పెట్టి. వాళ్లు చూస్తూ ఉండగానే నిముషాల్లో బిట్‌కాయిన్ విలువ నలభైరెండు లక్షలయ్యింది. అయిదు నిముషాల్లో రెండు లక్షల లాభం. సాయంకాలానికి మళ్లా నలభైఒక లక్షకు వచ్చింది. అయినా ఒక లక్ష లాభమే కదా!

రెండవ వారం నలభై లక్షల విలువ దగ్గర మరో రెండు బిట్‌కాయిన్లు కొన్నారు. ఆ వారం నలభై రెండు లక్షలైంది. మూడోవారంలో నలభై నాలుగు లక్షలకు పెరిగింది. ఒక్క నెలలో పన్నెండు లక్షల లాభం. పడిలేస్తూ ఆర్నెల్లయ్యేసరికి

పదిహేను లక్షల లాభం కనిపించింది. ప్రతిరోజూ గుండెదడ తట్టుకోలేని కుచేలుడన్నాడు– “అమ్మేసి మన డబ్బులు మనం తీసుకుని లాభంతో మరల బిజినెస్ చేద్దాం. నెలకు చిట్టీ పెట్టే డబ్బుల్తో బిట్లు బిట్లుగా కొందాం బిట్‌కాయిన్” అన్నాడతడు. “నాకైతే భయ భయంగా ఉంది రేటు పడిపోయినప్పుడల్లా”.

కొందరతడిని బలపరిచారు. కొందరు వ్యతిరేకించారు. వాగ్యుద్ధాలలో కుచేలుడిలా డబ్బు అవసరమున్న పిరికివాళ్లు పదిమంది వెనక్కితగ్గారు. వాళ్ల షేర్లు ఎవరు కొంటారన్నది ప్రశ్నార్థకం. పదిమంది షేర్‌లు అమ్మేసి లాభాలు పంచుకున్నారు ఒప్పందం ప్రకారం.

మరుసటి నెలలో బిట్‌కాయిన్ విలువ నలభై లక్షలకు పడిపోయినప్పుడు మురుగన్–ఆశాలత దంపతులు బ్యాంకులో, బయట నలభై లక్షల లోను తీసుకుని ఒక కాయిన్ కొన్నారు. ఇంకో రెండు మూడు నెలలయ్యేసరికి పడుతూ లేస్తూ బిట్‌కాయిన్ విలువ యాభై లక్షలయ్యింది. కుచేలుడి గ్రూపు దుఃఖపడుతుంటే ఆశాలత గ్రూపు ఆనందంతో పార్టీలు చేసుకున్నారు.

జూదం, కోడిపందేలు, గుర్రప్పందేలు, క్రికెట్ బెట్టింగ్‌లూ పెద్ద వ్యసనాలు. నలుడూ, ధర్మరాజూ ఏమీ నేర్చుకోరు గత అనుభవాల నుంచి. ఆ ఉన్మత్తత, ఉద్రేకంలో రాజ్యాన్ని, సంపదలను, అన్నదమ్ముల్ని, చివరకు భార్యను కూడా తాకట్టు పెడ్తారు.

ఆశాలత–మురుగన్‌లలో ఆశ పుట్టింది. ఇప్పుడు అశ్వరహస్యం, ద్యూత రహస్యం తెలుసుకున్నాక ‘మీలో కోటీశ్వరుడెవరంటే’ ఆశాలత మురుగనే అవ్వాలి అనుకున్నారు కాని, అతిగా ఆశపడే వ్యక్తిని, అతిగా వడ్డీ ఇస్తాననే బ్యాంకును నమ్మకూడదన్న ప్రాథమిక విషయాన్ని వాళ్లు మరచిపోయారు. గ్రూపు నుంచి విడిపోతామని వాళ్లనేసరికి మిగతా సభ్యులు ‘దంచినమ్మకు బుక్కిందే దక్కిందనుకుని’ ఎవరి డబ్బులు వాళ్లు తీసేసుకున్నారు. ఎకౌంట్ క్లోజ్ చేసేసారు కమిటీ అనుమతితో ఆనక.

కర్నూలు జిల్లా జొన్నగిరి అనంతపురం–వజ్రకరూర్ ప్రాంతాలలో వానలు పడగానే జనం రంగురాళ్లకై వెదికినట్లు, ఎవరికో ఒకరికి వజ్రం దొరుకుతుంది. ఆ వార్త దావానంలా వ్యాపించి తండోపతండాలుగా ప్రజలు తుగ్గాలి, మడికెర,

పగిడిరాయి, పెరవలి, మహానంది, మహాదేవపురం ప్రాంతాలలో కాళ్లకు బలపాలు, కళ్లకు లాంతర్లు కట్టుకుని అదృష్టాన్ని పరీక్ష చేసుకున్నట్లు ఆశాలత–మురుగన్‌లు తమ అదృష్టాన్ని వెదుక్కుంటున్నారు. ఇప్పటివరకూ సేఫ్‌జోన్‌లో ఉన్నారు. అప్పులు తీర్చేసారు ఏడాదయ్యేసరికి. బిట్‌కాయిన్ ప్రభంజనం సాగుతూనే ఉన్నది. పది నిముషాలకో బిట్‌కాయిన్ మైనింగ్ చేయబడుతున్నా డిమాండ్ పెరుగుతూనే ఉన్నది.

ఒక్క వజ్రముంటే సరిపోతుందా – నవరత్నాలు కావాలి కదా! (మాణిక్యం, ముత్యం, పగడం, మరకతం, పుష్పరాగం, నీలం, గోమేధికం, వైడూర్యం, వజ్రం)... ఇవన్నీ ఉంటే నవగ్రహాలు మనల్ని కాపాడుతాయనుకున్నారు ఆశాలత–మురుగన్‌లు. బిట్‌కాయిన్, ఎథిరియమ్, రిపుల్, కార్డనో, స్టెల్లార్, లైట్‌కాయిన్, ఇవాస్, డొగెకాయిన్, బిట్‌కాయిన్ క్యాష్‌లలో పెట్టుబడి పెట్టారు అప్పోసప్పో చేసి ఎకౌంట్లు ఎక్కువయ్యేసరికి పాస్‌వర్డ్‌లు భద్రపరచడం సమస్య అయ్యింది. పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్, డైరీలలో వ్రాసిపెట్టి బ్యాంకు లాకర్‌లలో దాచారు విడివిడిగా. ఇద్దరూ కలిసి వెళ్తేనే లాకర్ ఓపెన్ చెయ్యాలి. ఎంత భార్యాభర్తలైనా వ్యాపారం వ్యాపారమే కదా అనుకున్నారు. బిట్‌కాయిన్, ఎథెరియమ్‌లో ముప్పై, ముప్పై లక్షలు ఇంకో ఇరవై లక్షలు మిగతా వాటిలో పెట్టారు. తొమ్మిది రకాల పాస్‌వర్డ్‌లు. వీటికి తోడు బ్యాంక్ లాకర్ల నెంబర్లు. జీవితం అంకెలమయమయ్యింది. పడుకున్నా లేచినా కళ్లల్లో అంకెలు, పాస్‌వర్డ్ అక్షరాలు గజిబిజిగా. ముప్పై లక్షల అప్పు పెద్ద లెక్కలోకి రాదు. ఇంకో ఆర్నెల్లలో అప్పులు తీరిపోతాయి. కోటీశ్వరులమైపోవచ్చు.

కరోనా మూడోవేవ్ మొదలయ్యింది. ఈసారి వ్యాపిస్తున్న వేరియంట్ సోకినవాళ్లకు ఫిట్స్ వస్తున్నాయి. కోమాలోకి పోతున్నారు త్వరగా. మరలా హాస్పిటల్స్, స్మశానాలు బిజీ అయిపోయాయి. చావు బాజాలు, మరణమృదంగాలు తాహతును బట్టి మోగుతున్నాయి.

క్రిప్టోకరెన్సికున్న సమస్యల్లా ఎలక్ట్రిసిటీ వినియోగం. ప్రతి ట్రాన్సాక్షనూ రికార్డ్ చేయడం, బ్లాక్ ఛెయిన్ వాలిడిటీ, కంప్యూటర్ నోడ్స్ వాడకం, టైమ్ స్టాంపింగ్, ట్రాన్సాక్షన్ వాలిడేషన్ 'మైనింగ్' వల్ల ఎలక్ట్రిసిటీ ఖర్చు విపరీతంగా ఉంటుంది. బిట్‌కాయిన్ యూజర్స్ దాదాపు అరవై లక్షలమంది. మెయిన్ కంప్యూటర్‌లు ఎంత శక్తివంతమైనవంటే అవి సక్రమంగా పనిచేయడానికి

అపారమైన విద్యుత్తు చౌకగా కావాలి. క్రిప్టొకరెన్సి కంప్యూటర్ వ్యవస్థలు విద్యుత్తు నిరంతరాయంగా, చీప్‌గా దొరికే చైనా, ఆస్ట్రియా, ఐస్‌ల్యాండ్, టిబెట్, నార్డిక్ దేశాలలో ఉన్నాయి. పొరపాటున ఆ సప్లైలో సమస్య వస్తే...

అనుకున్నట్లే కంప్యూటర్లు క్రాష్ అయ్యాయి. దానికితోడు హాకర్లు విరుచుకుపడ్డారు. ఒక్కసారిగా 70 వేల డాలర్లున్న బిట్‌కాయిన్ విలువ సగానికి సగం పడిపోయింది. కొన్ని వేల బిట్‌కాయిన్, ఎథిరియమ్ వ్యాలెట్లు దొంగతనానికి గురయ్యాయి. సెల్‌ఫోన్లలో క్షణక్షణం పడిపోతున్న బిట్‌కాయిన్ వాల్యూలు చూస్తూ గజగజ వణికిపోయారు ఆశాలత–మురుగన్‌లు. ఒకరికి తెలియకుండా ఒకరు లక్షలు అప్పుచేసి వ్యక్తిగత వ్యాపారం చేస్తున్నారు... కారు నడుపుతూన్న మురుగన్ పక్కనే ఉన్న ఆశాలత కళ్లలోకి చూసాడు. ఇద్దరి కళ్లలోనూ కొట్టవస్తున్నట్లున్న భయం. ముఖం నిండా చెమటలు. కారు పార్క్‌చేసి గబగబా అపార్ట్‌మెంట్‌లోకి వచ్చి తమ ఎకౌంట్స్ చెక్ చేసుకోసాగారు దూరదూరంగా కూర్చుని.

కంప్యూటర్ వ్యవస్థ తేరుకునేసరికి బిట్‌కాయిన్, ఎథెరియమ్ వాల్యూలు ఇంకా పడిపోయాయి. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు వాళ్లకు. తాము చేసిన అప్పుల గురించి ఒకరికొకరు చెప్పుకోడానికి 'ఇగో' అడ్డం వస్తున్నది. తెల్లారేసరికి ఆశాలతకు ఒళ్లు సలపరంగా, జ్వరంగా ఉన్నదనిపించింది. పారసిటమాల్ వేసుకున్నాక చెమటలు పోసి ఒళ్లు చల్లబడినట్లయ్యింది. రెండోరోజు 102 డిగ్రీల జ్వరం. పరాకుగా మాట్లాడ్తుంటే ఆశాలతను హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు మురుగన్. కోవిడ్ పాజిటివ్ వచ్చింది. హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేసారు. తనకేదో చెప్పాలని ప్రయత్నిస్తూ మాటరాక అవస్థ పడింది ఆశాలత. నాలుగవ రోజున కోమాలోకి వెళ్లిపోయిందామె. ఫిట్స్ రావడం, చేతికి పెట్టిన సెలైన్ ట్యూబుల్ని, ఇసిజి వైర్లను పీకివేస్తూ దయ్యంపట్టినట్లు మాట్లాడ్తుంటే మంచానికి కట్టేసారామెను ఐసొలేషన్‌వార్డు వైద్యసిబ్బంది.

దేవుడు ప్రకృతి దెయ్యం వికృతి. లక్ష్మి చంచలమైనది. 'సిరి దావచ్చిన వచ్చును సలలితముగ నారికేళ సలిలముభంగిన్, సిరి తా పోయిన పోవును కరి మింగిన వెలగపండు కరణిన్ సుమతీ' అన్నారు పెద్దలు.

రాత్రి తొమ్మిదయ్యింది. అర్జంటుగా రమ్మని ఫోను హాస్పిటల్ నుంచి. గాభరాపడుతూ మురుగన్ హాస్పిటల్ మెట్లెక్కుతుంటే ఎక్కడో గుడ్లగూబ అరుస్తూ ఎగిరిపోతున్న సవ్వడి. గుండె దడదడలాడింది. ఉలూకవాహిని వెళ్లిపోతోందా?...

"క్రిటికల్‌గా ఉంది ఆమె పరిస్థితి. సి.టి. స్కాన్ చేసాం. మెదడులో అక్కడక్కడా రక్తం గడ్డకట్టింది" అన్నాడు డాక్టర్.

మురుగన్ చూస్తుండగానే ఆమెకు పిట్స్ వచ్చింది. ఏదో చెప్పాలనుకున్నట్లు ఆమె కళ్లు తనవేపు తిరిగాయా? అనుకున్నాడు మురుగన్. వెంటిలేటర్ అమర్చిన కొన్నిగంటల తరువాత ఆమె ఊపిరి అనంత ఐసియు వాయువుల్లో కలిసిపోయింది. పదిలక్షల బిల్లు కట్టాక ప్రాణంలేని కట్టెను ఇచ్చారు తెల్లగుడ్డలో చుట్టి. హాస్పిటల్ నుంచి సరాసరి స్మశానానికి. ఎవరో కొద్దిమంది బంధుమిత్రులు వచ్చారు బిక్కుబిక్కుమంటూ. ఇన్నేళ్లు సంపాదించిన డబ్బుకన్నా వేగంగా ఆమె శరీరం పంచభూతాల్లో కలిసిపోయింది. మిగిలినవల్లా కాస్తంత బూడిద, అస్థికలూ... పాస్‌వర్డ్స్‌లా.

మొన్నటివరకు పిల్లలు లేరని బెంగ. ఇప్పుడు ఇల్లాలు లేదు. ఇల్లంతా బోసిపోయినట్లనిపిస్తున్నది. ఎపార్ట్‌మెంట్లలోని వాళ్లు, మిత్రులు, కిట్టీపార్టీ మెంబర్లు ఒక్కొక్కరేవచ్చి పలకరించి పరామర్శించి పోతున్నారు. దశదినకర్మ ముగిసాక అప్పులు ఇచ్చినవాళ్ల ఒత్తిడి మొదలయ్యింది. దాదాపు నలభై లక్షలు అప్పుచేసింది ఆశాలత. ఆమె బీరువా వెదుకుతుంటే డైరీ కనిపించింది. దాంట్లో క్రిప్టోకరెన్సి పాస్‌వర్డులు, బ్యాంక్, లాకర్ల నెంబర్లు వివరంగా వ్రాసి ఉన్నాయి. ఇవన్నీ తనకు తెలిసినవే! మరి ఆ నలభై లక్షలు దేంట్లో పెట్టుబడి పెట్టింది?

మురుగన్ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. మొత్తం ఇద్దరిదీ కలిపి అరవై లక్షల రూపాయల అప్పు. తమ తాహతుకు మించిందే. గుండె దడదడ లాడుతుండగా ధైర్యం కోసమని పూజాగదిలోని దేవుళ్ల పటాల వేపు చూసాడు. గండం గట్టెక్కించమని మొక్కుకున్నాడు. అప్పుడు కనిపించింది హారతిపళ్లేలు, పూజాసామాగ్రి పెట్టుకునే అరలో 'ఐఫోన్' తానెప్పుడూ చూడనిది. చార్జర్ చేయడానికి పెట్టి తన ఫోన్ నోటిఫికేషన్‌ల వేపు చూసాడు. క్రిప్టోకరెన్సీ మార్కెట్ కోలుకున్నది. నిముష నిముషానికీ వాల్యూ పెరుగుతూపోతున్నది. కొన్ని బ్యాంకులు,

స్టాక్ఎక్స్ఛేంజిలు, దేశాలు క్రిప్టోకరెన్సీని అంగీకరించడంతో, మైనింగ్ సప్లై లిమిట్ 21 మిలియన్ల బిట్కాయిన్లకు దగ్గర పడడంతో డిమాండ్ విపరీతంగా పెరిగి బిట్కాయిన్ ఒక్కటి కోటిరూపాయల విలువకు చేరుకుంది.

ఆశాలత డైరీని ఓపెన్ చేసి చూస్తుంటే మార్కెట్ క్రాష్ కాకమునుపు ఆమె ఎవరెవరిదగ్గర ఎంత అప్పు చేసిందీ, ఎంత వడ్డీ కట్టాలి వివరంగా వ్రాసి ఉన్నాయి. తనకు తెలీకుండా రెండు బిట్కాయిన్లు కొనగలిగింది ఆశాలత. అప్పులు నలభై లక్షలరూపాయలు. రెండు బిట్కాయిన్ల విలువ రెండు కోట్లు. మరి 'యూనిక్ యూజర్ పాస్వర్డ్' ఎక్కడ దాచిపెట్టింది? డైరీలో అక్షరక్షరం వెదికాడు. ఆమె కంప్యూటర్, సెల్ఫోనులోని ఫోల్డర్లలో వెదికాడు. ఒక ఫోల్డర్పై 'జునో మొనెటా' అని వ్రాసి ఉంది. దాని లోపల – "ఐఫోన్ – లక్ష్మిఫోల్డర్లో బిట్కాయిన్ పాస్వర్డ్ ఉన్నది" అని వ్రాసి ఉంది. ఐఫోన్ పాస్వర్డ్– మురుగన్ 369.

పోయిన ప్రాణం లేచివచ్చినట్లై పరిగెత్తుకుంటూ వెళ్లి ఐఫోన్ ఆన్ చేసాడు. పాస్వర్డ్ దగ్గర మురుగన్ 369 టైప్ చేయగానే ఐఫోన్ ఓపెన్ అయ్యింది. గుండె దడదడలాడుతున్న శబ్దం అతడికి వినిపిస్తుండగానే 'సిరి' వాయిస్ వినబడింది "ఫింగర్ ప్రింట్ అండ్ వాయిస్ ప్లీజ్" అతడు అట్లాగే చూస్తుండిపోయాడు... చితిమంటల్లో తగలబడిపోతున్న ఆమె శరీరం... దానితోపాటు కాలిపోయిన వేలిముద్రలూ... ఆమె గొంతూ... దానితోపాటు పాస్వర్డ్లూ, రెండుకోట్ల రూపాయలూ... ఎగిరిపోతున్న గుడ్లగూబ రెక్కల చప్పుడూ...

★★★★★

# 13. అనియంత్రిత భావ ముట్టడి అను ఓ.సి.డి.

"జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ!
తస్మాద పరిహార్యే ర్థే న త్వం శోచితు మర్హసి !!"

మైకులో వస్తున్న శ్లోకం వినగానే ఆమె గుండె జల్లుమన్నది. ఒళ్లంతా చెమటలు పోసాయి. ఏదో దిగులు ఇంతింతై పెరిగి పెరిగి ఆమెను భయకంపితు రాలిని చేసింది. గజగజ వణుకుతూ ఆమె ఓ మూలన కూర్చుంది శూన్యంలోకి చూస్తూ...

"పుట్టినవాడికి మరణం తప్పదు, మరణించిన వాడికి మరల పుట్టుక తప్పదు. ఈ అనివార్యమైన దానికి నీవు శోకించవద్దు" ఎవరిదో చావు ఊరేగింపు. టపాకాయలు, చావు బాజాలు, భగవద్గీత శ్లోకాలు, బంధుమిత్రుల శోకాలు...

"తప్పదా... చావు తప్పదా! ఎందుకు చనిపోవాలి ఎవరైనా? ఎవరు చంపుతున్నారెవరిని?" మానస ఆలోచిస్తున్నది.

"మానసా! రా అమ్మా! జ్యోతి నీ క్లోజ్‌ఫ్రెండ్ కదా! ఆమెను పలకరిద్దాం! పద!" అన్నది మానసవాళ్ల అమ్మ.

జ్యోతి భర్తకు కరోనా సోకింది. వారం రోజులు ఐసిసియూలో ఉన్నా ఫలితం దక్కలేదు. హాస్పిటల్ నుంచి అటే స్మశానానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు కానిచ్చారు. పదిహేను రోజులుగా ఐసొలేషన్‌లోనే ఉన్నారు వాళ్ల కుటుంబ సభ్యులు.

బలవంతం మీద మానస కదిలింది అయిష్టంగానే. వాళ్లింటికి వెళ్లగానే మానసను కావలించుకుని పెద్దగా ఏడ్చింది జ్యోతి. ఎదురుగా జ్యోతి భర్త ప్రభాకర్

ఫోటో! రూపుకట్టిన ఉషారుగా ఉండే ప్రభాకర్ ఇవ్వాళ చలనంలేని ఫోటోగా మారిపోయాడు.

జ్యోతిని ఓదార్చి ఇంటికి వస్తుంటే మానసకు కాలేజి రోజులు గుర్తుకువచ్చాయి. ప్రభాకర్ అంటే తనకూ ఇష్టమే! తను ఇంట్రావర్టెడ్ కనక బయటపడలేదు. జ్యోతికి తనకన్నా డబ్బూ, అందం ఉన్నాయి కనుక ఎగరేసుకుపోయింది. జ్యోతిని కాకుండా తనని పెళ్లి చేసుకుంటే బతికేవాడేమో ప్రభాకర్!

"ఛీఛీ! ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను?" చిరాకుపడింది మానస. జ్యోతి తనను కావలించుకుంది కదా... తనకు కరోనా అంటుకుందేమో! నాలుగయిదు సార్లు శానిటైజర్‌తో చేతులు కడుక్కుంది. మనసు శాంతించలేదు. మూడుసార్లు తలారా స్నానం చేసింది. పళ్ల బిగువున తనగదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నది.

రాత్రి ఎనిమిది గంటలకు బాలాదిత్య టూర్ నుంచి వచ్చాడు. పదిహేను రోజులైంది అతడు బయట పనిమీద వెళ్లి. దిగాలుగా ఉన్న మానసను ఓదార్చి, గిఫ్టులు ఇచ్చి సంతోషపెట్టే ప్రయత్నం చేసాడు... భోజనాలయ్యాక గదిలో పడుకున్నారు. అతడికి శరీరాన్నప్పగించి నిద్రలోకి జారుకుందామె. నిద్రలో కల... కలలో ప్రభాకర్ కాదు కాదు బాలాదిత్య... ముఖం అస్పష్టంగా ఉంది. 'దిల్ అపనా, అవుర్ ప్రీత్ పరాయీ?'... తన పని కాగానే ముఖంపై చిన్న ముద్దుపెట్టి ప్రభాకర్ కాదు కాదు బాలాదిత్య పక్కనే తిరిగి పడుకున్నాడు.

మానసలో గిల్టీ ఫీలింగ్... అపరాధ భావన. ఏమిటి తను ఇవ్వాళ ఇలా ఆలోచిస్తున్నది. 'తప్పు కడిగేసు కోవాలి!' నెమ్మదిగా లేచి బాత్‌రూంలోకి వెళ్లింది. తలుపు గట్టిగా వేసుకున్నానో లేదోనని మూడు నాలుగుసార్లు చెక్ చేసుకున్నది. తెల్లటి లక్స్ సబ్బు... సెమన్ – ఇంద్రియద్రవంలా! కడిగినచోటే కడగడం మొదలెట్టింది. కడగడం, నీళ్లు పోయడం... సబ్బు దాదాపు అరిగిపోయింది. లోపల ఒకటే మంట. బాధతో కళ్లనీళ్లు తిరిగాయి. మరొక్కసారి చన్నీళ్లతో కడుక్కుని దాదాపు గంట తరువాత మంచం మీదకు వచ్చి పడుకుంది.

"ఏమైంది మానసా!" అడిగాడు బాలాదిత్య సగం నిద్రలో.

"ఏం లేదు! ఏం లేదు" అన్నది మానస.

✣ ✣ ✣ ✣ ✣

"ఏదో అపరాధ భావన! ఏం చెయ్యాలి?" తనలోనే తాను కృంగిపోతున్నది.

"బాబూ! మానసను డాక్టర్‌కు చూపిద్దాం!" అన్నది మానస వాళ్ల అమ్మ లోగొంతుతో! "చేసిన పనే చేస్తున్నది. బాత్‌రూంకి వెళ్తే ఒక పట్టాన రాదు. బయటకు వెళ్లేప్పుడు తలుపు తాళంవేసి వేసానా లేదా అనుకుని మళ్లీ మళ్లీ వెనక్కి వచ్చి చెక్ చేస్తున్నది. ఏదన్నా ముట్టుకున్నదంటే పదిసార్లు చేతులు కడుగుతున్నది. నాకేదో భయంగా ఉంది. నువ్వు టూర్ నుంచి వచ్చాక చెబుదామని ఆగాను".

"అవునండీ! మానస ఇదివరకటిలా ఉండడం లేదు. ఇవ్వాళ సైకియాట్రిస్ట్ అప్పాయింట్‌మెంట్ తీసుకుంటాను" అన్నాడు బాలాదిత్య.

మరుసటి రోజు ఉదయం పదకొండు గంటలకు డాక్టర్ అప్పాయింట్‌మెంట్ దొరికింది. ఈ రోజంతా మానసను మంచి మూడ్‌లో ఉంచడానికి బాలాదిత్య, మానసవాళ్ల అమ్మ శాయశక్తులా ప్రయత్నించారు.

"నాకే జబ్బూ లేదమ్మా! కొద్దిగా భయమేసింది అంతే! జ్యోతికి అట్లా అయ్యేసరికి నా మనసులో మనసు లేదు" అన్నది మానస. "నాకు హాస్పిటల్‌కు వెళ్లబుద్ధి కావడం లేదమ్మా! నావల్ల ఎవరకన్నా కరోనా వస్తే! నా వల్ల వాళ్లు చనిపోతే! నేను జీవితాంతం బాధపడనా?"

"నీకు కరోనా లేదు కదా మానసా?" అన్నాడు బాలాదిత్య.

"నీకెలా తెలుసు" రెట్టించింది మానస. "కరోనా నెగిటివ్ వచ్చిన వాళ్లకు కూడా సి.టి. స్కాన్‌లో తేడా రావడం లేదా? వ్యాక్సీనులు తీసుకున్నవాళ్లకు కరోనా జ్వరం రాలేదా? జ్యోతివాళ్ల ప్రభాకర్‌కు ఆర్.టి.పి.సి.ఆర్. ముందు నెగిటివ్ వచ్చింది కదా! మరెందుకు చనిపోయాడతడు?"

"ప్రభాకర్‌కు షుగర్, బి.పి. ఉన్నాయి కదమ్మా!" అన్నది మానసవాళ్ల అమ్మ... "హార్ట్ ఎటాక్ వచ్చి బి.పి. డౌన్ అయ్యి ప్రాణం పోయిందట" అందామె మానసను అనునయిస్తూ... "అంతా దేవుడి నిర్ణయం..."

మానసకు కోపం వచ్చింది– "ఎవడా దేవుడు? జ్యోతి, ప్రభాకర్‌లు గుళ్లూ గోపురాలకు తెగ తిరుగుతారు కదా! పూజలూ, నోములూ, ఉపవాసాలూ క్రమం తప్పకుండా చేస్తారే! ఏ ఒక్క దేవుడూ, దేవతా ప్రభాకర్‌ను కాపాడలేదే? దేవతలకు భర్తలుంటే చాలా! జ్యోతికి అక్కర్లేదా? దేవుళ్లంట దేవుళ్లు..."

"అలా అనకూడదమ్మా! దైవనింద మహాపాపం" అన్నది అమ్మ.

మానస వెంటనే మంచమ్మీంచి లేచింది. బాత్‌రూంకి వెళ్లి స్నానంచేసి తడిబట్టలతో పూజాగృహం దగ్గరకు వెళ్లి దీపాలు వెలిగించింది. "నన్ను క్షమించు దేవుడా!" అంటూ విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, వినాయక స్తుతి, గాయత్రీ మంత్రం, మృత్యుంజయ మంత్రం చదువుతూనే ఉన్నది. హారతిలిస్తూనే ఉంది. కళ్లకద్దుకుంటూనే ఉన్నది.

"వారణం అయిరం సురుఘ వాలమ్ వంధు
నారన నంబి నడక్కింద్రన్ ఎంద్రెధిర్
పూరణ పొకుదమ్ వైతు పురమెంగుమ్
తోరణమ్ నాట్ట కన కందెన్ తొఝునాన్!"

"నన్ను క్షమించు కన్నా..." అని లెంపలేసుకుంటూ అక్కడే కూలబడింది. "నేనూ నీ ఆండాళ్‌నే కదా...!" అంటూ కళ్లు మూసుకుంది.

బాలాదిత్య గుండె దడదడలాడింది. ఏమిటీ మానసిక వైపరీత్యం! ఓ.సి.డి. ఎక్కువయ్యింది. ఖచ్చితంగా... అవును...

మానసవాళ్ల అమ్మ సాయంతో నెమ్మదిగా మంచం మీద పడుకోబెట్టాడు మానసను. తెల్లవార్లూ ఏవో పిచ్చిపిచ్చిగా కలవరిస్తూనే ఉన్నది నిద్రలో...

✣ ✣ ✣ ✣ ✣

తెల్లారేసరికి కాస్త కుదుటపడినట్లుంది. లేచి తలారా స్నానం చేసి గదిని నీట్‌గా సర్దింది. పూజా కార్యక్రమాలు పూర్తి కానిచ్చి లెంపలు వేసుకున్నది. "నన్ను క్షమించు ప్రభూ!" అంటూ పాశురాలు చదివింది.

"హాస్పిటల్‌కు వెళదాం, మానసా!" అన్నాడు బాలాదిత్య.

"అట్లాగే! అమ్మా తలుపు తాళం సరిగా వేసావా?" అని అడుగుతూనే వెనక్కి వెళ్లి మూడుసార్లు తాళం లాగి చూసింది.

మెట్ల మధ్యలో నడుస్తూ కిందకు దిగి కారు వెనకసీట్లో కుడిపక్క కూర్చుంది. చీర కారు డోర్లో చిక్కుకుందేమోనని రెండుసార్లు డోర్ తీసి మళ్లీ వేసింది. కాస్త స్థిమితపడి కనిపించని దేవతలకు దణ్ణం పెట్టుకుంది.

"మీ భయమే కాని, నాకేం ప్రాబ్లెం లేదమ్మా! నాకు తెలుసు మీరు నాకు ఓ.సి.డి. ఉందనుకుంటున్నారని. దీపికా పడుకొనె పరఫెక్షనిస్టు నాలానే! అజయ్ దేవగన్ చేత్తో చపాతీలు ముట్టడు తెలుసా, హాండ్ షేకింగ్ కూడా చెయ్యడు. సన్నీలియోన్ అరగంటకోసారి కాళ్లు కడుక్కుంటుంది. విద్యాబాలన్‌కు దుమ్మూధూళి అంటే భయం. డేవిడ్ బెఖామ్‌కు టాటూలంటే ఇష్టం. ప్రతిదీ రెండు రెండు కొంటాడు. హొవార్డ్ హ్యూఘ్సు బట్టలు లేకుండా చీకటిగదిలో నాలుగు నెలలున్నాడు సినిమాలు చూస్తూ.  వాళ్లతో పోలిస్తే నేను చాలా మెరుగు" అన్నది మానస.

డాక్టర్ ప్రసాదరాజు చాలా ఓపికగా మానస చెప్పింది విన్నాడు. బాలాదిత్య, మానసవాళ్ల అమ్మ చెప్పిన విషయాలు నోట్ చేసాడు. "తగ్గుతుందమ్మా! ఏం ఫరవాలేదు" అని ధైర్యం చెప్పాడు.

"ఏ పరిస్థితులలో నీకిటువంటి అనియంత్రిత, అసహజ, ఆలోచనలు, భయాలు వస్తున్నాయో వాటికి దూరంగా పారిపోకుండా క్రమేపీ అలవాటు చేసుకోవాలి. కొద్దిరోజులు విపరీతమైన తలనెప్పి, భీతి కలిగినా క్రమేపీ నార్మల్ అవుతావు. దీనిని 'ఎక్స్‌పోజర్ అండ్ రెస్పాన్స్ ప్రివెన్షన్' అంటారు. ఇది కాక కొన్ని మందులిస్తాను. ఎనాఫ్రానిల్ మూడు పూటలా వాడండి. అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కు తీసుకురండి. కరోనా కాలం కదా! ఆన్‌లైన్‌లో కూడా ఎప్పాయింట్‌మెంట్ తీసుకోవచ్చు" అన్నాడు డాక్టర్.

డాక్టర్ స్మార్ట్‌గా ఉన్నాడు అనుకున్నది మానస. తను కూడ డాక్టర్ కావాలనుకుని హౌస్‌వైఫ్ అయ్యింది. బయటకు వస్తూ డాక్టర్ వేపు మరల మరల చూసింది. ఆమె దేహంలో ఏవో తెలీని ప్రకంపనలు... లోపల ఎక్కడో అగ్ని రగిలింది. దేర్ ఈజ్ ఫైర్ బర్నింగ్ ఇన్‌సైడ్. అతడితో పడుకుంటే చల్లార్తుందేమో...!

ఛఛ ఏమిటీ ఆలోచనలు! దారుణం! మొన్న ప్రభాకర్, నిన్న దేవుడు, ఇవ్వాళ డాక్టర్! ఏమవుతున్నది తనకు?

ఇంట్లో వీళ్లని దిగబెట్టి బాలాదిత్య మందులు, ఫ్రూట్స్, స్వీట్స్ తెస్తానని బజారుకెళ్లాడు.

మానస గబగబా తన రూంలోకి వెళ్లింది అమ్మకు చెప్పి. గది తలుపులు మూసి బాత్‌రూంలోకి వెళ్లింది. లోపల అగ్నిని చల్లార్చాల్సిందే! అరలోంచి తెల్లటి లక్స్ సబ్బు తీసింది. తెల్లగా, పాలనురుగులా, సెమెన్‌లా ఉందా రంగు. కడుగుతూనే ఉంది, సబ్బు రాస్తూనే ఉంది... సబ్బు అయిపోయేంత వరకూ... భరించలేని మంట పుట్టేంత వరకూ... వళ్లు తుడుచుకుని తెల్లటి బట్టలేసుకుంది.

వచ్చి పూజాగది ముందు కూర్చుంది నిష్ఠగా– "నా తప్పులు క్షమించు దేవతలారా... నాకీ ఆలోచనల నుంచి విముక్తి కలిగించండి..." దేవుళ్ల సహస్రనామాలూ చదివింది.

కాస్త మనశ్శాంతి కలగగానే రూం అంతా నీట్‌గా సర్దింది. "ఈ ఒ.సి.డి.ని జయిస్తాను" అనుకున్నది. తలుపు తీసి హాల్లోకి వచ్చింది. పక్క వీధిలో ఏదో హడావుడి. కిటికీలోంచి చూస్తే అంతా క్లియర్‌గా కనబడుతున్నది. మానసను చూసి వాళ్లమ్మా పైకి వచ్చింది. ఎదురు వీధిలో ఇంటిముందు శవ వాహనం... దానిపై తెల్లటిగుడ్డలో ఎవరిదో శవం.... పక్కనే మాస్కులు తొడుక్కున్నవాళ్లు... బంధుమిత్రులు... ఏడ్పులు... వెక్కిళ్లు....

జాతస్యహి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ!
తస్మాద పరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి!!"

కెవ్వున కేక పెట్టి మానస తన గదిలోకి పరిగెత్తి మంచం మీద పడిపోయింది.

బాలాదిత్య గబగబా వస్తూనే ఉన్నాడు. మానసవాళ్లమ్మ ఆమె వెనకనే వెళ్లి మానసను తన ఒడిలోకి తీసుకుని ఓదారుస్తున్నది.

"తప్పదా అమ్మా! చావు తప్పదా! ఎందుకు చనిపోవాలి ఎవరైనా? ఎవరు చంపుతున్నారెవరిని? ఈ కరోనాకు కనికరం లేదా?" మానస అరుస్తూనే ఉన్నది.

"పుట్టిన వాడికి మరణం తప్పదు... మరణించిన వాడికి మరల పుట్టుక తప్పదు. ఈ అనివార్యమైన దానికి నీవు శోకించవద్దు...." శవవాహనం వెళ్లిపోతుండగా మాటలు ఫేడైపోయాయి. మానస నెమ్మదిగా తేరుకున్నది.

"నేను ఓ.సి.డి. జయస్తాను" అన్నదామె నిశ్చయంగా. "ఆదిత్యా! సారీ! టాబ్లెట్ పట్టుకురా వేసుకుంటాను"

బాలాదిత్య టాబ్లెట్లు, నీళ్లు తెచ్చాడు. మానస టాబ్లెట్లు వేసుకున్నది. నెమ్మదిగా ఆమెకు నిద్రపట్టింది.

ఇప్పుడు వాళ్లకు తెలుసు ఈ ఒ.సి.డి; ఈ కరోనా భయం ఇక ఆమెనేమీ చెయ్యలేవని... దూరంగా గుడిలో గంటలు మ్రోగినాయి ఆశీర్వదిస్తున్నట్లుగా... శ్రీదేవి కరుణాదృక్కుల వెన్నెల రాగానే దుఃఖపు చీకటి తొలగినట్లుగా...

**"యయోః కాంత్యా యాంత్యాః శశికిరణ సారూప్యసరణే**
**విధూతాంతర్ధ్వాంతా విలసిత చకోరీవ జగతీ"**

★★★★★

# 14. వాళ్లను ఉరిదీయండి.... నెమ్మదిగా...
## (Hang them slow !)

**'I am Monarch of all I survey**
**My right there is none to dispute**
**From the centre all round to the sea**
**I am lord of the fowl and the brute'**

-William Cowper

– "అది వీరులు పోయే వీరస్వర్గమూ కాదు, పాపులు తగలడే పాడు నరకమూ కాదు. ఎటుపోవాలో వీళ్లకూ తెలీదు. ఎటు పంపాలో వాళ్లకూ తెలీదు. సమాజ శ్రేయస్సు కొరకే చనిపోయారని వాళ్లని రంగంలోకి దించిన వాళ్లంటున్నారు. అది సరైనదో కాదో తెలీక స్వర్గ నరకలోకపు పరిపాలకులు తలలు పట్టుకుని కూర్చున్నారు. కాకపోతే త్రిశంకు స్వర్గంలో లాగా, మన గోడమీద బల్లిలాగా ఇక్కడ తలకిందులుగా ఉండక్కరలేదు. అదే కాస్త వెసులుబాటు.

– యుద్ధం చేయి. ఎదుటివాణ్ణి చంపు. పంచాయితీ బెట్టి వాడి పాపాల చిట్టా చదువు. మధ్యలో నోరెత్తితే చితకదన్ను. చివర్లో కత్తితో పొడిచి, గన్నుతో కాల్చి, గొడ్డలితో శిరచ్ఛేదం చేయి.–

"నా కనుచూపు మేరలో కనిపించే దానికి నేను రారాజును. నా ఆజ్ఞనెవ్వడూ మీరడానికి వీల్లేదు. ఈ బొంగ్రాయి కేంద్ర బిందువు నుండి ఆ సముద్ర తీరాల వరకు పశుపక్ష్యాదుల మీద, అందరి మీదా పెత్తనం నాదే!"–

–అని గర్వించే వాళ్లను చూసి భూమి ఫక్కున నవ్వుతుంది. సమాధులు నోరు తెరుస్తాయి. ఆకాశంలో నల్లమబ్బులు కమ్మి వడగళ్లు కురిసి, పిడుగులు ఉరుములు, నానా భీభత్సం చేసి ఆ గర్వాంధులను చావుదెబ్బ కొడతాయి.

ఇవన్నీ ఈ బల్ల గుద్ది చెప్పేవాళ్లకు తెలవదని కాదు. ఇంతలేసి పరిశోధనా పత్రాల కట్టలూ, వేలాది పేజీల పుస్తకాలూ, నవీన సిద్ధాంతాలూ ఆ కాగితాల మీద సిరా ఆరేంతసేపు కూడా ఉండవు. వాళ్లవల్ల ప్రజల ఆకలి శాశ్వతంగా తీరిన దాఖలాలు లేవు. వాళ్లను నమ్మి ప్రజలు గుండెలపై చేయి వేసుకుని నిదుర పోయిందీ లేదు. –

ఆలోచనల్లో పడి, అడవుల్లో తుప్పలో పడి అతడు నడుస్తూనే ఉన్నాడు.

ఎటుపోతే ఎటు తేల్తాడో అతడికీ తెలీదు. అడవికీ తెలీదు.

తెలిసిన సూర్యుడు మబ్బుల చాటున దాక్కున్నాడు.

వళ్లంతా ముళ్లు గీసుకుని రక్తం చారికలు కట్టి భుజాల దగ్గర కాళ్ల దగ్గరా ఎండిపోయింది. ఇంతకుముందు అలవోకగా మోసిన తుపాకి ఇవ్వాళెందుకో బరువుగా అనిపిస్తోంది. బుల్లెట్లు, గ్రెనేడ్ల మీద అస్పష్టంగా పుర్రె, ఎముకలు కనిపిస్తున్నాయి. బాయ్‌నెట్ సైతాన్ తోకలా వంపు తిరుగుతున్న భ్రమ. నాలుక పిడచకడ్తోంది.

అవిగో నీళ్లు. చిన్ని చెలమ. తాగాలంటే విషమెవరన్నా కలిపారేమోనన్న భయం. తాగకపోతే దాహంతో చస్తానేమోనన్న భీతి. దాహం జయించింది. ఏటి ఇసుకలో మనిషి అడుగుజాడలు లేవు. ఏవో మృగాలవి తప్ప. గబగబా నీళ్ల దగ్గరకెళ్లి ఆదరాబాదరాగా దోసిలిలో నీళ్లు నింపి నోట్లో పోసుకున్నాడు. చిక్కగా బురదనీళ్లు. గుటకపడి పలమారింది. దగ్గు ఖణేల్ ఖణేల్‌మని రాగా. పక్కనే గుట్టలు ఖణేల్ ఖణేల్ మన్నాయి. కాస్త మడుగు లోపలికి వెళ్లి మూతి, చేతులు, గొంతు కడుక్కుని తేటనీళ్లు తాగాడు. ప్రాణం లేచివచ్చింది. కాళ్లూ చేతులూ ఒళ్లూ కడుక్కుని బట్టలపై రక్తం మరకలు వదిలించుకున్నాడు.

వెళ్లి చెట్టునీడలో నిలబడ్డాడు. బట్టలన్నీ తడిచి, వీస్తున్న వేడిగాలికి ఆరుతూంటే ఎంతో హాయిగా అనిపించింది. అక్కడే కాసేపు కూర్చోబుద్ధయ్యింది. కూర్చున్నవాడిని కూర్చోనీకుండా కునికిపాట్లు రాసాగాయి. కునికిపాట్లు కూర్చునేం పడతాడు? అందుకని భుజం మీది గన్నూ, కిట్టూ తీసి పక్కనే పెట్టి శత్రువుల కంటబడితే పని ఖతం అనిపించగానే గబగబా చెట్టుపైకెక్కి అటూయిటూ చూసాడు. ఎక్కడా ఏ జాడా, అలికిడి కనిపించలేదు. చెట్టు దిగి కాస్త మాటు

చూసుకుని పక్కకు ఒత్తిగిలి పడుకోగానే 'ఇంకెంత ఆలస్యం?' అని కసురుతున్నట్లు నిద్ర అమాంతం అతడిని కావలించుకున్నది. ఎన్నిరోజులయ్యిందో సరిగా నిద్రపోయి! ఎన్నో యుగాలయినట్లు ఉంది...

"ముందు వీళ్లని ఉరిదియ్యాలి. దేశం పేరిట, మతం పేరిట, వర్గం, భావం, భాష, భేషజం, తెగ ఒకటేమిటి ఏదో ఒకదాని పేరిట సిద్ధాంతాలు ప్రతిపాదించి, ద్వేషం రగిల్చి వ్యక్తుల మరణాలకు, కారణమౌతున్న వారిని వదలకూడదు. ఈ యుద్ధాలకు ఏవన్నా పెద్ద కారణాలున్నాయా అంటే ఏవీలేవు. చిన్న సరిహద్దు తగాదాలు, దేశం కావచ్చు, భావజాలం కావచ్చు అంతే! కాసేపు ఇరుపక్షాల వారు నింపాదిగా కూర్చుని ఆలోచిస్తే ఒక్కగంటలో తేలిపోయే సమస్యలే. కాని వాటిని సాగదీసి, సాగదీసి, లాగి లాగి రావణకాష్ఠంలా మండేట్లు చేస్తున్నారు.

ఈ దారుణ యుద్ధాల్లో విజేత భూభారం తగ్గించిన అవతార పురుషుడౌతాడు. పరాజితుడు మారణహోమం చేసిన కసాయివాడౌతాడు. ఇద్దరూ నరహంతకులే! అతివాదులు శత్రుశేషం, ఋణశేషం ఉండరాదని ఆచరిస్తే, మధ్యవాదులు కాళ్లూ చేతులూ నరికి జీవచ్ఛవాలుగా ప్రతిద్వందుల్ని వదిలేద్దామని ప్రతిపాదిస్తారు. మితవాదులు గోడమీద పిల్లుల్లా, ఏ ఎండాకా గొడుగు పట్టే జనాల్లా వ్యవహరిస్తారు.

మొత్తం మీద సరిహద్దులు మానవ రక్త కంకాళాలతో, అస్థిమాంసాలతో తడిచి ఎరుపెక్కి పదునెక్కుతాయి. పగ ప్రతీకారాలు ముళ్లకంచెలుగా కొన్నాళ్లు దుర్భేధ్యంగా కనిపిస్తాయి. మతం పేరు మీదో, దేవుడి పేరు మీదనో పవిత్ర యుద్ధాలు దారుణంగా ప్రజ్వరిల్లి ప్రజలు తాత్కాలిక ద్వేషాలతో పుట్టిన ఊరికి, కన్నవారికి దూరంగా అనామకంగా మట్టిలోనో, మంటలోనో కలిసి కానరాకుండా పోతారు.

ప్రపంచ యుద్ధాలు పోయి, మత యుద్ధాలు, దేశయుద్ధాలు, రాష్ట్ర యుద్ధాలు, ప్రాంతీయ యుద్ధాలు, వీధి పోట్లాటలు, పొరుగిళ్లతో తగాదాలు, ఇంటి గొడవలు, భార్యాభర్తల తగవులు ఇవన్నీ ప్రపంచ యుద్ధాలకన్నా భీభత్సంగా పరిణమించి ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరాటాలలో తాడోపేడో తేల్చుకుంటారు. అనుకూలంగా కొందరు వ్యతిరేకంగా కొందరు పుస్తకాలు, కరపత్రాలు వ్రాసి

తమ కలం కండూతిని తీర్చుకుంటారు. కొందరికా రాతలు నచ్చి తు.చ. తప్పకుండా పాటించి తాముండే చోట చిచ్చు రగిలించుకుని ఆ మంటల్లో, పొగల్లో ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు.

"అందుకే వీళ్లని ఉరిదియ్యాలి!" అన్నది తన గొంతు! ఎవర్ని? అన్నది ఎక్కడినుంచో ఓ గొంతు. అంతే చుట్టూరా ఎన్నో ముఖాలు. పాతతరం రాజులు, అలెగ్జాండరు, జూలియస్ సీజరు, హెరోదు, నెపోలియన్, హిట్లర్, ముస్సొలిని, ఇడి అమిన్ –ఇంకా ఎందరివో ఎర్ర, పచ్చ, తెల్ల, నల్ల మొహాలు, అనేక రకాల ఉద్యమ నాయకులవి స్పష్టాస్పష్టంగా కనిపించి మాయం కాసాగాయి. వాళ్లలో ముందు అస్పష్టంగా, తరువాత స్పష్టంగా తన మొహం! వీడిని ఉరిదియ్యాలి అన్నది మరో గొంతు. చిత్రం! ముఖాలు ఉన్నవాళ్లు, లేనివాళ్లు ఎందరో వరుసగా ఉరికంబాలనెక్కుతున్నారు. అసంఖ్యాకంగా ఉరికంబాలు. అసంఖ్యాకంగా ఉరికొయ్య దగ్గర నిలబడ్డవాళ్లు. అరుగో ప్రపంచ యుద్ధానికి కారణమైనవాళ్లు! వీళ్లు మత యుద్ధ కారకులు, వీళ్లు వర్ణద్వేషంతో జాతుల్ని నాశనం చేసినవాళ్లు, వీళ్లు కొత్తకొత్త వైరసుల్ని, మందుల్ని సృష్టించి వ్యాపారం చేస్తున్నవాళ్లు; వీళ్లు కులం పేరుతో, వాళ్లు జాతిభేదంతో, వీళ్లు వేర్వేరు వర్గాల పేరుతో, వీళ్లు లింగ వివక్షత పేరుతో ప్రపంచాన్ని, సమాజాన్ని, కుటుంబాల్ని నాశనం చేసినవాళ్లు– "వీళ్లను ఉరిదీయండి" అన్నారు అక్కడున్న వాళ్లంతా ముక్తకంఠంతో– "వీళ్ల మాటలు నమ్మి, సమాజం బాగుపడ్తుందని వీళ్లు చెప్పినట్లు, రాసినట్లు చేసి ఎంతోమందిని చంపాం, మేం చచ్చాం! తీరా ఇప్పటికీ ఆ భూలోకంలోకి స్వర్గం ఇంకా రాలేదు! మమ్మల్ని తమ తప్పుడు ఆలోచనల్తో, విధానాలతో మోసం చేసిన వీళ్లందరినీ, ఇదుగో ఈ రకంగా వ్రాసి చెబుతున్న ఇతగాడినీ ఉరిదీయండి" అని అరుస్తున్నారు వాళ్లు గోలగోలగా. "వీళ్లు మాకు మనుషుల్ని బతికించడం నేర్పించి ఉండాల్సింది – చంపడం కాదు!"...

ఉరికొయ్యల ముందు మౌనంగా నిలబడ్డ అందరిలానే తనూ తలదించుకుని ఉన్నాడు. అందరి తలలపై నల్లని ముసుగులు కప్పారు. ముసుగులు కప్పాక అందరూ ఒక్కలానే ఉన్నారు. రాజెవడో, బంటెవడో, కవి ఎవడో, వేదాంతెవడో, ఆడా, మగా, ఎవరో ఇప్పుడు చెప్పడం కష్టం. ఉరితాళ్లు మెడల చుట్టూ బిగుసుకుంటున్నాయి. ఎవరో అంకెలు లెక్కబెడ్తున్నారు. ఎక్కడో పిస్తోలు పేలిన శబ్దం వినిపించింది. శరీరాలు గాలిలోకి తేల్తున్నాయి. కాళ్లు వేలాడ్తున్నాయి. మెడ విరిగి నరాలు తెగాయి. ఎక్కడ చూసినా చీకటే!

"వాళ్లను ఉరిదీయండి. కాని నెమ్మదిగా...! Hang them slow!" - ఎవరిదో కేక!

"ఎన్నాళ్లు... ఎందుకు?" -అన్నాడింకెవడో!

"మనం మళ్లీ పునర్జన్మ ఎత్తి, చేసిన తప్పుల్ని సరిదిద్ది భూలోకంలో, స్వర్గాన్నో, కనీసం శాంతినో నెలకొల్పేంత వరకు! మానవత్వాన్ని మేలుకొల్పేంత వరకు!" -

"Hang them slow" అరుస్తున్నారందరూ. "Hang them slow"....

గొంతు బిగదీసుకున్నట్లు అనిపించి ఉలిక్కిపడి లేచాడు మెడ తడుముకుంటూ. మెడ మీద పడిన ఎండుటాకు పక్కకు తొలిగింది. ఏవో మృగాలు తనున్న చోటుకు దగ్గర్లోంచి వేగంగా మడుగు వేపు పరిగెడ్తున్నాయి. ఒళ్లు భయంతో జలదరించినా తమాయించుకున్నాడు. హమ్మయ్య! కలే! ఉరి కాదు! నెమ్మదిగా, భారంగా ఊపిరి పీల్చుకున్నాడు. గుండె దడదడలాడ్తూనే ఉన్నది.

నీళ్ల దగ్గర జంతువులు. కుందేళ్లు, లేళ్లు, పక్కనే ఓ పాము, ఆ దిగువన రెండు తాబేళ్లు, దూరంగా గద్ద, కొన్ని పక్షులు...

దాహం తీరింది. నిద్ర తీరింది. కడుపు ఆకలితో నకనకలాడ్తున్నది. ఎదురుగా నదరైన ఆహారం. నెమ్మదిగా తుపాకి తీసి బుల్లెట్లు లోడ్ చేసాడు. లేళ్లో, కుందేళ్లో ఏదో ఒకటి చావడం ఖాయం. దేన్ని కొట్టాలి? రేంజిలోనే ఉన్నాయి. చిన్నదైన కుందేలును కొట్టడం కన్నా పెద్ద సైజున్న లేడిని కొట్టడం సులభం. ఇటువంటి తెలివితేటలుండడం వల్లనే కదా మనిషి ఇంత గొప్పవాడైంది.

పడుకునే పొజిషన్ తీసుకున్నాడు. -"ఇప్పుడు ఈ కనుచూపు మేరంతా తన సామ్రాజ్యమే! ఈ గన్నున్నంత వరకూ నా ఆధిపత్యాన్ని ఎవడూ ప్రశ్నించలేడు. ఈ క్రూరమృగాలకు, పక్షులకూ ఏలికను నేనే!" అనుకుంటుంటే అతనిలో గర్వం ఉప్పొంగి పెదాలపై అనుకోకుండా చిరునవ్వు విరిసింది.

తుపాకి గురిపెట్టాడు. మచ్చల లేడి నిశ్చలంగా నీళ్లు తాగుతున్నది. ఒకసారి తలవేపు, మళ్లీ గురిని మార్చి దాని గుండె వేపు గురిపెట్టాడు. చిటికెన వ్రేలు ట్రిగ్గర్‌ను నొక్కడానికి సిద్ధంగా ఉన్నది.

“యుద్ధాన్ని వదిలి తాను పారిపోయి వచ్చిందెందుకు? తన తోటి సైనికులు దొరికిన అమాయకుల్ని చంపుతూ, వాళ్ల స్త్రీలను అవమానపరుస్తుంటే చూసి భరించలేకనే కదా! అవతలివాళ్ళూ అంతే! అయినా శత్రుదేశం వాళ్లన్న పేరుపెట్టి, వేరే మతం వాళ్లన్న రంగు అద్ది వాళ్ల మాన ప్రాణాలను అర్ధరాత్రి హరించారు కదా! చేతిలో ఆయుధాలుండబట్టే కదా వాళ్లు అంత విశృంఖలంగా, దారుణంగా ప్రవర్తించింది! దాన్ని వ్యతిరేకించేగదా తను వాళ్లనుంచి విడివడి ఈ అడవుల్లో దారి తెన్నూ లేకుండా తిరుగుతున్నది!

ఈ జంతువుల దగ్గరా ఆయుధాలు లేవు. ఇవి శత్రువులు లేరన్న నిశ్చింతతో నీళ్లు తాగుతున్నాయి. వాటిని చంపి వాటి ఉసురు తీసి, వాటి ఊపిరి తాడుతో బతకలేడు తను. వద్దు అనుకుని, పడుకున్నవాడు, తుపాకి పక్కకు బెట్టి కాళ్లు ముందుకు లాక్కుని కూర్చున్నాడు.

వెనక బుస్ అన్న శబ్దం. గాభరాగా వెనక్కి తిరిగి చూసాడు. ఇందాక తన పాదం ఉన్న చోటు దగ్గర పడగవిప్పి బుస్ మంటూ గాలిని కాటేస్తున్న నల్ల త్రాచుపాము. కదలకుండా తీవ్రంగా చూస్తున్నది. తను అలానే ఉండి ఉంటే తన బుల్లెట్ మచ్చులలేడిని చంపేముందే నాగుపాము కాలసర్పమై తనను కాటేసి ఉండేది. అడవి తనను తాను రక్షించుకుంటుంది అంటే ఇదేనేమో! మరి, మనుషులెందుకు ఒకరినొకరు కాపాడుకోరు?

అతడు లేచి నిలబడ్డాడు. గట్టి నిర్ణయానికి వచ్చి తన దగ్గరున్న తుపాకిని, బుల్లెట్లు, గ్రెనేడ్లను, కత్తిని, సైనిక దుస్తుల్ని తీసి పొదల్లోకి విసిరేసాడు. బనీను డ్రాయర్‌తో నడుస్తూ మామూలు మనిషిలా, పక్షులు ఎగుర్తూ పోతున్న వేపు నడక సాగించాడు. అతడి వేపు ఒకసారి తల పంకించి చూసి నాగుపాము కూడా అడవిలోకి వెళ్లిపోయింది. మడుగు దగ్గర మరిన్ని జంతువులు నిమ్మళంగా నీళ్లు తాగుతూ ఉన్నాయి.

★★★★★

# 15. శత్రువుతో సంసారం అను నీలి త్రికోణం
## (Sleeping with enemy)

"అసంకల్పితంగా నోరు జారి, మనసులో మాట బయటపడితే దానిని 'ఫ్రాయిడియన్ స్లిప్' అంటారు. అందుకే ఇతరులతో మాట్లాడేప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పెద్దలంటారు పెదవి దాటిన మాట పృధివి దాటుతుందని.

మీకు నేనో ఉదాహరణ చెబుతాను. ఒక రోజున టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారం జరుగుతోంది. బాగా శిక్షణ ఇచ్చాకే ఓ పిల్లవాడి చేతికి మైక్ ఇచ్చారు. మైక్ పట్టుకోగానే- చుట్టూ లైట్లు, అంతా నిశ్శబ్దం... కెమేరామాన్, డైరెక్టరు ఏవో సంజ్ఞలు చేస్తున్నారు. ఇందాకటిదాకా వాళ్లు చెప్పిందంతా మరచిపోయి మనసులో మాట, రోజూ వీధుల్లో తాము గోలగోలగా అరిచేది అనేసాడు ఆ పిల్లవాడు- "గల్లీగల్లీమే షోర్ హై..... బడా చోర్‌హై!" ఇంకేముంది. కొంపలు మునిగాయి. అధికార పార్టీ నాయకుడి పేరు అది. దేశమంతా ప్రజలు చూసారు. ఆ ప్రొడ్యూసర్, డైరెక్టర్ల భవిష్యత్తు ఆరోజుతో ఖతమయ్యింది"

చప్పట్లతో హాలు మారుమోగింది. ఆత్మహత్య చేసుకున్న ప్రఖ్యాత చిత్రకారులు, కళాకారులు, ప్రముఖులు, వారి మానసిక పరిస్థితులు – విశ్లేషణా విధానం, సామూహిక ఆత్మహత్యలు, రైతుల, విద్యార్థుల ఆత్మహత్యలపై తన అభిప్రాయాన్ని నిర్ద్వంద్వంగా చెప్పి తన ప్రసంగం ముగించాడు డాక్టర్ నీలకంఠరావు. శ్రోతలు ప్రశ్నలడుగుతున్నారు. మీడియా పాత్ర ఏమిటి అని ఓ శ్రోత అడిగాడు. "ప్రసార మాధ్యమాలు ఇటువంటి వార్తలు ప్రసారం చేసేప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈరోజు ఫలాన పార్టీ నిర్వహించిన బంద్‌లో వరంగల్‌లో ఇప్పటికి రెండు బస్సులు తగలడ్డాయి, మూడు షాపుల అద్దాలు పగిలాయి, విజయవాడలో అటువంటివేమీ జరగలేదు అని వార్తలు వస్తే విజయవాడ పార్టీ శ్రేణులు ఊరుకుంటాయా? మీరే చెప్పండి? ఆ హీరో సిన్మా వంద సెంటర్లలో వందరోజులాడిందంటే తమ హీరో సిన్మాని నూట ఒక్క సెంటర్లలో నూట

ఒక్కరోజులాడించే ప్రయత్నం చేసే జనాలున్న నేలయిది. ఈ మాస్ మెంటాలిటీ ఎక్కడైనా ఎప్పుడైనా ప్రమాదమే!" అన్నాడతడు.

ఐదు నక్షత్రాల హోటల్‌లో జరుగుతున్న మానసిక వైద్యుల సమావేశంలో Keynote Address- ప్రధానోపన్యాసం ఇచ్చాక 'టీబ్రేక్'లో నీలకంఠరావు తనను అభినందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలుపుతూ లాబీ బయటకు వచ్చాడు. ఈ పొగడ్తలూ, చప్పట్లూ మామూలే. దేశ విదేశాలలో నీలకంఠరావు గొప్ప మానసిక వైద్యనిపుణుడిగా, వక్తగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నాడు. అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించాడు. అవార్డులనందుకున్నాడు.

రూంకు వెడదామనుకుని లిఫ్ట్ వద్దకు వచ్చాడు. లిఫ్ట్ స్విచ్ నొక్కాడు. ఆగిన లిఫ్ట్ తలుపు తెరుచుకున్నది. ఒక్కసారి గుండె ఝల్లుమన్నది. ఎదురుగా ఆమె. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. ఆమె కూడా అంతే! ఆమె కళ్లు విస్మయంతో తొణికిసలాడుతున్నాయి. అకస్మాత్తుగా అతడు తన ఎడమ చెంపను తడుముకున్నాడు. ఆమె కిలకిలా నవ్వింది. అదే నవ్వు! అదే కళ్లు! అదే అందం! అదే ఆకర్షణ!

"నీలూ! నీవేనా!.... నీవేం మారలేదు నీలూ!" అన్నదామె.

అతడింకా స్థాణువులా నిలబడే వున్నాడు. ఆమెను చూడగానే అతనెప్పుడూ అంతే!

అతడెప్పటికీ మారడు. అది నిజం.

ఇద్దరూ 'కాఫీ లాంజ్'లోకి వచ్చారు కాఫీ తాగుతూ మాట్లాడుకో సాగినారు. ఎప్పటిలా ఆమె గలగలా మాట్లాడుతూనే ఉన్నది. అప్పటిలానే నీలకంఠరావు ఆమెను చూస్తూ వింటూనే ఉన్నాడు. తనూ, తన భర్త, తన ఐశ్వర్యం, తమ ఆనందం - ఇవన్నీ తప్ప ఆమె అన్నీ మాట్లాడుతున్నది. అవి మాట్లాడుతుందేమోనని అతడు ఎదురుచూస్తున్నాడు.

"You know I have taken up painting" అన్నదామె. "నేనిప్పుడు పెయింటింగ్స్ వేస్తున్నాను. బ్లాక్, డార్క్ గ్రీన్ నాకిష్టం. 'వాన్ గో' అంటే పిచ్చి అనుకో! పసుపుపచ్చ, బంగారపు గీతల్ని ముదురాకుపచ్చ బ్యాక్ గ్రౌండ్‌లో తీగెల్లా సాగదీస్తానులే! ముదురు నీలంరంగు ఆకాశంలో సుడులు తిరుగుతున్న

నక్షత్రాలు- 'వాన్ గో' గీసినట్లే నేనూ గీసాను కాని వాటిల్లో దూరం నుంచీ చూస్తే నా ప్రతిబింబం కనిపించేలా గమ్మత్తైన టెక్నిక్ వాడాను. దానికి మొన్న ప్రదర్శనలో ప్రైజ్ వచ్చింది! అవునూ నీకు పెయింటింగ్ అంటే ఇష్టమే కదా? బోరుగొడ్తున్నానా!" అన్నదామె.

నీలకంఠరావు ఆమె మాటల్ని వింటున్నాడని అనడం కన్నా మర్యాదస్తుడిలా, బుద్ధిమంతుడిలా తలూపుతున్నాడని అనుకోవచ్చు. 'ఏమైనా మాట్లాడు' అన్నదామె.

"హౌ ఆర్ యూ!" అన్నాడతడు.

మళ్లీ ఆమె గలగలా నవ్వింది.

"నువ్వేం మారలేదు" అన్నదామె. "కమ్ ఫర్ లంచ్ టుడే. దిసీజ్ మై అడ్రస్, ఫోన్ నెంబరు దీనిపై ఉంది" అని విజిటింగ్ కార్డు తీసి ఇస్తూ "ఐ షల్ బి వెయిటింగ్ ఫర్ యూ! బై!" అన్నదామె. "నీ కార్డివ్వు!"

ఆమెతో నడుస్తూ లాబీలోకి వచ్చాడు. పార్కింగ్‌లో ఉన్న తన కారును స్టార్ట్ చేసి వెళ్లబోతూ అతని వంక చూసి అన్నది- "నిజం చెప్పాలంటే ఇంత హాయిగా నవ్వి చానాళ్లయ్యింది"-

కారు తలుపులు మూసుకున్నాయి. కారు వేగంగా దూసుకుపోయింది.

* * * * * *

'ఈవెనింగ్ లేట్ ఫ్లైట్' కాబట్టి నీలకంఠరావుకూ పెద్ద అబ్జెక్షన్ లేకపోయింది. ఆమె ఎప్పుడూ ఇంతే! తనకు వేరే పనులున్నాయా, తను రాగలడా లేడా, ఇవేమీ అడగదు. తనకేం కావాలో చెబుతుంది. వచ్చెయ్! అంటుంది. వెళ్లిపోతుంది. వెళ్లొద్దు అనుకుంటాడు తను. కాని వెళ్తాడు. చిన్నప్పుడూ అంతే. గలగల నవ్వులు, జలపాతంలా మాటలూ ప్రవహిస్తాయి. తాను వింటూనే ఉంటాడు.

*రూంకి వెళ్లి కాస్త విశ్రాంతి తీసుకున్నాడు. నిద్ర పట్టింది. నిద్రలో కల! మరల మరల వచ్చే స్వప్నం - Recurring dream. ఆమె తన ఎదురుగా వస్తున్నది. తన స్నేహితురాళ్లతో- 'ఏమే! వీడు నిన్ను ప్రేమిస్తున్నాడా ఏమిటి!*

*నిన్ను చూస్తే కళ్లు తిప్పుకోడు! దమ్ముంటే I love you చెప్పు లవర్‌బాయ్!' సడన్‌గా తాను 'ఐ లవ్‌యూ! నీవు నాక్కావాలి!' అనడం – ఆమె చెయ్యి తన చెంప పగలగొట్టడం! –*

*– తరువాత కలిసి 'సారీ' చెప్పింది. మళ్లీ మాటలు మామూలే. నీలకంఠరావు మెడిసిన్‌లో చేరాడు. ఆమె ఎం.ఏ. లిటరేచర్ చేసినట్లు గుర్తు. అతను ఫైనలియర్‌లో ఉండగా ఆమె పెళ్లయ్యింది. శుభలేఖ అందుకున్నప్పుడు అతని కళ్లవెంబడి అప్రయత్నంగా కన్నీళ్లు కారాయి.*

సెల్‌ఫోన్ మోతతో మెలకువ వచ్చింది. ఆమే! – "ఏమిటి బయల్దేరావా! నేను రానా? కుదిరేట్లు లేదులే! టాక్సీ తీసుకో! విజిటింగ్ కార్డు మీద అడ్రస్ చూడు. వెరీ ఈజీ– బంజారాహిల్స్ – రోడ్ నెం. 14 – నీ హోటల్‌కు ఇక్కడకు జస్ట్ ఇరవై నిముషాలు – వెయిటింగ్ ఫర్యూ" –ఫోన్ ఆఫ్ అయ్యింది. అంతే! ఆమె తత్త్వమది.

ఆమె ఇంటి ముందు టాక్సీ దిగేసరికి గుమ్మంలో ఆమె ప్రత్యక్షం. పదిహేనేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది. ఫ్రెష్‌గా లిల్లీపూవులా... జూలియా రాబర్ట్స్‌లా – చిరునవ్వుల వెన్నెలలా–

ఆమె పక్కనే, ఆమెను చూస్తూ నడుస్తున్నాడు...

ఆమెకు తెలుసు అతడేం చేస్తున్నాడో...

అతడికి తెలియదు ఆమె ఏమనుకుంటున్నదో...

అద్భుతంగా ఫర్నిష్ చేయబడిన ఇల్లు. చక్కగా ఉంది. ముందు వెయిటింగ్ రూంలో ఆమె చెప్పిన పెయింటింగ్. 'వాన్ గో' ఇన్‌స్పిరేషన్ మాడిఫైడ్ వెర్షన్ – లీలగా బంగరు తీగెలతో తళుకు లీనుతున్న ఆమె రూపం –

"నీలూ! కూర్చో. జస్ట్ ఫైవ్ మినిట్స్. మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్...."

*నీలూ మాయమై నీలకంఠరావు సైకియాట్రిస్ట్ బయటకు వచ్చాడు. 'వాన్ గో' మనః స్థితిలోనే ఇప్పుడు స్వప్న ఉన్నదా? గలగల నవ్వే ఆమెలో గూడుకట్టుకున్న విచారానికి కారణం ఏమిటి? ముదురు నీలాకాశం, సుడులు తిరుగుతున్న నక్షత్రాలు. ఆమె ప్రతిబింబం అంతర్లీనంగా, బంగరు తీగెలా! పరీక్షగా చూస్తున్న సైకియాట్రిస్టు నీలకంఠరావు దృష్టిలో పడింది పెయింటింగ్‌లోని*

*ఆమె రేఖాచిత్రం కనుల దగ్గర కనిపించీ కనిపించనట్లు కన్నీటి చుక్క. ఇప్పుడు కనబడుతోంది. మరలా చూస్తే లేదు... నో... నో... ఉంది...!*

"హ్యావ్ దిస్ వెల్‌కమ్ డ్రింక్!" అన్నదామె నీలకంఠరావుకు గ్లాస్‌నందిస్తూ. ఇద్దరూ ఫ్రూట్ జ్యూస్ తాగుతూ కబుర్లలో పడ్డారు. మళ్లీ మామూలే! ఆమె మాట్లాడడం! అతడు రెండు ముక్కల్లో సమాధానం చెప్పడం. కాసేపు తలవంచుకుని, ఆమె చూడడం లేదనుకున్నపుడల్లా ఆమెవేపు చూస్తున్నాడు. అతడు చూస్తున్నాడని ఆమెకు తెలుసు కనకే ఆమె అతడికా అవకాశం ఇస్తున్నదని అతడికి తెలియదు.

"బ్రెడ్, ఎగ్స్, బిరియాని, ఫిష్.... టుడేస్ మెనూ! ఇంకా నీకేమి కావాలో చెప్పు నీలూ! ఛాయిస్ ఈజ్ యువర్స్!" -అంటూ చెప్పుకుపోతున్నదామె డైనింగ్ హాల్ వేపు చూస్తూ...

"నీవు, నీవు కావాలి!"... అని నాలుక్కరుచుకున్నాడు నీలకంఠరావు. పరధ్యానంలో ఉండి, ఆమె తన ఆలోచనల్లో నిండిపోగా! అతని చెయ్యి అప్రయత్నంగా మరలా ఎడమ చెంపను నిమురుకుంటున్నది.

"నువ్వేం మారలేదు"... అన్నదామె. ఇప్పుడామెలో ఆనాటి కోపం లేదు. అరక్షణంలో రుద్రకాళి అవతారం దాల్చి తన చెంపను పగలగొట్టిన స్వప్న కాదీమె!

"సారీ! టంగ్ స్లిప్!" అన్నాడతడు.

"ఐ నో! ఫ్రాయిడియన్ స్లిప్" అన్నదామె.

"మై హజ్బెండ్ ఈజ్ కమింగ్..." ఆమె అంటుండగానే కాలింగ్ బెల్ మోగింది. స్వప్న వెళ్లి తలుపు తీసింది.

"కృష్ణప్రసాద్. మై హబ్బీ! డియర్! హి ఈజ్ నీలకంఠరావు"... ఆమె చెబుతుండగానే అతడు నీలకంఠరావుతో కరచాలనం చేస్తూ "నీలకంఠరావు - ఫేమస్ సైకియాట్రిస్ట్.... ఐనో! గ్లాడ్‌టూ మీచ్యూ - బి సీటెడ్ సర్" అన్నాడు కృష్ణప్రసాద్. స్వప్న డైనింగ్ హాల్లోకి వెళ్లింది. లంచ్ ఎరేంజ్ చేయడానికని.

"ఇవ్వాళ మీ ఉపన్యాసం విన్నాను. కొన్ని నచ్చాయి. అఫ్‌కోర్స్ అన్ని అభిప్రాయాలూ నచ్చాలనేదేమున్నది?" అన్నాడు కృష్ణప్రసాద్. పెయింటర్స్,

ఆర్టిస్ట్స్ అండ్ దైర్ మెంటల్ స్టేట్స్, సూయిసైడ్స్ మీద చెప్పింది ప్రతిదానితో నేను మీతో ఏకీభవిస్తాను. స్వప్నతో నేను చెప్పేది అదే! ఆ పెయింటింగ్ చూడండి. డార్క్ బ్లూ - డిప్రెషన్; స్టార్స్- మెటీరియలిస్టిక్ థింగ్స్ - మధ్యలో ఆమె మొహం - డిప్రెషన్‌లో మునిగిపోతుందా? ఎందుకు? డాక్టరు గారూ! మీరు చెప్పండి! అన్ని భోగభాగ్యాలూ ఆమెకున్నాయి! అంతులేని సంపదలు, కో అంటే కోటిమంది నౌకర్లు, చాకర్లు, ఎప్పుడూ డల్‌గా ఉంటుంది. ఏం అంటే మాట్లాడదు! ఇక్కడున్న సీనియర్ సైకియాట్రిస్ట్‌లకు చూపించాను. ఆమె పెయింటింగ్స్‌ను కూడా 'ఎనలైజ్' చేయించాను. 'వాన్ గో'లా ఆత్మహత్య చేసుకుంటుందేమోనని నా భయం! You know - ఐ హేట్ సూయిసైడ్స్! ఇంతకీ 'వాన్‌గో'ది హత్యా? ఆత్మహత్యా?

చిన్నప్పుడు మీరు ఆమె క్లాస్‌మేట్ అటగదా... ఒకే ఊళ్లో పుట్టి పెరిగారట. ఇంటర్ వరకు కలిసి చదివారట. నాకు తెలుసులెండి! మీరైనా చెప్పండి. అంత మూడీగా ఉంటే ఏ హజ్బెండ్ అయినా ఎలా భరించగలడు! నా పర్సనల్ విషయాలు చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెడ్తున్నానా! మీరు లంచ్‌కి వస్తున్నారని స్వప్న ఇందాక ఫోన్ చేసింది. నాకోసం వస్తే అనుకోకుండా మీరు కలిసారట కదా! లైఫ్ ఈజ్ ఫుల్‌ఆఫ్ సర్‌ప్రైజెస్!" - కృష్ణప్రసాద్ మాట్లాడ్తూనే ఉన్నాడు.

గలగల నవ్వుతూ, ఇతరుల్ని నవ్విస్తూ, ఎప్పుడూ మాట్లాడుతూ సందడి సందడిగా ఉండే స్వప్న, సైలెంట్‌గా మారిందా? కారణం ఎవరు? ఇతడేనా? అందరికి సలహాలిచ్చే తన మానసిక పరిస్థితి ఏమిటి?

"నిజం చెప్పాలంటే ఇంత హాయిగా నవ్వి చానాళ్లయ్యింది" - పొద్దున ఆమె అన్న మాటలు గుర్తుకొచ్చాయి. స్వప్న మౌనానికి కృష్ణప్రసాద్ కారణమయితే ఆమె నవ్వులకు కారణం తనేనా! అంటే! మరెందుకు అప్పుడు పదిమందిలో చెంపదెబ్బ కొట్టి అవమానించింది? సామాజిక, ఆర్థిక సోపానాలలో తను కింద ఉండడం... ఆమెపైన ఉండడం, కారణమా?

*"ఆమెను ప్రేమిస్తున్నావా? నీ స్తోమత ఏమిటి? నీ కులమేమిటి? నీ చదువూ తెలివితేటలూ సంపాదనా ఆమె కుక్కపిల్ల ఖరీదు చెయ్యవు"* అన్నది కదూ ఆమె *ఫ్రెండ్, చెంపదెబ్బ బోనస్‌గా, మరో కనబడని దెబ్బ కొడ్తూ-*

"రండి! భోజనానికి" అందామె. ఆమె ముఖంలో ఇందాకటి కాంతి, ఉత్సాహం లేవనిపించింది నీలకంఠరావుకు. పనిమనుషులు వడ్డిస్తుంటే ముగ్గురూ భోజనాలు కానిచ్చారు. కృష్ణప్రసాద్ ధారాళంగా మాట్లాడ్తూనే ఉన్నాడు. తనూ, తన పలుకుబడి, తన సామ్రాజ్యం, అంతా తనే! ఇతరులు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదు. మధ్యమధ్యలో పనిమనుషుల్ని తిడుతున్నాడు, కారణమేదీ లేకుండా; సినీతారలు తనతో ఎలా కలిసిమెలిసి తిరుగుతారు. 'యునో! దోస్ బిచెస్ – మనీ సార్, మనీ – దట్సాల్!'

స్వప్న మౌనంగా వింటున్నది.

"చూడండి నీలకంఠరావు గారూ! తను చూడండి! ఎలా ముంగిలా కూర్చుంటుందో! నో డిస్కషన్స్! నో ఇంటలెక్చువల్ ఆర్గ్యుమెంట్స్. కాసేపు ఆఫీసు పని చేస్తుంది. ఇంటికి వచ్చి అదుగో ఆ పిచ్చి గీతలు! ఆ నల్లని, ముదురాకుపచ్చ పెయింటింగ్స్! డార్క్ బ్లూ – డిప్రెసింగ్ యూనో!"

"హేయ్ స్వప్నా! టేక్ హిజ్ సజెషన్" అన్నాడు కృష్ణప్రసాద్. ఆమె మాట్లాడలేదు.

భోజనాలనంతరం కృష్ణప్రసాద్ స్వయంగా నీలకంఠరావును హోటల్ వద్ద దించాడు.

* * * * * *

కరోనా వచ్చాకమానసిక రోగుల సంఖ్య పెరిగింది. వ్యాధి భయం, వైద్య భయం, ఒంటరితనం భయం, మరణ భయం...

నీలకంఠరావు బిజీగా ఉన్నాడు. లిస్టులో ఆఖరి పేషంట్ పేరు స్వప్న.

తన స్వప్న ఎలా ఉన్నదో! ఎప్పుడూ ఆమెను మరచిపోయింది లేదు. "ప్లీజ్ సెండ్ హర్ ఇన్" అన్నాడు నీలకంఠరావు.

ఆమె లోనికి వచ్చింది పేషంటుగా. డాక్టర్ నీలకంఠరావు గుండె ఝల్లుమన్నది. లేచి విష్ చేసి సీటు చూపించాడు. తన ముందు కూర్చున్నది. ప్రతి పేషంట్‌నూ కనీసం ఇరవై నిముషాలు కౌన్సిలింగ్ చేసే నీలకంఠరావు నిశ్శబ్దంగా ఆమెను చూస్తూ ఉండిపోయాడు. గలగలలాడుతూ, నవ్వుతూ వెన్నెలలు విరజిమ్మే ఆమె అతనివేపు చూస్తూ అలానే కూర్చున్నది.

ఇద్దరి మౌనంలో ఎన్నో సంభాషణలు.

చాలాసేపటికి ఆమె అన్నది- "అతడెంత డామినేట్ చేస్తాడో తెలుసా నీలూ! నేను ఏమాత్రం భరించలేని స్థితి! శాడిస్ట్ అయిపోయాడు. నామీద ప్రైవేట్ డిటెక్టివ్‌లను పెట్టాడు. నేనెవరితో మాట్లాడినా వాళ్లకూ నాకు రంకు కడ్తున్నాడు. పడక గదిలో నన్ను దారుణంగా అవమానం చేస్తాడు. ఎన్నోసార్లు విడిపోదామని ప్రయత్నించాను. ప్రతిసారీ పిరికితనంతో వెనక్కు తగ్గేదాన్ని. కొన్నిరోజులు మారినట్లు నటిస్తాడు. మరల మామూలే! ఈ జీవితానికి అలవాటు పడిపోయానేమో! శత్రువుతో సంసారం నాది. I am sleeping with enemy. నా నవ్వును, నా మాటను దొంగిలించాడు. నాశనం చేసాడు నన్ను. నన్ను మానసికంగా చంపేసాడు. మాకు పిల్లలు కలగక పోవడానికి నేను కారణమంటాడు. రెండుసార్లు అబార్షన్లు. దాదాపు చచ్చి బతికాను. అమ్మా, నాన్నా చనిపోయాక మరింత ఒంటరిదాన్ని, పిరికిదాన్ని అయ్యాను. పిల్లలు లేకపోవడం నాలో ఇన్‌ఫిరియారిటీ కాంప్లెక్సును మరింత పెంచింది.

మనిద్దరం ఒక ఊరివాళ్లమేనన్నది, నీవు నన్ను ప్రేమించిన సంగతి, నిన్ను నేను అవమానించిన సంగతి, ఆ తరువాత నీవు పెళ్లి చేసుకోలేదన్నదీ అతడు కనుక్కున్నాడు. నీకూ నాకూ మధ్య ఏదో సంబంధమున్నదని వాడి అనుమానం. నీలూ! నేను నిన్ను 'నీలూ' అని పిలుస్తానని కూడా వాడికి తెలుసు".

నీలకంఠరావు గమనిస్తున్నాడు - అతడిస్థాయి వాడి స్థాయికి దిగజారింది.

ఆమె చెప్పుకుపోతూనే ఉన్నది-

"నా ఫోన్ టాపింగ్ చేస్తున్నాడు. ఈ ఆర్నెల్లలో నీకేమన్నా మెసేజ్‌లు పంపానా, మాట్లాడానా అని ఇన్వెస్టిగేట్ చేయిస్తున్నాడు. ఇప్పుడు వాడి డిటెక్టివ్ ఇక్కడకు వచ్చే ఉన్నాడు. నేనంటే నీకిష్టమని, నన్ను ప్రేమిస్తూనే ఉన్నావని, అతడికి తెలుసు. నీకు తెలీకుండా నీ ఇల్లు సోదా చేయించాడు. నీ బెడ్‌రూంలో నా ఫోటో ఉన్న సంగతి నాకు చెప్పి మనిద్దరి మధ్య ఏదో ఉన్నది నన్ను ఒప్పుకొమ్మని ప్రతిరోజూ చిత్రవధ చేస్తున్నాడు.

నీలూ! ఈ ఆర్నెల్లకు ముందు నీవు నా దృష్టిలో నన్ను ప్రేమించిన అనేకమందిలో ఒకడివి. నా చేత చెంపదెబ్బ తిన్నవాళ్లలో మొదటివాడివి. బాల్య

స్నేహితుడివి. అంతే! చిన్నప్పటి నుంచీ నీతో మాట్లాడడం నాకిష్టమే కాని మా అంతస్థు, డబ్బు, కులగౌరవం లాంటి గోడలు నిన్ను నా సమానస్థాయిలో ఎప్పుడూ ఊహించనివ్వలేదు. కాని ఈ ఆర్నెల్లలో అతడు మనపై చేస్తున్న ప్రతి సోదా, నిందా, నీపై నాకు ప్రేమను మొలకెత్తించి, దినదినం పెంచుతున్నాయి. ఇప్పుడు నా మనసు నిండా నీవే, ప్రతిక్షణం, నాలోని ప్రతికణం ఇప్పుడు నీకోసం బతకాలంటున్నది. నీలూ! నీలూ! అని కలవరిస్తున్నది. ఇన్నేళ్ల నీ ప్రేమ, ఆరాధనలోని నిజాయితీ నాచుట్టూ ఉన్న అడ్డుగోడల్ని సమూలంగా తొలిగించి వేసింది.

ఆ రాక్షసుడి నుంచి నన్ను దూరంగా తీసుకుపో నీలూ! నా నవ్వును, నా మాటను బతికించు! నన్ను నన్నుగా బతకనీ! కాని వాడన్నట్లు నేను ఆత్మహత్య చేసుకోను! బతికి నీకోసం సుందర స్వప్నాల్ని చిత్రిస్తాను. నీ స్వప్నగా నిజమౌతాను."

నీలకంఠరావు స్వప్నమలా నిజమైంది.

* * * * * *

తన వస్తువు పరాయివాళ్ల చేతుల్లోకి పోవడం సహించలేని కృష్ణప్రసాద్ వాళ్లిద్దరి హత్య చేయడానికి పథకం వేసి విఫలమై, తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోగా– ఆ తరువాత వాళ్లిద్దరికీ, ప్రపంచానికి వేర్వేరు విధాలుగా తెలిసింది.

✧✧✧✧✧

(ఈ నీలి త్రికోణంలో– నీలకంఠరావు ఆత్మహత్యా భావాల ఒత్తిడిని చిన్నవయసులోనే జయించి వాటిని తన ఎదుగుదలకు తోడ్పడేలా చేసుకోగలిగాడు. అతడు తోడుంటే తనకు ఈ దిగులు, నిరాశ దగ్గరకు రావనే నమ్మకం కలగగానే స్వప్న తనలో ప్రవేశిస్తున్న ఆత్మహత్యా భావాలను తుంచివేయగలిగింది. తనేం చెబితే అదే జరగాలని కోరుకునే కృష్ణప్రసాద్ తనను ఎదిరించిన వాళ్లపై కలిగిన ఆగ్రహాన్ని విధ్వంసానికి వినియోగించి అది విఫలం కావడంతో డిప్రెషన్‌కు లోనై ఆ ఆగ్రహాన్ని తనపైకి మరలించుకుని తన జీవితాన్ని అంతం చేసుకున్నాడు)

★★★★★

# 16. చిన్న తప్పు - పెద్ద ముప్పు
## (The Butterfly Effect)

అతడికి చాలా కోపంగా వుంది. కోపం ఆరోగ్యానికి శాపం!

అది అతడికీ తెలుసు! అందరికీ తెలుసు!

అతడి కోపం అందరికీ శాపమని ఎందరికి తెలుసు?

డేవిడ్ కుతకుతలాడిపోతున్నాడు- తనలాంటివాడే ఆరన్-

ఏం తప్పు చేసాడని ఆరన్ స్వార్ట్జ్‌కు ఇంత పెద్ద శిక్ష?

పుట్టింది 86లో, 2013కే నూరేళ్లు నిండాలా?

పదమూడేళ్ల వయసులో 'ఆర్స్ డిజిటా ప్రైజు'- అందరికి ఉపయోగపడే వెబ్‌సైట్ క్రియేట్ చేసాడనేకదా ఇచ్చింది! పధ్నాలుగో ఏట RSS 1.0 వెబ్ వర్షన్ వర్కింగ్ గ్రూపులో మెంబరు, ఆ తరువాత ఎన్నెన్ని విజయాలు!

వరల్డ్ వైడ్ వెబ్ కన్సార్టియం ($W_3C$) కోర్ గ్రూపులో పనిచేసాడు. Reddit సోషల్ న్యూస్ సైట్, ఇన్ఫోగామి స్థాపన, హార్వర్డ్ యూనివర్సిటీలో రిసెర్చిఫెలో, Demand Progress ఆన్‌లైన్ గ్రూపు స్థాపకుడిగా, 'స్టాప్ ఆన్‌లైన్ ప్రైవసీ ఏక్ట్'ను వ్యతిరేకించే బృందంలో సభ్యుడిగా, The Baffler కు సహసంపాదకుడిగా ఇంత చిన్న వయసులో ఇవన్నీ ఎవరికి సాధ్యం?

ఇంతకూ అతడు చేసిన నేరమేమిటి? JSTOR ఎకడమిక్ జర్నల్స్‌ను డౌన్‌లోడ్ చేయడమేగా! ఇన్ఫర్మేషన్ అందరికి అందుబాటులో ఉండాలనేదేగా అతడి ప్రయత్నం. దాని వలన ఎవరికి హాని జరిగింది? ఆ మాత్రం దానికి అటువంటి మేధావిపై Wire fraud, Computer fraud and abuse act కింద నేరారోపణ చేస్తారా? రెండేళ్ల పాటు నానా మానసిక హింసలూ పెట్టారా!

చివరికి ఏం మిగిలింది వీళ్లకు! జనవరి, పదకొండు 2013 నాడు ఆ మేధావి తన ఇంట్లో, Crown Heights, Brooklyn లో ఉరివేసుకుని మరణించాడే! ఇంత ఘాతుకమా! ఇరవై ఏడేళ్లకే బలవన్మరణమా!

ఈ వార్త చూడు! చైనా హాకర్లు పెంటగాన్ ఆయుధ రహస్యాల్ని ఒక్క మీటనొక్కి మొత్తం కాజేయలేదా! నోరు మెదపడం లేదెందుకని ఈ రక్షణ శాఖ ఇన్వెస్టిగేటర్లు! ఆరన్ స్వార్ట్జ్ బతికుంటే, ఒక్క సలహా అతడిని అడిగుంటే మన రహస్యాలను ఎలా కాపాడుకోవాలో చెప్పేవాడు కాదా! మన మేధావులపై చిన్నచిన్న నేరాలు మోపి చిత్రహింసలు పెట్టవచ్చా! అది నేరం కాదా! ప్రతి పరిశోధనా ముందు విధ్వంసానికే వినియోగించబడ్తుందని వీళ్లకు తెలవదా?'-

తనకు ఆరాధనీయుడైన ఆరన్ చావుకు ప్రతీకారం తీర్చుకోవాలి. డేవిడ్ బుర్రలో ఎన్నో ఆలోచనలు! గత సంవత్సరకాలంగా ఇదే ఆలోచిస్తున్నాడు. జనవరి 11, 2021. ఆరన్ స్వార్ట్జ్ చనిపోయి ఖచ్చితంగా ఎనిమిదో సంవత్సరం నాటికి ఏదో ఒహటి చేయాలి! అతడి ఆత్మకు శాంతి కలిగించాలి. Aaron, I Love You Ron! మేం నిన్ను మరిచిపోము!

తన ఇన్నాళ్ల శ్రమ ఒక కొలిక్కి వచ్చింది. సూపర్ కంప్యూటర్ల జాబితా, వాటి I.P. నంబర్లు; ప్రపంచంలో అన్ని కంప్యూటర్లకు అనుసంధానాలు చేయడం, సెక్యూరిటీ వలయాలను ఛేదించడం, ఫైర్‌వాల్స్‌ను బ్రేక్ చేయడం, పాస్‌వర్డ్స్ ఆటోమాటిక్ రికవరీ స్టోరేజీ, ఒక్క సెకనులో వందో వంతు లోపల ఇన్ఫర్మేషన్ రిట్రీవల్ చేయడం, పంపడం ఇటువంటి పనులన్నీ తన మాస్టర్ కంప్యూటర్‌కు అప్పచెప్పాడు. సక్సెస్!

తన కంప్యూటర్ ఆచూకీ దొరకకుండా ఉండడానికి ఓ డజను శక్తివంతమైన హార్డ్ డిస్కులు, సీరియల్‌గా జతచేసి ప్రతిదానికి సెక్యూరిటీ లాక్‌లు ఎరేంజ్ చేసాడు. ఇప్పుడు తనకు కావాల్సిన సమాచారం మాత్రమే మాస్టర్ కంప్యూటర్‌లోకి వస్తుంది. తను పంపాలనుకున్నదే బయటకుపోతుంది. తనుండే ప్రదేశాల్ని, హార్డ్‌డిస్కుల్నీ ముప్పై నలభై రోజులకోసారి మారుస్తూ ఫెరిఫరల్స్‌ను వాడుతూ, తీసివేస్తూ ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేటర్లకు దొరకకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు.

ఇక ఫైనల్ ప్రోగ్రాం రాస్తున్నాడు. కోవిడ్-19లా ఇది Deadly VIRUS- (Vital Information Resource under Seize). ఈ వైరస్ ప్రతి కంప్యూటర్ స్క్రీన్ మీదా ప్రత్యక్షం కావాలి! పాప్‌అప్‌గా! Pop up లో రెండు బటన్‌లు.... Yes, No.

"Hi! I am Aaron ! Don's switch off me, Please!

Hanging is my passion, that is todays fashion.

If you donot want to see this message press 'Yes' button thrice, Otherwise press 'No' button twice"-

డేవిడ్ కంప్యూటర్ బుర్ర మరింత వేగంగా పనిచేస్తున్నది. ఇప్పుడు రాయబోయేది అసలు ప్రోగ్రాం-

If 'Yes' button is pressed once a = a

If 'Yes' button is pressed twice a = e

If 'Yes' button is pressed thrice a = i

If 'No' button is pressed once a = o

If 'No' button is pressed twice a = u

If 'Yes', 'No' buttons are pressed o = a ... మిగతా ప్రోగ్రామ్ వ్రాసి 'పాస్‌వర్డ్స్' రెండు ఎటాచ్ చేసాడు.

దీని వలన జరగబోయే ఎఫెక్ట్స్ తలుచుకుంటేనే డేవిడ్‌కు ఒళ్లు పులకించిపోతున్నది. ఈ ప్రోగ్రామ్ ప్రతి కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లోని FAT (Factor Allocation Table) పదో సెక్టారులోకి వెళ్లేట్లు చేస్తాడతను. అంతే! ఇంకేముంది. 'Yes' నొక్కినా, 'No' నొక్కినా, నొక్కకపోయినా అచ్చులు (Vowels) అచ్చుతప్పులై మొత్తం అల్లకల్లోమే!

అచ్చులు లేని పదాలు లేవు,

అచ్చు తప్పులు లేని ప్రోగ్రాములూ లేవు.

ప్రోగ్రాములు లేకుండా వైరస్ ఉండదు.

వైరస్ వచ్చాకేగా వాక్సీన్ వచ్చేది.

మెక్‌ఫీలు, కాస్పరిస్కీలు ఇవన్నీ కాపలా కుక్కలే,

కాస్త రొట్టెముక్క వేస్తే నోరు మూసుకునే శునకాలే!

వీటి నోరు ముయ్యాలి ముందు!

అందుకే ఏంటీ వైరస్ ప్రోగ్రాంలోకే చొరబడ్డాడు.

వైరస్ స్కాన్‌లో (Scan) 'a' ఉన్నది. పదం మారితే స్కానింగ్ ఆగిపోయి తన వైరస్ దెబ్బకు నిర్వీర్యమైపోతుంది. వైరస్‌కు వైరస్సే విరుగుడు. ఆరన్ హాంగ్ చేసుకుని చనిపోయాడు. ఈ కంప్యూటర్లూ హాంగ్ అవుతాయి.

ఇంట్రానెట్ ఏక్టివేట్ చేసి చిన్న కంప్యూటర్‌లలో ప్రోగ్రాం ప్రవేశపెట్టి ఫలితాలు సరిచూసాడు. మొత్తం ఆరు ఎఫెక్టులు, వాటికి రివర్స్ ప్రోగ్రాములు ఫిల్టర్స్ వ్రాసాడు. ఇప్పుడున్న ఏంటివైరస్ సాఫ్ట్‌వేర్‌లకన్నా తను తయారుచేసేది అత్యంత శక్తివంతమైనదవుతుంది. తన పంట పండుతుంది. బ్యాంకు బాలెన్సు ఆకాశాన్నంటుతుంది.

ముందు 'పోర్న్' వెబ్‌సైట్లను పనికిరాకుండా చేయాలి! అవి సమాజానికి చీడపురుగులు. అంతేకాదు వాటికున్న ఖాతాదారులూ ఎక్కువే! నీలి చిత్రాలు చూసేవాడు ఆ ఉబలాటంలో ఎన్నిసార్లు బటన్ నొక్కుతాడో ఎవడికి గుర్తు. అయినా వాటిని చూసేది కుర్రకారే! అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అయితే మరీనూ. వాళ్ల దగ్గరుండేది పైరసీ సాఫ్ట్‌వేర్లు. పైరసీ మీద కూడ దెబ్బదీయ గలుగుతాడు తాను.

రెండోది ఏస్ట్రాలజీ వెబ్‌సైట్లు– సగం జనానికి సెక్స్ పిచ్చి, మరో సగానికి జాతకం పిచ్చి. వాడికదో వెర్రి, వీడికిదో వెర్రి. ఈ వెర్రిబాగులోళ్లని బాగు చెయ్యాలంటే ముందు విశాల ప్రపంచపు సాలెగూడు– 'వరల్డ్ వైడ్ వెబ్'ను నాశనం చెయ్యాలి. అదే తన ప్రయత్నం.

ఆరన్ స్వార్ట్జ్– 'ఇన్ఫర్మేషన్–సమాచారం' అందరికీ అందాలన్నాడు.

ఈ డేవిడ్ చెడు నాలెడ్జ్ ఎవ్వరికీ అందకూడదంటున్నాడు!

అంతే తేడా! కాని ఆశయం ఒక్కటే!

కాలక్షేపానికి కార్డులు సృష్టిస్తే పత్తాలాటలో మొత్తం పోగొట్టుకుంటున్నట్లు స్టోరేజ్ కోసం కంప్యూటర్లు కనుక్కుని అడ్డమైన చెత్త చూసి, అడ్డదార్లు పడ్తున్నారు.

బాబెల్ గోపురంతో భగవంతుడ్ని అందుకోవాలనుకున్నట్లు...

ఈ కొత్త పోకడలతో సైతానుకు మొక్కుతున్నారు.

సృష్టికర్తకు కోపం వస్తే చూడ్డానికేం మిగుల్తుంది?

డేవిడ్ అనుకున్నాడు. 'తనూ ఒక సృష్టికర్తే!'

డెడ్లీ వైరస్ సృష్టికర్త.

ఇప్పుడు తన చేతిలో లక్షలాది కంప్యూటర్ల బతుకులున్నాయి.

ఒక్క మీట నొక్కితే చాలు అంతా గజిబిజీ గందరగోళమే!

బాబెల్ గోపురాన్ని దేవుడు ధ్వంసం చేయలేదా?

తను చేస్తే తప్పేమిటి?

మాస్టర్ కంప్యూటర్‌ను ఏక్టివేట్ చేసాడు డేవిడ్.

ముందుగా 'పాప్ అప్'ను రిలీజ్ చేసాడు.

కొత్త వైరస్ సర్వీస్ ప్రొవైడర్ల సెక్యూరిటీ దృష్టిలో పడేలోపునే అసలు వైరస్‌ను అప్‌లోడ్ చేసాడు. స్క్రీన్‌పై 'పాస్‌వర్డ్' అన్న కాలమ్ వచ్చింది. వైరస్ ఏక్టివేట్ కావాలంటే పాస్‌వర్డ్ టైప్ చేసి 'ఎంటర్' (Enter) నొక్కితే చాలు! ఇప్పుడు చేయాల్సింది 'Yes' or 'No' బటన్ నొక్కి మరల Enter నొక్కాలి. అంతే!

ఒక పాస్‌వర్డ్‌తో చెడు వెబ్‌సైట్లు మూలనపడ్తాయి. పీడా వదుల్తుంది.

ఇంకో పాస్‌వర్డ్‌తో సూపర్ కంప్యూటర్లలోకి వైరస్ చేర్తుంది. అది వద్దు ఇప్పుడు. వెరీ డేంజర్! –అనుకున్నాడు డేవిడ్.

స్కూలు నుంచి రోనాల్డ్‌ను తీసుకుని మార్గరెట్ వచ్చినట్లుంది. కాలింగ్ బెల్ మోగింది.

'తలుపు తీశాడు. సారీ! డిస్టర్బ్ చేసానా! 'కీ'స్ మర్చిపోయాను'– అందామె.

'హాయ్ డాడ్' – అన్నాడు రోనాల్డ్– అంటూనే లోపలకు పరుగెత్తాడు.

'కీస్ కాదు మర్చిపోయింది, కిస్' – అన్నాడు డేవిడ్ హాపీ మూడ్‌లో

'కమాన్! లెటజ్ హావ్ సమ్ కాఫీ' – ఇద్దరూ కిచెన్‌లోకి వెళ్లారు.

ఏడేళ్ల రోనాల్డ్ హుషారుగా ఉన్నాడు.

ఇవ్వాళ వెరొనికా బర్త్‌డే!

విషెస్ చెప్పగానే 'ఐ లవ్‌యూ రాన్' అన్నది వెరొనికా నవ్వుతూ!

తానూ అన్నాడు 'ఐ లవ్‌యూ రాన్' అని, వినీ వినబడకుండా!

ఇద్దరి ముద్దుపేర్లూ 'రాన్'– బాగుంది కదూ! వెరీగుడ్ ఫ్రెండ్స్. ఒకే జట్టు! ఒకే పేరు!

డాడీ కంప్యూటర్ ఆన్ చేసే ఉంది.

కోప్పడతాడేమో! 'సారీ' చెబ్దాంలే!

ముందు 'వెరోనికా'కు మెసేజ్ పంపుతా! సర్‌ప్రైజ్ చేస్తా!

ఏమని?

కీ బోర్డులో ఒక్కొక్క అక్షరం నొక్కాడు రోనాల్డ్.

I LOVE U RON

'డాడీ! వెరొనికాకు మెసేజ్ పంపాలంటే ఏం నొక్కాలి?'

'Enter'! అన్నాడు కిచెన్‌లోంచి డేవిడ్ అప్రయత్నంగా!

రొనాల్డ్ నొక్కాడు.

కంప్యూటర్ స్క్రీన్ ఒక్కసారి కదిలినట్లయ్యింది.

అంకెలు, ఏవేవో అక్షరాలు ఆగకుండా కదుల్తూనే ఉన్నాయి.

కాఫీ తాగుతూ వస్తున్న డేవిడ్ కళ్లు కంప్యూటర్ స్క్రీన్ మీద నిలిచిపోయాయి.

అక్షరాలు కదిలి కదిలి ఆగిపోయాయి.

కంప్యూటర్ స్క్రీన్ బ్లింక్ అయ్యింది.

ఆఫ్ అయి మరల కాంతివంతమయ్యింది.

స్క్రీన్ పైన మెసేజి–

"Hi! I am Aaron ! Don't switch off me, please

Hanging is my passion, that is today's fashion"

- If you do not want to see this message press 'Yes' Button thrice; Otherwise press 'No' button twice -

దాదాపు పరిగెత్తుకుంటూ వస్తూ డేవిడ్ ఏదో చెప్పబోయేలోపునే రోనాల్డ్ 'Yes' బటన్‌ను రెండు మూడు సార్లు నొక్కాడు. తర్వాత Enter బటన్ నొక్కేసాడు.

ప్రపంచంలోని అన్ని కంప్యూటర్లతో పాటే తన కంప్యూటరూ 'హాంగ్' అయ్యింది. వరల్డ్ వైడ్ వెబ్‌లు, రక్షణశాఖ రహస్యాలు, మిస్సైల్స్ కంట్రోళ్లు, విమానాల నియంత్రణ, లిఫ్ట్‌లూ, యంత్రాలూ, బ్యాంకులూ, కంప్యూటర్ల మీద ఆధారపడిన సమస్త నాగరికతా సర్వనాశనం; గందరగోళం! ఏం జరుగుతుందో, ఏం జరిగిందో ఎవరికీ తెలియక విధ్వంసం!

డేవిడ్ బిత్తరపోయి చూస్తున్నాడు.

ఆ పాస్‌వర్డ్- సూపర్ కంప్యూటర్‌లకోసం పెట్టింది. ఎలా ఆన్ అయ్యింది? రోనాల్డ్ కెలా తెలుసు?

రోనాల్డ్ అంటున్నాడు మార్గరెట్‌తో- 'అమ్మా! వెరొనికాకి ఏమని మెసేజ్ పంపానంటే- ఒక్కొక్క అక్షరం వత్తిమరీ చెబుతున్నాడు- I LOVE U RON.

✧✧✧✧✧

(**Butterfly Effect-** ఎక్కడైనా ఒక చిన్న మార్పు సంభవిస్తే దాని ప్రభావం ఎక్కడో సుదూరంగా ప్రళయంగా మారడాన్ని Butterfly Effect అంటారు.

1952లో రే బ్రాడ్‌బరీ తన కథ 'ఎ సౌండ్ ఆఫ్ థండర్'లో ఒక్క సీతాకోక చిలుక తన రెక్కలను కదిలిస్తే సుదూరంగా ఎటువంటి అలలు వస్తాయో అని టైమ్ ట్రావెల్ గురించి వ్రాసాడు.

1961లో ఎడ్వర్డ్ లొరెంజ్ 0,506127 కు బదులు 0.506తో గుణిస్తూ వాతావరణాన్ని సూచించబోగా దానిలో వచ్చిన తేడా చాలా ఎక్కువగా ఉండి

సమాచారం తప్పుగా వచ్చింది. అది తన మిత్రుడితో చెబితే– ఒక సీగల్ పక్షి రెక్కలు కదిలిస్తే వాతావరణం మారిపోతుందా?' –అన్నాట్ట.

దాన్నే ఎడ్వర్డ్ లొరెంజ్ ఒక సమావేశంలో– Does the flap of a Butterfly's wings in Brazil set off a tornado' in Texas? అన్న పేరుతో పరిశోధనా పత్రాన్ని సమర్పించాడు.

Butterfly Effect ఆధారంగా It is a wonderful life, Brazil, Blind chance, sliding doors, The Butterfly effect, Run Lola run, 12B అనే తమిళ సినిమా లాంటివి వచ్చాయి.)

★★★★★

# 17. యముని మహిషపు గంటల చప్పడు

ఘల్లు ఘల్లుమంటున్నది.

"ఎక్కడా? నాకేం వినబడడం లేదే!" అన్నాడు యస్.ఐ. మల్లేశం.

"ఏమోసార్! ఏదో ఘల్లుఘల్లు, గజ్జెల చప్పుడులా" అన్నాడు కానిస్టేబుల్ ఏకదంతం చెవులు నిక్కబొడిచి వినడానికి ప్రయత్నిస్తూ.

"రాత్రేమన్నా మందెక్కువయ్యిందా! నానా అడ్డమైన సరుకూ తాగితే రాత్రి తెల్లార్లు రకరకాల గజ్జెల చప్పుళ్లు వినబడ్తాయి" అన్నాడు మళ్లీ యస్.ఐ. మల్లేశం.

పక్కనే గుడి గంటలు మోగాయి. ఏకదంతం కళ్లు మూసుకుని లెంపలేసుకున్నాడు.

"అదీ సంగతి! గుడి గంటలు విని ఉంటావులే, పని చూసుకో" అన్నాడు పక్కనున్న ఏసుపాదం. ఇతడు ఏ.ఎస్.ఐ.

"ఈ గంట గణగణమన్నది. నే విన్నది ఘల్లుఘల్లు మన్నది సార్!" అన్నాడు ఏకదంతంవిడవకుండా.

"ఇది ఖచ్చితంగా ఓవర్‌డోసు మహాత్యమే! ఏకదంత మహాప్రభూ! మేం బయటకు వెళ్తున్నాం! తమరు స్టేషన్లో తీరిగ్గా కూర్చుని రకరకాల గంటల చప్పుళ్లను విని వివరంగా నోట్ పుటప్ చేయండి" అని వెటకారంగా ఒక నవ్వు నవ్వి యస్సై, ఏయస్సై, కానిస్టేబుల్స్ వెంటరాగా ఏదో కేసు విచారణ గురించి బయటకు వెళ్లాడు. జీపు వెళ్లిన చప్పుడు.

ఏకదంతం స్వతహాగా మంచివాడూ, దైవభక్తుడూ, జాలీ దయా కలవాడు. అంచేత ప్రతిమనిషిలోనూ దేవుడుంటాడని నమ్మేవాడు గనుక దొంగల్లో కూడ దేవుణ్ణి చూసి జాలిపడి వదిలేసేవాడు. అందుకని జీవితాంతం ప్రమోషన్లు

రాని కానిస్టేబుల్‌గానే మిగిలిపోయాడు. రిటైర్మెంట్ వచ్చే నెలలోనే ఉంది కనుక అతడిని ఫ్రీగా వదిలేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ నిశ్శబ్దంగా ఉంది. లాకప్ ఖాళీగా ఉంది.

మళ్లీ గుడిగంటలు మోగాయి. యథావిధిగా ఏకదంతం దేవుణ్ణి స్మరించి లెంపలేసుకున్నాడు.

ఇది గుడిగంటల చప్పుడు గణగణమని కాని, ఇందాక తను విన్నది వేరేరకంగా లేదూ అదెట్లా ఉందంటే

"ఘల్లుఘల్లు"

అదిగో అదీ. ఇదేగదా తనకు వినబడింది. ఎవ్వరూ వినలేదంటారేవిటి? బయటకు వచ్చి చూసాడు. దగ్గర్లో ఎక్కడా ఎవ్వరూ లేరు. పహారా కాసే సెంట్రీ తప్ప!

-"దామోదరం! ఇటుగానీ ఎవరైనా వచ్చారా?" కేకపెట్టాడు

"లేదే!" అన్నాడు దామోదరం.

ఏకదంతం లోనికి పోయి తన కుర్చీలో కూర్చుని ఆలోచనలో పడ్డాడు.

మళ్లీ ఘల్లు ఘల్లు చప్పుడు.

కల్తీ సారా తాగితే ఇట్లా ఏమన్నా వినబడ్తాయా, చెవులు మందగించి. డాక్టరుకు చూపించుకోవాలి. కరోనా జ్వరం వస్తున్నదేమో! మాస్కు సరిగా పెట్టుకున్నాడు.

ఘల్లు ఘల్లు చప్పుడు దగ్గరగా ఉన్నట్లు అనిపించింది.

బహుశా దయ్యమేమో!

కొంపదీసి లాకప్‌లో ఉరేసుకుని చచ్చిన పాపిష్ఠి, ఖంగాళీ దాని కాళ్ల గజ్జెల చప్పుడు కాదు కదా!

ఒక్కక్షణం ఏకదంతానికి భయమేసింది.

ఛఛ! పోలీస్ స్టేషన్లో దయ్యాలా! లాకప్పులో పడెయ్యనూ కాళ్లకూ చేతుల్కి బేడీలు వేసి అనుకుని ధైర్యం తెచ్చుకున్నాడు.

ఘల్లు ఘల్లుమని చప్పుడు.

"పైకి చూడవయ్యా కానిస్టేబులూ! నేను రంగయ్యని" అని ఎవరో పిలిచినట్లు.

ఏకదంతం గాభరాగా పైకి చూసాడు. పైన ఏవీ కనిపించలేదు. సాలెగూళ్లు, బూజూ! ఛఛ! దులిపించాలి! యస్ఐ. గారికి చెపితే మళ్లీ తననే దులపమంటాడు. వెధవ గొడవ.

"నేను రంగయ్యని! ఏకదంతం! నీ చిన్నప్పటి స్నేహితుడిని!" –

తను కలగంటున్నాడా లేక ఏదన్నా దయ్యం మాటలు వింటున్నాడా! అటూ యిటూ చూసాడు. ఎవరూ కనిపించలేదు. లేచివెళ్లి కూజాలో నీళ్లతో ముహం కడుక్కుని రెండు గుక్కలు తాగాడు. రంగయ్య మొన్ననే కదా కలిసింది. వాడికేం మూడెకరాల పొలం. ఇద్దరు కూతుళ్లు. పెళ్లిళ్లు చేసి అత్తారిళ్లకు పంపేశాడు. హాయిగా ఉన్నాడు. నా పరిస్థితే అంతంత మాత్రమున్నది. రిటైర్‌మెంట్ దగ్గర పడ్డది. కొడుకులిద్దరూ దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. భార్య లేదు. ఒంటరి బతుకు.

"ఏకదంతం! ఆలోచనలు ఆపి నా మాట విను. తొందరగా! నీ సాయం కావాలి నాకిప్పుడు"–

ఘల్లు ఘల్లుమన్న చప్పుడు. అప్పుడే మళ్లీ గణగణ మోగిన గుడిగంటలు.

"అచ్చోసి ఆంబోతును వదిలినట్లు మన ఊళ్లో దున్నపోతును వదిలేస్తాం గదా! అది నా వెంట బడిందివ్వాళ. నేనేం చెయ్యలేదు. ఇదుగో ఈ గజ్జెల కర్రతో అదిలించానంతే. నా నారుమడి తొక్కుతూ ఖరాబు చేస్తున్నదని"–

ఏకదంతంకు గాభరా ఎక్కువైంది. రాత్రి బాగా తాగిన మాట వాస్తవమే. పిల్లలు రావడం లేదన్న దుఃఖం, రిటైర్మెంట్ దగ్గర పడిందన్నది మరో దుఃఖం. రెండిటినీ చల్లపరచడానికి రెండు పెగ్గులు ఎక్కువ తాగిన మాట వాస్తవం. తాగింది ఆర్.సి.ఏ. కదా! ఎప్పుడూ ఇలా కాలేదే!

"గజ్జెల కర్రతో అదిలించి తిట్టానంతే! నీయమ్మ! ఒళ్లు బలిసి నారుమడి తొక్కుతున్నావు, ఛల్!" అన్నా! అంతే! అది నా ఎమ్మట బడింది. బుసలు కొడ్తూ అది నామీదకు దూసుకు వస్తుంటే నా పై ప్రాణాలు పైనే పోయాయి. నా గజ్జెల

కర్ర గట్టిదే గదా, ఒకటి రెండు దెబ్బలు కొట్టేసరికి వెనక్కి తగ్గింది గాని మళ్లీ నా వెంటబడింది. నేను పరిగెత్తి పరిగెత్తి చింతచెట్టెక్కా గబగబా!"

ఏకదంతంకు ఏం చెయ్యాలో పాలుపోడంలేదు. రంగయ్యకు ఫోన్ చేద్దామనుకుని సెల్‌ఫోను తీసాడు. ఛార్జి అయిపోయింది కాబోలు ఎప్పుడు డెడ్ అయ్యిందో! ఛార్జి చేద్దామంటే స్టేషన్‌లో కరెంటు పోయి చాలా సేపయ్యింది.

"చింతచెట్టు మీద కూర్చున్నానా, అది కదలదే! రౌద్రంగా వచ్చి రెండు మూడు సార్లు చెట్టును కుమ్మింది. కిందకు దిగితే చంపేస్తుందేమోనని భయం. కదలకుండా కూర్చున్నాను. అప్పుడప్పుడూ గజ్జెలకర్రతో అదిలిస్తూ. ఆ దున్నపోతు పోలా అర్ధగంటయినా, చెట్టు చుట్టూ తిరుగుతూనే ఉన్నది. నా దగ్గర సెల్‌ఫోనుతో మా అన్నయ్యకు, నీకు ఫోన్ చేసినాను. నీ ఫోను కలవలేదు"–

ఏకదంతం వెంటనే లేచి నిల్చున్నాడు. అంతా ఏదో సిన్మాలా ఉంది. తనకు వినబడ్తున్నాయి కాని ఏమీ కనబడడం లేదు. అది రంగయ్య గొంతే. సందేహం లేదు. మనిషి లేకుండా గొంతెలా వినబడ్తుంది? నాకేమన్నా పిచ్చి పట్టిందా? అసంకల్పితంగా బుర్ర గోక్కున్నాడు. ఘల్లుఘల్లుమంటూ గజ్జెల చప్పుడు.

"ఇదుగో ఏకదంతం! నా మాట విను! నా చెలక నీకు తెలుసు గదా! ఆ గట్టు పక్కనే చింతచెట్టు. అదుగో మా అన్న మందినేసుకుని వచ్చాడు. అందరూ కట్టెలు పెట్టి కొట్టేసరికి అది కిన్నెరసాని వాగులోకి లగెత్తింది. హమ్మయ్య ఊపిరి పీల్చుకుని నేను చెట్టుదిగి వచ్చాను. గండం గట్టెక్కింది".

ఏకదంతం ఊపిరి పీల్చుకున్నాడు. ఈ గొడవ ఇట్లా ముగిస్తే మంచిది. కాసేపు నిద్రపోతే ఈ వినబడడాలు తగ్గుతాయేమో! ఇక చచ్చినా ఎక్కువ తాగకూడదు. తాగినా రక్తం, మెదడు కూర తినకూడదు. తింటే పిచ్చి కలలు వస్తాయనేవాడు మా తాత! ఇంతకీ ఇది కలా! మెలకువగానే ఉన్నా కదా! కూర్చునే కునికిపాట్లు పడ్డాడనిపించింది ఏకదంతానికి.

ఘల్లుఘల్లుమని చప్పుడు. మరింత వేగంగా, దగ్గరగా

"లేలే! ఏకదంతం! అదుగో ఆ దున్న నన్ను వెనక నుంచి కుమ్మేస్తున్నది. అయ్యో! దేవుడో! తప్పించుకుని పరిగెత్తుతున్నా నేను! బుసలు కొడ్తూ అది మీదిమీదికి వస్తున్నది. దాని మెడలో పటకాకున్న గంట ఠంగ్, ఠంగ్ మంటున్నది.

నా అన్న మిగతా వాళ్లు అదిలిస్తే వాళ్ల మీదకు దూకింది. అందరూ చెల్లాచెదురైపోతున్నారు. ఎవరూ ఊహించని విషయం. నేను పరిగెత్తుతున్నా... పరిగెత్తి పరిగెత్తి చెట్టు దగ్గరకు వచ్చేసా! అదిగో ఆ దున్న! వస్తోంది. చావులా! చావురంకె పెడ్తోంది. తలకిందకు వంచి కొమ్ముల్ని నా వేపు గురి పెడ్తొంది. నేను చెట్టు ఎక్కబోతున్నాను. చేతిలో గజ్జెల కర్ర కిందపడింది. దున్న వేగంగా దగ్గరకి వచ్చేసింది. నా వీపుకు దాని వేడి ఊపిరి తాకుతున్నది. దాని కొమ్ములమధ్య చెట్టుకు మధ్య నలిగి కింద పడిపోయాను. తప్పించుకున్నా మళ్లీ ఎక్కబోయాను. నా అన్నా, వాళ్ల కేకలు, అదిలింపులు వినబడ్తూనే వున్నాయి. ఈసారి అది కొమ్ము విసిరేసరికి దాని కొమ్ము నా తొడలో దిగబడింది. నా చేతికి అందిన చెట్టుకొమ్మ జారిపోయింది. దాని కొమ్ముల్లో నేను చిక్కుకుపోయాను. అది తల అటుయిటూ తిప్పుతూ నన్ను విసిరేస్తున్నది. నాకు కళ్లు తిరుగుతున్నాయి. ఆకాశం, మబ్బులు, చెట్లూ, చుట్టూ పొలాలూ, మనుషులు– మసకమసకగా... దబ్బున కిందపడ్డాను. దాని ఎర్రటి కళ్లు, పచ్చగా ఎర్రగా నా కళ్లలోకి చూస్తున్నాయి. దాని తల నా తలను ఢీకొట్టింది. పెద్ద బండరాయి నా నెత్తిమీద పడ్డట్లు. పెద్ద సుత్తితో నా తలమీద ఎవరో కొట్టినట్లు. నా నెత్తి పగిలి రక్తం కారుతున్నదా! అంతా తడి. ఇప్పుడు నెప్పి! ఇప్పుడు నెప్పిలేదు. క్రమేపీ చీకటి కమ్ముకు వస్తున్నది. దాని కొమ్ములు ఈటెల్లా నా శరీరాన్ని గుచ్చుకుపోతున్నాయి. తూట్లు తూట్లు పొడుస్తున్నాయి. జల్లెడలా రంధ్రాల మయమయ్యింది నా దేహం. ఏ రంధ్రం నుంచి పోవాలో ఆలోచిస్తున్నది నా ఆత్మ! ఏవిటీ ఇంత తేలికైపోయింది శరీరం. ఇదిగో ఈ గజ్జెల కర్ర ఎక్కి పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా! ఏకదంతం, నువ్వూ మీ య.స్సై, కానిస్టేబుల్సు నన్ను కాపాడాలి!"

ఏకదంతం నెత్తిమీద టపటపా కొట్టుకున్నాడు. ఏమైంది తనకివ్వాళ! లేచి బయటకు రాబోయాడు.

పోలీస్ జీపు వేగంగా వచ్చింది. యస్సై అరుస్తున్నాడు. "ఏకదంతం! త్వరగా రా! సెంట్రీ! నీవిక్కడే ఉండు! స్టేషన్ చూసుకో" ఏకదంతం దాదాపు పరుగెత్తుతున్నట్లు వెళ్లి జీపెక్కాడు.

ఏ.యస్సై ఏసుపాదం అంటున్నాడు– "నాగారం ఊరి నుండి ఫోన్లు వచ్చాయి. మన యస్.పి. గారు మెసెజ్ పంపారు. అడుగో మన సి.ఐ. ఉమేష్ గారి జీపు. నాగారం ఊళ్లో ఓ పిచ్చెక్కిన దున్నపోతు మనుషుల్ని పొడుస్తున్నదట. రంగయ్య అనే అతడు చావుబదుకుల్లో ఉన్నాట్ట"

ఏకదంతానికి ఆశ్చర్యంతో నోటమాట రావడం లేదు. తను ఇప్పటివరకూ విన్నది చెబితే వీళ్లు ఆశ్చర్యపోతారేమో! అయినా అధికారుల ముందు ఎప్పుడన్నా నోరెత్తిన రకం కాదాయె తను! చెప్పినా ఎవరు వినిపించుకుంటారు?

చెట్టుక్రింద దృశ్యం భీభత్సంగా ఉంది. గ్రామస్థులు అక్కడే ఉన్నారు. రంగయ్య శవం– తల ఛిద్రమై, శరీరం తూట్లు తూట్లుగా పొడవబడి, చొక్కా రక్తంతో తడిసి భయంకరంగా ఉంది. పక్కనే గజ్జెల కర్ర.

"ఎటు వెళ్లింది దున్న?" అడిగాడు యస్సై మల్లేశం.

"కిన్నెరసాని వాగు వేపు సార్!" అన్నాడో యువకుడు.

"అంతా పావుగంటలో ఖతమయ్యింది. మీరు వచ్చేలోపునే మేము బండితో దున్నపోతును గుద్దించి రంగయ్యను కాపాడాలని ప్రయత్నం చేసాం సార్! దున్న పారిపోయింది కాని రంగయ్య చచ్చిపోయాడు" అన్నాడు వలవల ఏడుస్తూ రంగయ్య అన్న క్రిష్ణయ్య.

"యస్.పి. గారి ఆర్డర్! దాన్ని కాల్చేయమని" అన్నాడు సి.ఐ. ఉమేష్.

ఇద్దరూ రివాల్వర్లు లోడ్ చేసుకున్నారు. కానిస్టేబుల్స్ తుపాకీలు గురిపెట్టి కిన్నెరసాని వాగువేపు జీపుల్ని పరిగెత్తించారు. దూరంగా చెట్టుకింద నల్లగా గ్రానైట్ కొండలా దున్నపోతు. రేంజిలోకి రాగానే ఇద్దరూ ఒకేసారి కాల్చారు. గుళ్లు తగిలాయి కాని దున్నపోతు లేచి పరిగెత్తసాగింది. దాని మెడలో పటకాకున్న గంట ఠంగ్, ఠంగ్ మని మోగసాగింది. జీపుల్ని దాని వెనకే వేగంగా పోనిస్తుంటే సి.ఐ. అన్నాడు– "రెడ్ ఇండియన్లు అడవి దున్నల్ని ఇలాగే వేటాడేవారట. వాళ్లకు ఒక విషయం తెలుసు. దున్నలికి, బర్రెలకి రెండు ఊపిరితిత్తుల్ని కప్పి ఒకే పొర కుహరం ఉంటుందని. దానిలోకి బాణం గాని, గుండు గాని రంధ్రం చేస్తే గాలి లోపలికి పోయి అడవిదున్న నేలకూలి చస్తుందని. దాన్నే న్యూమోథొరాక్స్ (Pneumothorax) అంటారుట. ట్రైనింగ్‌లో చెప్పారు నాకు. ఇప్పుడు మన బుల్లెట్ దానికి తగలాల్సిన చోటే తగిలింది. అది దొరికిపోయినట్లే"

–అతడు అన్నట్లే దున్నపోతు వేగం తగ్గింది. దగ్గరకు రాగానే మరో రెండు రౌండ్లు కాల్చారు. బుస్‌మన్న శబ్దంతో గాలిలోనికి పోతుండగా ఆ దున్నపోతు కిందపడి, చొంగ కారుస్తూ, నాలుక వెళ్లబెట్టి చచ్చింది.

ఏకదంతంకు ఇదంతా మిస్టరీగా అనిపించసాగింది. అంతా తనకు వినబడ్డట్టే. తన మిత్రుడు రంగయ్యే ఇలా ఆత్మగా వచ్చి తనతో మాట్లాడాడా!

దున్నపోతు దగ్గర ఇద్దరు కానిస్టేబుళ్లను ఉంచి పంచనామాకు ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు సి.ఐ. యస్.పి.కి మెసేజ్ పంపారు –ఆపరేషన్ సక్సెస్ బట్ బఫెలో డైడ్, ఒన్‌ఫెలో రంగయ్య డైడ్– పత్రికలవాళ్లు ఫోటోలు తీస్తున్నారు. కథనాలు వ్రాసుకుంటున్నారు.

ఏకదంతం వాళ్లు రంగయ్య శవమున్న చోటుకు వచ్చారు. చిన్ననాటి స్నేహితుడి చావును చూసిన ఏకదంతానికి దుఃఖం ఆగడం లేదు. అంతా తన కళ్లముందు జరిగినట్లే ఉంది. తనకు వినబడిన మాటలను నమ్మి కాస్త ముందు వచ్చి ఉంటే రంగయ్య దక్కేవాడేమో! ఏకదంతం వలవలా ఏడుస్తున్నాడు. రంగయ్య అన్న మిగతా గ్రామజనం కూడా అదే పరిస్థితుల్లో ఉన్నారు. ఏమొచ్చిందో మాయరోగం ఆ దున్నకు, దేవుడిలాంటి రంగయ్యను పొట్టన పెట్టుకుంది– అని కొందరు, అది దేవుడి దున్న కదా! ఏదో తప్పు జరిగి ఉండాలి, రంగయ్య దానిని కొట్టాడా, లేకుంటే ఎందుకు దానికింత కచ్చి రంగయ్యపై అని కొందరు– ఇలా జనం రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

పంచనామా ముగిసింది. అన్ని పనులూ అయిపోయాక సి.ఐ. గారు వెళ్లిపోయారు. యస్సై తన సిబ్బందితో, ఏకదంతంతో కలిసి పోలీస్ స్టేషనుకు వచ్చాడు. తన సీట్లో కూర్చున్నాడే కాని ఏకదంతంకు మనసులో మనసు లేదు. మనసు మరీ దిగాలుగా అనిపించి బయటకు వచ్చి ఆవరణలో ఉన్న చెట్టుకింద ఉన్న బల్లపై కూర్చున్నాడు. ఘల్లు ఘల్లుమన్న చప్పుడు.

ఉలిక్కిపడి తల పైకెత్తి నలువేపులా చూసాడు ఏకదంతం.

"ఏకదంతం! నే పోతున్నా! ఈ దున్నపోతు నన్ను వదిలేట్లు లేదు!"– గాలిలో దూసుకుపోతున్నట్లు మాటలు.

ఘల్లుఘల్లుమన్న గజ్జెల చప్పుడు....

దాని వెనకే దున్నపోతు మెడలో గంటల చప్పుడు.... ఠాంగ్ ఠాంగ్...!

★★★★★

# 18. అగ్ని ప్రవేశంలో అయిదో సూత్రం

**రావణాంక పరిక్లిష్టాం దృష్టాం దుష్టేన చక్షుషా,**
**కథం త్వాం పునరావద్యాం కులం వ్యపదిశన్ మహత్".**

"రావణుడి ఒడిలో నలిగావు, అతడి కామాగ్ని నేత్రాలతో చూడబడిన దానివి నీవు. గొప్ప కులములో పుట్టిన నేను నా కులగౌరవం కోసం ఈ యుద్ధం చేసానే కాని నీ మీద నాకు ఆసక్తి లేదు" అన్నాడు రాముడు.

ఆమె మౌనంగా అగ్నిప్రవేశం చేసి వచ్చింది స్వర్ణకాంతులతో మెరుస్తూ. రాముడన్నాడు– "కాంతి సూర్యుని విడిచి మరెక్కడికీ వెళ్లనట్లు సీత నన్ను విడిచి మరెవ్వరి సంబంధమునూ పొందదు".

విషపుగాలిలా లోకోపవాదం వీచింది. గర్భవతిగా ఉన్న సీతను అడవిలో వదిలి రమ్మని ఆజ్ఞాపించాడు రాముడు. అక్కడ వాల్మీకి ఆశ్రమంలో లవకుశుల్ని కని పెద్దచేసి, లోకోపవాద భయం తగ్గని రాముడి కప్పగించి తల్లి ఒడిలోకి తరలిపోయింది సీత.

అగ్ని పరీక్ష గురించి ఆలోచించలేదామె ఈసారి.

✤ ✤ ✤ ✤ ✤

నిమ్రాద్‌కు అబ్రహాంపై కోపం వచ్చింది. అగ్నిగుండంలో పడవేయిస్తే చెక్కుచెదరకుండా బయటకు వచ్చాడు అబ్రహాం.

హిరణ్యకశిపుడు తన మాట వినకుండా శత్రువును పూజిస్తున్న తన కుమారుడు ప్రహ్లాదుడిని ఘోర దవాగ్నులలో త్రోయించాడు. చిరునవ్వులు రువ్వుతూ బయటకు వచ్చాడు ప్రహ్లాదుడు.

✤ ✤ ✤ ✤ ✤

"నేరం చెయ్యని వాళ్లను దేవుడు కాపాడతాడు - జ్యుడిషియమ్ డై - జడ్జిమెంట్ ఆఫ్ గాడ్" అనేది ప్రజల విశ్వాసం.

"అగ్నిగుండాల మీద, మండుతున్న నిప్పుకణికల మీద నడిపించడం, సలసల కాగే నూనెలో, నీళ్లలో చేతులు ముంచడం; ఎర్రగా కాలుతున్న ఇనుప కడ్డీలతో, దబ్బనాలతో వాతలు పెట్టడం; గన్నేరుపప్పు, ముషిణి గింజలు, కాలబార్ బీన్స్, పీచ్ గింజలు తినిపించడం -ఇవన్నీ నిర్దోషిత్వాన్ని ఋజువుచేసే పరీక్షలు" అన్నాడు అంతర్యామి.

"రాజస్థాన్‌లో సాంసితెగలో- శోభనదినపు రాత్రి వధువుకు రక్తస్రావం జరగకపోతే ఆమె తన చేతులకు ఆకులు కట్టుకుని మండుతున్న నిప్పుకణికెలు చేతిలో పట్టుకుని వంద గజాలు నడిచి తన కన్యాత్వాన్ని నిరూపించుకోవాల్సి వచ్చేది" చెప్పింది నివేదిత.

"సినాయి ఎడారుల్లోని బెడొయిన్‌లు నిందితులతో నిజం చెప్పించడానికి కాల్చిన గరిటె లేదా చువ్వలను నాలుకపై ఉంచేవారు. నాలుక కాలిందా అతడు అబద్ధం చెప్పినట్లే! ఈ పద్ధతిని వాళ్లు బిషా (దేవుని సత్యకాంతి) అని పిలుస్తారు" అన్నది శీతల్.

"జోన్ ఆఫ్ ఆర్క్ తన కనుల ముందున్న శిలువను చూస్తూ మంటల్లో కాలిపోయింది. అమాయకులైన స్త్రీలపై మంత్రగత్తెలన్న ముద్ర వేసి అనేక వేలమందిని సజీవ దహనం చేసారు విచ్-హంట్ కాలంలో" అన్నాడు ప్రసాద్.

"ప్రపంచంలోనే అత్యంత దయనీయంగా అణగదొక్కబడినదెవరో తెలుసా? కులం, లింగ వివక్షత, పేదరికం త్రిశూలపు మూడు మొనలు కాగా వాటితో అణచబడిన మన దేశంలోని దళిత స్త్రీలు. దాదాపు ఎనిమిది కోట్లమంది" అన్నది నివేదిత. "ఇంటా బయటా వివక్షత వలన ప్రశ్నించే స్వభావాన్ని కోల్పోయారు వీళ్లు"

అంతర్యామి, ప్రసాద్, శీతల్, నివేదితలు ఢిల్లీ నుంచి ఆగ్రాకు చేరుకున్నారు. హత్రాస్‌కు వెళ్లాలనేది వీరి ఆలోచన. మధ్యలో అనేక విషయాలు మాట్లాడుకుంటూ వస్తున్నారు.

ప్రేమకు చిహ్నమైన ఆగ్రా నుంచి మహా మాయానగర్ జిల్లాలోని హత్రాస్ పట్టణానికి దూరం యాభై కిలోమీటర్లు. ద్రౌపది ఆర్తనాదం వినిపించగానే

వెళ్లి ఆమెను కాపాడిన శ్రీకృష్ణుడి మధురకు నలభై నాలుగు కిలోమీటర్ల దూరం ఈ హాత్రాస్.

"మాటల్లోనే వచ్చేసాం హాత్రాస్‌కు" అన్నది శీతల్. "ఇక్కడి ఇంగువ చాలా ఫేమస్. అయిదు రైల్వేస్టేషన్లున్న పట్టణం కూడా ఇదే!"

హాత్రాస్ ఇంగువ షాపు దగ్గర ఓ పావుకిలో ఇంగువ కొని శీతల్, నివేదితలు ముచ్చట్లలో మునిగారు. అంతర్యామి అడిగాడు షాపు యజమానిని– "బుల్‌గరి గ్రామానికి దారెటు?".

"ఎందుకు సార్, అంతా అయిపోయినాక! మీరు రిపోర్టర్లా?" అడిగాడతడు.

"వెళ్ళి రానీ" అన్నాడు పక్కనే ఉన్న ఇంకొకాయన.

"ఇప్పుడు పెద్ద బందోబస్తులవీ లేవులే...! ఇక్కడ నుంచి ఉత్తర దిక్కుగా వెళ్తే ఇరవై కిలోమీటర్ల లోపునే 'బుల్‌గరి' గ్రామం వస్తుంది. మీ అయిడెంటిటీ కార్డులవీ చూపిస్తే అనుమతి దొరకొచ్చు"

'బుల్‌గరి' గ్రామం నిశ్శబ్దంగా ఉంది. కొత్తవాళ్లతో మాట్లాడేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. చెప్పీ చెప్పీ అలిసిపోయిన వాళ్లను కదిలించడమంత కరెక్ట్ కాదు. అందుకే వాళ్లు నలుగురూ నిశ్శబ్దం చెప్పే మాటల్ని వింటున్నారు.

జొన్న సజ్జ చేలు గాలికి ఊగుతున్నాయి.

"ఆమెకు పంధొమ్మిదేళ్లు. 14 సెప్టెంబరు 2020 నాడు ఒంటరిగా ఉన్న ఆమెను నలుగురు యువకులు 'జబర్దస్తీ' చేసి, అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఇక్కడ వదిలేసి పారిపోయారు" అన్నది దుఃఖిస్తూ సజ్జచేను.

"మేం దళితులం. మమ్మల్ని మా ఆస్థిపాస్తుల్ని జబర్దస్తీ చేయడానికి వాళ్లకే భయమూ లేదు. వాళ్లు పెద్దోళ్లు!" అన్నారు నాలుగు కుటుంబాల దళితులు.

"మావాళ్లు అమాయకులు. మమ్మల్ని బెదిరించి డబ్బు గుంజడానికి ఆడిన నాటకం ఇది" అన్నారు ఆ ఊళ్లోని వంద కుటుంబాల అగ్రవర్ణాల వాళ్లు.

"ఆ గాయపడిన అమ్మాయిని తీసుకువచ్చారు నిజమే! వాళ్లు చెప్పిన దానినిబట్టి సెక్షను 354 ఐ.పి.యస్. కింద కేసు నమోదు చేసాం. ఇదుగో ప్రాథమిక రిపోర్టు – యఫ్.ఐ.ఆర్" అన్నది చాంద్‌పా పోలీస్‌స్టేషన్.

"ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉంది. వెంటనే ఆమెను ఆలీఘర్ – జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ కాలేజి హాస్పిటల్‌కు రిఫర్ చేసాము" అన్నది హాథ్రస్ వైద్యకేంద్రం.

"ఆమె మెడ ఎముకలు విరిగి పారలైజ్ అయిన స్థితిలో ఉంది. నాలుకకు గాయమైంది కనుక మాట సరిగా రావడం లేదు. ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాం" అన్నది ఆలీఘర్ హాస్పిటల్.

"చాంద్ పా పోలీసులు ముందు మమ్మల్ని పట్టించుకోలేదు. పైపెచ్చు అవమానకరంగా మాట్లాడారు" అన్నారు ఆమె కుటుంబ సభ్యులు.

"గలా దబాదియా! జబర్దస్తీ న కర్నే దేరహెతైకు" అంటున్నదామె వీడియో క్లిప్‌లో...

"సెప్టెంబర్ 19 నాడు ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం... సెక్షన్ 307, 354 కింద కేసులు బుక్ చేసాం. సందీప్‌ను అరెస్ట్ చేసాం" అన్నారు పోలీసులు.

"సెప్టెంబర్ 22న ఆలీఘర్ హాస్పిటల్‌లో మరణ వాంగ్మూలం రికార్డు చేసాం" అన్నాడు జిల్లా మెజిస్ట్రేటు.

"ఆమె చెప్పిన దానిని బట్టి మిగతా ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేసాం" అన్నారు పోలీసులు.

"సెప్టెంబరు 28 నాడు మా హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. అప్పటికే ఆమె పరిస్థితి విషమించింది. సెప్టెంబర్ 30 ఉదయాన ఆమె చనిపోయింది" అన్నది ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్.

"హాస్పిటల్ దగ్గర ప్రదర్శనలు తీవ్రమవుతుండడంతో, కర్మకాండలు ఎంత త్వరగా ముగిస్తే అంత త్వరగా ప్రశాంతత నెలకొంటుందని భావించాం" అన్నాడు మహామాయానగర్ జిల్లా మెజిస్ట్రేటు.

"ఆ రాత్రి నేను ఉలిక్కిపడ్డాను. కటికచీకటిలో కార్లు దూసుకువచ్చాయి" అన్నది బుల్‌గరి గ్రామం.

"పోలీసులు, మీడియా, కార్లు, జీపులు, లైట్లు – నాకు భయం వేసింది" అన్నది వేపచెట్టు.

“వాళ్లిక్కడే చితి ఏర్పాటు చేసారు. ఎండుకట్టెలు, పిడకలతో చితి పేర్చారు. అర్ధరాత్రి దాటింది. తెల్లవారుజామున రెండున్నరకు ఆ చితిమంటల్లో ఆమె పార్థివ దేహం కాలిపోయింది. మిగిలిందల్లా నల్లగా కాలిన నేల, ఇంత బూడిద, బొగ్గులూ!” అన్నది చింతచెట్టు.

“వాళ్ల కుటుంబ సభ్యులు అనుమతి పత్రంపై సంతకాలు చేసాకే శవదహనం జరిగింది” అన్నాడు పోలీస్ అధికారి.

“మీరు చేసిందేమీ బాగోలేదు. మేము Suo Moto Cognizance గా ఈ కేసును తీసుకుంటున్నాం” అన్నది అలహాబాద్ హైకోర్టు.

“కుల ఘర్షణలు చోటు చేసుకోకుండా మేం చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది” అన్నాడు పోలీస్ అధికారి.

“మీరు ప్రతిసారి మాట మార్చి ఇబ్బంది పెడుతున్నారు. ఇలా సాక్ష్యాలు, వాంగ్మూలాలు రకరకాలుగా ఇవ్వవద్దు” అన్నాడు జిల్లా మెజిస్ట్రేటు ఆమె కుటుంబ సభ్యులతో.

“పోలీస్ సూపరింటెండెంట్‌తో పాటు అయిదుగురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తున్నాం” అన్నది స్టేట్ గవర్నమెంట్.

“ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు విదేశీ కుట్ర జరుగుతోందని, దానికి చెక్ పెట్టేందుకు కాన్‌సెప్ట్-పి.ఆర్. అనే సంస్థకు బాధ్యత అప్పచెప్పారు” అని వ్రాసింది ‘ద వైర్’.

“సి.బి.ఐ.కు బాధ్యత అప్పగిస్తున్నాను నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపేందుకు” అన్నాడు ముఖ్యమంత్రి. “ఇరవై అయిదు లక్షల రూపాయలు, ఒక ఇల్లు, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నాం!”

“నేను ఆమె స్నేహితులం. ఆమెను ఆమె కుటుంబ సభ్యులే కొట్టి ఉంటారు” అని హాత్రాస్ పోలీసులకు ఉత్తరం వ్రాసాడు ప్రధాన నిందితుడు తన సహచర నిందితులతో కలిసి.

“అక్టోబరు-మార్చి మధ్య ఆమె సోదరుడి ఫోన్‌కు నిందితుడికి మధ్య దాదాపు వంద కాల్స్ ఉన్నాయి” అన్నారు పోలీసులు.

“ఆర్నెల్ల క్రితం అమ్మాయి తండ్రి నాతో ఫిర్యాదు చేసాడు. మా అబ్బాయిని లాగి చెంపదెబ్బ కొట్టి మందలించాను. ఆ తరువాత మావాడు పని

దొరికిందని వేరే ఊరు వెళ్లిపోయినాడు. మరలా వచ్చి నెలరోజులు కూడా కాలేదు” అన్నాడు ప్రధాన నిందితుడి తండ్రి.

“మా పిల్లలకు ఈ ఘటనకూ ఏ సంబంధమూ లేదు. వాళ్లు నిర్దోషులు” అన్నారు మిగతా నిందితుల తల్లిదండ్రులు.

“మమ్మల్ని ఆ ఊళ్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు” అన్నారు ప్రతిపక్ష నాయకులు.

“వాళ్లు ముఖ్యమంత్రి కులస్థులు గనుక వాళ్లను ప్రభుత్వం కాపాడుతున్నది” అన్నాడు ఓ ఏక్టివిస్టు.

“ఈ ప్రతిపక్షాలది రాజకీయ నాటకం” అన్నారు అధికార పార్టీ సభ్యులు.

“ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలి. ఒంటరిగా బయటకు పోరాదు” అన్నాడో ప్రజాప్రతినిధి.

“రాజకీయ పక్షాల ప్రతినిధులు ఆలోచించి మాట్లాడాలి” అన్నది మహిళా జాతీయ కమీషన్.

“ఇప్పుడు నిజం తెలిసింది నిందితులకే. వాళ్లతో నిజం చెప్పించడానికి బ్రెయిన్ స్కాన్ లాంటి నూతన పద్ధతులు ట్రై చేస్తున్నాం” అన్నాడు పోలీస్ అధికారి.

“నిజం ఎప్పుడో కాలిపోయింది. మీరెందుకు ఇక్కడ తచ్చాడుతున్నారు? రెండు నెలలు దాటింది గదా చితిమంటలు చల్లారి. ఇప్పుడిక్కడంతా చీకటే! ఇది ఆత్మలు తిరిగే సమయం. మీరూ వెళ్లిపొండి” అన్నది చీకటి.

గ్రామం విడిచి వెళ్లిపోతుండగా నివేదిత అన్నది– “సీతపై నిందలు మోపిన వ్యక్తిని రాక్షసుడిగా అనుమానించి అతడిని, అతడి కుటుంబాన్ని రాజభటులు చంపేసారని ఒక కథ!”

“అట్లాగే కన్నగి భర్త కోవలన్ రాణి కాలి అందియ దొంగిలించాడని ఓ స్వర్ణకారుడు నేరారోపణ చేయగా కోవలన్‌ను పాండ్యరాజు భటులు చంపివేస్తారు. కన్నగి ఆగ్రహజ్వాలల్లో మధురై నగరం భస్మమవుతుంది. పాండ్యరాజు, రాణి ఆవేదనతో మరణిస్తారు. ఆ తరువాత పాండ్యరాజు వారసులు తప్పుచేసిన స్వర్ణకారుడిని, అతడి పరివారాన్ని హతమార్చారట!

1948లో మహాత్మాగాంధి హత్య అనంతరం జరిగిన అల్లర్లలో మహారాష్ట్రలో ఎనిమిది వేలమంది బ్రాహ్మణులు హత్య చేయబడినారు. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం దాదాపు పది వేలమంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారు" అన్నాడు అంతర్యామి.

"భగొరాలో రాజ్‌పుట్ కుటుంబీకులను మావొయిస్టులు చంపారు. తమిళనాడులో దళితులను భూస్వాములు హత్య చేసారు. పూలన్‌దేవి చేతిలో ఠాకూర్లు, ఠాకూర్ల కాల్పులలో పూలన్‌దేవి మరణించారు. కారంచేడు, చుండూరు, ఖైర్లాంజీ, జహానాబాద్ – ఇలా దేశంలో అనేక ప్రాంతాలలో వాళ్లను వీళ్లు వీళ్లను వాళ్లు చంపుకుంటున్నారు. అగ్నిప్రవేశాలు, చితిమంటలు, భారతమాత కన్నీళ్లు..." అన్నది శీతల్ ఆవేదనగా.

"జడత్వం, ప్రచోదనం, చర్య–ప్రతిచర్య న్యూటన్ వివరించిన మూడు సూత్రాలైతే, నాలుగోది Gravity - గురుత్వాకర్షణ స్థితి. న్యూటన్ చెప్పని అయిదో సూత్రం– బాహ్యశక్తుల ప్రమేయం వలన భావోద్వేగాలెక్కువై చితిమంటల్లో నిజం కాలిపోవడం" అన్నాడు ప్రసాద్.

వాళ్లు కారెక్కి ఆ ఊరు వదిలి ఓ కిలోమీటరు వచ్చేసరికి భూమి కదిలినట్లనిపించింది. ప్రసాద్ కారును ఆపాడు. నలుగురూ కిందకు దిగారు. కాని నిలబడలేకపోతున్నారు.

అంతర్యామి అన్నాడు– "శీతల్, నివేదితా, ప్రసాద్! భూకంపం! నేలమీద పడుకోండి!"

దూరంగా చెట్లు, ఇళ్లూ కూలుతున్న సవ్వడి. భూమి కొద్ది సెకన్లపాటు కంపించి ఆగింది. మబ్బులు పగిలి మెరుపులు మెరిసి పిడుగులు పడి ఊరంటుకున్నట్టు మంటలు చెలరేగుతున్నాయి. ఊరేనా! లేక దేశమంతా కాలిపోతున్నదా? కలుషితమైన వ్యవస్థ కాలిపోగా శుభ్రించబడిన మనుషులు గోడలు, కంచెలు లేని కొత్త ప్రపంచం వేపు నడుస్తున్నారా!

ఊరు సంగతి మాకు తెలీదు కాని, ఆ నాలుగిళ్ల మనుషులు ఆశను, ధైర్యాన్ని నెత్తినెట్టుకుని ఉచ్ఛనీచాల ఉలుకులేని తూర్పులోగిలి వేపు వెళ్తున్నారు. వాళ్లతోపాటే మేమూ....

★★★★★

# 19. జంతు క్షేత్రం

"పన్నెండు గొంతులు ఆగ్రహంతో అరుస్తున్నాయి ఒకేలా; సందేహం లేదు అన్నీ పందిముఖాలే! బయట నుంచి చూస్తున్న జంతువులకు అక్కడ పంది నుంచి మనిషికి, మనిషి నుంచి పందికి, మరల పంది నుంచి మనిషికి మారడం కనిపించింది. అయితే ఇప్పుడు వాటిలో పంది ఏదో మనిషి ఏదో చెప్పడం అసాధ్యం" – ఏనిమల్ ఫార్మ్, జార్జి ఆర్వెల్.

"దీంట్లో అసాధ్యమేమీ లేదు. స్వైన్‌ఫ్లూ వైరస్ కొద్దిగా మారి కరోనా వైరస్ అయితే అన్ని ముఖాలు గబ్బిలాల ముఖాల్లానే ఉంటాయి" అన్నాడు మైఖేల్.

"నేను ముందే చెప్పాను ఇదంతా కామినీ పిశాచుల, కాంతిస్వరూపుల కుట్ర అని. దయ్యాల సంతానం ఇప్పుడు శ్వేతసౌధంలో రాజుకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నది" అన్నది స్టెల్లా.

"అజిత్రొమైసిన్, క్లొరొక్విన్, జింక్, ప్రాణాయామం మేమందరం ఇంటిల్లిపాదీ చేసాం. కరోనా ఇలా వచ్చి అలా పారిపోయింది" అన్నాడు లక్ష్మణబాబా!

"ఆసియా వాళ్లు ఐవర్‌మెక్టిన్ వాడితే మంచిది! బంగ్లాదేశ్‌లో బాగా పనిచేసింది – ఐవర్‌మెక్టిన్, డాక్సిసైక్లిన్ కాంబో!" అన్నది ఆయేషా.

ఇక్కడ మేం ఐవర్‌మెక్టిన్‌ను కుక్కల కడుపులో నులిపురుగుల్ని చంపడానికి వాడతాం! ఏమిటో, కొన్నాళ్లు పోతే కుక్కలకు, పందులకు వాడే మందులే మనుషులకి పనిచేస్తాయంటారు" అన్నది షిర్లే.

"మనుషులకి, పందులకి తేడా తెలవకుండా బతుకుతున్నపుడు పందుల జలుబు మనుషులకు రాకుండా ఎట్లా ఉంటుంది? ముఖాలు కుక్క ముఖాలైతే

కుక్కల మందు, చీమల ముఖాలయితే చీమల మందు వెయ్యాలి. ఏ ముఖం అద్దంలో కనబడితే ఆ మందు వెయ్యాలి" అన్నాడు స్టువర్ట్.

"గురువు గారి 'గుడ్‌జీన్స్' గూట్లో దాక్కున్నాయా, కరోనా వైరసు స్పైకులొచ్చి ట్రంపు రాజుగారి లిబర్టీకి అంటుకున్నాయి!" అన్నాడు గార్డన్.

"మాజీ నాజీలంతా మాస్కులు తొడుక్కున్నాక ఐసోలేషన్ రూంలో నార్డిక్-జర్మన్ విశ్వవృక్షపు చెవులూ, వేళ్లూ కొరుకుతున్న సర్పం ఎవరు?" అన్నాడు రాబర్ట్.

"ఇవాంకా ట్రంప్, జారెద్ కుషెర్‌లు యూదు మతస్థులు కదా, అందుకే జెరూసలెంను ఇజ్రాయెల్‌కిచ్చాడు. ఇజ్రాయెల్‌పై ప్రేమ జర్మనీకి కోపకారణం కాదా! వాళ్లూ, వీళ్లు ఒకే రూంలో కూర్చున్నపుడు భయమేస్తుంది మళ్లీ ఏ హొలొకాస్ట్-ప్రళయ మొస్తుందోనని" అన్నాడు ఫ్రెడ్.

"ఆస్ట్రేలియా న్యూస్ సైట్ - బెటూటా అడ్వకేట్ వ్యంగపు హెడ్‌లైన్స్ చూడు - ట్రంప్ కుటుంబం వల్ల వ్యాప్తి చెందిన కరోనా కేసులు, మొత్తం క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలో కేసులకన్నా ఎక్కువ" నవ్వాడు అలెగ్జాండర్.

"ట్రంప్‌కు జ్వరం రాగానే వ్యక్తిగత వైద్యుడు - రెడీగా ఉన్న ఎనిమిది గ్రాముల పాలిక్లొనల్ ఏంటిబాడి కాక్‌టెయిల్ - REGN-Cov2 - ఇచ్చేసాడు. జింక్, విటమిన్-డి, రెమ్‌డెసివిర్, మెలటోనిన్, ఏస్టెరిన్, ఫామొటిడిన్ - అన్నీ అరిగించుకున్నాడు అధ్యక్షుడు" అన్నది మెలిస్సా.

"మందులు మింగడంలో మనోడు ఘటికుడులే. మరి గేం ఛేంజర్ క్లొరొక్విన్ ఏమయ్యింది? ఇండియా మీద ఉరిమిన ఉరుములు వృధాయేనా?" అన్నాడు మహేంద్ర.

"ఆయన వాళ్ల డాక్టర్లను నమ్ముతాడు. నీవు నీ వైద్యుడిని నమ్ముకో! మనము వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ఇప్పటినుంచీ కరోనా ట్రంపు కథ వినవచ్చు" అన్నాడు ప్రసేన్.

"ఇంగ్లండ్ ప్రధానమంత్రి బొరిస్ జాన్సన్ ఈ కోవిడ్-19తోనే మూడురోజులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో (ICU)లో మృత్యువుతో పోరాడి

గెలిచాడు. వీళ్లిద్దరిదీ ఒకటే కథ (ట్రంప్–జాన్సన్). ఇప్పుడు ట్రంప్ వంతు వచ్చింది” అన్నాడు ఫ్రెడ్.

“జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడియు భార్య, అమెరికా అధ్యక్షుడి సిబ్బంది, ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ సెక్రటరీ కరోనా బారిన పడ్డవాళ్లే. ట్రంప్ జూనియర్ గర్ల్‌ఫ్రెండ్ కింబర్లి గ్యుయిపొయెలికు జులై 3న కరోనా పాజిటివ్ వచ్చింది. ట్రంప్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ – రాబర్ట్ ఒబ్రీన్ కూడా కరోనా వ్యాధిగ్రస్తుడైనాడు” చెప్పాడు గార్డన్.

వీళ్లలా మాట్లాడుకుంటున్నపుడే టెలివిజన్ స్క్రీన్ మీద ఈ వాక్యాలు కనిపించాయి.

“కరొనా కిరీటానికి

మనషులంతా ఒక్కటే,

అయినా, కొందరికి క్లోరోక్విన్, కొందరికి పాలిక్లోనల్ ఏంటిబాడీస్”

“రాను రానంటూనే కరోనా చిన్నది – రానే వచ్చింది కరోనా చిన్నది. ఇదేం చిన్నది కాదు పెద్దదే! యునైటెడ్ కింగ్‌డమ్ యువరాజు ప్రిన్స్ ఛార్లెస్, మొనాకొ యువరాజు రెండవ ఆల్బర్ట్; కొసావొ ప్రధానమంత్రి అవదుల్లా హొతి; ఆర్మినియా ప్రధానమంత్రి నికొల్ పుషిన్యాన్, బెలారస్ ప్రెసిడెంట్ అలెగ్జాండర్ లుకాషెంకొ, రష్యా ప్రధానమంత్రి మైఖెల్ మిషుస్టిన్, బ్రెజిల్ ప్రెసిడెంట్ – జెయిర్ బొల్సొనారొ, హొండూరస్ ప్రెసిడెంట్ – జువాన్ ఒర్లాండొ హెర్నాండెజ్, బొలివియా ఇంటర్మ్ ప్రెసిడెంట్– జియానిన్ గియామ్మాటి, బురుండి ప్రెసిడెంట్ పియర్రి నకురుంజిజా, ఇండియా హోంశాఖామంత్రి అమిత్ షా, ఇప్పటి వైస్ ప్రెసిడెంట్, వెంకయ్య నాయుడు, వీరుకాక సత్యేందర్ జైన్, నితిన్ గడ్కరి, శివరాజ్‌సింగ్ చౌహాన్, అహమద్ పటేల్, వీళ్లందరూ అనేక విషయాలలో ఒకరికొకరు నెగటివ్‌గా ఉన్నా కరోనాకు మాత్రం ‘పాజిటివ్’ అయ్యారు” ఏకరువు పెట్టాడు కులదీప్ సింగ్.

“మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం, రాజకీయవేత్త వసంతకుమార్‌లను మనం కోల్పోయాము”

అక్కడ శిఖరాగ్ర చర్చలకు కూర్చున్నాయి ప్రపంచ జంతువులన్నీ. అటుపక్క ఎర్రడ్రాగన్, ఎదురుగా చారలచుక్కల గ్రద్ద; హుపొ, సైబిరియన్ పులి,

సింహం, ఒంటె, పిచ్చుక, కౌజుపిట్ట, కోడిపుంజు, ఏనుగు, నెమలి, డేగ, ఎలుగుబంటి, కంగారు బల్ల కటూయిటూ కూర్చున్నాయి. అన్నిటి నెత్తిమీద కరోనా కిరీటాలే. ముఖాన మాస్కులే!

"ఈ కిరీటం నువ్వు మాకు పెట్టావు. అప్పట్నుంచీ ఒకటే యుద్ధం దురద నాకు. నా చారలు చుక్కలు పొడిపొడిగా రాలుతున్నాయి. ఓ డ్రాగన్! నష్టపరిహారం చెల్లించు, లేకుంటే నిన్ను అష్టదిగ్బంధనం చేస్తా! తస్మాత్ జాగ్రత్త!" అన్నది బాల్డ్ ఈగిల్-గరుడపక్షి బింకంగా!

డ్రాగన్ భయంకరంగా ఉరిమింది. నిప్పులు కక్కింది - "ఓ చారల చుక్కల గరుడపక్షీ! ముందు నీ ముక్కులో, గొంతులో పుల్ల పెట్టి పరీక్ష చేయించుకో. ఒక శతాబ్దం పాటు నన్ను కెలికారుగా, మీ ఇనుప బూట్ల కింద తొక్కిపెట్టి! మా ప్రజల్ని ఓపియం మత్తులో నాశనం చేసినప్పుడు గుర్తుకు రాలేదా ఈ పరిహారాలూ, ఉపసంహారాలూ!" అన్నది సింహం వైపు సీరియస్‌గా చూస్తూ.

సింహం జూలు సవరించుకుంది "రవి అస్తమించని సామ్రాజ్యం మాది. ఆనాటి పరిస్థితుల కనుగుణంగా అప్పుడు వ్యవహరించాం మేము. మీరు హింసకు పాల్పడితే మేం కఠినంగా ఎదుర్కొన్నాం అది తప్పా? ఓపియం స్మగ్లర్లు మీవాళ్లు కాదా! మా వ్యాపారాన్ని అడ్డుకున్నవాళ్లు మా పంజాదెబ్బ రుచి చూసారు".

"ప్రజల్ని నిర్వీర్యుల్ని చేసే వ్యాపారం ఓ వ్యాపారమా! చైనాతో పాటు మమ్మల్నీ దోచుకుతిన్నారు. రెండు వందలేళ్లు మమ్మల్ని బానిసల్లా చూసారు. మీరూ మీ జాత్యహంకారమూ!" సింహాన్ని తిట్టింది నెమలి తన పింఛాల్ని విప్పుతూ. మీ గొడవ తగ్గింది కదా అనుకుంటే ఇప్పుడు డ్రాగన్ చూపు మా సరిహద్దులపై పడింది. విషప్పురుగుల్ని చీల్చే నెమలి, డ్రాగన్ అంటే భయపడదు.

"ఎరుపంటే మాకూ యిష్టమే, కాని ఓ డ్రాగన్, నీ తోక మా సరిహద్దులపై మీద ఊగుతున్నది. హైపర్‌సోనిక్ మిస్సైల్స్‌తో నీ తోక కత్తిరిస్తాం, జాగ్రత్త!" అన్నది ఎలుగుబంటి.

"కత్తిరించావులే కాగితం - పదిహేను ముక్కలయ్యింది మీ సోవియట్ సమూహం. ఎలుగుబంటికి ఎగరడం ఎక్కువ, తిరగడం తక్కువనీ! మేము 'ఒకే డ్రాగన్' పతాకం కింద మా సోదరుల్ని కలుపుకోవాలని చూస్తుంటే మీకు కళ్లమంటగా ఉంది" అన్నది డ్రాగన్ మంటలు కక్కుతూ.

కోడిపుంజు కొక్కొరొకో అంది, హుపో చిరచిరలాడింది, ఒంటె ఒంటరి కేకలు పెట్టింది. పిచ్చుక, కౌజుపిట్ట, ఏనుగు, డేగ, కివీ, కంగారూలు కంగారు కంగారుగా గెంతేసరికి సభ రసాభాస అయ్యింది. బయట జంతువులకు భయం పట్టుకున్నది. "ఏం చేస్తున్నారు వీళ్లు?" అన్నదో అక్కుపక్షి!.

"విచిత్రమేమిటంటే అది వెనక్కి పరిగెత్తి పరుగెత్తి 1957, 1968 మైలురాళ్ల దగ్గర బర్డ్‌ఫ్లూ వచ్చి తుమ్మింది. తరువాత ముందుకు పరిగెత్తి 2009 దగ్గర ఆగినప్పుడు స్వైన్‌ఫ్లూ వచ్చింది. బర్డ్‌ఫ్లూ వైరస్‌లో పక్షుల, మనుషుల వైరస్ ముక్కలు కలిసి కొత్త వైరస్‌గా మారితే, స్వైన్‌ఫ్లూ (వరాహ వైరస్)లో పక్షుల, పందుల, మనుషుల వైరస్ ముక్కలు కలిసి H1N1 పుట్టిందట. గత పదేళ్లుగా మనుషుల మెదళ్లలో వైరస్ చేరి హైబ్రిడ్ వైరస్ (Chimera Virus)గా మారేసరికి బయోసేఫ్టీ ల్యాబుల్లో రకరకాల వైరస్‌లను కలిపి కొత్త వైరస్‌ను సృష్టించుకున్నారు. అందుకే అందరి నెత్తిపైన ఆ కరోనా కిరీటాలు. మొత్తానికి ఈ కరోనా వైరస్ చాలా గట్టిది. 2019 చివర్లో ఈ మనుషుల బుర్రల్లోంచో, ల్యాబుల్లోంచో బయటపడి విమానాలెక్కి విశ్వవీధుల్లో విలయవిహారం చేస్తున్నది" అన్నది కాకి అనబడే వాయసం.

అక్కడ పేరుమోసిన పద్నాలుగు జంతువులు, పక్షులు కాసేపు మనుషులుగా మారి 'సర్వేజనా స్సుఖినోభవత్' అందామనుకునే లోపునే వాళ్ల వాళ్ల జాతీయ జంతు ప్రవృత్తిలోకి తరలిపోతున్నాయి. వాళ్ల జాతికి ప్రమాదం లేకుండా ఇతర జాతుల్ని నాశనం చేసే జీవాయుధాల్ని తయారు చేస్తున్నాయి.

అదంతా చూసి రామచిలుక అన్నది– "నేనేమైనా అంటే చిలకపలుకులంటారు కాని వాళ్లు చేస్తున్నదీ అదే కదా! డ్రాగన్ దగ్గర వాళ్ల 'హాన్' ప్రజల్నేం చేయకుండా ఇతరుల్ని నిర్వీర్యపరచే జెనెటిక్ బాంబులున్నాయేమో! హూపో పక్షి దగ్గర అరబిక్ ఒంటెల్ని, డేగల్ని పారలైజ్ చేసే ఆయుధాలున్నాయి. ఏం చకోరపక్షీ! మీ దగ్గరా మీ వాళ్లకేం కాకుండా నెమలిని దెబ్బతీసే అటామిక్ క్లస్టర్ బాంబులున్నాయి కదా!"

చకోరపక్షి గొణిగింది– "గ్రద్ద దగ్గర లేవా? ఎలుగుబంటి దగ్గర లేవా; డ్రాగన్ దగ్గర లేవా? నెమలి దగ్గర లేవా? ఎవరి గోళ్లు వాళ్లవి! కాశ్మీరాన్ని,

హైదరాబాద్, జునాగఢ్‌లను బిగ్‌బ్రదర్ గుంజుకోలేదా! నెమలి పిట్ట మాకంటే సైజులో పెద్దది. పెద్దన్న కాబట్టి అది చెప్పిందే నిజమంటారా!”

అంతా గందరగోళం. పక్షులూ, జంతువులూ, లోనా బయటా అణుముక్కల్తో, గోళ్లతో అణువణువూ రక్కుకుంటున్నాయి. చీల్చుకుని చింపుకుంటున్నాయి.

ఈలోగా మరలా మార్పు; జంతువులు, పక్షులు మానవ రూపాల్లోకి వచ్చాయి. ఎక్కడ చూసినా ఫ్లూ-జలుబు జల్లులే! హాఛ్, తూఛ్ శబ్దాలతో, తుంపరలతో అక్కడంతా వర్షాకాలం వచ్చినట్లుంది. మాస్కులన్నీ తడిచిపోయాయి. ఎవరి వాసన వాళ్లకే పడక కడుపులో దేవినట్లై ఐసొలేషన్‌కో, క్వారంటెయిన్‌కో పరుగులు తీసారు జనం.

ఎవరి కొంపకు వాళ్లు చేరుకున్నాక వాళ్లకే మార్పూ కనిపించలేదు. పాత గోడలు, రక్తపు మరకలు, ఉచ్ఛనీచాల రంగు వాసనలూ అలాగే ఉన్నాయి. కరోనా జలుబుకు కాష్టాలు మండుతూ, గోతులు నిండుతూ, సమాధులు వెలుస్తున్నాయి.

“ఈ కథలో కథ ఏది” అన్నాడో పండితుడు.

“గబ్బిలాలు కీచుమంటుంటే, నక్కలు ఊళలు వేస్తుంటే, గుడ్లగూబలూ, పాములూ సంచరించే వేళ సమాధుల మధ్య కావలసినన్ని కథలు దొరుకుతాయి. పోయి వెదుక్కో!” అన్నది కరోనా ఆ గబ్బిలాల మేధావిని కౌగిలించుకుంటూ!

★★★★★

# 20. ఎండాకాలపు గడ్డి - శీతాకాలపు పురుగు
## (Summer Grass - Winter Worm)

నల్లపిల్లిలా మెత్తమెత్తని అడుగుల్తో వచ్చి నేపాల్‌గంజ్ పట్టణాన్ని కమ్ముకుంటున్నది మసకచీకటి. మే నెలలో వంద డిగ్రీల జ్వరం వచ్చినట్లు పట్టణం అంతా చెమటవాసన! దరిద్రం ఏమంటే కరెంటుపోయి గంటయ్యింది. హోటల్ రూంలో ఉండలేక బయటపడ్డాం. ఏ.సి. పనిచేయడం లేదు, ఫాను మాత్రమే తిరుగుతుందట జనరేటర్ కరెంటుకు.

చాయ్‌వాలా చాలా దీక్షతో 'టీ' తయారుచేస్తున్నాడు గుడ్డిదీపం వెలుగులో. రోడ్డు పక్కన చెత్తకెవరో నిప్పు పెట్టినట్టున్నారు, చిటపట మంటలు, పొగ. ఆ వెలుగులో కనిపించాయి దెయ్యపు పురుగులు మంటవేపు ఎగుర్తూ, మెరుస్తూ. కొన్ని తెల్లగా, కొన్ని గోధుమరంగులో, చనిపోయినవాళ్ల ఆత్మలు ఎగుర్తున్నట్లు.

"తెల్లవి మగపురుగులు, గోధుమరంగులోవి ఆడపురుగులు. ఇవి Ghost Moths – దయ్యపు పురుగులు" అన్నాడు ఆనందరావు. ఇతడు వ్యవసాయ శాస్త్రవేత్త.

"అల్లంటీ బాగుంది" అన్నాడు సూర్యనారాయణ. "ఉష్ణం ఉష్ణేచ శీతలం – వెలిగించవయ్యా ధూమకాష్ఠం! అల్లంటీ, గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ దెబ్బకు చెమటలు కక్కి ఒళ్లు చల్లబడాలి!"

"అవిగో పురుగులు మనవేపే వస్తున్నాయి. ఓ జంట – చూడు. ఆ డాన్సు–లెక్కింగ్–డిస్‌ప్లే! మన 'కిరణ్' స్టైల్. స్వయంవరం అన్నమాట. ఏక్స్ (Axe) ఎఫెక్ట్‌లో 'ఫెరొమోన్స్' రిలీజ్ చేస్తాయి. కుదిర్తే ఓ కప్పు కాఫీ, మాటలు కలిస్తే ఆ తరువాత శోభన దినమే! ఏమంటావు కిరణ్!" అన్నాడు నవ్వుతూ ఆనందరావు.

కిరణ్ వైరాలజిస్టు. మితభాషి. “సర్! నేనే దొరికానా మీకు ఈరోజు!” అన్నాడతడు బ్రహ్మచారి నవ్వు నవ్వుతూ. అతడో నిరంతర ప్రేమాన్వేషి.

వాళ్లు ఆ పురుగుల సయ్యాట చూస్తూనే ఉన్నారు. ఇంతలో ఎక్కడనుంచి వచ్చిందో ఓ గబ్బిలం, దగ్గరవుతున్న జంటను నోటకరుచుకు పోయింది.

“ఛఛ! వెధవ గబ్బిలాలు! ఓ క్షణం కింద ఆ పురుగుల జంట ఆనందపు అంచున ఉన్నాయి. మరుక్షణం మృత్యువు నోటిలో ముగిసిపోయాయి” అన్నాడు మార్కండేయ. ఇతడు అర్ధవేదాంతి, మెకానికల్ ఇంజినీర్.

“ఏంటి బాస్! ఇలా ఇరుక్కుపోయాం! లక్నో నుంచి నాలుగు గంటలు క్వాలిస్‌లో క్వాలిటీ ప్రయాణం చేసాం! నూట ఎనభై అయిదు కిలోమీటర్ల దూరం మన కబుర్లతో చిటికెలో వచ్చామనిపించింది. ఏదో హోటల్ కాస్త ఫరవాలేదులే అనుకుంటే కరెంటు పోయింది. ఇంతకీ ఏమంటున్నాడు మన గైడ్!” అడిగాడు సూర్యనారాయణ, రియల్ ఎస్టేట్ వ్యాపారి అతడు.

“సిమికొట్, హిల్సాలో వాతావరణం బాగోలేదట. మనం నేపాల్ గంజ్‌లోనే కొద్దిరోజులు ఉండాల్సి వచ్చేట్టుంది” అన్నాడు కిరణ్.

“బోర్‌కొడ్తోంది. ఏదైనా సినిమా చూద్దామా!” అన్నాడు ఆనందరావు.

చాయ్ దుకాణమతడు చెప్పాడు పక్కనే భాగేశ్వరిలో సినిమా థియేటర్ ఉందని. మోటార్‌సైకిల్ ఆటో కలిపి చేసిన హైబ్రిడ్ బండి ఎక్కి QFX థియేటర్‌లో ‘గాల్ గాదత్’ నటించిన ‘వండర్ వుమన్’ చూసాక హాల్లో ఎయిర్‌కండిషన్ అందరికీ నచ్చింది. అక్కడో మెరుపుతీగెను చూసాడు కిరణ్. తన స్నేహితురాలితో వచ్చినట్లుంది.

“బయట దీపాల వెలుగులో దెయ్యప్పురుగులు ఎగుర్తున్నాయి జంటలు జంటలుగా! మనం ఒంటరిగా! నలుగురు మగవాళ్ల వలన రొమాంటిక్ ప్రపంచానికేం ఉపయోగం లేదు” అన్నాడు ఆనందరావు. సిన్మా హాల్ నుంచి హొటల్‌కు వచ్చేసరికి హొటల్ లాంజ్‌లో వాళ్లిద్దరు కనిపించారు కిరణ్‌కు.

మరుసటి రోజు ఉదయాన ఎక్స్‌ట్రా లగేజ్ తీసేసి క్లోక్‌రూంలో పెడుతుంటే మరల కనిపించింది ఆమె. స్నేహపూర్వకంగా నవ్వాడు కిరణ్. తనను గుర్తుపట్టినట్లు ఆమె చిరునవ్వు నవ్వింది.

"పరిక్రమా?" అన్నాడు ప్రశ్నార్థకంగా "నాపేరు కిరణ్!"

"మానస సరోవర యాత్ర! యస్! నేను శీతల్! ఈమె వసుధ ఫ్రమ్ చండీఘర్!" అన్నది శీతల్.

వసుధ కాస్త సీరియస్ టైపులా ఉంది. వయసులో పెద్దది. నలభై-నలభై అయిదు ఉండవచ్చు.

"మేం ఫిజికల్ ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్లం. యోగా, ఏరోబిక్స్ నేర్పుతాం" అన్నది వసుధ అంటీ ముట్టనట్టుగానే.

"మాది విజయవాడ" అన్నాడు కిరణ్.

"మా తాతగారిది విజయవాడ! మేము చండీఘర్‌లో సెటిల్ అయ్యాం" అన్నది శీతల్ "బై" చెబుతూ.

"మనవాడు మొదలెట్టాడు" అన్నాడు ఆనందరావు సూర్యనారాయణ, మార్కండేయలతో.

"మన గ్రూపుకు రేపు ఉదయం వరకు ఈ నేపాల్‌గంజ్ ఉక్కబోతలోనే మోక్షమట!" అన్నాడు మార్కండేయ విసుగ్గా.

శీతల్, వసుధ గ్రూపు సిమికోట్ వెళ్లిపోయారు. నిత్యప్రేమికుడు కిరణ్ కాస్త దిగులుగా కనిపించాడు.

కిరణ్‌ను కాస్త ఉత్సాహపరచడానికన్నట్లు మార్కండేయ కర్నాలి నదివేపు ప్రోగ్రామ్ ఫిక్స్ చేసాడు. దారిలో అద్భుతమైన దృశ్యాలను చూస్తూ వాళ్లు మైమరచిపోయారు.

"మానస సరోవరం దగ్గర హిమాలయాల్లో మాప్చాచుంగొ గ్లేసియర్ (టిబెట్-చైనా)లో మొదలై నేపాల్‌లో 500 కిలోమీటర్లు ప్రయాణించి ఇండియాలోని బ్రహ్మఘాట్ దగ్గర శారదానదిలో కలుస్తుంది కర్నాల్ నది. శారదా, కర్నాల్ నదులు కలిసి 'ఘాఘరా' నదిగా వేయి కిలోమీటర్లు పారి ఎడమ పాయగా గంగానదిలో కలుస్తుంది" అన్నాడు ఆనందరావు.

"రామాయణంలో వర్ణించబడిన 'సరయూ' నది ఘాఘరానదీ దిగువ భాగమే! సరయూ నది కుడి ఒడ్డున అయోధ్యా నగరం ఉన్నది" అన్నాడు సూర్యనారాయణ.

"నేపాల్ ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి 'అయోధ్య మా నేపాల్-పర్సా జిల్లాలో బీర్‌గంజ్ దగ్గర థోరి' అన్నాడు నిజమేనా! రామాయణం వ్రాసిన వాల్మీకి ఆశ్రయం చితవన్ నేషనల్ పార్క్‌లో గండకీ నది దగ్గర ఉంది. గండకీ నదిలోనే కదా సాలగ్రామాలు దొరికేది" కిరణ్ అడిగాడు ఉత్సుకతతో.

"అవును. సీతాదేవికి లవకుశులు జన్మించింది, పెరిగి యుద్ధ విద్యలు, రామకథా గానం నేర్చుకున్నదీ చిత్‌వన్‌లోని వాల్మీకి ఆశ్రమంలో అనేది ఐతిహ్యం. నేపాల్-ముస్తాంగ్ జిల్లాలో ముక్తినాథ్ దగ్గర గండకీ నదిలో దొరికే అమ్మోనైట్ శిలాజాలను విష్ణుమూర్తి చిహ్నాలుగా పూజిస్తారు. దేవీ భాగవతంలో వీటి గురించి వర్ణించబడింది" వివరించాడు మార్కండేయ.

"నేపాల్-చైనా స్నేహంతో ఇండియాకు కించిత్ కష్టకాలం వచ్చింది" అన్నాడు సూర్యనారాయణ.

మరుసటి రోజున ఉదయమే లేచి నేపాల్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుంటే అన్నాడు ఆనందరావు "స్వర్గానికి మెట్లు' లో తొలిమెట్టు ఇది".

విమానాశ్రయంలో ఉన్న ఫిక్స్‌డ్ వింగ్ చిన్న విమానాలు (డొనీర్, ట్విన్ ఒట్టర్‌లు) బాగా పాతబడ్డ లారీల్లా ఉన్నాయి. ఏడుగురు ప్రయాణీకుల్ని లగేజీతో కలిపి కట్టకట్టి తొక్కినట్లు పడేశారు. విమానంలో ఇరుకు ఇరుకుగా కూర్చుని ఓ గంట భారంగా, గాలిలో దీపంలా కాలం గడిపేసరికి సిమికోట్ వచ్చింది.

"సముద్ర మట్టానికి 3,000 కిలోమీటర్ల ఎత్తున షార్ట్ టేకాఫ్ అండ్ లాండింగ్ (Stol) విమానాశ్రయం ఉన్న చిన్న మున్సిపాలిటీ- సిమికొట్. పదకొండు వేల జనాభా!" అన్నాడు ఆనందరావు.

"ఇంకో వార్త! ఈరోజు సిమికొట్‌లోనే ఉండాలట! హిల్సాలో వాతావరణం బాగాలేదు" వార్త మోసుకొచ్చాడు సూర్యనారాయణ.

'సిమికోట్'లో హొటల్ లాంటి దాంట్లో దిగేసరికి రకరకాల ఉద్వేగాలు పొంగుకొచ్చాయి. "నా చిన్నప్పుడు అంటే యాభై ఏళ్లకింద మా ఊళ్లో ఇలాంటి హొటలే ఉండేది. అన్నీ కామనే! కైలాస మానస సరోవర యాత్ర అంటే అన్ని సౌఖ్యాలు వదులు కోవాలన్నది ఇక్కడ అర్థమవుతోంది" అన్నాడు మార్కండేయ కించిత్ దిగులుగా!

ఎవరి దారిన వారు ఊరు చూడటానికి పోయారు కాబోలు కిరణ్ నిద్ర లేచేప్పటికి రూమ్‌లో ఎవరూ లేరు. బయట చలిపుడుతోంది. థర్మల్స్, స్వెట్టర్‌తో బందోబస్తుగా బయటకు వచ్చి చూసాడు. చాలామంది ప్రయాణీకులు తమలాగే చిక్కుకుపోయినవాళ్లు వీధినపడి తిరుగుతున్నారు. ఊరి చివర శివాలయం బాగుందని అటువెళ్లి తిరిగొచ్చిన ఆనందరావంటే కిరణ్ తన వీడియో కెమెరాతో షూట్ చేసుకుంటూ బయల్దేరాడు. ఆడవాళ్లు శ్రమించి పనిచేస్తుంటే బాతాఖానీతో మగవాళ్లు కాలక్షేపం చేసే మగ సామ్రాజ్యమీ ఊరు.

రాత్రి పడిన వర్షానికి తడిచిన బురద రోడ్డుపై జారుతున్నాయి కాళ్లు. పక్కనే చిన్ని వాగులు. కాస్త నీరెండ మధ్యాహ్న సమయానికి వచ్చి ఊరు ప్రకాశవంతమైంది. బంగారు రంగులో బార్లి పొలాలు, ముదురాకుపచ్చ ఓక్, పైన్, రొడొడెండ్రాన్, వెదురుచెట్లు, వాటిలోంచి నెమిలిరంగులో ఉన్న మోనాల్ (డాన్‌ఫె) పక్షి ఎగురుకుంటూ పోయింది వంతెన పక్కన నిలబడి చూస్తున్న కిరణ్ మీదుగా!

"లక్కీఫెలో" అన్నాడు దారినే పోతున్న స్థానికుడొకడు. "ఏదైనా తలుచుకో, కోరుకున్నది నెరవేరుతుంది."

"నమస్తే!" అన్నాడు కిరణ్. "థాంక్యూ సర్!"

"రాజకుమారి లభిస్తుందా! ఏమో!" అనుకున్నాడు తనలో తాను మోనాల్ పక్షి వెళ్లిన వేపుకు చూస్తూ.

ఆకుపచ్చని పొలాల మధ్య ఒంటరి శ్వేతద్వీపంలా ఉన్నదా శివాలయం. గుడి ముందు ఆవరణలో పిల్లలు ఊయలలూగుతున్నారు. ఖరీదైన షూస్ విడిచి వెళ్లాలంటే పిల్లలెత్తుకుపోతారేమోనని భయం. పరిక్రమ కోసం కొన్న షూస్ మరి. శివుడి మీద భారం వేసి షూస్ విడిచి లోపలికి అడుగుబెట్టాడు కిరణ్.

"సర్, ఫ్రమ్ ఇండియా? గివ్ మి ఫైవ్ రూపీస్! ఐవిల్ షోయూ సొమ్‌థింగ్ జీ" అన్నాడో గడుగ్గాయి. "యువర్ షూస్ మై రెస్పాన్సిబిలిటీ!"

"వీడు నా ఆలోచనల్ని చదివేస్తున్నాడే" అనుకుంటూ కిరణ్ అతడి చేతిలో అయిదు రూపాయలు పెట్టి అతడు చెబుతున్నది వింటూ, తలుపు రంధ్రాల్లోంచి శివలింగాన్ని, వెలుగుతున్న ప్రమిదల దీపాల్ని చూసి గుడి వెనక్కి

వెళ్లేసరికి పక్కనే ఉన్న ఓక్ చెట్టు మీద మోనాల్ పక్షి రెక్కలు రెపరెపలాడిస్తూ "హలో!" అన్నదా!

తన చెవుల్నీ, కళ్లనీ, తన అదృష్టాన్నీ, తనను తాను నమ్మలేకపోయాడు "హలో కిరణ్!" అన్నదామె. అటు మోనాల్ – ఇటు శీతల్!

"చాలా బాగుంది కదూ ఇక్కడ" అన్నది శీతల్.

"ఆ మోనాల్ నన్నిక్కడికి తీసుకువచ్చింది" అన్నాడు కిరణ్ ఆ పక్షివేపు చూపిస్తూ.

"లవ్ ఇన్ సిమికోట్" అన్నాడా గడుగ్గాయి ఇకిలిస్తూ.

గుట్టమీద గుడి, దిగువన కర్నాల్ నది గలగలలు, అప్పుడప్పుడు గుడిగంటల సవ్వడి; చుట్టూ పంటపొలాలు, పక్కనే శీతల్! ఆమె ఎంత అందంగా ఉన్నదంటే అందమంటే ఎలా ఉండాలో అలా ఉంది, అందేంత దగ్గరలో, అందనంత దూరంగా!

"నా పూర్తిపేరు రాజ్‌కిరణ్! వైరాలజిస్టును. ఎడ్వెంచర్స్ నాకిష్టం" అన్నాడతడు మాటలు కలుపుతూ.

"నాక్కూడా! ఇండియాలో చాలా హిల్‌స్టేషన్లలో ట్రెక్కింగ్ చేసాను. చాలాసార్లు ఒంటరిగానే! ఈసారి ప్రయాణంలో వసుధ పరిచయమయ్యింది" అన్నది శీతల్. "ఉత్తరాఖండ్ పూలలోయ– వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ అంటే చాలా యిష్టం నాకు".

"అక్కడ బెల్‌ఫ్లవర్స్, గెరానియం, మల్టిస్టోరీడ్ మోరినా పూలుంటాయట కదా, నేను వెళ్లలేదు. నాకు నచ్చింది నీలగిరి కొండల్లోని కురింజి పూల వికాసం. 2006లో నేను వెళ్లినపుడు అక్కడ కొండలు, గుట్టలు, మైదానాలు నీలికురింజి పూల కార్పెట్‌తో కప్పబడినట్లు కనిపించాయి".

"నేను 2018లో చూసాను. ఒక అద్భుత దృశ్యం అది" అన్నది శీతల్ ఆత్మీయంగా.

ఇద్దరూ మాట్లాడుకుంటూంటే మూడు గంటలు గడిచిపోయాయి క్షణాల్లా. ఆ గడుగ్గాయి పిల్లాడికి మరో పది రూపాయలిచ్చి, షూస్ తొడుక్కుని ఊరిముఖం పట్టారిద్దరూ.

పేదరికం కొట్టవచ్చినట్లు కనిపిస్తోందక్కడ. గుట్టల మీద కట్టుకున్న ఇళ్లు, సరైన తలుపులు లేక చెక్కలు అడ్డంగా పెట్టుకున్నవి. హిందూ కులవ్యవస్థ, లామా సాంప్రదాయాలు కలిసిన సమాజం వీటి గురించి మాట్లాడుకుంటూ వీడ్కోలు చెప్పుకుని ఎవరి హోటల్‌కు వారు వెళ్లిపోయారు.

ఉదయం ఎనిమిది గంటలకల్లా తొలి హెలికాప్టర్ బయల్దేరుతుందనే సరికి అందరిలో ఉత్సాహం పెల్లుబికింది. సిమికోట్ విమానాశ్రయం దగ్గర హెలికాప్టర్ల సందడి. అయితే హిల్సాలో వర్షం కురుస్తుందట. ఆలస్యమవుతుందని గైడ్ చావుకబురు చల్లగా చెప్పాడు.

ఎవరో పిలుస్తున్నట్లనిపించి వెనక్కి తిరిగాడు కిరణ్. దిగాలు పడిన ముఖాలతో శీతల్, వసుధలు. వసుధ అంది– “కిరణ్! శీతల్ పాస్‌పోర్ట్ ఇంకా రాలేదు. అది వచ్చేవరకు మేము ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చేట్లుంది”.

“నీవు వెళ్లు వసుధా! ది సీజ్ మై ఫేట్! యూ నీడ్ నాట్ స్టే ఫర్‌మి!” అన్నది శీతల్.

“దట్స్ నాట్ ఫెయిర్. ఐవిల్ స్టే!” అన్నది వసుధ.

కిరణ్ వెళ్లి గైడ్‌నడిగాడు “శీతల్ లేట్‌గా సబ్మిట్ చేసింది సర్ తన పాస్‌పోర్టు. ఈ వెదర్ కండిషన్ వలన ప్లేన్స్ డిలే అయ్యాయి. ఆమెకు పైసా నష్టం లేకుండా నెక్స్ట్ బ్యాచ్‌లో ఆమెకు పరిక్రమ చేయిస్తాను. అది నా పూచీ” అన్నాడు గైడ్ తంకా (Tankah).

కిరణ్ రిక్వెస్ట్ చేసాడు “శీతల్ తల్లిదండ్రులు మా రాష్ట్రం నుంచే వెళ్లి చండీఘర్‌లో సెటిల్ అయ్యారు. నీకు అభ్యంతరం లేకపోతే నేను ఆమెకు తోడుగా ఉండి ఆమెతోపాటు పరిక్రమ చేస్తాను”.

గైడ్ అన్నాడు– “ఒకరికంటే ఏదో తిప్పలు పడతాం! మీ ఒరిజినల్ ప్లాన్‌లో మీరు వెళ్లండి సర్! లేకుంటే మీ ఇద్దరూ నష్టపోతారు. అదుగో ఎనౌన్స్‌మెంట్! హెలికాప్టర్ ప్రయాణాలు మొదలయ్యాయి. బి క్విక్!” అని గైడ్ సీరియస్‌గా వెళ్లిపోయాడు.

మిత్రులూ అదే అన్నారు. వసుధ ఆమాటే అన్నది. శీతల్ అన్నది “కిరణ్! ఇది నా దురదృష్టం. నేను హెడ్ ఆఫీస్‌తో మాట్లాడాను. నన్ను వేరే బ్యాచ్‌తో కలిపారు”.

అప్రయత్నంగా ఇద్దరి కళ్లలో కన్నీళ్లు తిరిగాయి. ఇద్దరికీ అర్థమయ్యింది, ఎక్కడో గుండెలో కలుక్కుమన్న బాధ. ఫోన్ నెంబర్లు, ఈమెయిల్సూ ఇచ్చిపుచ్చుకున్నారు. కలిసిన చేతులు నెమ్మదిగా విడిపోయాయి. ఆమె వెళుతూ వెళుతూ మూలమలుపు దగ్గర తిరిగి కిరణ్ వంక చూసింది. ఆమెనే చూస్తున్న అతడి మనసులో ఆమె వదనం శాశ్వతంగా నిలిచిపోయింది. 'బైబై' అన్నట్లు అతడి పెదాలు కదిలాయి.

"రావయ్యా బాబూ! మన నెంబరు వచ్చింది" అంటూనే ఆనందరావు కిరణ్‌ను లాక్కుంటూ గేటు దాటించి హెలికాప్టర్ వద్దకు తీసుకుపోయాడు.

పైలట్‌తో కలిపి ఆరుగురు కూర్చోగలరు ఆ హెలికాప్టర్‌లో. పన్నెండు కిలోల లగేజి మాత్రమే అనుమతించబడింది. ఎవరి వొళ్లో వాళ్ల లగేజి పెట్టుకుని కాస్త విసుక్కుంటూ ఉండగానే ఛాపర్ రెక్కలు వేగంగా తిరిగాయి. గాలిలోకి నిలువుగా లేచిన హెలికాప్టర్ కొండశిఖరాల్ని దాదాపు స్పృశిస్తూ, మబ్బుల్ని ముద్దాడుతూ, పైన్, ఓక్ చెట్లపైన దూసుకుపోతున్నపుడు దిగువన కర్నాలి నది హిమాలయ పర్వత సానువుల మధ్య వంపుసొంపుల నీలిరేఖలా దర్శనమిచ్చింది. ఇరవై నిముషాలలోపే 3900 మీటర్ల ఎత్తులో ఉన్న హిల్సా చేరుకున్నాక కిరణ్ కాస్త కుదుటపడినాడు కాని శీతల్ స్నేహస్పర్శ ఇంకా అతడిని వీడలేదు.

మరల హిల్సా వాతావరణంలో ఏదో తేడా! పళ్లు పటపటలాడే చలిగాలులు వీచగా వణికిపోయారు యాత్రికులు. హెలికాప్టర్లు ఆగిపోయాయి. వసుధ వేరే గ్రూపులో వచ్చిందని గైడ్ అన్నాడు. శీతల్ సిమికోట్‌లోనే ఉన్నది, రేపు రావచ్చు.

సిమికోట్ కంటే పరమదరిద్రంగా ఉంది హిల్సాలో వసతి. ఇరవై ముప్పై మంది ఒకే డార్మిటరీలో కాలకృత్యాలన్నీ బహిరంగంగానే! పేరుకు సామూహిక టాయ్‌లెట్లున్నాయి కాని, భరించరాని దుర్గంధం. రోమన్లకాలంలో రాళ్లకు రంధ్రాలు చేసిన టాయ్‌లెట్లను టర్కీ-ఎఫిస్యుస్ (Epheseus) లో చూసినట్లు కిరణ్‌కు గుర్తు వచ్చింది. సహ ప్రయాణీకుడు ఓహోయన ఇప్పటికే తొమ్మిదేళ్లు వరసగా పరిక్రమలు చేసిన మహానుభావుడన్నాడు- "బయటకు వెళ్లేప్పుడు జాగ్రత్తగా ఉండండి, చేతిలో కర్ర ఉండడం శ్రేయస్కరం. ఇక్కడి కుక్కలు దేనినీ వదలవు. మీరు లేచేలోపునే శుభ్రం చేస్తాయవి".

దిగువన ఫ్రెండ్‌షిప్ వంతెన దగ్గర కుక్కల అరుపులు వినవస్తుండగా తాము వచ్చిన పని దిగ్విజయంగా కానిచ్చారు మిత్ర చతుష్టయం కాస్త బెరుకు బెరుకుగానే. దగ్గర్లో కుక్కలు మొరుగుతున్న శబ్దాలు.

గ్రూపు అందరూ వచ్చాక ఒక క్రమపద్ధతిలో అందరూ కాలినడకన 'హిల్సా'ను వదిలి కర్నాలి నదిపై ఉన్న స్నేహ వారధిని దాటి చైనా ప్రాంతమైన టిబెట్ అటానమస్ రీజియన్‌లోకి అడుగుపెట్టారు, అటువేపున బక్కగా ఉన్న నేపాల్ కుక్కలు ఇటువేపు బలంగా ఉన్న చైనా కుక్కల్ని చూసి మొరుగుతున్నాయి ఒక గుంపును చూసి మరొహటి. గైడ్ హెచ్చరిక చేసాడు– "మీరిప్పుడు చైనా భూభాగంలో ఉన్నారు".

"పిచ్చి వేషాలు వేయొద్దని అర్థం కావచ్చు" అన్నాడు ఆనందరావు కిరణ్ వంక చూసి కన్ను గీటుతూ.

నేపాల్ చెక్‌పోస్ట్ గుడారాల్లో ఉంటే చైనా–టిబెట్ చెక్‌పోస్ట్ చక్కటి కాంక్రీట్ భవనంలో జబర్దస్త్‌గా ఉంది. ప్రతి ఒక్క బ్యాగు ఎక్స్‌రే తీయబడింది. పర్సనల్ ఛెకప్స్ అయినాక ప్రయాణీకుల్ని వదిలారు. 'అంతా చైనామయం' ఇక్కడ. బస్సులు, బైకులు, కార్లు, అధికారులు... వొల్వో లాంటి చైనా బస్సులో సముద్ర మట్టానికి 3900 మీటర్ల ఎత్తున ఉన్న తక్లాకొట్ (Taklakot) అనబడే పురాంగ్ చేరుకున్నారు. హిల్సా నుంచి తక్లాకోట్‌కు దూరం 27 కిలోమీటర్లు. "బురాంగ్ (పురాంగ్) అంటే 'గుర్రపు తల' అట" అన్నాడు మార్కండేయ. కర్నాలి నది – నెమలి ముఖం; సింధునది – సింహపు ముఖం; సట్లెజ్ నది – ఏనుగు ముఖం; బ్రహ్మపుత్ర నది – గుర్రపు ముఖం; ఈ బురాంగ్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇవి ఆ నదుల జన్మస్థానాలు".

"మానస సరోవర యాత్ర ఉత్తర ముఖద్వారం – బురాంగ్" అన్నాడు సూర్యనారాయణ. కైలాస పర్వతం విశ్వకేంద్రం. బాన్, బుద్ధిజం, హిందూ, జైనుల పవిత్ర పుణ్యక్షేత్రం.

ఆరోజు హిమాలయా హొటల్‌లో ఉండి మరుసటిరోజు ఉదయం తక్లాకోట్ (బురాంగ్) నుంచి బస్సులో ప్రయాణం మొదలైంది. రెండు గంటలు ప్రయాణం.

"అదుగో రక్షస్థలి – రాక్షసుల సరస్సు. రావణాసుర నిర్మితం. కైలాస పర్వతాన్ని పెకలించబోయినప్పుడు రావణుని మోకాలు నేలకానగా క్రుంగిన

ప్రాంతం. ఉప్పునీరు; జీవజాలం నివసించలేని సరస్సు; నీటి పక్షులు కూడా కానవచ్చేవి కాదనేవారు” అన్నాడు మార్కండేయ. “రావణాసురుడు ఎంత లావుండి ఉంటాడో!” అన్నాడతడు.

వెళ్లి రక్షస్థలి (రాక్షస సరస్సు) చూసి వచ్చారు మిత్రులు.

“దూరంగా అదుగో శివభక్తుడైన గుర్లా మంధాత పర్వతం. ఇంకా దూరాన కైలాసపర్వతం ప్రథమ దర్శనం” నమస్కరిస్తూ అన్నాడు ఆనందరావు.

అక్కడ నుంచి ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానస సరోవరం చేరుకున్నారు.

“టిబెటన్లు ఈ సరస్సును ‘మాఫం యుట్సో’ అని కైలాస పర్వతాన్ని కాంగ్ రిన్ పొచె – మంచుకొండల మణిరత్నం – ప్రెషస్ జ్యూయెల్ ఆఫ్ స్నోస్ – అని పిలుస్తారు” అన్నాడు మార్కండేయ.

“అదుగో చూడండి, మానస సరోవరానికి పడమటి దిక్కున పద్మసంభవుడు తన భార్య యెషె తసొగ్యేల్‌తో తపస్సు చేసిన గుహ ఉన్న పవిత్ర ఆరామం. (స్పారొ మోనాస్టరి). పిచ్చుక గుడి–జియు గొంపా (Jiu Gonpa). సట్లెజ్ నదీ ఏనుగు ముఖద్వారం ఉన్నది అక్కడే!” అన్నాడు కిరణ్.

మిగతా ఇద్దరూ కాళ్లూ చేతులూ కడుక్కుని తలపై నీళ్లు జల్లుకుని వణుకుతుంటే కిరణ్, సూర్యనారాయణ వెళ్లి మూడు మునకలు వేసారు మానస సరోవరంలో. అందరూ ఆ సరస్సులోని పవిత్ర శిలలను, గులకరాళ్లను సేకరించి, సీసాల నిండా పవిత్ర జలాన్ని నింపుకుని సీల్ చేసారు.

“ఈరోజు పౌర్ణమి” అన్నాడు మార్కండేయ. “మానస సరోవరంలో పూర్ణిమా అర్ధరాత్రి పార్వతీ పరమేశ్వరుల ప్రతిబింబాలు కనిపిస్తాయట”.

“ఈ మబ్బులు తొలిగిపోతే రాత్రికి నక్షత్రాల వెలుగులో నిండుపున్నమి వెన్నెలలో మానస సరోవరపు అందాలను వీక్షించవచ్చు. తెల్లవారే తొలి సూర్యకిరణ కాంతులకు కైలాస పర్వతం స్వర్ణకాంతులతో ధగధగమని బంగరు కొండగా భాసించడాన్ని తిలకించవచ్చు” అన్నాడు సూర్యనారాయణ.

మానస సరోవర్ యాత్ర వాళ్లు ఇచ్చిన టెంట్‌లోకి వెళ్లి కాసేపు కూర్చునేప్పటికే మార్కండేయకు ఆయాసం, గుండెదడ మొదలయ్యాయి. పల్స్ ఆక్సిమీటర్ 90 చూపించేసరికి కాసిని ‘ఆక్సిజన్’ పఫ్‌లు తీసుకున్నాడు.

ఈలోగా మబ్బులు దట్టంగా కమ్మి చీకటి పడింది. షెర్పా, గైడ్‌లతో సంప్రదించి వాళ్ల చేతులు తడిపితే వాళ్లు 'డార్చెన్' వెళ్లడానికి వెహికిల్ సమకూర్చినారు.

ఆనందరావుకు ఆయాసం మొదలైంది. డార్చెన్ (కంగ్సా) చేరుకుని 'గాంగెస్' గెస్ట్‌హౌస్‌లో ఓ గంట విశ్రాంతి తీసుకున్నాక ఆనందరావు, మార్కండేయ స్థిమితపడినారు. సూర్యనారాయణ ఆక్సిజన్ సిలిండర్లు తెచ్చాడు. కిరణ్ చిరుతిళ్లు, వాటర్‌బాటిల్స్ కొనుక్కువచ్చాడు.

"గాంగెస్ గెస్ట్‌హవుస్ కోలాహలంగా ఉంది. పరిక్రమ పూర్తిచేసిన వారు చాలా కొద్దిమందే. గత వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా లేదు. తక్లాకొట్, హిల్సా, సిమికొట్, నేపాల్‌గంజ్‌ల మధ్య ఆకాశయానం అంతంత మాత్రంగా ఉంది. ప్రయాణీకులు గెస్ట్‌హవుసుల్లో చిక్కుకుపోయారు" వివరించాడు సూర్యనారాయణ మిత్రబృందానికి.

"మనం కైలాస పర్వత పాదాల వద్ద ఉన్నాం, 4575 మీటర్లు ఎత్తున, ఇక్కడంతా నల్లటి ధూళి. ఎదురుగా కైలాసపర్వత శిఖరాగ్రం; రేపు ఉదయం యమద్వార దర్శనం. అహో ఏమి మనభాగ్యం!" అన్నాడు కిరణ్.

సూర్యనారాయణ అన్నాడు– "కిరణ్! ఇందాక మీటింగ్‌లో నీ స్నేహితురాలు 'వసుధ' ఏమన్నదో తెలుసా! కొందరు చేసే పాపాలకు అందరి పుణ్యాలూ ఆవిరవుతాయట. నిన్న రాత్రి పున్నమి చంద్రుడి వెన్నెలా రాలేదు, సరోవరంలో ఆదిదంపతుల నీడా కనబడలేదుట!"

"అవునా!" అన్నాడు ప్రసాద్.

"పరిక్రమ దారి బాగోలేదు. నిన్న మొన్న వెళ్లిన వాళ్లలో కొందరికి ఏక్సిడెంట్‌లు, రెండు మరణాలు సంభవించాయట. 'యమద్వార్' చూసి, పరిక్రమ మానేస్తే మంచిదని గైడ్ అంటే – నేను సపోర్ట్ చేసాను. ఆమె రెచ్చిపోయింది – 'పైసా పైసా కూడబెట్టుకుని ఇంతదూరం వస్తే పరిక్రమ లేదంటారా? ఎవరు వచ్చినా, రాకపోయినా నేను వెళ్లితీరతాను. మీరు ఒప్పుకోకపోతే హెడ్ ఆఫీస్‌కు ఫిర్యాదు చేస్తానిప్పుడే' అనేసరికి ఆమెను కొందరు సపోర్టు చేశారు. 'రేపు పరిక్రమ మొదలవుతుంది' అని గైడ్ ఎనౌన్స్ చేసి 'వాతావరణం బాగుంటే!' అని ముగించాడు" అన్నాడు సూర్యనారాయణ.

ఆనందరావు, మార్కండేయలు పరిక్రమ వద్దనుకున్నారు. సూర్యనారాయణ తటస్థంగా ఉన్నాడు. కిరణ్‌కు పరిక్రమ చేయాలని ఉంది.

డార్చెన్‌లో టిబెటన్ల శిబిరం వేపు వెళ్తుంటే ఎదురొచ్చింది వసుధ. పలకరించకుండా ముభావంగా వెళ్తూ అన్నది గొణుగుతున్నట్లు "పరిక్రమ దేవుడి చుట్టూరా చెయ్యాలి, అమ్మాయిల చుట్టూ కాదు".

చెంప ఛెళ్లుమన్నట్లయ్యింది కిరణ్‌కు. అతడి మనోఫలకంపై శీతల్ ప్రత్యక్షమయ్యింది; కళ్లలో నీళ్లు తిరిగాయి.

తెల్లవారే లేచి శుచిగా యమద్వార్ చేరుకున్నారు వెహికిల్‌లో మిత్రులు నలుగురూ. సూర్యనారాయణకు హై ఆల్టిట్యూట్ సిక్‌నెస్ ఎక్కువయ్యింది. రాత్రి వాంతులయ్యాయి. నీరసంగా ఉన్నాడు. పరిక్రమ చెయ్యాల్సిన మూడో వికెట్ డౌన్ అయ్యింది.

యమద్వార్ ఉన్న ప్రాంతం తర్బొచె (Tarboche)–ముక్తిమార్గపు యమద్వారాన్ని దాటేప్పుడు ఏదైనా వస్తువు వదిలెయ్యడం ఆనవాయితీ. కిరణ్ తాను వ్రాసిన 'జర్నీ టు మానస సరోవర్' అనే పుస్తకాన్ని అక్కడ ఉంచాడు. ఏం వదిలావు అంటే "ప్రేమ రాహిత్యాన్ని" అన్నాడు.

మనిషి పోగలిగినంత ద్వారం ఉన్న కట్టడం యమద్వార్. ఎదురుగా కైలాస పర్వతం. అక్కడ నుంచే పరిక్రమ ప్రారంభమవుతుంది.

"టిబెటన్లు ప్రతియేటా కైలాసవాసి పరమాత్మ డెమెఛొక్ (Demchok)ను ప్రస్తుతిస్తూ ఇక్కడ కొత్త జెండా కర్రను ప్రతిష్ఠిస్తారు. ఆ పండుగ పేరు 'సాగా దవ' (Saga Dawa). నీలం (ఆకాశం), తెలుపు (గాలి), ఎరుపు (అగ్ని), ఆకుపచ్చ (నీరు), పసుపుపచ్చ (భూమి) రంగుల జెండాలను వరుస క్రమంలో తాళ్లకు కట్టి ఎగరవేస్తారు. శంఖాలు, బాకాలు, డప్పులతో ఇక్కడ కొద్దిరోజులు హోరెత్తిపోతుంది. టిబెటన్లు గుంపులు గుంపులుగా వచ్చి ఈ ఉత్సవానికి హాజరవుతారట కైలాసవాసి డెమ్‌ఛొక్‌ను పూజించేందుకు. కైలాస పర్వతపు (కాంగ్ రిన్‌పొఛె) దక్షిణ ముఖం స్వస్తిక్ ఆకారంలో ఉన్నదని టిబెటన్ బౌద్ధులు భావిస్తారు" అన్నాడు మార్కండేయ.

యమద్వారాన్ని దాటి, కైలాస పర్వతాన్ని దర్శించాక మనసు కాస్త స్థిమితపడింది కిరణ్‌కు. మిత్రులకు చెప్పి పరిక్రమ ప్రారంభమయ్యేవేపుకు నడిచాడు. చెట్టూ చేమా లేని ఆ ప్రదేశంలో గులకరాళ్ల మధ్య కనిపించాయి నీలి పూలు (ఫర్‌గెట్ మి నాట్ ఫ్లవర్స్), కాస్త దూరంలో కస్తూరి కమల పుష్పాలు. కర్నాలి నది అంచున అడవి ఉల్లిపూలు.

పక్కనే 'యాక్'లు ఆ కాస్త పచ్చదనాన్ని మేస్తున్నాయి. వాటిని మేపుతున్న ఒక టిబెటన్ కిరణ్ వంక తదేకంగా చూస్తున్నాడు. అంతలో కిరణ్ దృష్టిని ఒక గోధుమరంగు పుల్లలాంటిది ఆకర్షించింది. కస్తూరి కమల పూలను కోస్తూ ఆ పుల్లలాంటి దానిని పెల్లగించాడు. ఆ గోధుమరంగు పుల్ల కింద బంగారు రంగులో మెరుస్తూ గొంగళిపురుగు లాంటిది. ఒళ్లు జలదరించి కింద పడేసాడు.

కిరణ్‌ను చూస్తున్న టిబెటన్ పరిగెత్తుకుంటూ వచ్చి ఆ పురుగును చూసి పెద్దగా కేకపెట్టాడు. "యార్ట్సా గుంబు" అతడి కేక విని ఇంకో నలుగురు గుమికూడారక్కడ. కిరణ్‌ను చూపిస్తూ అతడు వాళ్లతో ఏదో చెబుతున్నాడు టిబెటన్ భాషలో. అక్కడే కిరణ్‌కు కస్తూరి కమలాల కింద ఇంకో అయిదు పుల్లలు కనిపించగా వాటిని కెల్లగించి వాళ్లకిచ్చాడు వాళ్ల ముఖాల్లో వర్ణించలేనంత ఆనందం. ఏదో గుసగుసలాడుకుని కైలాస పర్వతానికి మొక్కుతూంటే, వాళ్ల నాయకుడు కాబోలు, కిరణ్ పేరడిగి తన మెడలోని పూసల గొలుసు తీసి కిరణ్ మెడలో వేసి "గొడొల్పా, గొడొల్పా కిరణ్!" అన్నాడు 'లామా' పూజారిలా! మొదటగా దొరికిన పురుగును జాగ్రత్తగా రుమాలులో పెట్టి జేబులో వేసుకున్నాడు కిరణ్.

ఈ హడావుడి చూసి మిత్రులు కిరణ్‌ను రమ్మని కేకలు పెట్టారు. టిబెటన్ మిత్రులకు థాంక్స్ చెప్పి రెండు మూడు సెల్ఫీలు దిగి యమద్వార్ వద్దకు వచ్చాడు కిరణ్.

"నువ్వేదో కొంటెపని చేసావేమో, వాళ్లు తన్నబోతున్నారని భయమేసింది" అన్నాడు సూర్యనారాయణ.

"కస్తూరి కమలాల కింద ఫంగస్ కాడలా కనిపిస్తే కెల్లగించాను. ఫంగస్ ఓ ఎండిన గొంగళిపురుగు తలకంటుకుని ఉంది. ఇదుగో చూడు, ఇటువంటివి ఓ అయిదు దొరికాయి. అవి వాళ్లకిస్తే ఈ పూసల గొలుసు నా మెడలో వేసారు" అన్నాడు కిరణ్ తన చేతికంటిన ఫంగస్ పొడిని దులిపేస్తూ.

ఆనందరావు అన్నాడు ఆలోచిస్తూ "అది కాటర్‌పిల్లర్ ఫంగస్ కావచ్చు. చైనీస్, టిబెటన్, నేపాల్ నాటువైద్యాలలో వాడతారు. చాలా ఖరీదైనది".

'దెరాపుక్‌కు డొల్మాలా-పాస్‌కు మధ్య మంచు చరియలు విరిగిపడు తున్నాయని 'పరిక్రమ' ఆ రోజుకు ఆపివేసారు. కైలాస పర్వతాన్ని తనివితీరా చూసి మిత్రులు నలుగురూ మరల డార్చెన్‌కు చేరుకున్నారు.

"పరిక్రమలో- డార్చెన్ నుంచి దెరా-పుక్‌కు ఇరవై కిలోమీటర్లు. ఆరు గంటల ప్రయాణం. 5080 మీటర్ల ఎత్తులో ఉంటాం! అక్కడ కాంపింగ్! ఫస్ట్ స్టాప్. మరుసటి రోజు ఇంకో 550 మీటర్లెక్కి దొల్మా-లా-పాస్ చేరుకుని, ఆరువందల మీటర్లు దిగి జుతుల్-పుక్ (దిజుల్త్రి-పుక్) చేరుతాం. ఎనిమిది గంటల నడక - పద్దెనిమిది కిలోమీటర్ల ప్రయాణం. మూడవ రోజు నాలుగు గంటల్లో పధ్నాలుగు కిలోమీటర్లు నడిచి డార్చెన్ చేరుకుంటాం. రేపైనా 'పరిక్రమ' (కొరా) కుదిర్తే" అన్నాడు మార్కండేయ కాస్త ఆయాసపడుతూ.

"ప్లాన్  బాగానే ఉంది కాని మొత్తం మన ఫ్లైట్ షెడ్యూలంతా తారు మారవుతుంది! కిరణ్! నీవు వెళ్లదలుచుకుంటే వెళ్లు, మేం 'డ్రాప్' అయినట్లే" అన్నాడు ఆనందరావు.

"మనం వచ్చిన పర్పస్ సర్వ్ అయ్యింది కదా! మానస సరోవరం, కైలాస పర్వతం చూసాం! ప్రాణాంతకమైన నడక వద్దులే! బతికుంటే మరోసారి రావచ్చు" అన్నాడు సూర్యనారాయణ.

"నేనూ మీతోపాటే" అన్నాడు కిరణ్.

"డార్చెన్ నుంచి తక్లాకొట్, అక్కడ నుంచి హిల్సా చేరుకోడానికి షెర్పాల, గైడ్‌ల చేతులు తడిపితే కాని ముందు నెంబరు దొరకలేదు. హిల్సా నుంచి హెలికాప్టర్‌లో సిమికోట్ వచ్చేసరికి ఆలస్యమయ్యింది. యాత్రలో చిక్కుకుపోయిన జనంతో హోటళ్లు కిటకిట లాడుతున్నాయి. సిమికోట్‌లో నలుగురికి కలిపి ఒక్క రూం దొరికింది. మరుసటి రోజు షెడ్యూల్ ప్రకారం ప్లేన్ ఎక్కి నేపాల్‌గంజ్‌లో దిగాక ప్రాణం కుదుటపడింది.

కిరణ్ నేపాల్‌గంజ్‌లో ఆగిపోవడానికి నిశ్చయించుకున్నాడు. మిగతా ముగ్గురు లక్నోకు, అక్కడ నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు, అక్కడ నుంచి స్వస్థలాలకు చేరుకున్నారు క్షేమంగా.

ఏదో అసంతృప్తి కిరణ్‌లో. పరిక్రమ చేయలేకపోయాడు, కనీసం ఈ కాటర్‌పిల్లర్ ఫంగస్ గురించైనా తెలుసుకోవాలి. నెట్‌లో బోల్డెంత సమాచారం దొరికింది. నేపాల్‌లోని పన్నెండు జిల్లాల్లో (దార్చులా, జుమ్లా, ముగు, బజంగ్, మనంగ్, గొర్ఖా, రుసువా, సింధుపల్‌చౌక్, శంఖువ సభ, మ్యాగ్ది, రుకుమ్, డొల్పా) యార్సాగుంబా దొరుకుతుంది. టిబెటన్ లామా తన మెడలో పూసలదండ వేస్తూ గొడొల్పా, గొడొల్పా అన్నమాట అర్థమయ్యింది కిరణ్‌కు. 'గో డొల్పా' -

యస్! వెళ్తాను డొల్పాకు. ట్రెక్కింగ్ పర్మిట్, టిమ్స్ కార్డ్ దొరికాయి కాస్త ఖర్చుపెట్టగా!

నేపాల్‌గంజ్‌కు డొల్పాకు దూరం 150 కిలోమీటర్లు. కాంపింగ్ కిట్ తీసుకుని తారా ఎయిర్‌లైన్స్‌లో జుఫాల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు కిరణ్. నలభై అయిదు నిముషాల ప్రయాణం. సముద్ర మట్టానికి 2500 మీటర్ల ఎత్తులో జుఫాల్. అక్కడ నుంచి దునాయి చేరుకోడానికి మూడు గంటలు పట్టింది. రోజుకు అయిదారు గంటలు ట్రెక్కింగ్. జుఫాల్‌లో కిరణ్‌కు తోడు పదిహేను మంది ఓ గ్రూపుగా బయల్దేరారు. దునాయి–లింగ్‌డొ–లాహిని ఒదర్–టొల్‌టొల్ – థొతరప్ – నుమా–లాఫెది బేస్ కాంప్ (4480 మీటర్ల ఎత్తు) నుయాలా పాస్ మీదుగా – దనిగర్ – బాగాలా – యాక్ ఖర్కా – రింగ్‌మో గ్రామం చేరుకునేసరికి పదిరోజులు పట్టింది. దారిలో ధవళగిరి పర్వతాల అందాలు, మంచు చిరుత అడుగుజాడలు (స్నో లియొపార్డ్), నీలి గొర్రెలు, జలపాతాలు, టార్కాయిస్ నీలి జలాల సరస్సులు, శతాబ్దాలుగా సంచార జీవితాలు గడుపుతున్న టిబెటన్ జాతి నేపాలీలు బాన్ మతావలంబీకుల జీవితాల్ని అధ్యయనం చేస్తూ ఫొక్ సుండో సరస్సు వద్ద ఆగింది ట్రెక్కింగ్ గ్రూపు. 'రింగ్‌మో' గ్రామంలో బస.

మరుసటిరోజు ఉదయం బాన్ మతస్థుల గుడి బాన్‌గొంపాకు వెళ్తున్నపుడు మరల ప్రత్యక్షమయ్యింది మోనాల్ పక్షి, ఈసారి జంటగా! వాటి రెక్కల చప్పుడుకు కిరణ్ గుండె దడదడలాడినా, ముఖంపై చిరునవ్వు విచ్చుకుంది. ఏదో ఆశ. ఒక చక్కటి స్వప్నం. అంతే!

తొమ్మిది వందల సంవత్సరాల చరిత్ర గల షొవా గొంపా (Tshowa Gompa), ఫొక్సుండొ సరస్సు అంచున ఉన్నది ఓ గుట్టపై. పొలాల్లో యాక్ పశువులు మందలు మందలుగా కానవచ్చాయి తెల్లగా, నల్లగా మేఘాల్లా. సముద్ర మట్టానికి 11350 అడుగుల ఎత్తున ఉన్న ఫొక్సుండొ ఓ అద్భుతమైన సరస్సు. ఆ సరస్సు నీలిజలాల అడుగున ఓ మంత్రభవనం, దివ్యాత్మల తాంత్రిక మండల చక్రం ఉన్నదని అక్కడి ప్రజలు విశ్వసిస్తారు" వివరిస్తున్నాడు గైడ్. అతడిని అనుసరిస్తూ గ్రూపు గుడివేపు వెళ్లింది. ఒంటరిగా మిగిలాడు కిరణ్.

ఆ సరస్సు నీటిలోకి చూస్తూ తన ప్రతిబింబాన్ని చూస్తున్నపుడు పక్కనే ఎవరిదో నీడ కనిపించినట్లై వెనక్కి తిరిగాడు కిరణ్!

ఎదురుగా శీతల్! కాసేపటికి తేరుకున్నారిద్దరూ. "మోనాల్ పక్షి కనిపించింది ఈ ఉదయాన జంటగా" అన్నాడు కిరణ్.

ఆమె నవ్వింది ధవళగిరి పర్వతాలపై మంచు మెరిసినట్లు. “నేనిక్కడకు వచ్చి నాలుగు రోజులయ్యింది. ఈ గ్రామం విడిచి వెళ్లబుద్ధి కాలేదు. ప్రతిరోజూ పనిగట్టుకుని రావడం, ఈ సరస్సు అందాలను చూస్తూ మైమరచిపోవడం” అన్నదామె. అతడి వేపు చూసి నవ్వులు విరజిమ్ముతూ. “ఇప్పుడనిపిస్తుంది ఇందుకేనేమోనని!”

“సిమికోట్ నుంచి డార్చెన్ వెళ్లలేదా?” అడిగాడు కిరణ్.

“రెండు రోజుల వరకూ పాస్‌పోర్టు రాలేదు. ఇది అయ్యేపని కాదనిపించింది. అప్పర్ డొల్పా ట్రెక్కింగ్ బుక్ చేసుకుని, ఇటు వచ్చాను” అన్నదామె.

“మేము యమద్వార్ దాటి వెనక్కి వచ్చాము. యమద్వార్ దగ్గర నాకు కాటర్‌పిల్లర్ ఫంగస్ కనిపించింది. అక్కడ అంతవరకు కనిపించని ‘యార్సాగుంబు’ను నేను చూపించేసరికి టిబెటన్ల ‘లామా’ నన్ను ఆశీర్వదించి ఈ పూసలదండ వేసి గొడొల్పా, గొడొల్పా అన్నాడు. అప్పుడు అర్థం కాలేదు ఆ మాటకర్థం. గో డొల్పా అని! ‘డొల్పా’కు ఎందుకు వెళ్లమన్నాడో ఇప్పుడు అర్థమయ్యింది నాకు” అన్నాడు కిరణ్ ఆమె వేపు తన్మయంగా చూస్తూ.

మాట్లాడుతూనే కిరణ్ అక్కడ గులకరాళ్ల మధ్య నీలిపుష్పాలు, కస్తూరి కమలపూల గుత్తుల్ని చూసాడు. “శీతల్! అటు చూడు! యమద్వార్ వద్ద కూడా నాకు కస్తూరి కమలపూల దగ్గర ‘యార్సాగుంబా’ పురుగు కనిపించింది”. దగ్గరకు వెళ్లి పరీక్షించి చూసాడు. అక్కడ ఆశ్చర్యంగా గోధుమరంగు కాడలు పూల మధ్య ఒకటి కాదు వందలు వందలుగా... తవ్వి చూసాడు, మేలిమి బంగరు రంగు పురుగు.

“మైగాడ్!” అన్నది శీతల్. “కిరణ్! ఈ ఒక్కో పురుగు అయిదు నుంచి పది డాలర్ల విలువ చేస్తుంది”.

నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో ఉన్నది వాళ్లిద్దరే. మూడు గంటలు కష్టపడేసరికి అయిదువందల పురుగులు స్వంతమయ్యాయి. “రెండు మూడు రోజులు మనకిదే పని” అన్నది ఆమె.

“అప్పర్ డొల్పాలో ఓ రోజంతా మోకాళ్లు మోచేతుల మీద దేకుతూ కష్టపడితే నాలుగయిదు దొరికితే మహాభాగ్యం! మనకి గంటకు రెండు వందలు దొరికాయి.... అవీ కుప్పలు కుప్పలుగా!” అన్నాడు కిరణ్.

"ఒకప్పుడు చైనా చక్రవర్తులకు మాత్రమే అందుబాటులో ఉండేది ఈ మూలికా వైద్యం. తరువాత చైనీస్, టిబెటన్, నేపాలీ, ఇండియన్ సంప్రదాయ వైద్యంలో భాగమైంది. 'హిమాలయన్ వయాగ్రా'గా పేరొచ్చింది దీనికి!" అన్నది శీతల్.

"సెప్టెంబర్ 1993 బీజింగ్ ఒలింపిక్స్ – ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో చైనా ఆటగాళ్లు వరల్డ్ రికార్డులను బద్దలు కొట్టడానికి 'కాటర్‌పిల్లర్ ఫంగస్' టీ కారణమని వాళ్ల కోచ్ చెప్పడంతో దీనికి డిమాండ్ అమితంగా పెరిగిపోయింది. సార్స్ వైరస్‌ను ఇది 2003లో నియంత్రించిందనేసరికి దీని విలువ ప్రతి సంవత్సరం 20 రెట్లు పెరిగింది. దీని ప్రపంచ మార్కెట్ విలువ దాదాపు పది బిలియన్ డాలర్లు. నాణ్యమైనది కిలోగ్రాము 140,000 డాలర్లు (కోటి రూపాయలు)" అన్నాడు కిరణ్.

"క్రీస్తుపూర్వం 620 సంవత్సరం నుంచే ఇది చైనీస్ మెడికల్ రికార్డులలో ఉంది కిరణ్! ఇప్పుడు మనకు దొరికింది నిధి" అన్నది శీతల్. "ఇండియాలో దీనిని కీరాబీర్, కీడా జాది, కీడా ఘూస్, ఘూస్ ఫుపుంద్ అంటారు. నేపాలీలు యార్సాగుంబా అని పిలుస్తారు"

"రేపెన్ని దొరికితే అన్నిటితో సంతృప్తి పడదాం" అన్నాడు కిరణ్. ఎల్లుండి పొద్దున్నే ఛెప్కా గ్రామం, అక్కడ నుండి దునాయి, మూసికొట్ మీదుగా నేపాల్‌గంజ్ చేరుకుందాం. ఎయిర్‌పోర్ట్ ఛెక్‌లు తప్పించుకోవచ్చు".

నాలుగు రోజులు నానా కష్టాలుపడి ఇద్దరు నేపాల్‌గంజ్ చేరుకున్నారు. ఒకరోజల్లా పడి నిద్రపోయాక కాస్త అలసట తగ్గింది. కాఫీ తాగుతూ అన్నది శీతల్, చిరునవ్వులు చిందిస్తూ –"డార్చెన్ వెళదామా, ప్రేమికుడా!"

"పరిక్రమ దేవుడి చుట్టూ చెయ్యాలి, అమ్మాయిల చుట్టూ కాదు" అన్నది నీ ఫ్రెండ్ వసుధ" నవ్వుతూ అన్నాడు కిరణ్. "ఆది దంపతుల కరుణ, మోనాల్ పక్షి జంట చూపిన దారి, లామా ఆశీస్సులు నాకు నీ స్నేహాన్ని, ప్రేమను ఇచ్చాయి. థాంక్యూ!"

"మన అదృష్టం బాగుండి ఎవరికి దొరక్కుండా బయటపడ్డాం. లేకుంటే ఇద్దర్నీ చంపేసేవాళ్లు స్థానికులు, మనం యార్సాగుంబా ఏరుకోవడం చూస్తే! ఆమధ్య నేపాల్‌లో కొన్ని గ్రామాల మధ్య యార్సాగుంబా ఏరుకోవడంలో గొడవ మొదలై హత్యల వరకు వెళ్లింది. నేపాలీ మావొయిస్టులకు, ప్రభుత్వ బలగాలకు మధ్య పోరాటాలకు కారణమైంది ఈ కాటర్ పిల్లర్ ఫంగస్" అన్నది శీతల్.

"చైనాలో ఈ ఫంగస్‌ను డాంగ్ ఛాంగ్ సియాసావొ (Dong Chang Xia Cao) 'Summer Grass Winter Worm' అని అంటారు. జనాల్ని విడదీసినా మనల్ని కలిపింది ఈ 'వేసవికాలపు గడ్డి, శీతాకాలపు పురుగు" అన్నాడు కిరణ్.

"ఈ కోవిడ్-19 వైరస్ ఉధృతి చైనా, నేపాల్, టిబెట్, తైవాన్‌లలో తక్కువగా ఉండడానికి కారణం ఈ యార్సాగుంబా కషాయమేనేమో" అన్నది శీతల్.

లక్నో చేరుకున్నారు ప్రేమికులిద్దరూ ఏ ఆటంకాలూ లేకుండా!

శీతల్, కిరణ్ కాంప్‌ఫైర్ పక్కన కూర్చుని మాట్లాడుకుంటున్నారు కూల్‌డ్రింక్ సిప్ చేస్తూ. ఆ వెలుగులో కనిపించాయి దయ్యపు పురుగులు (Ghost Maths) కొన్ని తెల్లగా, కొన్ని గోధుమరంగులో ఎగుర్తూ ఉన్నాయి చనిపోయిన వారి ఆత్మల్లా; వాళ్ల వేపు వస్తున్నది ఓ జంట; లెక్కింగ్ డిస్‌ప్లేతో! వాళ్లు ఆ పురుగుల సయ్యాట చూస్తూనే ఉన్నారు. ఇంతలో కొబ్బరి చెట్టు మీంచి దూసుకు వచ్చిందో గబ్బిలం. దాన్ని గమనించిన కిరణ్ భగభగా మండుతున్న కట్టెను పైకెత్తి అదిలించాడు. గబ్బిలం భయపడి కీచుమంటూ పారిపోయింది. ఆ దయ్యపు పురుగుల జంట శీతల్, కిరణ్‌ల మధ్య దాక్కుని రక్షింపబడింది. మెరుస్తున్న కనులతో కిరణ్‌ను మెచ్చుకుంటూ సురక్షితమైన అతడి భుజాలపై తన శిరస్సును వాల్చింది శీతల్.

ఎండాకాలపు గడ్డి - శీతాకాలపు పురుగు; కోవిడ్-19 రెండూ నేపాల్, ఇండియా, చైనా సరిహద్దులోనే ఉన్నాయి. ఒకటి నేలలో, రెండోది యునాన్ గుహల్లోని గబ్బిలాలలో. ఒకటి ఫంగస్, రెండోది వైరస్! విరుగుడూ, విషం ఒక్కచోటే ఉన్నాయి, జనన మరణాల్లా. నల్లటి మేఘాలు క్రమంగా కమ్ముకు వస్తున్నాయి. గాలి తీవ్రమైంది.

కొబ్బరి చెట్ల మీద గబ్బిలాలు ఒక్కుమ్మడిగా పైకి లేచాయి కీచుమంటూ! అటూ యిటూ ఎగిరి మరల చెట్లపై వాలుతున్నాయి.

మెరుపులు మెరిసి ఆకాశాన్ని చీలుస్తుండగా ఫెళఫెళామని ఉరుముల చప్పుడు. ఎక్కడో పిడుగు పడింది చెవులు బద్దలయ్యే శబ్దంతో. ఏదో చెడుగాలి విస్తరిస్తున్నది రెక్కలు చాచిన మహాభూతంలా...

★★★★★



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

## I. Poetry (Telugu)

1. Alchemy
2. Vaana Mabbula Kanthi Khadgam
3. Tea Kappulo Toofan
4. Tangeti Junnu
5. Karakatakam (Cancer)
6. Oka Sarassu – Aneka Hamsalu (Psychiatry)
7. Marana Saasanam
8. Sri Lalitha Sahasranama Stotram
9. Kuyyo – Morro Satakam
10. Bhairava Satakam

## II. Poetry (English)

11. Shades
12. The Twilight Zone
13. My Poem is My Birth Certificate
14. The Pendulum Clock, The Gramophone,
    The Typewriter and The Pen
15. The Vigilance Whistle!
16. How to Cook a Delicious Poem
17. Windows and Apples
18. The Guerdon of Poesy
19. The Haste Land
20. Bees Need No Invitation When Flowers Bloom...
21. Poetravelogue
22. WOW! (Supercalifragilisticexpialidocious)
23. The Lost Songs of a Lone Traveler!

## III. Stories, Novels, Essays… (Telugu)

24. Katti Anchupai (Noir Stories)
25. Chupke – Chupke (Woman diseases)
26. Akshararchana
27. Deepa Nirvana Gandham (Death)
28. Swapna Sastram (Dreams-1)
29. Kalalu-Peeda Kalalu (Dreams-2)
30. Satyanveshanalo (Novel)
31. Sankya Sastram (Numerology)
32. Dr. Jayadev Cartoons (Cartoons)
33. Kathalu – kavitalu
34. Genome (Biotechnology Novel)

## IV Stories, Novels, Essays (English)

35. In Search of Truth (Novel)
36. How to be happy (Philosophy)
37. Bouquet of Telugu Songs and Poems

## V Translations (English to Telugu)

38. Iliad (Homer)
39. Odyssey (Homer)
40. Epic Cycle (Homer)
41. Three Greek Tragedies
42. The Poems of Sappho
43. Aeneid (Virgil)
44. Pilgrim's Progress (John Bunyan)
45. Paradise Lost (John Milton)
46. Paradise Regained (John Milton)
47. Divine Comedy (Dante)
48. Faust (Goethe)
49. World Famous Stories
50. Namdeo Dhasal Poetry
51. William Blake Poetry
52. Emily Dickinson Poetry – Part I
53. Emily Dickinson Poetry – Part II
54. Emily Dickinson Poetry – Part III
55. Emily Dickinson Poetry – Part IV
56. Emily Dickinson Poetry – Part V
57. Russian Poetry
58. Jalapatam (Eighteen English Poets)
59. Dabbu Manishi (Money Poetry)

60. Santi Yuddham (War-Peace)
61. Christu Adbhuta Geethalu
62. The Path of Christ
63. Silappadikaram
64. Manimekhala
65. Sangam Poetry
66. Conference of Birds (Attar)
67. Masnavi - Part 1
68. Masnavi - Part 2
69. Masnavi - Part 3
70. Masnavi - Part 4
71. Masnavi - Part 5
72. Masnavi - Part 6
73. Madhusala (Edward Fitzgerald)
74. Sougandhika (Master Poems in English-1)
75. Toorpu Padamara (Master Poems in English-2)
76. Prema Kurisina Velalo… (Master Poems in English-3)
77. Vallu Mugguru (Master Poems in English-4)
78. Alanati Kothagali (Master Poems in English-5)
79. Manchu Toofan (Master Poems in English-6)
80. Endaa – Vaana (Master Poems in English-7)
81. Pillanagrovi Pipupu (Master Poems in English-8)
82. Naalugu Dikkulu (Master Poems in English-9)
83. Allanta Doorana Aa Paata Vinavacche (Master Poems in English-10)
84. Divya Vastrala Kosam (Master Poems in English-11)
85. Oka Madhusala (Master Poems in English-12)
86. The Axion Esti (Odysseus Elytis)
87. Love & Death (Frederico Garcio Lorca)
88. Ten Thousand Lines (Edwin Cordevilla)
89. Century of Love (Roula Pollard)
90. Pablo Neruda Poetry
91. Mexican Poetry
92. Inanna (Queen of Heaven and Earth)
93. Sataroopa (A.K. Khanna)
94. Aamani (Master Poems in English-13)
95. Kotha Deepalu (Master Poems in English-14)

## VI Translations (From Telugu, Hindi to English)

96. Bhagavatam (Potana)
97. Soundarya Lahari (Sankaracharya)
98. Modern Bhagavadgita

99. Samparayam (Suprasanna)
100. The Tree of Fire (Anumandla Bhoomaiah)
101. The Poems of Kuppam (Seeta Ram)
102. We Need a Language (T.W. Sudhakar)
103. The Broken Grammer (T.W. Sudhakar)
104. The Voice of Telangana (Madiraju Ranga Rao)
105. Fire and Ice (Rama Chandramouli)
106. The Tears of Bliss
107. This is no Streaking (Stories – K.K. Menon)
108. The Pool of Blood (Novel – Ampasayya Naveen)
109. Madhusala (Harivamsa Roy Bacchan)
110. Journey to Manasa Sarovar (English poetry)
111. Smooth Hands- Sosonjan A. Khan- (Bilingual)
112. Dancing Winds- Maria Miraglia (Bilingual)
113. Moments- Alicja Kubreska (Bilingual)
114. Tayouan Pai Pai- Yaw-Chin Fang(Bilingual)
115. The World of Extinct Lamps- Izabela Zubko (Tri lingual)
116. Pearls of Wisdom- Pramila Khadun- (Bilingual)
117. The Wind my lover- Ade C. Manila-(Bilingual)
118. The Mystic Mariner- Madan Gandhi (Bilingual)
119. Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
120. The True Meaning of Life - Rashid Pelpuo
121. The Wind My Lover - Ade C. (Bilingual)
122. Jak Ziemia Po Pierwszym Deszezu - The Poems from Poland (Bilingual)
123. Prima Ballerina Roberta Di Laura
124. The Casket of Vermilion (English Poetry)
125. Barefoot to Arcadia - Aprilia Zank (Bilingual)
126. Lets be one in The One - George Onsy (Bilingual)
127. Riding the Tide - Ashok Bhargava (Bilingual)
128. The Collected poems of Dr. LSR Prasad
129. The Epic of Gilgamesh
130. Krzysztof Kokot - Around the Haiku
131. Renata Cygan - I am a troubadour
132. Sergio Camellini - The Planet of Pink Clouds
133. Kumkum Bharine
134. Oulaya Drissi El Bouzaidi - A Long-winged Breath
135. Agnieszka Jarzebowska - The Fifth Season
136. The Making of Mahatma
137. Juliusz Erazm Bolek - The Secrets of life - A Calendar in verse
138. The Songs of Annamayya
139. Basudeb Chakraborti Poetry

140. Poland Poetry - As Clear as the Sun
141. Bozena Helena Mazur-Nowak's - Blue Longing
142. Izabela Zubko - The Holy Trinity
143. Deepa Chandran Ram - The Inner Quiet
144. Nazi Naaman Poetry
145. Lal Ded 'Vakhs'
146. Eden S. Trinidad - Eden Blooms
147. Dr. Jernail S. Anand - Fighting the Flames
148. Hell Rise in Paradise
149. Three Color Brush (China Poetry)
150. The Making of Mahatma - Poetry (Collector's Edition)
151. An Epic of Kashmir (Poetry)
152. The Legend of Lady Yang Guifei
153. Tjukurpa - Time Continuum (Dream Time - Every When)
154. Trident (Love, War and Peace) Poetry
155. Yuddhopanishad (The Upanishad of War)
156. COVID-19 - Biotechnology Novel
157. Krishna Prasai's Sun-Shower (A collection of 108 Zen Poems)
158. Covid-19 Parodies
159. VIRUSES - VACCINES
160. THE EDDAS
161. The Fifth Horseman (Telugu)
162. Che Guevara (Poetry) (English)
163. Coffee - Poems (Poetry) (English)
164. Ancient Egypt Stories (Telugu)
165. James Joyce - Chamber Music (Telugu)
166. Ravi Maruth's The Enraged Voice (English)
167. Alicja Kuberska's (Not) my poem (Telugu)
168. Prasen's - To Whomsoever it may concern (English)
169. Coro'noir' Stories (Telugu)
170. The Tortured Artist (English Poetry

# కరోనా

## కత్తి అంచుపై....



Coro'noir' Stories

నాయిర్ (Noir) కథలలో హీరోలుండరు.
ఎక్కడ నుంచో ఎవరో వచ్చి విలయాన్ని,
విధ్వంసాన్ని, బాధల్ని, భయాన్ని సృష్టిస్తారు.
కథ అసంపూర్తిగా, నిరాశగా ముగిసి
నిజం సమాధిలో కప్పబడగా, పాత్రలు గమ్యం కానరాని
ధూళి తెరలలో అదృశ్యమవుతాయి.

'ఉత్తిష్ఠ జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత!!
క్షురస్యధారా నిశిత దురత్యయా దుర్గంపథస్తత్ కవయో వదంతి!!!'





డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. LANKA SIVA RAMA PRASAD**